Smt. S. Andalu

# శ్రీ రామాయణానుభవము

## (బాలకాండ)



ఆచి శ్రీనివాసాచార్య ఎం.ఎ.

# శ్రీ రామాయణానుభవము

## (బాలకాండ)



ఆచి శ్రీనివాసాచార్య ఎం.ఎ.

# రచయిత పరిచయము

## ఆచి శ్రీనివాసాచార్య ఎం.ఎ.

| | | |
|---|---|---|
| జననము | - | శ్రీశాల (సిరిసిల్ల కరీంనగర్ జిల్లా) |
| జననీ జనకులు | - | శ్రీమతి ఆచి వేంకట నరసమాంబ<br>శ్రీ మదాచి వేంకట నృసింహాచార్య<br>(ఆవునూరు) స్వామివారు |
| వృత్తి | - | ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్దిపేట |
| ప్రవృత్తి | - | ఉపన్యాసాలు, కాలక్షేపాలు, కవిత్వము |
| ప్రవేశము | - | శ్రీ రామయణ భగవద్గీ తా, శ్రీభాష్యాది సంస్కృత<br>గ్రంథాలలో భగవద్విషయాది తమిళ గ్రంథాలలో |
| ఉపన్యసించిన స్థలాలు | - | యాదగిరి, హైదరాబాద్, విజయవాడ,<br>శ్రీరంగాది ప్రముఖ స్థలాలలో |
| శాశ్వత సభ్యత్వము | - | ఉభయ వేదాంతాచార్య పీఠములో |

**Sri Ramayananubhavam**

By Achi Srinivasa Charya

# శ్రీ రామాయణానుభవము

_ ఆచి శ్రీనివాసాచార్య

శ్రీనివాస ప్రచురణములు :-
ప్రతులు - వెయ్యి
ప్రథమ ముద్రణము - అక్టోబర్ 1996
(సిద్దిపేట)

ధర - రూ.30-00

ప్రతులకు:
ఆచి శకుంతలా దేవి
బాంబే బిల్డింగ్ 12-5-41/5,
విద్యానగర్ సిద్దిపేట 502 103

ముద్రణ : శారద ఆఫ్‌సెట్ ప్రింటర్స్, కరీంనగర్.

# శ్రీ రామాయనమః

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | శుభాశంసనము | 1-2 |
| 2. | మంగళా శాసనము | 3 |
| 3. | రసా స్వాదనము | 4-6 |
| 4. | ప్రశంసా సూక్తము | 7-8 |
| 5. | పలికించెడు వాడు రామ భద్రుడే | 9-13 |
| 6. | శ్రీ రామాయణమంటే | 14-25 |
| 7. | వేదమే రామాయణంగా | 26-31 |
| 8. | రామాయణము ఒక ఇతిహాసము – ఊహాగానం కాదు | 32-39 |
| 9. | ఇతి హాసంగా రామాయణ ప్రయోజనము | 40-44 |
| 10. | వాల్మీకి చరిత్ర | 45-49 |
| 11. | వాల్మీకి సందేహము – నారదాగమనము | 50-58 |
| 12. | రాముడు పరమాత్మే | 59-73 |
| 13. | శ్రీ రామాయణావతరణము – వాల్మీకి శాపము | 74-82 |
| 14. | అయోధ్యాపురము | 83-86 |
| 15. | ఋష్యశృంగుడు | 87-89 |
| 16 | అశ్వమేధ యాగము – పాప వినాశము | 90-92 |
| 17. | పుత్ర కామేష్టి – పాయస విభాగము | 93-100 |
| 18. | దేవతల సృష్టి | 101-102 |
| | శ్రీ రామావతారము | 103-107 |
| | నామకరణము | 108-115 |
| | విశ్వామిత్ర మహర్షి | 116-119 |
| | విశ్వామిత్రతపము – దక్షిణ దిశ | 120-124 |
| | విశ్వా మిత్ర తపము – పశ్చిమ దిశ | 125-128 |
| | విశ్వామిత్ర తపము – ఉత్తర దిశ | 129-130 |
| | విశ్వామిత్ర తపము – తూర్పు దిశ | 131-132 |

## శ్రీ రామాయణము: విషయసూచిక - 2


| | |
|---|---|
| విశ్వామిత్ర సమాగమము | 133-1336 |
| అహం వేద్మి (నాకు తెలుసు) | 137-140 |
| ఊనషోడశ - పదహారేళ్లైనా లేవు | 141-145 |
| బల - అబల | 146 |
| కౌసల్యా సుప్రజా | 147-152 |
| తాటక వధ | 153-156 |
| సిద్ధాశ్రమము - వామనవృత్తాంతము | 157-159 |
| విశ్వామిత్ర యాగ సంరక్షణము | 160-163 |
| మిథిలానగర ప్రస్థానము | 164-165 |
| కౌశికీ చరిత్ర | 166-167 |
| కుమార సంభవము | 168-170 |
| సగరయాగము | 171-173 |
| భాగీరథీ అవతరణము | 174-176 |
| సముద్ర మథన వృత్తాంతము | 177-180 |
| సప్త మరుత్తులు | 181-183 |
| అహల్యా శాపవిమోచనము | 183-187 |
| శివధనుర్భంగము | 188-196 |
| సీతా కల్యాణము | 197-202 |
| పరశురామ గర్వ భంగము - అయోధ్యా పునరాగమనము | 203-207 |
| కృతజ్ఞతాంజలి | 208-209 |
| ఉపయుక్త గ్రంథావళి | 210 |
| ద్రవ్యదాతలు | 211 |

# శుభాశంసనము

త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ
రామానుజ జీయర్ స్వామి
జీయర్ ఎజుకేషనల్ ట్రస్ట్
సీతానగరం-గుంటూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్ - 522 501
బదరీనాథ్ -2-9-96



శ్రీమతే రామానుజాయనమః

ప్రియ శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్య స్వామిన్ !

*శ్రీమతే నారాయణాయ నమః*

*అనేక మంగళా శాసనములు.*

"శ్రీ రామాయణానుభవాన్ని" గురించి మీరు వ్రాసిన లేఖ చేరింది. గ్రంథం త్వరలో భాగవతోత్తముల కరకమలాల నలకరించబోవడం మాకెంతో ఆనందాన్నిస్తోంది. త్వరలో మేము గూడ దాన్ని సేవించబోతున్నామనే ప్రతీక్ష ఎంతో సంతృప్తికరము గద! పొందడంకంటె ప్రతీక్ష ఎంత ఆనందమో!

శ్రీరామాయణం ఎందరో మహానుభావుల మనోమందిరాలలో భావనా జ్యోతినావిష్కరించి లోకాన్ని ప్రకాశింపచేస్తోంది. అది వాల్మీకి యొక్క శ్రీహస్తానికి ఉన్న మహత్తు.

మన పూర్వాచార్యులు ఆ శ్రీరామాయణంలోని రహస్యాలను ప్రపన్న జన హృదయకేదారాలకు నదీమాతృకంగా ప్రవహింపజేసి అందించారు. నాటికి నేటికి అదలా కొనసాగుతునే ఉంది.

శ్రీశైలపూర్ణులు శ్రీ ఆచార్య రామానుజ స్వామికి పదునెనమిది సార్లు పదునెనమిది విధాలుగా అందలి గంభీర సాంప్రదాయకార్థ విశేషాలను తిరుమలేశుని సన్నిధిని అనుగ్రహింపగ, ఆపై మన ఆచార్య పరంపర వాటిని

*శ్రీరామాయనమః*

మరింత స్పష్టముగ మనకందరికి అందించారు.

ఎన్నెన్ని విధాలుగ ఎందరెందరందలి మహార్థాలను అనుభవించి అందించినా మరింత నూతనంగ అవి భాసిస్తునే ఉన్నాయి.

మీ పితృపాదుల ద్వారా పెద్దల ద్వారా మీరు గ్రహించి, మీరు అనుభవించే వాటిని ఆధ్యాత్మిక బంధువర్గ మందరితో పంచుకోవాలనే ఆర్తితో గ్రంధస్థంచేయడం మీ ఔదార్యానికి సూచకం. అందునా లలితమైన స్పష్టమయిన మీదైన శైలిలో ఆ అర్థాలను అనుభవించే రుచికల వారందరికి అందుబాటులోకి మీ గ్రంథం తెస్తుందని భావిస్తున్నాం.

మన శ్రీనమ్మాళ్వారు అనుగ్రహించినట్లు

*"కణ్ణార్ ఇరామ పిరానై యల్లాల్ మత్తుం కఱ్పరో ...........*

*నాట్టిల్ పిఱందు పడాదన పట్టు మనిశర్కా."*

జ్ఞానమున్నందుకు పొందదగిన ప్రయోజనమును నిరూపించుకోదలచిన వారు శ్రీ రాముని కల్యాణ గుణాలను తప్ప వేరొకటి నేర్తురా? కారణం ఈ మానవుల కోసం ఎంత ఉపకారం చేసినా మరచి ప్రత్యుతః అపకారమునే చేయదలచే స్వభావం కల ఈ మనుష్యుల కోసం - అనుక్షణము అన్ని రకాలుగా ఆదుకొనే ఆత్మబంధువునే మరచిన ఈ మనుష్యులను బాగుచేయు ఆదర్శాన్ని స్థాపించడం కోసము-ఈ మట్టిపై నడిచి పడరాని పాట్లన్ని పడిన పరమోపకారకుడు కద శ్రీరాముడు!మనసున్న ప్రతి జీవి తలప వలసినది తన్నే-అనుభవం అంటూ ఉంటే అతని కల్యాణ గుణాలనే కద!

అదిచేసి, తరించి పదుగురిని తరింపచేయదలచిన మీరు ధన్యులు. మీ ఈకృతి శ్రీరామచంద్రుడు ప్రీతితో స్వీకరించుగాక!

**(సంతకము)**

చిన్న శ్రీ.రా. జీయర్ స్వామి

బదరీనాథ్

**2-9-96.**

శ్రీరామాయనమః

# మంగళాశాసనము

శ్రీమతే రామానుజాయ నమః

***తె.కం. రంగరామానుజదాసః శ్రీవాసుదాస్వాశ్రమం***

నడిగడ్డపాలెం

(వయా) చుండూరు

గుంటూరు జిల్లా - **522 318** ఆం.ప్ర.

**17.6.1996**

శ్రీ.ఉ.వే. శ్రీమాన్ ఆచి. శ్రీనివాసాచార్య స్వామివారిని సేవించి వ్రాసికొను విన్నపము.

వాతావరణము చల్లబడినది. శ్రీమాన్ మాస్వామివారు పూర్తిగా కాకున్నా కొంత తేరుకున్నారు. పూర్తిగా వినగలిగిన శక్తిలేక అచ్చుటచ్చుటగా సొంతం గ్రంథము విన్నారు. విషయవివరణమునకు చాల సంతోషించారు. అది తమకెంతో ఆనందమును, ఆసక్తిని, తృప్తిని కలిగించిందని దేవరవారికి విన్నవించుమన్నారు. ఇట్లే తక్కిన కాండలలోని విషయములను గూర్చియు మధుస్యందినులగు వ్యాసములను వ్రాసి పూర్తిచేయగోరుచున్నారు.

పరశ్శతం ప్రణమతి,

రంగరామానుజదాసః.

# "రసాస్వాదనము"

శ్రీరామాయణము వేదమే. వేదము అపౌరుషేయం. శ్రీరామాయణము వాల్మీకి నుండి ఆవిర్భవించినది. శ్రీరామచంద్రుడు శ్రీమహావిష్ణువే ధశరథ పుత్రునిగా జన్మించాడు. వేదములలో రెండు భాగములు కలవు. పూర్వభాగము ధర్మప్రతిపాదకము. ఉత్తరభాగము జ్ఞాననిరూపకము. జ్ఞానము అనగా అర్థపంచక జ్ఞానము. మానవుడు ఆంతరముగా జ్ఞానార్జనము చేసి దానిని ఆచరించుచు ఆత్మశ్రేయము సంపాదించవలెను. బాహ్యాముగా వేద పూర్వభాగమునందలి కర్మాచరణము చేసి ప్రేయమును ఆర్జింపవలెను. ఈ రెంటిని వేదము రెండు భాగములలలో నిరూపించినది. వాల్మీకి నుండి ఆవేదమే రామాయణ మహాకావ్యముగ అవతరించినది. కావ్యములో వాచ్యార్థము, వ్యంగ్యార్థము అను రెండు అర్థములుండును. వాచ్యార్థముచే వేద పూర్వభాగమునందలి ధర్మాచరణము ఎట్లు చేయవలెనో ప్రతిపాదించినది. వ్యంగార్థముచే ఆత్మ ఉజ్జీవనమునకు అర్థపంచక జ్ఞానమును ఎరింగినవాడు ప్రవర్తించవలసిన విధానమును ఎరింగించును. వేదములో రెండు భాగములను బాహ్యాంతరములుగా సంఘటితముచేసి "శ్రీరామాయణమను" మహాకావ్యము ఆవిర్భవించినది.

శ్రీరామాయణము అజ్ఞులకు, ప్రాజ్ఞులకు విశేషజ్ఞులకు కూడ సమాదరణీయమైనది. కథామాత్రమునెరిగి ఆనందించు సామాన్యులకు పరమరమణీయమైన కథ ఇందు నిబంధింపబడినది. ప్రాజ్ఞులు అయినవారికి పాత్రలనడువడిచే నీతులను ధర్మమ[illegible]ను నిరూపించుచు కావ్యమునందు ఆవశ్యకములైన వర్ణనములచే, అలంకారములచే, రసపోషణచే ఆనందమును కలిగించును. శరీరముకంటే వేరైన ఆత్మస్వరూపమును గుర్తెరింగిన విశేషజ్ఞులకు

*1. "ప్రకృతిబంధమునుండి విడువడి పొందవలెననికోరెడి ప్రాప్యమేది?*

*2. పొందెడివాడు ఎవడు?*

*3. పొందుటకు ఉపాయమేమి?*

*4. పొందుటవలన కలిగెడి ఫలమేమి?*

*5. పొందకుండ నిరోధించెడి ప్రతిబంధకములు ఏవి?*

అనెడి ఐదు విషయములను ఎరింగించును. ఇట్లు అంతర బాహ్యాములలో బ్రహ్మధర్మస్వరూపములను ఎరింగి ధర్మాచరణముతో బ్రహ్మజ్ఞానముతో మానవుడయి జన్మించినవాడు పొందవలసిన పురుషార్థమును నిరూపించిన మహాకావ్యము శ్రీరామాయణము.

నారదుడు వాల్మీకికి సంక్షేపముగ ఉపదేశించుచు రామాయణమును **"పవిత్రము, పాపఘ్నము, పుణ్యము"** కనుక **"వేదముతో సమము అయినది"** అని అనినాడు. పవిత్రము అనగా మాలిన్యమును తొలిగించి శుద్ధి కలిగించునది. రామాయణమునందలి శబ్దములకు మంత్ర శక్తి ఉన్నది. అర్థము తెలియనక్కరలేదు. పారాయణ మాత్రముచేతనే పొందవలసిన ఫలములు పొందుట సులభము. ఇక ఇందలి అర్థములు హృదయమున ప్రవేశించినచో బుద్ధిలో మనసులో ఉండెడి దోషములు తొలగి పవిత్రమగును. రామాయణమందలి శబ్దార్థములు ఎరింగినవారు సాత్వికమైన అంతఃకరణము కలిగి సత్వమహితమైన ప్రవర్తనముతో ఉత్తమ మానవులుగ పవిత్రమైన జీవనము నడుపగలుగుదురు.

భగవత్ప్రాప్తికై లభించిన శరీరముతో దేనిని ఎట్లు పొందవలెనో ఎరింగి ప్రతిబరధకములగు పాపములను తొలిగించుకొనుటకు శ్రీరామాయణమే సాధనము. భగవత్ప్రాప్తికి ప్రతిబంధకము పాపము. అహంకార మమకారములు పాపము. నేను కాని శరీరమును "నేను" అని తలంచుట అహంకారము శరీరమునకు చెందినదానిని "నాది" అని ఆత్మకు సంబంధించిన దానినిగా భావించుట మమకారము. ఈ రెండింటివలననే సుఖదుఃఖములు కలుగుచున్నవి. దీనికి కారణము కామము. కామము ఆవేశించిన మనసు అహంకార మమకారములను పెంచి ఆత్మను బంధమున ఉంచును. దానిని విడిపించుకొని భగవానునితో చేరవలెను. అవిద్యా, కామ, కర్మరుచి వాసనలచే ప్రేరితమైన ఇంద్రియ వృత్తులే ఆత్మను బంధించుచున్నవి. దాని నుండి విడువడుటకు భగవానుని "శరణాగతి" చేయవలెను. కర్మాచరణముచే జ్ఞానముచే భక్తిచే భగవానుని అభిముఖము చేసుకొని వాని అనుగ్రహముచే సత్పురుష సహవాసము లభించి ఆచార్యుని పొంది ఆత్మబంధమును వీడి భగవానుని చేరవలెను. ఈ రహస్యమునే వేదము ప్రతిపాదించినది. దీనినే శ్రీరామాయణము నిరూపించినది.

బాహ్యముగ సమాజములో తాను సుఖమును అనుభవించుచు ఇతరులను సుఖింపజేయుచు జీవించుటకుచేయు వ్యాపారములే ధర్మములు. ఈ లోకములో నున్న ప్రాణులను దేవపితృవర్గమును తాముచేయు కర్మలచే ఆరాధించుట మానవ ధర్మము. దీనినే శ్రీరాముడు ఆచరించి మానవుడు బాహ్యముగ ఎట్లు

ప్రవర్తించవలెనో నేర్పినాడు. తాము పొందవలసిన విధానమును లక్ష్మణ భరత శత్రుఘ్నుల ప్రవర్తనచే నిరూపింపబడినది. ఇట్లు ఈ రామాయణము "ఉపనిషత్ అర్థప్రతిపాదకమై" ఆత్మ పరమాత్మ స్వరూప విశదీకరణ సమర్థమై ప్రకాశించుచున్నది. సమాజములో గురువువద్ద, తండ్రివద్ద, తల్లివద్ద, భార్యవద్ద, భర్తవద్ద, మిత్రుని వద్ద, శత్రువు వద్ద, ఋషుల వద్ద ఎట్లు ప్రవర్తింపవలెనో ఎరింగి వర్తించుట మానవధర్మము. తన ప్రవర్తనచే వారికి సుఖమును కలిగించి వారు సుఖించుటను చూచి తాను సుఖించుటకు చేయు వ్యాపారమే ధర్మము. అట్టి ధర్మములు అనంతములు. వాటిని ఆచరించుట మానవునకు ఎంత ఆవశ్యకమో అంత కష్టసాధ్యము. భగవానుడే స్వయముగ రామునిగ జన్మించి ధర్మములను తాను ఆచరించి మానవత్వమును లోకమున నిలిపి దానవత్వమును అంతమొందించినాడు. ఉపదేశము చేయడు. ఆచరణమే ప్రధానముగ సాగిన అవతారము శ్రీరామావతారము.

శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్యస్వామివారు కళాశాలలో అధ్యాపకులు అగుటచే ఎట్లు సులభముగా హృదయ స్పర్శిగ విషయమును అందింపగలమో ఎరింగిన ఆచార్యులు. అందుచే విషయమును చక్కగ విడదీసి ఆయా ఘట్టములను విడమరచి అందలి ఇతివృత్తములోని సౌందర్యమును హృదయమునకు హత్తుకొనునట్లు వివరించారు. పాత్రల వర్తనమును చక్కగ ప్రతిపాదించినారు. అనంతరము ఆ సన్నివేశముచే ఎరుంగదగిన తత్త్వమేమో వివరించినారు. ఈ విధముగ బాలకాండను భిన్నభిన్నములగు శీర్షికలతో విశ్లేషించి పరమ రమణీయముగ వ్యాఖ్యానించినారు. వీరి భాష విశదమైనది. సుకుమారమైనది. విషయ నిరూపణము విశదతరము. అంతరతత్వనిరూపణము విశదతమము. ఈ విధముగ ఆంధ్రపాఠకలోకమునకు ఎరుంగదగిన విషయములను సులభముగ స్పష్టముగా నిర్దుష్టముగ అందించి ధన్యులై రామచరితామృత పానముచే ఆంధ్రలోకము తరించునట్లు ఉపకరించినారు. వీరి కృషి ప్రశంసనీయము. ఇంతకు ముందు ఎందరో వ్రాసినారు. కాని వీరి వివరణ విధానము ఒక ప్రత్యేకతను సంతరించుకొనినది. అందుచే నూతనత్వమును సంతరించుకొనినది. శ్రీమాన్ శ్రీనివాసాచార్యులుగారు ఈవిధముగ శ్రీరామాయణమునంతను లోకమునకు అందించి శ్రీసీతారాముల అనుగ్రహపాత్రులై ధన్యజీవులు అగుదురుగాక. శ్రీరామచరితామృత రసాస్వాదము కల్గించి పాఠకలోకము నానందింపచేతురుగాక!

విశాఖపట్నం ఇట్లు
**6-6-1996** శ్రీ భాష్యం అప్పలాచార్యులు.

# ప్రశంసా సూక్తము

"అభినవ తిక్కన", కవికోకిల", "సుకవిభూషణ"

"విద్వత్కవి" - వేముగంటి నరసింహాచార్యులు

1. శ్రీమదాచి వంశాంబుధి -శీతకిరణ।
శ్రీనృసింహార్య దేశిక ప్రియ తనూజ।
శ్రీనివాస మనీషివరేణ్య గణ్య।
అద్భుతము మీదు" రామాయణానుభవము"!

2. శ్రీమన్నృసింహ నామను
ధీమణి కూరిమి కుమార! ధీమద్వర్యా!
రామాయణ పారాయణ
ప్రేమమయా! శ్రీనివాస విఖ్యాతాఖ్యా॥

3. రామాయణ దుగ్ధాబ్ధిని
ధీమంథానమ్ముతోమథించి సుధా ధా
రామాధురి నందించియు
ఈమెయి మము చేసినారు కృతకృత్యులుగాన్ ॥

4. వాచా మాధురి సాధురీతి సుమనో వాల్లభ్య రామాయణ
శ్రీచందంబును అందమున్ మధురస స్నిగ్ధమ్ముగా గూర్చుచో
పూచెన్ మల్లెలు మొల్లలౌచు తెలుగుం బూదోటగా శ్రీనివా
సాచార్యా! కృతకార్య! మీ కృషి కడున్ శ్లాఘ్యంబుగా శోభిలెన్॥

5. ప్రతిభా పాండిత్యంబులు
జతగా విలసిల్లి శ్రోతృ శ్రవణానందా
న్వితమై మీ ప్రవచన సం
ప్రతిష్ఠ శోభిల్లెశ్రీనివాసాచార్యా!

6. మీ ప్రజ్ఞయు మీ విజ్ఞత
మీ ప్రతిభావైభవమ్ము-మీచాతురియున్
దీప్రమ్మై మీ కీరితి
కప్రమ్ము పరిమళించెకడలన్ తడలై॥

7. గాఢ ప్రజ్ఞా పరిణతి
రూఢముగా వ్యూఢముగను-రుచికర వచన
ప్రౌఢిమ చూపిన మీకిదె
బాఢప్రశంసనము శ్రీనివాసాచార్యా!

8. ఉభయ వేదాంత చింతనా భ్యుదయ కలన
పండిత ప్రకాండాదర ప్రాప్తి గలిగి
నిండు గుండెలో మేల్మిపండించుకొన్న
ఆచి శ్రీనివాసాచార్య జోహారు మీకు"

# పలికించెడివాడు శ్రీరామభద్రుడే

*"క్వాహం మందమతిః?- గభీర హృదయం రామాయణాంతత్క్వచ ?"*

*"మందమతినైన నేనెక్కడ ? గంభీరమైన రామాయణమెక్కడ "*

ఈ మాటలు అన్నది నాలాంటి అజ్ఞులు,అల్పజ్ఞులు కారు. తమ వ్యాఖ్యానంతో రామాయణ మహాసముద్రములోని రత్నములన్నింటినిపైకి తీసి మనకందించిన మహామేధావులు శ్రీ గోవిందరాజులవారు. గోవిందరాజుల శ్రీసూక్తి శ్రీమద్రామాయణ మహాసాగరము యొక్క లోతు అగాధమనితెలుపుటకే ఉద్దేశించినది.

మానవ జీవితం విచిత్రమై మాధవుని కృపతో అనేకములైన మార్పులను కూర్చుకొంటుంది.

మా పితామహులు ఆచిరాఘవాచార్యస్వామివారు. చిన్నతనం నుండి సరస్వతీ కటాక్షం కొరకు తమ వారందరిని వదలి ప్రాణాలకు సైతము తెగించి పరితపించారు. తత్ఫలితంగా కృపాసముద్రులయిన శ్రీసీతారాములు వారి నాలుక చివర శాశ్వతంగా నిలిచి నిరంతరం నర్తించారు. వారి శ్రీమద్రామాయణ ప్రవచనం జగత్ప్రసిద్ధి పొందింది. వింటే కూడలి (ఆచి) రాఘవాచార్యులవారి వలననే రామాయణం వినాలి " అనే ఖ్యాతి ఏర్పడింది. వారు తమ జీవితాంతము తమ విద్యార్థులను అనేకులను విద్వాంసులుగా తీర్చిదిద్దారు.

శ్రీ రామచంద్రుని కృపాకటాక్షము పూర్ణంగా ప్రసరించి, "రత్నమాంబా రాఘవార్యుల గర్భ (శుక్తి ముక్తా) ఫలంగా మానాన్నగారు ఆచి వేంకట నృసింహాచార్య స్వామి వారు అవతరించారు.

"ప్రపేదిరే ప్రాక్తన జన్మ విద్యాః"అన్నట్లు అతి సులభంగా వారు సరస్వతీ కటాక్ష పాత్రులయ్యారు"రామ శబ్దము తోడ (విద్య)ప్రారంభముంజేయ-రాముడే జీవనా శ్రయము"నిచ్చాడు పన్నెండు సంవత్సరాల చిరుత ప్రాయంలోనే పురాణాలను ప్రవచించారు.

పన్నెండు సంవత్సారాలు రాష్ట్రమంతటా సుప్రసిద్ధ నగరాలలో, భాగ్యనగరంలో రెడ్డి హాస్టలు వంటి ప్రసిద్ధ స్థలాలలో సురవరం ప్రతాప రెడ్డి గారు, మాడపాటి హన్మంత రావుగారు, బూర్గుల రామకృష్ణా రావు గారి వంటి విద్వన్మణుల అధ్యక్షతలో అనేకవందల అవధానాలు కావించి "అవధాన కుశల" బిరుదు పొందారు. వారు సాహితీ వేత్తలకు "శాస్త్రిగారు".సంప్రదాయాభిమానులకు "స్వామివారు."

"బాలసరస్వతి"," ఉపన్యాసకేసరి", బహుభాషా ప్రవీణ" "భగవద్విష విద్వాన్" మొదలైన బిరుదులకే బిరుదుగా నిలిచారువారు.

వేలాది భక్తులకు పంచ సంస్కారాలను అనుగ్రహించి వారి జీవితాలను తీర్చిదిద్దిన ఆచార్యవర్యులయ్యారు.

వారు సమకాలీన సమాజముపై ఎంతగాఢంగా ముద్రవేశారో "కవితాకళానిధి" శ్రీ ఉ.వే. వేదాంతాచార్య స్వామి వారు -వారి బహుముఖ వ్యక్తిత్వ ప్రభావానికి ముగ్ధులై సమర్పించిన కమనీయ కవితా నీరాజనము అద్దము పడుతుంది దానిని దర్శిద్దామా!

1. శ్రీమత్కొడలి రాఘవార్య తనయున్ - శృత్యర్థ సంస్థాపన
ప్రామాణ్య ప్రవణున్ -శఠారి గురువర్య ప్రాప్త సద్బోధు- గీతా
మాంగల్య వచస్సుధా ప్రకటు-గోదావైభవోల్లాసు-మా
శ్రీమద్వేంకట నారసింహ గురు-గీర్తింతున్ బుధారాధన
స్థేమస్వాదు కవిత్వ నిర్మితి కృతార్థీ భూత చైతన్యుడన్

2. ఆర్య సమాజవాది పటు హస్తుల పాలిట సింహశౌర్యమై
వీర్యవదూహ నిర్గుణకుభృద్గణ ఖండన వజ్రసారమై
భూర్యవివేకనాస్తిక తమోగుణ దుర్దిన భాను తేజమై
ధైర్య ధురంధరుండును విదాంవరు డయ్యెన. అచ్చి స్వామిదాన్

3. ప్రతివాదులకు నెల్ల వాకట్టు వేంకట
నారసింహాఖ్యమం త్రాక్షరములు
అసధర్ములకు గుండె యడలుగుహాముఖ
పంచాస్య నినదవద్భాషణమ్ము
"ఆత్మ" బంధులకచ్ఛమగు సుదర్శనము
బాలాతపప్రచుర దీవ్యన్ముఖమ్ము
ఆస్తిక శ్రోతల కమృత ధారాస్నాన
మద్భుతా వహముపన్యాస శక్తి
అనుచరుల దీర్చిదిద్దు దీవ్యదనుభావ
భక్తి విశ్వాసమైన జీవనము పరమ
భాగవత లక్షణమ్ము సంభావ్యమైన
శాసకత మించె వెలిగె యాస్వామి మిగుల

అనేక సంవత్సరాలు "వాల్మీకి" స్థానాన్ని అలంకరించి శ్రీరామాయణ కధాసుధను సంపూర్ణంగా స్వయంగా అనుభవించి, అనేక రాష్ట్రాలలో వేలాది శ్రోతలకు పండిత పామర రంజకంగా అందించిన అపర వాల్మీకులు వారు. నా సౌభాగ్యకారణంగా తరుచుగా వారి ప్రవచనాన్ని శ్రవణం చేయడం జరిగింది. ఫలితంగా శ్రీరామ భద్రుడు సీతాదేవి సమేతంగా నా హృదయ సింహాసనముపై ప్రతిష్ఠితుడయ్యాడు. మా నాన్నగారు అంకురింపజేసిన శ్రీసీతారామభక్తిని విఖ్యాత విద్వాంసులు, ప్రవచనపారంగతులయిన శ్రీ ఉ.వే.ప్ర మరంగంటి శ్రీరంగాచార్యస్వామివారు, వేదమూర్తులు వాగమృత వర్షకులయిన సంతానం గోపాలాచార్యస్వామివారు - తమ వాక్సుధావృష్టితో మరింత వికసింపజేశారు.

నా "రామాయణాభిరుచి" మార్గంలో ఒక ముఖ్యమైన మలుపు త్రిప్పినవారు కులపతులు, ఉభయవేదాంత మహాసముద్రమంధరాయమానులు శ్రీ.ఉ.వే.ప్ర. తె.కం. గోపాలాచార్యస్వామివారు వారు అనుగ్రహించిన "రామాయణంలో వేదాంతార్థాలు " అనే గ్రంధము పరిమాణంలో చిన్నదైనా ప్రభావంలో

చాల పెద్దది. ధశరథుడు, విశ్వామిత్రుడు, మారీచుడు మొదలైన పాత్రల ద్వారా "శ్రీమద్రామాయణము తో మన జీవితాలకు సమన్వయం ఎలా కల్పించుకోవాలో " మొట్టమొదట నాకు మార్గ నిర్దేశం చేసిన దేశికులు వారు. వారి "రామాయణ రత్నాకరం " కూడ ఏరుకొనేవారికి, వారి ఓపిక కొలది రహస్య రత్నాలనందించగల దివ్యప్రబంధము.

అలాగే "శ్రీరామాయణ - తత్వదీపికల " ద్వారా అనేక రామాయణ రహస్యాలను ఆవిష్కరింపజేసిన మహామేధావులు, వ్యాఖ్యాన కళావాచస్పతులు, శ్రీ ఉ.వే.ప్ర.శ్రీభాష్యం అప్పళాచార్యస్వామివారు. వారు నా మనస్సులో వేసిన ముద్ర శాశ్వతమైంది.

నాకు అసాధ్యమనిపించిన వేదాంతశాస్త్రములో ప్రవేశాన్ని కలిగించి, విద్వత్సభలలో "భగవద్విషయం ","శ్రీ భాష్యం " గ్రంధాలలలోని విషయాలలో నాచే విజ్ఞాపనం చేయించిన, చేయిస్తున్న కృపామాత్రప్రసన్నులైన మా ఆచార్యవర్యులు శ్రీ ఉ.వే.ప్ర. కందాళై ( చిక్కడుగాంయుల ) రంగాచార్యస్వామివారు. వారి ఋణం ఎన్ని జన్మలలోనైనా తీర్చుకోవడానికి వీలులేనిది.

అదే విధంగా "పునశ్చరణ" స్థాయిలో "శ్రీభాష్య", "గీతాభాష్యాది" శాస్త్రాలలోని అతి గంభీర విషయాలను అతి సులభంగా ప్రవచించిన విద్వద్గరిష్ఠులు, "ఉభయ వేదాంతాచార్యులు" మా మేనమామగారు - శ్రీశిరిశినగళ్ కృష్ణమాచార్య (శతావధాని ) స్వామివారు. వారి నామ స్వరూప సంస్మరణము సకల శుభాస్పదమైనది.

ఏ మహనీయులు తమ బాల్యంలోనే "చదువులలో మర్మములన్నిటిని పూర్తిగా తమ అఖండ మేధాసంపత్తితో గ్రహింపగలిగారో, సాంసారిక విషయముల బురదలో కాలిడకుండానే " సన్యసించి ", భగవద్రామానుజులవలె అశేష భక్తసమూహములను దేశవిదేశాలలో తమ శ్రీసూక్తి సుధ ద్వారా ఉఱ్ఱూతలూగిస్తున్నారో, ఎవరి కటాక్షప్రసారానికై భక్తకోటి తహతహలాడిపోతుందో - అట్టి మహాత్ములు శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు, ఉభయ వేదాంతపీఠాధ్యక్షులు, త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జీయర్ స్వామివారు. వారి కృపాకటాక్షము నన్ను నిత్యము పులకాంకితుని కావిస్తోంది.

నా జీవితమును ప్రభావితము చేసిన మరొక ముఖ్యవిషయము మా మాతృదేవతా కటాక్షము. నన్ను మొదటి నుండి ఉన్నతాశయముల గురించి ప్రబోధించి, ప్రోత్సహించి నా ఉజ్వల భవిష్యత్తు గురించి కలలు కంటున్న మా "అమ్మ" కలిగిస్తున్న ప్రభావాన్ని నా మాటలలో వర్ణింపగలనా ?

ఇదుగో ఇంత మంది మహానుభావుల అభిమానము, జగత్పితరులైన శ్రీసీతారాముల నిర్హేతుక కృపావిశేషము అజ్ఞుడనైన నన్ను ఉత్తేజపరిచి, నాద్వారా "శ్రీరామాయణానుభవాన్ని "పాఠక లోకానికి అందిస్తోంది. చివరలో మరొక మారు గోవిందరాజుల శ్రీసూక్తిని స్మరించుకొంటాను.

*" కో భారోత్ర మమస్వయం కులగురుః - కోదండపాణిః - కృపా కూపారో రచయత్యథ స్సపది మే జిహ్వాగ్రసింహాసనః"*

"రామాయణ రచన నాకేమి భారము? నా కుల గురువు, కృపాసముద్రుడు కోదండపాణి అయిన శ్రీరామచంద్రుడే నా జిహ్వాగ్ర సింహాసనము పై ఆసీనుడై తన రామాయణ కథా విశేషాలను తానే రచించుకొంటాడు. ఇప్పుడు " శ్రీ రామాయణానుభవ " రచనలో నాకు మాత్రమేమి తక్కువ! "పలికించెడువాడు రామభద్రుడే" కదా!

ఇతిశం.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

# " శ్రీరామాయణమంటే ...? "

శ్రీమద్రామాయణమొక విశ్వశ్రేయస్కరమైన కావ్యము. ఈ కావ్యపఠనముచే లోక కల్యాణం జరుగుతుంది. శ్రీరామాయణమొక గొప్ప ఇతిహాసము. నిజంగా జరిగిన ఒక మహత్తర చరిత్ర. వేదమే వాల్మీకి వదనారవిందము నుండి శ్రీరామాయణ మధువుగా జాలువారింది.

శ్రియఃపతి దుష్టశిక్షణ, "శిష్టరక్షణ, అధర్మనిర్మూలనము, ధర్మ సంస్థాపనము" అనే అవతారప్రయోజనాలను నెరవేర్చడానికి శ్రీరాముడయ్యాడు.

శ్రీరామాయణ పారాయణము మన జీవితాలను ధన్యం చేసికోవడానికి, సమాజశ్రేయస్సు కొరకు పాటుపడడానికి తోడ్పడుతుంది.

ముఖ్యంగా రామాయణంలోని ప్రతిపాత్ర, ప్రతిసంఘటన -మన జీవితానికి సంబంధించిందే. శ్రీరామభద్రుడు స్థాపించిన ఉత్తమాదర్శాలన్నిటిని మనము పాటించవలసిందే. అయితే శ్రీరామాయణమంటే ఏమిటో మనము పూర్తిగా తెలిసికోవాల్సిన అవసరమెంతైనా ఉంది.

***"రామాయణము"*** అనే పదానికి ***"రామస్య అయనం"*** అనే వ్యుత్పత్తి అర్థము ఉంది.

"అయనమ్"అంటే **1.** "చరితము" **2.** " ప్రతిపాదనము"**3.** "ఉపాయము"**4.** "ఫలము (స్థానము, ఆధారము)" అని వివిధార్థాలు ఉన్నాయి.

### *1. రాముని చరితమే రామాయణము :-*

శ్రీ రాముడు కౌసల్యా దశరథుల సంతానము, తల్లి దండ్రులకు బంధుమిత్రులకు, సకల ప్రాణులకు, సమస్త లోకవాసులకు హితాన్ని, ఆనందాన్ని కల్గించాడు.

విశ్వామిత్ర మహర్షి వెంట వెళ్లి, తాటకా, తాటకేయులను ముక్కుపచ్చ లారని వయస్సులో సంహరించాడు. అద్భుతంగా శివధనుర్భంగము కావించి సీతాదేవిని వివాహం చేసికొన్నాడు. పితృవాక్యపాలనమునకై సంతోషంగా కఠినమైన

కాననలకు వెళ్లాడు. ఋషులను రక్షించి, రాక్షసులను శిక్షించాడు. ఇంతటి అద్భుత చరిత్ర ప్రపంచంలో ఏమహా వీరునికి లేదు. ఏ మహాపురుషునికి లేదు. అటువంటి అత్యద్భుత రామచరితమే శ్రీరామాయణము.

***II. శ్రీ రామతత్త్వమును ( అయనము) ప్రతిపాదనము*** చేసేది. రామాయణము:- (అయ్యతే=ప్రతి పాద్యతే)ఒక సామాన్య విషయాన్ని మామూలుగా తెలుపడంకంటే ఒక విశిష్ట విషయాన్ని సూచనగా తెలుపడాన్ని ప్రతిపాదనము అంటారు.

రాముడు ఒక పరిపూర్ణ మానవుడుగా సమస్త లోకాదర్శాలను స్థాపించాడు. అయితే ఆయన కేవల మానవుడుకాదు. ఒక నాగ సర్పము పడగ ముడుచుకొని సాధారణంగా సంచరించినట్లు తన పరమాత్మ తత్త్వాన్ని మరుగు పరుచుకొని సామాన్యమానవుడిగా సంచరించిన మహనీయుడాయన.

రావణవధార్థము దేవతలచేత ప్రార్థింపబడి, పురుషునిగా అవతరించిన పరమపురుషుడు. భార్గవరామునిచే, తారచే, మండోదరిచే, ఋషులచే ఆవిష్కరింపబడిన పరత్త్వము గలవాడు శ్రీరాముడు. రావణ వధానంతరము బ్రహ్మాదిదేవతలచే ప్రస్తుతింప బడిన పరదైవము ఆయన. ఈ విధంగా శ్రీరాముని పరమాత్మగా ప్రతిపాదించిన తత్త్వ శాస్త్రము శ్రీరామాయణం.

***III. శ్రీరాముని ఉపాయంగా ( అయనంగా) తెలిపే గ్రంథము శ్రీరామాయణము.***

" అయ్యతే ప్రాప్యతే అనేన ఇతి అయనమ్"" దీనిచే పొందబడుతున్నాడు" అనే వ్యుత్పత్తిని బట్టి అయనము అంటే ఉపాయము.

ఉపాయములన్నిటిలో శరణాగతి గొప్పది. రామాయణ మొక దీర్ఘ శరణాగతి కావ్యము. దేవతలు, ఋషులు, సుగ్రీవుడు, జటాయువు విభీషణుడు మొదలైన ప్రాణులందరు తరతమ భేదాలు లేక శ్రీరామునే ఆశ్రయించి తమ తమ ఫలాలను పొందారు. శరణాగతికి- అర్హతలతో, ఫలాలతో నిమిత్తము లేదని, సమస్త ప్రాణులకు సమాశ్రయణీయుడు శ్రీరాముడే అని తెలుపుతుంది శ్రీ రామాయణము

IV. శ్రీరాముడే పొందదగిన "ఫలమని" ( అయనమని) తెలిపే శాస్త్రమే శ్రీరామాయణము.

సీతాదేవి, లక్ష్మణుడు, హనుమ, భరతుడు శ్రీరాముని సేవించడమే ప్రధాన ఫలమని నిష్కర్షగా తెలిపారు శ్రీరామాయణము ద్వారా. అందువలన మనము అందరము కోరదగిన ఫల స్వరూపము శ్రీరామసేవయే.

అయితే రామాయణ మంటే ***ఒక్క రాముని అయనము మాత్రమే కాదు.***

**(1) రామాయణ మంటే "రామ" యొక్క అయనముకూడ " "రామాయాః అయనం"** - రామ అంటే ఎవ్వరో కాదు సీతాదేవియే.

" అయనము" అనే శబ్దానికి గల పూర్వార్థాలను స్మరించుకొన్నప్పుడు రామాయణమంటే

**2. "సీతాచరితము"** :- వాల్మీకి రామాయణ మంటే" సీతాయాశ్చరితం మహత్" అని వివరించాడు.

రామాయణంలో రాముని ఒక్కనిచరిత్ర చాల స్వల్పము. సీతాదేవి చరిత్రే చాల గొప్పది *"అప్రమేయం హితత్తేజఃయస్యసా జనకాత్మజా"* అన్నట్లు రామునికి తేజస్సును సమకూర్చింది సీతాదేవియే.

సీతాదేవిని పొందకముందు శ్రీరాముడు సాధించిన విజయం కేవలము తాటకను, మారీచ సుబాహులను నిరసించడం మాత్రమే. అలాగే సీతాదేవి భూమిలో ప్రవేశించిన తరువాత శ్రీరాముడు సాధించింది ఏముంది? అవతారము చాలించడమే కదా!

" సీతాదేవిని" నారీణాముత్తమా వధూః" అని వాల్మీకి వర్ణించాడు. సీతమ్మ తల్లి స్త్రీ జాతికే రత్నము. రామాయణంలో కౌసల్య, సుమిత్ర, కైక, తార, మండోదరి, మొదలైన అనేక స్త్రీల విశిష్ట చరిత్రలు ఉన్నాయి. అయినా సీతాదేవి ముందు వారెంతటి వారు?

శ్రీరామునికి వనవాసము విధింపబడింది. సీతమ్మకు విధింపబడలేదు. శ్రీరాముడు పదునాలుగు ఏండ్లు అడవిలో తిరిగి వచ్చేదాక సీతాదేవి అయోధ్య అంతఃపురంలో హాయిగా కాలము గడుపవచ్చు. ఆమెను అంతఃపురంలో హాయిగా కాలం గడుపుమనే శ్రీరాముడు ఆజ్ఞాపించాడు. కౌసల్యా సుమిత్రల, దశరథాదుల అభిమతముగూడ అదే.

అయినా రాజ్య సౌఖ్యములను తృణ ప్రాయంగా భావించి కఠిన కాంతార సంచారమే, శ్రీరాముని సాహచర్యమే తనకు స్వర్గ తుల్యమనే నిశ్చయం కలిగిన నారీమణి సీతాదేవి.

అదే విధంగా శ్రీరాముడాజ్ఞాపించిందే తడువుగా లంకలో అగ్నిలో సైతము దుముకడానికి వెనుదీయని "శేషత్వ సంపన్నురాలు" సీతాదేవి.

శ్రీరాముడు తనను వదిలివేసినా- తాను శ్రీరాముని తప్పవేరే దేనిని కోరుకొన లేదని నిరూపించడానికి భూప్రవేశం చేసిన "పారతంత్ర్య పరిపూర్ణురాలు" పరమ సాధ్వీమణి సీతాదేవి. ఇంతటి చరిత్ర సీతాదేవికి తప్ప మరెవ్వరికి సాధ్యముకాదుగదా!

***II. లక్ష్మీ దేవియే సీత:-*** " రాఘవత్వేఽభవత్ సీతా" శ్రీ (లక్ష్మీ) దేవి.- శ్రీమన్నారాయణుని విడిచి ఒక్క క్షణమైనా ఉండజాలదు. పరమపదములో స్వామితో నిత్యనివాసినిగా ఉండడమేకాదు. అవతారాలలో కూడ స్వామి వెంటే తాను కూడి ఉంటుంది.

శ్రియఃపతి- శ్రీరాముడుగా అవతరిస్తే- శ్రీదేవి స్వయంగా సీతాదేవిగా అవతరించింది. ***స్వామికి నిత్య అనపాయినిగా (ఎల్లప్పుడు కలిసి)*** ఉండడమే "ఆత్మ తత్త్వమని" నిరూపించిన తల్లి సీత.

అంతేకాదు బావిలో పడిన పిల్లలను పైకి తీయడానికి స్వయంగా తాను బావిలో దుమికిన తల్లి వలె" లంకలో రావణ నిర్బంధంలో ఉన్న కన్యలను సంరక్షించడానికి తాను స్వయంగా లంకలో ప్రవేశించిన లోకజనని సీతమ్మతల్లి ఈ విధంగా సీతమ్మను సాక్షాత్తుగా లక్ష్మీ దేవిగా ప్రతి పాదించింది శ్రీరామాయణము.

***III సీతాదేవి ఉపాయ ( పురుషకార) స్వరూపిణి:-***

శ్రీరాముడే మనకు ఉపాయము - అయితే ఆయన సాక్షాత్తుగా ఉపాయంకాదు. ఆయనను సూటిగా ఆశ్రయింపకూడదు. ఆయననే నేరుగా కోరిన శూర్పణఖ అవమానము పాలయిందికదా!

ముందుగా సీతమ్మను ఉపాయంగా ఆశ్రయించాలి. ఆమె పురుషకారంతో రాముని ఆశ్రయించాలి. అప్పుడు మనశరణాగతి ఫలిస్తుంది. ఇందుకు లక్ష్మణుడు, విభీషణుడు ఉదాహరణములు" శ్రయతే, శ్రీయతే"- మనచే

ఆశ్రయింపబడి తాను స్వయంగా పరమాత్మను ఆశ్రయించేది, మనకు పరమాత్మను అందించేది శ్రీ(సీతా) దేవి.

***1. "సీతాముపాచాతియశాః రాఘవంచ మహావ్రతం"***

తనను వెంట అడవులకు తప్పక తీసిక వెళ్లాలని లక్ష్మణుడు సీతా సమక్షంలో శ్రీరాముని ప్రార్థించాడు. సీతా దేవి సన్నిధిలో ఉన్న రాముడు లక్ష్మణుని అభిమతాన్ని కాదనలేక పోయాడు.

2. అదే విధంగా ***విభీషణుడు*** - తన భార్య ద్వారా, కూతురు ద్వారా సీతా దేవికి సేవలు చేయించాడు. తరువాత శ్రీరాముని ఆశ్రయించాడు. అందుకే సుగ్రీవాదులు నిషేధించినా- శ్రీరాముడు విభీషణునికి అభయమిచ్చాడు.

***IV. సమానంగా ప్రాప్యురాలు సీతాదేవి:-*** శ్రీ దేవి ద్వారా శ్రియః పతిని మనము ఆశ్రయింప వలసి ఉంటుంది. (శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్ర పద్యే) అలాగే శ్రీదేవితో కూడిన స్వామిని సేవించడమే మనము కోరదగిన ఫలము ( శ్రీమతే నారాయణాయ నమః)-

లక్ష్మణుడు సీతారాముల సేవయే ప్రధానఫలంగా కోరుకొన్నాడు" "భవాంస్తు సహ వైదేహ్యా

*గిరి సానుషు రంస్యతే*
*అహం సర్వం కరిష్యామి*
*జాగ్రతః స్వపతశ్చతే"*

" అన్నా! నీవు పర్వత ప్రదేశాలలో సీతాదేవితో రమించు. మీ ఇద్దరికి జాగ్రత్, స్వప్నా వస్థలన్నిటిలో సకల విధసేవలను చేస్తాను. ఇదే నాగాఢమైన కోరిక" అని రాముని వేడుకొన్నాడు.

***3. ఆత్మ కథ:-*** రామాయణ మంటే సీతకథ అని అర్థము కదా- సీతాదేవి చరిత్ర అంటే " ఆత్మ కథ" అని అర్థము- మన అందరి ఆత్మలకు" ప్రతీక" సీత. ఆత్మలన్ని పరమాత్మతో ఎప్పుడు విధేయంగా కలిసిఉండేవే." దాసభూతాః స్వతస్సర్వే హ్యాత్మానః పరమాత్మనః"

I. ***సీతాదేవి శ్రీరామునితో*** అయోధ్యలో పన్నెండు సంవత్సరాలు కలిసి ఉంది. మనము కూడా పరమాత్మతో కలిసి ఉండే వాళ్లమే." దేవానాం పూరయోధ్యా" పరమాత్మ ఉండే స్థానానికి అయోధ్య అని పేరు మనమందరము భగవంతునితో కలసి అయోధ్యలో ( పరమపదంలో) ఉండవలసిన వాళ్లమే.

II. అయోధ్యలో ఉన్న సీతమ్మ శ్రీరామునితో అడవికి తరలివచ్చింది.

అయోధ్యలో ఉండవలసిన మనము కూడ అరణ్యములోనికి వచ్చాము. ఈ సంసారమే ఒక అరణ్యము

అడవికి వచ్చినా సీతమ్మకు తక్కువేమి జరుగ లేదు. శ్రీరాముడు వెంటనుండగా సీతమ్మ అడవిలోనే అధికంగా సుఖములను అను భవించింది. ***" తక్కువేమి మనకు రాముడు ప్రక్కనుండువరకు"***- మన నాలుక రామనామ సుధా స్వాదనము చేస్తున్నంత వరకు మనకు ఈ సంసారంలో సుఖదుఃఖాలు సమానంగా ఆనంద దాయకంగానే ఉంటాయి.

***III. సీతమ్మ మారీచ మృగాన్ని అభిలషించింది.*** దానికొరకు శ్రీరామునే దూరంగా పంపించింది. అంతేకాదు తనకు రక్షకుడుగా శ్రీరామునిచేత నియమింపబడిన లక్ష్మణునికూడా క్రూరంగా నిందించి దూరంగా తరిమివేసింది. అదుగో అప్పుడు కష్టములు మొదలయ్యాయి సీతాదేవికి.

రామ లక్ష్మణులిద్దరిని దూరం చేసికొన్న సీతమ్మను రావణుడు చెరబట్టాడు. దూరంగా లంకకు తీసిక వెళ్లాడు దుర్మార్గులైన రాక్షసస్త్రీల నిర్బంధంలో ఉంచాడు. తనను వరించుమని బెదిరించాడు.

మనము కూడ మారీచ మృగము వంటి మృగమరీచికలను ( ఎండమావులను) లేక ప్రకృతి సుఖాలను గాఢంగా కోరుకొన్నప్పుడు- వాటికొరకు భగవంతుని, భాగవతోత్తములను దూరంగా మన మనస్సు నుండి నెట్టి వేసినప్పుడు మన ఆత్మ అహంకారగ్రస్త మవుతుంది.

ఆ అహంకారము ( రావణుడు) మన ఆత్మను ఈ శరీరంలో (లంకలో) అణచి ఉంచడం జరుగుతుంది. దుష్టవిచారముల (రాక్షసుల) మధ్య మన ఆత్మ బంధింప బడుతుంది. అహంకారము ఆత్మను బెదిరిస్తుంది.

IV. ***అయితే మారీచ మృగమును మోహించిన ఆ ఒక్క చెడ్డక్షణంలో తప్ప సీతమ్మ తల్లి మరెప్పుడు రాముని కంటే ఇతరములను కోరలేదు.*** రామ విరహము ఆసాధ్వికి దుర్భరమయింది. అత్యధిక దుఃఖాన్ని కల్గించింది. ***"రామమే వానుధ్యాయంతీ నిత్యం శోకపరాయణా"***

రామునే తలచుకొంటూ అనుక్షణము ఆసాధ్వి పరితపించింది. లంకావైభవాన్ని ఆతల్లి కన్నెత్తైనా చూడలేదు. రావణు నంతవానిని గడ్డి

పోచలాచూచింది. అయోధ్యా సౌఖ్యాలనే స్మరించింది. శ్రీరాముని సాంగత్యాన్నే గాఢంగా కోరుకొంది.

V. ***రామునికి సీతమ్మ పట్ల కరుణ కల్గింది.*** హనుమను సీత దగ్గరికి పంపాడు. తరువాత తానే వెళ్లాడు. రావణుని నిర్జించాడు. సీతమ్మను స్వీకరించాడు. అయోధ్యకు తనతో పాటు తిరిగి తీసికవెళ్లాడు.

మనముకూడ ఈ ప్రకృతి భోగాలను తృణీకరించి, రాముడే కావాలని పరితపించినప్పుడు, అహంకారమును పూర్తిగా నిరసించినప్పుడు, ఈ శరీర బాధలతో అపరిమితంగా దుఃఖించే మనను ఆయన కరుణించి

ఆచార్యుని పంపి, తద్వారా మనును స్వీకరించి, తన శాశ్వత నివాస స్థానానికి తీసికొని వెళ్లి, మనను నిరంతరం ఆనందింప జేస్తాడు. ***"ఏష హ్యేవానందయాతి"***

***4. పౌలస్త్య వధమిత్యేవ:-*** ( అహంకార వధయే): వాల్మీకి శ్రీరామాయణాన్ని వివరిస్తూ" పౌలస్త్య వధమిత్యేవ" రావణ వధయే రామాయణము" అని తెలిపాడు. శ్రీరామావతార ప్రయోజనము ముఖ్యంగా రావణ వధయే.

భగవదవతారము యొక్క ముఖ్య ప్రయోజనము దుష్టశిక్షణే. సురులను, సాధువులను హింసించి, స్త్రీ లోలుడై, అనేక స్త్రీలను చెరబట్టి, లోకాలన్నిటిని ఏడిపించిన రావణుని వధించుటకొరకే బ్రహ్మ పురస్సరంగా దేవతానీకము శ్రీహరిని ప్రార్థించింది. రావణుని వధించి దేవతలను కాపాడడానికే శ్రీహరి శ్రీరాముడుగా అవతరించాడు.

***రావణుడు మూర్తీభవించిన అహంకారము-*** అహంకారము విఱ్ఱవీగి యుక్తాయుక్త విచక్షణను కోల్పోతుంది. సాధువులను, సత్పురుషులను, స్త్రీలను, దీనులను అందరిని తన నిర్బంధంలో ఉంచుతుంది. వారిని హింసిస్తుంది. అటువంటి సమయంలో ఆ అహంకారము దుష్కామంగా మారుతుంది. సాధు పరిత్రాణముకొరకు శ్రీహరి స్వయంగా పూనుకొంటాడు- అహంకారమును దుష్కామమును నిర్మూలిస్తాడు.

రావణునికి తోడుగా ఉన్నవారు కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు మొదలైన వారు. ముందు అహంకారమునకు తోడయ్యేది మమకారము.

"కుంభకర్ణుడు మూర్తీభవించిన మమకారము. మమకారము" ("నా "అన్న" అన్న కారణంగానే ఆయన చివరిదాకా రావణుని అంటిపెట్టుకొని, సర్వనాశనము చెందాడు. కుంభకర్ణునికి రావణునిపట్లమాత్రమేకాదు. ఆయనకు ప్రకృతి భోగముల పట్ల కూడ అమితమైన మమత ( ప్రేమ) ఉంది. ఆయన పనులు రెండే **1.**తినడం, **2.** నిద్రించడము.

రావణునికి ముఖ్యంగా అండగా ఉన్నవాడు ఇంద్రజిత్తు అహంకారము విఱ్ఱవీగి దుష్కామముతో ప్రతి విషయము తనకే వశంకావాలనుకొంటుంది. తనకు విషయాలన్ని వశంకాకపోయినప్పుడు, అది క్రోధాన్నికల్గిస్తుంది." ***కామాత్ క్రోధోభిజాయతే***

ఇంద్రజిత్తు- క్రోధ స్వరూపమే. ఆయన తన క్రోధంతో ఇంద్రుడిని కూడ జయించాడు.

రావణుని మొదటి నుండి హెచ్చరించినవాడు విభీషణుడు. విభీషణుడంటే వివేకము. మంచి చెడులను వేరుగా చూపించేది వివేకము. చెడును అనుసరించకుండా హెచ్చరించేది వివేకము.

రావణునికి "ప్రదీయతాం దాశరథాయ మైథిలీ" శ్రీరామచంద్రునికి సీతాదేవిని సమర్పించుమని సదుపదేశం చేసిన వాడు విభీషణుడు. చివరకు తన మాట వినక, తననే పరాభవించినప్పుడు- అన్న అనే ఆలోచనను కూడ వదులుకొని" రామో విగ్రహవాన్ ధర్మః" అన్నట్లు ధర్మ స్వరూపుడైన శ్రీరాముని ఆశ్రయించినవాడు, విభీషణుడు మన వివేకమే విభీషణుడు. వివేకమెప్పుడు- అహంకార, మమకార, క్రోధములను నిరసించి, ధర్మమునే ఆశ్రయించుమని ఉపదేశిస్తుంది.

***5. రావణ కథ అంటే మనస్సు కథే:-*** సంస్కృత భాషలో మనస్సును "మనః" అంటారు. "మనః" అనే పదంలో" మ",నః" అనే రెండు అక్షరాలున్నాయికదా. ఆరెండు అక్షరాలను తల క్రిందులుగా త్రిప్పితే "నమః" అవుతాయి. "మనః" ఎప్పుడు "నమః" అనే పదానికి వ్యతిరేకము.

"నమః" అనే పదానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి ఒకే పదంగా ఉన్నప్పుడు "నమస్కారము" అని అర్థము

రెండవది "న" "మః" అనే రెండు అక్షరాలు రెండు వేర్వేరు పదాలుగా ఉన్నప్పుడు'-"మః" నాకు నేను-"న" కాదు అని అర్థము.

"నాకునేను స్వతంత్రుడిని కాదు" అని అర్థము. మొత్తము మీద" నమః" అనే పదము పారతంత్ర్యాన్ని బోధిస్తుంది.

రావణుడు అంటే మనస్స్వరూపం అందుకే ఆయన నమ మనస్సుకు వ్యతిరేకము" ద్విధా భజ్యేయ మప్యేవం ననమేయంతు కస్యచిత్"

" నన్ను ఇలా రెండు ముక్కలుగా కోసినా- నేనెవ్వరికి, ఎట్టి పరిస్థితులలో కూడ నమస్కరించను" అని ప్రకటించుకొన్నవాడు రావణుడు. అందుకే ఆయన నమస్సుకు వ్యతిరేకమైన మనస్స్వరూపము. అంటే అహంకారస్వరూపము.

II. అంతేకాదు ***"రావయతీతి రావణః"*** అని వ్యుత్పత్తి ఉంది.

" రావయతి" అంటే ఏడిపించేవాడు, హాహాకారాలు చేయించేవాడు అని అర్థము.

రావణుని వలె మన మనస్సుకూడ మనను ఎప్పుడు ఏడిపించేదే.

కుబేరుని నుండి పుష్పకాన్ని లాగుకొన్నా, నందనవనంలో నుండి మొక్కలను పెకిలించి, తెచ్చి తన అశోక వనంలో నింపినా రావణుడు వశం చేసికొన్నది పరులసంపదనే. అభిమానించింది. పరుల అర్థాన్నే-

మన మనస్సు కూడ లోకంలో ఉండే సకల పదార్థాలు తనకే స్వంతం కావాలని కోరుకొంటుంది.

III ***"రావయతి"*** అంటే ఇంద్రియములతో ఆక్రందనము చేయించేది. మనస్సు ఇంద్రియములెప్పుడు తమకు విషయ సుఖాలను మరీ మరీ ఆహారంగా సమర్పించుమని ఆక్రందనం చేస్తుంటాయి. ఉన్న సుఖాలతో ఇంద్రియములకు తృప్తి కలుగదు.

***"న జాతు కామఃకామానాం ఉపభోగేన శామ్యతి హవిషాకృష వర్త్మేవ భూయోభూయో భివర్థతే"***

ఎన్ని హవిస్సులు వేసినా అగ్నికి తృప్తి కలుగదు. ప్రతి హవిస్సుద్వారా అగ్ని ఇంకా తన నాలుకలను చాస్తూ మరింత విజృంభిస్తుంది. మన మనస్సులోని కామాగ్ని కూడ ఎల్లప్పుడు జ్వలిస్తునే ఉంటుంది. రావణుడు అటువంటివాడే. ఆయన ధర్మ పత్ని అతిలోకసుందరి. మండోదరి లోకాతీత సౌందర్యము, ఆమె పరిపూర్ణయవ్వనం ఆమె అద్భుత స్త్రీత్వము రావణునికి తృప్తినివ్వలేదు- ధాన్యమాలిని మొదలైన సుందరతరుణులను స్వంతం

చేసికొన్నాడు. అప్పటికి కూడ ఆయన కామాగ్ని చల్లబడలేదు. రంభ, పుంజికస్థల మొదలైన అప్సరస్త్రీలను బలాత్కరించాడు. వారి మూలంగా శాపాలకు గురిఅయ్యాడు. అయినా కళ్లుతెరవలేదు- ఆకామాంధుడు. అనేక కన్యలను చెర బెట్టాడు. అగ్నినిమూటకట్టుకొన్నట్లుగా చివరకు లోకమాతనే నిర్బంధించాడు ఆ అవివేకి.

***"అర్థ కామములకు పరవశమై దుర్మార్గాన్ని అనుసరించే రావణుని వంటి మనస్తత్వాన్ని శ్రీరామాశ్రయంతో నిగ్రహింపుమని"*** బోధిస్తుంది శ్రీరామాయణము.

రామాయణ మంటే సీతారాముల, రావణుల చరిత్రలు మాత్రమే కాదు. మరింత విశాలంగా పరిశీలించినప్పుడు ***"రామాయణమంటే"***

**6.** ***రాముడే అయనంగా ( ఆధారంగా) కలవారందరి చరిత్ర*** అని కూడ అర్థమవుతుంది. దేవతలు, దశరథుడు, కౌసల్య, సుమిత్ర కైకేయి, సీతాలక్ష్మణ, భరత శతృఘ్నులు, జటాయువు శబరీ, అహల్యా, సుగ్రీవ విభీషణులందరికి శ్రీరాముడే అయనము లేక ఆధారము- అందువలన వారందరి చరిత్ర కూడా రామాయణమే. మనకు కూడా మనమనస్సులకుకూడ రాముడే ఆధారము- అందువలన రామాయణ మంటే మన చరిత్ర కూడ, మనమనస్సు చరిత్రకూడ.

**7.** అదే విధంగా రామునికూడ అయనమయిన (ఆధారమైన) వారు కొందరున్నారు. ఉదాహరణకు లక్ష్మణ, హనుమసుగ్రీవాదులు వారందరి చరిత్రలు కూడ రామాయణమే. శ్రీరామునికి సేవ చేసిన ఒకగ్రద్ద (జటాయువు) ఒక బోయ (గుహుడు) మొదలైన వారున్నారు. వారి చరిత్రలు కూడ శ్రీరామాయణ భాగములే.

ఈ విధంగా విశాల పరిశీలనగావించినప్పుడు విశ్వజనీనమైనది రామాయణము. సర్వప్రాణి మనోహరమైనదిశ్రీ రామాయణము. నీచోన్నతుల అంతరమును పాటింపక గ్రద్ద నుండి దేవతల వరకు సమస్త ప్రాణులను సమానంగా సంభావించేది శ్రీరామాయణము.

మనకు సంబంధించినంతవరకు, మన మనస్సుకు సంబంధించినంత వరకు **1.** రాముని ఎదిరించే రావణతత్వాన్ని నిర్మూలించాలి. అర్థకామముల బలమైన బంధనాల నుండి విముక్తులము కావడానికి ప్రయత్నించాలి.

2. అంతేకాదు రాముడు అడవికి వెళ్లాడని తెలువగానే తన ప్రాణాలనే పరిత్యజించిన దశరథుని మనస్తత్వాన్ని ***భగవంతుని విడిచి ఉండజాలని మనస్స్వభావాన్ని*** అలవర్చుకోవాలి. ***"పరమ భక్తిని"*** అలవర్చుకోవాలి. "పునర్విశ్లేషభీరుత్వం పరమాభక్తిరుచ్యతే"

3. రాముడు వద్దన్నా అడవికి వెళ్లడానికి సిద్ధపడి రాముని ప్రార్థించి ఒప్పించి మెప్పించి, శ్రీరాముని సేవలోనే, సాహచర్యంలోనే తమ జీవిత సాఫల్యాన్ని వెదుకు కొన్న సీతాలక్ష్మణుల స్వభావాలను మనము కూడ స్వంతం చేసికోవాలి. ***"శేషత్వ మహిమను"*** గుర్తించాలి.

4. రాముడు మనకోరికను మన్నింపక, స్వాతంత్ర్యంతో - తన ఆజ్ఞా ప్రకారమే మెదులుకొమ్మని శాసించినా - మనను తనకు అతిదూరంగా తరిమి వేసినా- రాముని పట్ల- ఏమాత్రము నిరాదరణ లేక- రామునే ప్రియాతి ప్రియంగా, మన సర్వస్వంగా భావించి 'శ్రీరామ సమాగమము కొరకు గడియనొక యుగంగా సహిస్తూ, భరిస్తూ, ప్రతీక్షిస్తూ, రామాజ్ఞా నిర్వహణలోనే కాలం గడిపిన భరతుని "భక్తి భరితత్వాన్ని" తపశ్శీలాన్ని, మాహాత్మ్యాన్ని, పారతంత్ర్యాన్ని మన స్వంతం చేసికోవాలి.

5. అంతేకాదు మన వలెనే ఆకలి దప్పులను వ్యాధి బాధలను అనుభవిస్తూ, మన మధ్యలోనే జీవిస్తున్న (భరతాది) భాగవతోత్తములను ఆశ్రయించి- వారిని భగవంతుని కంటె అధికంగా సంభావించిన (శత్రుఘ్నుని) భాగవతనిష్ఠను మనము అలవాటు చేసికోవాలి.

ఇదే మనకు రామాయణ మందించే ముఖ్య సందేశము, ఇది మనకథ- ఇదే మన మనస్సు కథ- ఇదే శిష్ట రక్షణ కథ.

మన కథే, మన మనస్సు కథే - కనుకే మనకు, మనమస్సులకు శ్రీరామాయణము అత్యంత రమణీయమైనది. నిజానికి రామాయణము- ఇరువైమూడు మహాయుగాలకు ముందు జరిగిన అత్యంతప్రాచీన చరిత్ర. అత్యంత ప్రాచీనమైనా అత్యంత నవీనులమైన మనందరి మనస్సులలో శాశ్వతమైన ముద్రను వేయగలిగిన మధుర మనోహర మహేతి హాసం శ్రీరామాయణము.

ఈశ్రీరామాయణాన్ని ఎన్నో మారులు, మరెన్నో మారులు అత్యంత శ్రద్ధతో, ఆసక్తితో, భక్తి ప్రపత్తులతో అధ్యయనం చేసికొంటూ, శ్రీరామునికి ప్రియాతి ప్రియంగా మన జీవితాలను మలచు కొంటూ, ఆయన ఆదర్శాలను (వీలయి నంత వరకు)ఆచరిస్తూ విశ్వశ్రేయస్సుకు పాటు పడడము ద్వారానే వాల్మీకి మునీంద్రుని(ఋషి) ఋణాన్ని కొంతవరకైనా మనము తీర్చుకోగల్గుతాము. శ్రీరామావతార ప్రయోజనానికి కొంతవర్కైనా తోడ్పడ గలుగుతాము.

ఇతిశం

# "వేదమే రామాయణంగా"

*"వేదవేద్యే పరేపుంసి- జాతే దశరథాత్మజే*

*వేదః ప్రాచేత సాదాసీత్- సాక్షాత్ రామాయణాత్మనా"*

వేదవేద్యుడైన పరమ పురుషుడు(పరమాత్మ) దశరథ నందనుడైన శ్రీరాముడుగా అవతరించాడు. పరమాత్మను విడిచి ఉండజాలని వేదము రామాయణముగా వాల్మీకి ద్వారా అవనిపైకి అవతరించింది.

" ***వేదయతీతి వేదః*** " అంటారు. తెలిపేదివేదము. ఏమితెలుపుతుంది? వేదము పూర్వభాగము ద్వారా కర్మలను, చివరి భాగముద్వారా జ్ఞాన స్వరూపమైన పరబ్రహ్మను తెలుపుతుంది.

"***వేదాలన్నిటి చేతనేనే తెలుప బడుతున్నాను***" గీతాచార్యుడు" ***వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః*** " వేదము యొక్క ముఖ్య లక్ష్యము పరమాత్మగురించి తెలుపడమే అని వివరించాడు.

వేదమును పూర్తిగా లోతుగా పరిశీలించినప్పుడు వేదము పరమాత్మయొక్క మూలస్వరూపాన్నే కాక, శ్రీరామభద్రుని అవతారస్వరూపాన్ని కూడ గంభీరంగా తెలుపు తుందని తెలుస్తుంది.

1. ఉదాహరణకు "***ఋగ్వేదంలోని ఒక మంత్రము***" రామచరిత్రను ఎలా ప్రకాశింపజేస్తుందో చూద్దాము.

ఋగ్వేద మంత్రము " ***భద్రో భద్రయా సచమాన ఆగాత్***

స్వసారం జారోz భ్యేతి పశ్చాత్

సుప్రకేతైః(ద్యుతిభిః పుష్కలాభిః)

అగ్నిర్వితిష్ఠన్ వర్ణైరభిమస్త్రాత్

తస్యైషా పరాభవతి, తస్యోత్త రాభూయసే

నిర్వచనాయ, శుభవచనాయ"

ఈ మంత్రము యొక్క సామాన్యార్థము:-" భద్రుడు భద్రతో కలిసి వెళ్లాడు. జారుడు తన సోదరిపైకి వెళ్లాడు, తరువాత కమనీయ కాంతులతో

అగ్నినిలిచి అభిరాముని స్తుతించాడు. ఆమె అతని యొక్క పరాశక్తి అగుచున్నది. ఆయన అభివృద్ధికి, శుభానికి ఆమెకారణమగుచున్నది"

ఎవ్వరీ భద్రాభద్రులు? వీరెక్కడికి కలిసి వెళ్లారు? ఎవ్వరీ జారుడు? ఆయన ఎందుకు తన సోదరిపైకి ఎదురు వెళ్లాడు? అభిరాముడెవ్వరు? ఆయనను అగ్ని ఎందుకుస్తుతించాడు? ఆమె ఎవ్వరు? ఏవిధంగా ఆయన పరాశక్తి అయింది? ఎందుకు అయింది?

ఇవన్నీ ప్రశ్నలే. వీటికి ఒక ఆనుపూర్వికనబడడంలేదు. ఈ ప్రశ్నలకు సాధారణంగా సమగ్రార్థము స్పష్టము కావడంలేదు. అయితే ఈ వేదార్థాన్ని రామాయణార్థంతో ఉపబృంహణంచేసినప్పుడు ఈ మంత్రార్థము ఎలాస్పష్టమవుతుందో చూద్దామా?

"(భద్రుడు) రామభద్రుడు (భద్రతో) శుభకరియైన సీతాదేవితో కలిసి అడవికి వెళ్ళాడు. వ్యభిచారమే ముఖ్యవృత్తిగా కలిగిన రావణుడు( జారుడు) సోదరీ స్వరూపిణి అయిన సీతాదేవి (సోదరి) పైకి ఎదురుగా వెళ్లి అపహరించాడు.

తరువాత శీల పరీక్షా సమయంలో అగ్నిదేవుడు సీతాదేవిని తీసిక వచ్చి అందమైన కాంతులతో శ్రీరాముని ముందు నిలిచి ఆ అభిరాముని స్తుతించాడు. ఆ(సీతా)దేవియే శ్రీరామచంద్రుని( అతని) పరాశక్తి. ఆమెయే ఆయనకు శుభాన్ని, వృద్ధిని, ప్రసిద్ధిని కలిగిస్తుంది"

ఇప్పుడీ" భద్రోభద్రయా" అనే ఋగ్వేదమంత్రము శ్రీరామ చరిత్రనంతటిని ఎలా తనలో ఇమిడ్చుకొందో మనకు స్పష్టమయింది కదా!

మరొక రకంగా కూడ వేదము రామాయణార్థాన్ని ఎలా తెలుపుతోందో చూద్దామా?

2. వేద మంత్రాలలో గాయత్రీ మంత్రము సర్వశ్రేష్ఠమైనది కదా!

" నగాయత్ర్యాః పరోమంత్రః" అన్న వ్యాసోక్తి సుప్రసిద్ధమైనది. ఆగాయత్రీ మంత్రము శ్రీరామాయణార్థాన్నే తెలుపుతుంది. ఇప్పుడు రామాయణ, గాయత్రుల సాన్నిహిత్యాన్ని పరిశీలిద్దామా!

1. గాయత్ర్యాః..... విశ్వామిత్ర ఋషిః:- వేద మంత్రాలలో గాయత్రీ మంత్రాన్ని గుర్తించి, నిరంతరము అనుసంధించి, సిద్ధించుకొని, దాని సమగ్ర స్వరూపాన్ని సేవించి, లోకంలో ప్రకాశింపజేసి' "గాయత్రీ ఋషి" గా ప్రసిద్ధి నందినవాడు విశ్వామిత్ర మహర్షి.

గాయత్రీ మంత్రానికి దైవము శ్రీరాముడే" అహంవేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్" సత్య పరాక్రముడైన శ్రీరాముడే పరమాత్మ" అని నాకు స్పష్టంగా తెలుసునని, శ్రీరాముని పరమాత్మ తత్వాన్ని దశరథుని సభలో సమస్త మహర్షుల ముందు స్పష్టముగా తెలిపి, ఆతరువాత తాటకవధ, మారీచసుబాహువుల వధ, తనయాగ రక్షణల ద్వారా శ్రీరాముని సత్యపరాక్రమాన్ని లోకానికంతటికి చాటిన ధీశాలి విశ్వామిత్రమునీంద్రుడేకదా!

**2.** " చతస్రః చతస్రో వ్యాహృతయః, తాయోవేదసవేదబ్రహ్మ"

" భూః, భువః, సువః మహః' అని నాలుగు వ్యాహృతులు ఉన్నాయని వేదము వివరిస్తోంది. ఈ నాలుగు వ్యాహృతులు కూడ శ్రీరామునే ప్రకాశింపజేస్తున్నాయి. వాటిని చూద్దామా?

**(1)** "భూరితివా అగ్నిః":- "భూః" అనే వ్యాహృతి అగ్నిలో ప్రతిష్ఠను పొందుతున్నది. " శ్రీరాముడు అశ్వమేధ, పుత్రకామేష్టియాగాగ్నుల ద్వారా అవతరించాడు. విశ్వామిత్ర యజ్ఞాగ్నిద్వారా ప్రసిద్ధి వడసి, జనకుని సవనాగ్నిద్వారా సీతను పెండ్లాడాడు.

సీత అగ్నిప్రవేశము ద్వారా మహత్తర తేజస్సంపన్నుడయ్యాడు చివరకు అశ్వమేధయాగాగ్ని ద్వారా సార్వభౌమ పదాన్ని లవకుశుల్లను లభించాడు.

**2. *"భువరితివాయో"*** " భువః" అనే వ్యాహృతి వాయువులో ప్రతిష్ఠనందుతుంది.

మారీచుని వాయువ్యాస్త్రముతో శతయోజన విస్తీర్ణమైన హిందూ మహాసముద్రము యొక్క చివరలో పడగొట్టి మిగిలిన రామాయణ కథ నంతటిని నడపడానికి కారణమై శత్రువులచేత ప్రఖ్యాతి వడసిన పరాక్రమ వంతుడుగా శ్రీరాముడు ప్రతిష్టను పొందాడు.

**3. *"సువరిత్యాదిత్యే"*** " సువః" అనే వ్యాహృతి ఆదిత్యునిలో ప్రతిష్టను పొందుతుంది.

శ్రీరామభద్రుడు ఆదిత్య వంశసంజాతుడై ఆ( సూర్య) వంశాన్ని మణిదీపమువలె ప్రకాశింప జేశాడు.

అంతేకాదు" ఆదిత్య హృదయాన్ని" అనుసంధించి అరివీర భయంకరుడైన రావణాసురుని" చిత్రవధ" గావించి లోక కల్యాణాన్ని కలిగించాడు.

4. (I) ***"మహ ఇతి చంద్రమాః"*** "మహ" అనే వ్యాహృతి చంద్రునిలో స్థిరత్వాన్ని కలిగి ఉంటుంది." చంద్ర కాంతాననుడు" శ్రీరాముడు, చంద్రునివలె, చంద్రుని కంటె కూడ సుందరుడు శ్రీరామచంద్రుడు.

(II) మహఇతి బ్రహ్మణి" "మహ" అనే వ్యాహృతి బ్రహ్మయందు ప్రకాశిస్తుంది.

బ్రహ్మతేజస్సుతో సర్వ క్షత్రియ మహావీర భయంకరుడై లోకాతీత పరాక్రమ సంపన్నుడైన భార్గవ( పరశు) రాముని వైష్ణవ ధనుస్సును గ్రహించి విష్ణ్వంశావతారుడైన ఆమహా వీరుని నిర్వీర్యుని గావించి తన పరబ్రహ్మతత్వాన్ని ప్రకాశింప జేశాడు శ్రీరామభద్రుడు.

" అక్షయ్యం మధుహంతారం-

జానామిత్వాం సురేశ్వరం"

" శ్రీరామా! నీవు అక్షయుడివి, మధుసూదనుడిని, సురేశ్వరుడివి" అని తెలుసుకొన్నాను" అని భార్గవ రాముడు రామభద్రునిస్తుతించాడు.

5. ***గాయత్రీ చతుర్వింశ*** త్యక్షరా- గాయత్రికి ఇరువైనాలు అక్షరాలు. గాయత్రి సాధారణంగా సూర్యుని ప్రతిపాదిస్తుంది. సూర్యుడు సహస్ర కిరణుడు. గాయత్రీ మంత్రంలోని ఒక్కొక్క అక్షరము సూర్యుని వేయికిరణాలను ప్రకాశింపజేస్తుంది.

గాయత్రీ మంత్రాధి దైవము రామదివాకరుడేకదా. అందువలననే గాయత్రీ మంత్రంలోని ఇరువైనాల్గు అక్షరాలు రామాయణంలో ఇరువైనాలుగు వేల శ్లోకాలుగా విస్తృతమయ్యాయి.

ఇంకొక విషయము రామాయణంలో ప్రతి వేయి శ్లోకాల ముందు ఒక్కొక్క గాయత్రి అక్షరాన్నినిక్షిప్తం చేశాడు వాల్మీకి మహర్షి.

అంతే కాదు. రామాయణంలోని ముఖ్యమైన ఇరువైనాల్గు శ్లోకాలను దగ్గర చేర్చగా" గాయత్రీ రామాయణము'గా ప్రసిద్ధమైంది.

4. *త్రిపదాగాయత్రీ* :- గాయత్రీ మంత్రంలో (1) తత్సవితుర్వరేణ్యం(2) "భర్గోదేవస్య ధీమహి" (3) ధియోయోనః ప్రచోదయాత్" అని మూడు పదాలున్నాయి.

రామాయణంలో కూడ మూడు పదాలు ( స్థానాలు) ఉన్నాయి

(1) అయోధ్య(2) కిష్కింధ (3) లంక

5. షట్కుక్షిః- గాయత్రీ మంత్రంలోకుక్షీ భూతములైన( ప్రధాన) భాగములు ఆరు ఉన్నాయి.(1)తత్సవితుః (2)వరేణ్యం(3)భర్గోదేవస్య(4)ధీమహి(5) ధియో

**(6)** యోనః ప్రచోదయాత్‌రామాయణంలో గర్భభూతులైన ( ముఖ్యులైన) వారు ఆరుగురున్నారు.

**(1)** శ్రీరామచంద్రుడు**(2)**సీతాదేవి**(3)** లక్ష్మణుడు**(4)**భరతుడు**(5)** శతృఘ్నుడు**(6)**హనుమ

**(5)** ***తత్సవితుర్వరేణ్యాం*** :-"తత్" శబ్దముచే(ప్రస్తుతింప)ప్రతిపాదింపబడిన ఆ(రామ) సవితయొక్క గొప్పదైన

**(6)** భర్గో దేవస్య ధీమహి:- భగవత్ తేజస్సును(అప్రమేయం హితత్తేజః lయస్యసాజనకాత్మజా అన్నట్లు శ్రీరాముని తేజస్స్వ రూపమైన సీతాదేవిని) ఆశ్రయిస్తున్నాను.

**(7)** ధి యోనఃప్రచోదయాత్:- ఎవ్వడైతే మన బుద్ధులను ప్రేరేపిస్తాడో-

ఈ విధంగా గాయత్రీ మంత్ర వివరణమే రామాయణము. అంతేకాదు మరికొన్ని వేద వాక్యములుకూడ శ్రీరామాయణేతి హాసంలో అర్థవంతములైనవి.

**(1)** ***"పితాపుత్రేణ పితృమాన్‌యోనియోనౌ"*** :- తండ్రి ప్రతి జన్మలో కొడుకునే తండ్రిగా వరిస్తాడు. శ్రీరామావతారంలో జగత్పితయైన శ్రియఃపతి శ్రీరాముడుగా అవతరింపదలిచి, లోకంలో అందరు జీవాత్మలవలె తనకు ఒక కొడుకు అయిన దశరథుని- తన తండ్రిగా ఎన్నుకొన్నాడు.

" పితరం రోచయామాస- తదాదశరథం నృపం,"

**(2)** "అపిగ్రావాణఃప్లవంతే"- రాళ్లుకూడ నీళ్లలో తేలుతున్నాయని మరొక వేద వాక్కు.

వానరులద్వారా శ్రీరామచంద్రుడు హిందూ (లవణ) మహాసముద్రములో సేతువును నిర్మింపజేశాడు. తద్వారాలంకలో ప్రవేశించాడు.

సేతు నిర్మాణ వృత్తాంతాన్ని చారుల ద్వారావిన్న రావణుడు రామాదులకు తెలియకుండా వచ్చి సేతువును దర్శించి తనలో ఈ క్రింది విధముగా అనుకొంటాడు.

" అప్సు పాషాణాః ప్లవంతే కాలస్య కుటిలాగతిః"

"ఆశ్చర్యము- నీళ్లల్లో రాళ్లు తేలుతున్నాయే, కాలమెంత విచిత్రమైనది?"

**(3)** ఇంకా అహల్యావృత్తాంతము, క్రౌంచపక్షుల విషయము మొదలుకొని అనేక రామాయణ సంఘటనలు వేదాంతర్గతములే అని విజ్ఞులు సెలవిస్తారు.

**4.** అంతేకాదు శ్రీరామాయణంలోని సప్తకాండలు కూడ గాయత్రీ మంత్ర శబ్దార్థములను ప్రకాశింపజేస్తున్నాయి.

(1) ***బాలకాండ*** :-శ్రీరామచంద్ర స్వామిని సూర్య వంశ సంజాతునిగా వర్ణించడం ద్వారా"తత్సవితుః"శబ్దాన్ని వివరిస్తుంది.

(2) ***అయోధ్యాకాండ*** :- శ్రీరామచంద్రస్వామి కల్యాణగుణగణాలను పౌరజానపదులద్వారా వర్ణింపజేయడంద్వారా ***"వరేణ్యం"*** శబ్దార్థాన్ని తెలియజేస్తుంది.

(3)&(4) ***అరణ్య, కిష్కింధాకాండలు*** :- వాలిని, విరాధ, కబంధాది రాక్షసులను సంహరించడానికి మూలమైన శ్రీరాముని అప్రమేయమైన తేజస్సును వర్ణించడం ద్వారా" భర్గ" శబ్దార్థాన్ని సూచిస్తున్నాయి.

(5) ***సుందరకాండ*** :- సీతాసమక్షంలో ఆంజనేయస్వామి చేత శ్రీరామచంద్రుని దివ్యమంగళ విగ్రహాన్ని సంపూర్ణంగా వర్ణింపజేయడం ద్వారా" దేవస్య" శబ్దార్థాన్ని తెలుపుతుంది.

(6) ***యుద్ధకాండ*** :-" విభీషణ శరణాగతి" ద్వారా" ధీమహి" శబ్దార్థాన్ని ప్రకటిస్తుంది.

(7) ***ఉత్తరకాండ*** :- అయోధ్యావాసులందరికి రామావతార సమాప్తి సమయంలో మోక్షము లభించినట్లు ప్రస్తావించడం ద్వారా " ధియోయోనః ప్రచోదయాత్" శబ్దాలను వివరిస్తోంది.

ఈవిధంగా వేదవాక్యములకు ఉపబృంహణము ( వివరణ)ను కల్పించి, గాయత్రీ మంత్ర రాజాన్ని వివరిస్తుంది శ్రీరామాయణము. స్వయంగా శ్రియః పతి శ్రీరాముడుగా అవతరించగా, శ్రీపతిని తెలిపే వేదముకూడ ఈ భూమండలముపైకి వాల్మీకి వదనారవిందమును సాధనముగా చేసికొని రామాయణ మకరందంగా అవతరించింది. జన్మ, వ్యాధి, జరా, విపత్తి, మరణదుఃఖాలను తొలగించే అమృతమై ఆవిర్భవించింది. వాల్మీముఖ పర్వతమునుండి సంభవించిన రామాయణ మహానది హృదయాలనే పోలాలలో భక్తి సస్యాలను పండిస్తుంది. వాల్మీకి కని సింహముఖము నుండి వెలువడ్డ రామాయణ మహానాదం పాఠక, వక్తృ, శ్రోతృ జనాలకు శ్రీరామ ప్రాప్తిని కలిగిస్తుంది.

ఇతిశం

# ||| రామాయణము ఒక ఇతి హాసము ఊహాగానం కాదు

ఈ మధ్యకాలంలో రామాయణ మహాభారతములు యదార్థ సంఘటనలా?- ఈ రెండింటిలో ఏది మొదటిది?అనే మీమాంసను కొందరు అంతర్జాతీయ చరిత్రకారులు కల్పించి ఈ రెండు కావ్యాలు కూడ కల్పితగాధలే అని- కొందరు-ఈ రెండింటిలో మహాభారతమే మొదటిదని మరికొందరు నిర్ణయించారు. నిజానికి వారి తెలివితేటలకు నవ్వుకోవడం తప్ప చేయదగింది ఏమిలేదు.

రామాయణ మహాభారతములు రెండు ఇతిహాసాలు. వాస్తవంగా జరిగిన సంఘటనలను తెలిపే చరిత్ర గ్రంధాలు. ఈ రెండింటిలో రామాయణము క్రమాన్ని బట్టి చూచినా- ప్రాధాన్యాన్ని బట్టి చూచినా మొదటిది.

"వాల్మీకేస్తు వచస్సత్యం" అని అభిజ్ఞులనిర్ణయము. బ్రహ్మవాల్మీకికి వరమిస్తూ" నతేవాగన్పతాకావ్యేకాచిదత్ర భవిష్యతి," అని శ్రీమద్రామాయణంలో- వాల్మీకి వాక్కులలో ఒక్క అక్షరం కూడ అసత్యముకాజాలదని చెప్పినట్లు బాలకాండ తెలుపుతోంది.

యుద్ధకాండలో చివరిసర్గలో ఫలశృతిని తెలుపుతూ వాల్మీకి కూడ"పూజయంశ్చ, పఠంశ్చేమం ఇతిహాసం- పురాతనం"

శ్రీరామయణాన్ని పూజించ దగిన- పఠింపదగిన పురాతన ఇతి హాసంగా పేర్కొన్నాడు.

ఇంతకు" ఇతిహాసము" అనే శబ్దానికి గల అర్థాన్ని పరిశీలిద్దాము.

1. "ఇతిహాసం పురావృత్తం" అని నిఘంటువులో"

2. ఇతిహాసం కర్మవృత్తం" అని అర్థములు నిర్ణయింప బడ్డాయి. ఇతిహాసమంటే జరిగిన పనిని (సంఘటనను)లేక విషయాన్ని తెలిపేగ్రంధమని అర్థము.

" ఇతిహాసం" అనే పదానికి గల వ్యుత్పత్తిని బట్టి కూడ దాని అర్థాన్ని నిర్ణయింపవచ్చును కదా!

"ఇతిహ" ఇట్లు జరిగరినదని"

"ఆస్తే" ఉంది

"అస్మిన్"ఇందులో

అని ఇతిహాస శబ్దాన్ని పదవిభజన చేసి- దాని అర్థాన్ని పరిశీలించినప్పుడు జరిగిన సంఘటనలగురించి వివరణ ఇచ్చే గ్రంథమని- అంటే చరిత్ర గ్రంథమనే తేలుతున్నది కదా!

ఈ విధంగా రూఢ్యర్థము, వ్యుత్పత్తి అర్థము రెండింటినిబట్టి **"ఇతిహాసమంటే చరిత్ర"** అని శబ్దార్థ నిర్ణేతలు నిర్ణయించారు.

ఇంతకు రామాయణము ఎవ్వరి చరిత్రను తెలుపుతోంది? **1.** "రామస్య అయనమ్" అని రాముని చరిత్రను," **2.** "సీతాయాశ్చరితం మహత్"సీతాదేవి యొక్క గొప్ప చరిత్రను.,**3.** " పౌలస్త్యవధమ్, అని రావణ వధను తెలిపే గ్రంథమే రామాయణము.

ఆనాటి భారతదేశ చరిత్రను పరిశీలిస్తే ప్రధానంగా**3**ప్రాంతాల చరిత్రలు కనబడుతాయి.

**(1)** మానవ సామ్రాజ్య చరిత్ర:**(2)**వానర సామ్రాజ్య చరిత్ర **(3)**దానవ సామ్రాజ్య చరిత్ర

**[1)** మానవ సామ్రాజ్యము:- ఇది రామాయణకాలంలో ఉత్తర భారతమంతావిస్తరించి ఉంది. పశ్చిమంలో సింధు, సౌవీర రాజాలున్నారు. మధ్యోత్తర దేశంలో కోసల సామ్రాజ్యముఉంది. దాని అధిపతి ఇక్ష్వాకువంశ సంభవుడైన దశరథుడు. కొంచెము తూర్పు దక్షిణాలుగా అంగదేశము దానికి రోమపాదుడు అధిపతి. తూర్పు ఉత్తరాలుగా కేకయసామ్రాజ్యము. దానికి అధిపతి అశ్వపతి. దానికి ముఖ్యపట్టణము గిరివ్రజము. ఇదేనేటి మగధ ఈ దేశములో మాగధీనది అంతటా ప్రవహిస్తుంది. గిరివ్రజానికి చుట్టు ప్రక్కల కౌశాంబి, మహోదయము, ధర్మారణ్యము అనే నగరాలు ఉన్నాయి. ఇది ఈనాటి బీహారు భాగము. దీని దగ్గలోనే వంగ, మత్స్యదేశాలున్నాయి. ఇవే నేటి బెంగాల్ రాష్ట్రభాగాలు. ఉత్తర భారతంలోనేకాశీ, రాజ్యము ఉంది.

తూర్పు ఉత్తరములుగా విదేహసామ్రాజ్యముఉంది. ఇది నేటి నేపాలు భాగమనవచ్చును. దానికి మిథిలానగరము రాజధాని. ఆసామ్రాజ్యము జనక చక్రవర్తుల ఏలుబడిలో ఉండేది.

ఉత్తర భారత రాజ్యాలన్నిటిలో (ఇక్ష్వాకు)కోసల సామ్రాజ్యమే బలమైనది. దానికి రాజధాని అయోధ్య.**"ఇక్ష్వాకూణామియంభూమిః సశైల వనకాననా"**

**"సర్వాపూర్వామియం యేషామాసీత్ కృత్స్నా వసుంధరా"** అనే ప్రసిద్ధోక్తుల ద్వారా ఈ విశ్వమంతా మొదట ఇక్ష్వాకుల అధీనంలో ఉండేది. దశరథుని పాలనకాలం వరకు- మధ్యోత్తర భారతదేశము మాత్రమే మిగిలి పోయింది. అయినప్పటికి దశరథసామ్రాజ్యము మిగిలిన సామ్రాజ్యాలన్నిటికంటే బలమైనది. బలాన్ని బట్టో, బంధుత్వాన్ని బట్టో మిగిలిన రాజులందరు దశరథునికి వశులైనవారే.

ఆనాటి ప్రజలు ధార్మిక జీవనాన్ని గడిపేవారు" రాజ్ఞిధర్మిణి ధర్మిష్ఠాః : అన్నట్లు ఆనాటి రాజులవలె ప్రజలుకూడ ధార్మికులే. అందరు ధనధాన్య సమృద్ధికలవారే. అందరు సంతుష్టులుగా, ఉదారులుగా, సత్యవాదులుగా ఉండిరి. అందరు కిరీటాలను, పూలమాలలను, సుగంధద్రవ్యాలను, అనులేపాలను ధరించేవారు. దశరథునికి అనేకమంది రాజ పత్నులున్నట్లు తెలుస్తోంది బహుశఃరాజులకు "బహుభార్యాత్వం" ఆనాడు ఆచారంగా ఉండేదేమో. ఆనాటి ప్రజలు ధర్మార్థకామాలనే త్రివర్గాలను సంపూర్ణంగా సాధించేవారు. మోక్షంకొరకు ప్రయత్నించేవారు. అయితే అక్కడక్కడ బహుశఃకైకేయివంటి సవతి తల్లులు, మంథర వంటి దురోబధకులుఉండేవారేమో కాని వారందరు తరువాత శ్రీరాముని కల్యాణ గుణాలచే ప్రభావితులై ఉత్తములయ్యారు.

**2.**వానర సామ్రాజ్యము:-వింధ్య పర్వతముల దిగువ భాగాన్నుండి దక్షిణ దేశము ప్రారంభమవుతుంది. దక్షిణంలోని "కిష్కింధ" వానర సామ్రాజ్యానికి రాజధాని. వానరులంటే ఈ నాటి కోతులుకారు. వారు దైవాంశ సంభూతులు. ఇంద్రుడు, సూర్యుడు, మొదలైన దేవతలకు వానరస్త్రీలలో జన్మించనవారు. ముఖాలు వాలములు ఈ నాటి వానరములకువలె ఉండేవి. చాపల్యము వారికి కూడ ముఖ్య స్వభాముగా ఉండేది. ఆనాటి మానవ సామ్రాజ్యంలోని మహోన్నత సంస్కృతి ఆనాటి వానరులకు అబ్బలేదు. వాలి, సుగ్రీవ, అంగదాది మహావీరులలో సైతము వానరులచేష్టలు, చపల సంస్కృతి కొట్టవచ్చినట్లు కనపడేది.

ఇకవారి సాంఘిక జీవనాన్ని పరిశీలిస్తే- భర్త చనిపోయిన స్త్రీని ఆనాడు అనాథగా వదిలివేసే వారు కాదు. సమీప బంధువులెవ్వరో పెండ్లాడేవారు. అన్న చనిపోతే, వదినను మరిది పెండ్లాడేవాడు. దీనిని "దేవరన్యాయం" అంటారు. అలాగే తమ్ముడు చనిపోయాక మరదలును బావ పెండ్లాడే "భావుక న్యాయము" కూడ అమలులో ఉండేదేమో.

తార మొదలు వాలి భార్య. అయితే దుందుభితో జరిగిన యుద్ధంలో దీర్ఘకాలము వాలి బిలంలోనే గడిపినందువలన- ఆయన చనిపోయాడనుకొని ఆమె సుగ్రీవ పత్ని అయి- కిష్కింధా సింహాసనాన్ని అధిష్ఠించింది.

వాలి జీవించాడని తెలిసి- తిరిగి ఆయన పత్నిగా వానర సామ్రాజ్యాన్ని పరిపాలించింది. తిరిగి వాలివధ తరువాత మళ్లీ రుమతోపాటు 'సుగ్రీవ మహిషి' అయింది. ఆ దేశాచారాన్ని రాముడు కూడ ఆక్షేపించలేదు. నిజానికి వాలి సుగ్రీవులు వానర రాజులైనా- ఆనాటి వానర సామ్రాజ్యం మొత్తానికి తార మాటే వేదవాక్కు. కారణం తారగొప్ప రాజనీతిజ్ఞురాలు. అఖండప్రజ్ఞావంతురాలు. ఆమె సలహాను పెడచెవినపెట్టినందుకే తాను రాముని చేతిలో దుర్మరణం పాలయ్యానని, ఆమె సలహా ప్రకారము పరిపాలన చేయుమని సుగ్రీవునికి వాలి హితము చెప్పుతాడు.

తన ప్రియోక్తుల ద్వారా తారలక్ష్మణుని కోపాగ్నిని చల్లార్చి సుగ్రీవునికి రక్షణ ఎలా కల్గించిందో రామాయణ పాఠకులందరికి పరిచయమే కదా!

అయితే భర్త జీవించి ఉండగా, ఆస్త్రీని ఇంకొక పురుషుడు బలాత్కారంగా చేపట్టడం ఆనాటి వానరులలో పాపంగానే భావింప బడేది.

అన్నను కాదని తమ్ముడు వదినను చేపట్టడం ఆనాడు జరుగనే లేదు. ఆనాడు జ్యేష్ఠుడే శ్రేష్ఠుడు"జేష్ఠోభ్రాతా పితుస్సమః" అనే న్యాయం బలంగా ఉండేది.

ఇక తమ్ముని వెళ్లగొట్టి, ఆయన భార్యను అన్న స్వాధీనం చేసికోవడం వాలివిషయంలో వలె అక్కడక్కడ జరిగేదేమో. కాని అదికూడ పాపమే అని- దానికి కఠినమైన మరణమే తగిన శిక్ష అని అంగీకరింపబడింది.

" ఔరసీం, భగినీం చాపి। భార్యాంచాప్యనుజస్యచ

ప్రచరేత నరః కామాత్ । తస్యదండో వధః స్మృతః"

ఆనాటి వానర సామ్రాజ్యంలోనికి కూడ శ్రీరాముని ఆదర్శ లక్షణాలు వ్యాపింపజొచ్చాయి. కూతురు, సోదరి, మరదలు ముగ్గురు సమానులే అని వారివిషయంలో కామపరవశుడైన వానికి మరణ దండనమే తగిన శిక్ష అని వానరులలో కూడ బలంగా విశ్వసింపబడింది.

అంతేకాదు. అన్నమరణం తరువాత కూడ వదినను చేపట్టడం (దేవర న్యాయం) కూడ నేరమే అనే భావన వానరులలో అప్పటికే వ్యాపించడం మొదలైంది.

స్వయం ప్రభ గుహనుండి బయటకు వచ్చిన తరువాత అంగదుడు వానరులతో"అయ్యో! మాసం గడువు తీరిపోయిందే ఇప్పుడు వెళ్తే మాతల్లిని చేపట్టిన దుర్మార్గుడైన సుగ్రీవుడు మనను క్రూరంగా శిక్షింపక వదిలి పెడుతాడా" అని వాపోతాడు.

ఆనాటి వానర సామ్రాజ్యం మిక్కిలి బలోపేతమైంది. వాలి. సుగ్రీవ, సుషేణ, అంగద, హనుమ, జాంబవదాది వీరులు రాక్షసులను సైతము నిర్జింప సమర్థులే. అందుకే కిష్కింధ పొలిమేరలను సైతము రాక్షసులు సమీపింప సాహసించలేదు. అంతేకాదు ఆనాటి వానర సామ్రాజ్యము సకల సంపదలకు నిలయంగా ఉండేది.

3.రాక్షస సామ్రాజ్యము:-కిష్కంధకు ఉత్తర దక్షిణాలుగా రాక్షసులు వ్యాపించారు. గహనారణ్యాలలో జనపదాలలో కూడ రావణుడు తన సామ్రాజ్యమును విస్తరింపజేశాడు. జనస్థానంలో ఖర దూషణ త్రిశిరస్కులనే సేనానుల ఆధిపత్యంలో పదునాలుగువేల సైన్యాన్ని రావణుడు నిలిపి ఉంచాడు. రావణుడు సింహళదేశాధిపతి.

రాక్షసులు స్వేచ్ఛాచారులు. దౌర్జన్యము వారివృత్తి. మాంసభోజన రక్తమద్య పానీయములు వారికి విహితాలు. మానవులనుకూడ కొందరు రాక్షసులు భక్షించేవారు.

రాక్షసుల రాజైన రావణుడు ధాన్యమాలి మొదలైన సుందరాంగులను స్వంతంచేసికొన్నాడు. రంభ, పుంజిక మొదలైన అప్సరసలను బలాత్కరించాడు. అనేక రాజకన్యలను నిగ్రహించాడు.

"స్వధర్మో రక్షసాం భీరు! సర్వదైవ నసంశయః

గమనం వా పరస్త్రీణాం! హరణం సంప్రమథ్యవా"

సీతా!రాక్షసులకు పరస్త్రీ గమనము, హరణము, బలాత్కారము మొదలైనవి స్వధర్మములే" అని ఆనాటి రాక్షస ధర్మాలను రావణుడు తెలుపుతాడు. శూర్పణఖ యొక్క స్వేచ్ఛాప్రవృత్తి కూడ ఆనాటి రాక్షసుల ఆచారాలకు ఒక ఉదాహరణము.

రావణుడు సీతాదేవిని బలాత్కరించక పోవడానికి అనేక కారణాలు ఉన్నాయి.

1.సీతాదేవి యొక్క సౌకుమార్యము పట్ల రావణుని ప్రేమ,

బలాత్కారమువైపు అతని మనస్సును పోనీయకుండవచ్చును. ప్రేమ ఉన్నచోట బలాత్కారమునకు అవకాశముఉండదు కదా!

**2.** బ్రహ్మ, నలకూబరుల శాపాలు రావణుని నిలువరింప వచ్చును.

**3.** అన్నిటికంటె ముఖ్యముగా సీతాదేవి యొక్క దుర్నిరీక్ష్య పాతివ్రత్యతేజము రావణుని ముందడుగు వేయనీయలేదు.

అది ఆనాటి భారతదేశ భౌగోళిక, సాంఘిక చరిత్ర. ***"సర్వా పూర్వమియం యేషాం- ఆసీత్ కృత్స్నా వసుంధరా" ఇక్ష్వాకూణాం ఇయం భూమిః - సశైల వనకాననా"*** అనే ఆనాటి ప్రసిద్ధోక్తులు సముద్ర, గిరి పరీవృత మైన సమస్త భూమండలానికి ఇక్ష్వాకుప్రభువులే అధిపతులు అనే విషయాన్ని బలపరుస్తున్నాయి.

సింహళము, బర్మా, జావా, సుమిత్రా మొదలైన భూభాగాలు భారత దేశాంతర్గతాలే. ఆనాటి భూమండలము"సప్త ద్వీపావసుంధరా"అన్నట్లు ఏడుద్వీపాలను కలిగి ఉండేది.

శ్రీరామాయణేతిహాసం ఆనాటి చరిత్రను తెలుపుతోంది. ఆనాటి భూగోళ స్వరూపాన్ని కిష్కింధ కాండలో సుగ్రీవుని ద్వారా వాల్మీకి తెలియజేస్తాడు. జిజ్ఞాసువులు ఆవిషయాన్ని అక్కడగమనించాలి.

శ్రీరాముని కాలంలోని నదులు, పర్వతాలు, భూభాగాలు ఇప్పటికి అవే పేర్లతోనో, పేర్లు మారో అలాగే ఉన్నాయి.

అయోధ్యను, రామజన్మస్థలంగా, నివాసస్థలంగా ఇప్పటికి మనము ప్రాణప్రియంగా చూచుకొంటున్నాము.

అయోధ్యకు పరిసరాలలో ప్రవహించిన "సరయూనది" పేరు" గోగ్రా"గా మార్చుకొని గంగానదిలో సంగమించడానికి ఇప్పటికి ఉరకలు వేస్తునే ఉంది దండకారణ్యము, రాముడు నివసించిన పర్ణశాల, స్నానం చేసి తరించిన గోదావరీనది ఇప్పటికీ మనమనస్సులను ప్రభావితం చేస్తునేఉన్నాయి.

కన్యాకుమారి. రామేశ్వరాలకు వెళ్తే ఇప్పటికి రామసేతువు మన బంధాలను తొలిగిస్తునే ఉంది. మనకు రాముని అందిస్తునే ఉంది.

శ్రీరాముని కాలంలో అనేక వనచర రాజులు, గిరిజన రాజులు చక్రవర్తి పాలనను పటిష్టం చేసేవారు. సమ్రాట్టు వారిని ప్రాణ ప్రదంగా చూచుకొనేవాడు. గుహుడు శ్రీరామునికి అటువంటిప్రాణసముడైన సఖుడు

(ప్రాణ సమస్సఖా)

ఈ నాటి చరిత్ర కారులు ప్రముఖంగా పేర్కొనే ఆర్యద్రావిడుల సంస్కృతుల మధ్య అసహ్యము శ్రీరామాయణంలో కనపడదు.

రావణుడు శ్రీలంకా ప్రభువు. ఆయన ద్రావిడనేత. అయితే ఆర్యుల ప్రమాణగ్రంధాలుగా పేర్కొనే వేదాలలో ఆయన విద్వాంసుడు. ఉదాత్త అనుదాత్త, స్వరితాలను, ఘన, జటలను వేదాలకు కల్పించిన ఆవిష్కర్త. పంచకాల శివపూజాధురంధరుడు. ఆయనను ఆనాటి మానవులు, దేవతలు ద్వేషించింది ఆయన ద్రావిడుడని కాదు. ఆయన ఒక దుర్మార్గదానవుడని.

"అహో రూప మహో ధైర్యం। అహో సత్వమహోద్యుతిః

అహో రాక్షస రాజస్య। సర్వ లక్షణయుక్తతా।"

మొట్ట మొదట శయన మందిరంలో నిద్రిస్తున్న రావణుని రూపాన్ని చూచిన హనుమకు ఆశ్చర్యంతో కల్గిన భావాలివి. ఓహో ఏమి రావణుని రూపము। ఎంతధైర్యమో।ఎంత బలమో।బలమో ఎంతటి కాంతియో। ఈ రాక్షస రాజులో సర్వశుభలక్షణాలు రాశి పోసినట్లున్నాయికదా! అని విస్మితుడవుతాడు హనుమ.లంకానగరాన్ని చూచిన హనుమ దాని వైభవానికి ఆశ్చర్య పరవశుడై

" స్వర్గోzయం, దేవలోకోzయం, ఇంద్రస్యేయం పురీభవేత్

ఇది దేవతల స్వర్గలోకమా! ఇది ఇంద్రుని రాజధాని అయిన అమరావతీ నగరమా! అని ముగ్ధుడవుతాడు. "నిజంగా రావణుని తేజస్సును పరికిస్తే-ఈయన ఇంద్రునితో కూడిన త్రైలోక్యాన్ని పాలింపసమర్థుడే!అయితే ఇతడు అధర్మ పరుడు అదే ఇతని బలహీనత" అనుకొంటాడు హనుమ

"యద్యధర్మోన బలవాన్।స్యాదయం రాక్షసేశ్వరః

స్యాదయం సురలోకస్య।సశక్రస్యాzపిరక్షితా"

ఒక ద్రావిడుని రూపానికి, ధైర్యానికి, బలానికి, ప్రాభవానికి వాల్మీకి సమర్పించిన నీరజనమిది. అయితే అంతటి రాక్షస రాజు మూర్తీ భవించిన అధర్మము। మూర్తీ భూతదుష్కామము। అందువలననే ధర్మమూర్తి అయిన రాముని చేతిలో దశగ్రీవుడు సైతం చిత్రవధ గావింపబడ్డాడు.

ఈనాటి చరిత్ర కారులు నిరూపించ ప్రయత్నిస్తున్న మరొక విచిత్ర విషయం ఆర్యుల జన్మస్థలం. ఆర్యులు మధ్య ఆసియా అంటే రష్యా మధ్య భాగానికి చెందిన వారని ఆధునిక చరిత్ర వ్యాఖ్యానిస్తోంది.

వాస్తవం అయితే ఆర్యులు మనదేశానికి ఎక్కడనుండో వచ్చిన వారు కాదు. భారతదేశంలోనే జన్మించినవారు. భారతదేశమే వారి పుట్టిల్లు. ఈ దేశానికి" ఆర్యావర్తము" (అర్యుల దేశము)అని పేరు. ఆర్యులంటె మరెవ్వరోకాదు వేదమును ప్రమాణముగా నమ్మే మన వంటి వారందరు.

" అధిగచ్ఛేత రాజేంద్ర! దేవికాంలోకవిశ్రుతాం।

ప్రసూతిర్యత్ర ఆర్యాణాం।శ్రూయతే భరతర్షభ"

ఓ భరతర్షభా! ఆర్యులు పుట్టినది-హి మవత్పర్వతాల దిగువ ప్రవహిస్తున్న ప్రసిద్ధమైన దేవికా నదీతీరమే" అని ఇతిహాసం ఆర్యుల జన్మస్థానం గురించి స్పష్టంగా తెలుపుతుంది.

ఈ విధముగా శ్రీరామాయణము ఒకసత్యేతిహాసం, అయినా రామాయణ, మహాభారతాలు కల్పితకావ్యాలని, ఈ రెండింటిలో మహాభారతమే మొదటిదని, విచిత్రంగా వాదిస్తుండే పండితమ్మన్యులను జూచి జాలి పడడముకంటే మనము చేయదగినది ఏముంది.?

ఇతిశం.

# IV ఇతిహాసంగా రామాయణ ప్రయోజనము

శ్రీమద్రామాయణము ఒక ఇతిహాసము. రామాయణ, భారతములలో రామాయణమే ప్రథమము, ప్రధానమైనది. ఒక ప్రముఖ ఇతిహాసంగా శ్రీరామాయణమొక అనన్య సాధారణ ప్రయోజనాన్ని నిర్వహిస్తోంది. శ్రీమద్రామాయణము యొక్క ముఖ్య ప్రయోజనం ***'వేదానికి ఉపబృంహణము'*** కావించడమే.

వేదమొక చీకటి గుహవంటిది. బయటి వెలుగు ప్రపంచము నుండి ఆగుహలోకి ప్రవేశించినవారికి అందులో కన్నుపొడుచుకొన్నా ఏ వస్తువు కానరాదు. ఆగుహలో చివరిదాకాప్రయాణించే ఓర్పు, నేర్పు అందికిరి ఉండవు. ఆచీకటిలో చివరిదాకా ప్రయాణించిన వారికి ఒక అద్భుతప్రకాశముగోచరిస్తుంది.

ఇక్కడ బయట వెలుగు అంటే సంసారప్రకాశము. అందులో నుండి ప్రయాణించినవారికి గుహలో అంతా చీకటే. సంసార ప్రకాశమునకు సుఖసంతోషాలకు అలవాటు పడినవారికి వేదగుహలోని భగవత్తత్వము అంతాచీకటే. అందుకే గీతాచార్యుడు

"యానిశాసర్వభూతానాం- తస్యాం జాగర్తి సంయ మీ

యస్యాం జాగ్రతి భూతాని- సానిశాపశ్యతో మునేః" అని వివరిస్తాడు. సర్వ భూతములకు రాత్రి అయిన భగవత్ విషయములో సంయమి. జాగరూకుడై ఉంటాడు. సకల ప్రాణులు జాగరూకులై ఉన్న సంసార విషయములో ముని రాత్రివలే వ్యవహరిస్తాడు.

వేదగుహా నిశీధములో చివర వరకు ప్రయాణించిన వారికి "యోవేద నిహితం(విహితం)గుహాయాం" వేదగుహాంతరములో అద్భుతంగా ప్రకాశించే భగవత్తత్వము చేతికి లభిస్తుంది.

వేదమొక సముద్రమువంటిది. సముద్రముయొక్క లోతుకు అంతు ఉండదు. అంతటి అగాధ జలములో ఈదగల్గుట మహాకష్టము. సముద్రములో ఈదగల్గిన॥గజఈతగాళ్లకు" సముద్రము యొక్క అడుగులో ఉండే రత్నములు, వజ్రములు, నిక్షేపాలు అందుతాయి. అలాగే వేదరత్నాకరములో సంపూర్ణంగా ఈదగల్గినవారికి వేదవేద్యుడు అందుతాడు"(శ్రియశ్శ్రీః)" లక్ష్మీ దేవికే సంపద అయిన శ్రీపతి లభిస్తాడు.

గుహవలె, సముద్రము వలె వేదము అతి (అగోచర)గహనమైందని తెలిసికొన్నాము. అంతటి గంభీరమైన వేదానికి అర్థము తెలుపడం అసాధారణమైన విషయము. వేదార్థ విశదీకరణకు వేదాంగముల (షడంగముల) సంపూర్ణజ్ఞానము ఉండాలి. వేదోపబృంహణములైన స్మృతీతిహాస పురాణ జ్ఞానముకావాలి. వేదముల యొక్క"సర్వశాఖాప్రత్యయ న్యాయము" తెలియాలి. 'సర్వవేదాంత ప్రత్యభిజ్ఞ' ఉండాలి. అనగా వేదములోని అన్ని శాఖల అర్థము తెలియాలి. అన్ని ఉపనిషత్తుల సమన్వయ జ్ఞానము ఉండాలి. ఇంతటి జ్ఞానగరిమ సాధారణ విద్యావంతులకు సాధ్యమా?

అయితే ఈ ఆధునిక కాలంలో ప్రతి సాధారణజ్ఞుడు కూడా వేదార్థ ప్రవచనానికి ముందు కొచ్చేవాడే. ఇటు వంటివారిని చూచి,"అయ్యో!వీడునన్నెంత చెడగొట్టుతాడో?"అని వేదము భయడుతుందట.

" బిభేత్యల్పశృతాత్ వేదః, మామయం ప్రతరిష్యతి "

వేదార్థ నిర్ణయములో క్రాంత దర్శనులైన వ్యాసాది మునీంద్రులు మనకొరకు ఒక సులభమార్గాన్ని తెలియజేశారు.

***" వేదార్థ మరుతి యిడువదు స్మృతీతిహాసపురాణంగళాలో"*** లోక గురువులు స్మృతీతిహాస పురాణముల ద్వారా వేదార్థ నిర్ణయం చేయాలని సెలవిచ్చారు.

వేదములో పూర్వోత్తరములని రెండు భాగాలున్నాయి. ఇందులో పూర్వ భాగము కర్మకు సంబంధించింది. యజ్ఞయాగాది కర్మలు అన్ని అందులో వివరింపబడ్డాయి.

ఉత్తర భాగాన్ని వేదాంతము అంటారు. ఇందులోనే ఉపనిషత్తులున్నాయి. వీటికే వేదశిఖలు అనికూడపేరు. ఇవన్ని జ్ఞానమునకు సంబంధించినవి. జ్ఞానస్వరూపమైన పరబ్రహ్మకు చెందినవి.

"ప్రాయేణ పూర్వభాగార్థః- ధర్మశాస్త్రేణ కథ్యతే ఇతి హాస పురాణాభ్యాం వేదాంతార్థోపబృంహణం"

వేద పూర్వభాగాన్ని ధర్మశాస్త్రాలు వివరిస్తాయి. వేదాంతముల యొక్క అర్థాన్ని ఇతిహాస పురాణాలు నిర్ణయిస్తాయి.

ఇతిహాస పురాణాల్లో- ఇతిహాసములకే ప్రాధాన్యమివ్వబడింది. అలాగే ఇతిహాస ద్వయమైన శ్రీరామాయణ, మహాభారతములలో శ్రీమద్రామాయణానికే ప్రాథమ్యము ఉంది.

" *వేదోపబృంహణార్థాయ- తావగ్రాహయత్ప్రభుః* వేదములను వివరించే శ్రీరామాయణ ప్రచారముకొరకు లవకుశులను వాల్మీకి భగవానుడు నిర్ణయించాడు.

"కూజంతం రామ రామేతి-మధురం మధురాక్షరం

ఆరుహ్య కవితా శాఖాం-వందే వాల్మీకి కోకిలం"

కోకిల రసాల శాఖను అధిరోహించి మధురంగా కూజితం చేస్తుంది. వాల్మీకి కోకిల కవితా శాఖను ఆరోహించి మధురంగా మధురంగా, అక్షరంగా "రామ రామ" అంటూ కూజితం చేసింది మధురం "మ" నుముందుగా కల్గిన- "రాzక్షరం'రా అనే అక్షరం 'మధు' మధువే. వాల్మీకి కోకిల చేసిన మొదటి కూజిత మాధుర్యము శబ్దముల మాధుర్యము.

రెండవ మాధుర్యము అర్థ మాధుర్యము.

ఇక అక్షరత్వము రసమునకు సంబంధించినది.

రామాయణములో శబ్ద మాధుర్యము, అర్థ మాధుర్యముతోపాటు రసములో అక్షరత్వమున్నది. రసము ఎల్లప్పుడు అంతరార్థమునకు సంబంధించి ఉంటుంది. రామాయణములోని అంతరార్థము అక్షరమైనది. అక్షరమనగా నాశనములేకుండుట.

నిజముగా నాశనము (మార్పు) లేనిది ఆత్మతత్వమే. అందువలన రామాయణము యొక్క అంతరార్థము ఆత్మతత్వమునకు సంబంధించినది.

ఈవిధంగా రామాయణము అంతరంగా ఆత్మతత్వమును వివరించుతుంది.

వేదము పరమాత్మతత్వమునే తెలియజేస్తుంది. ఆత్మతత్వమునకు సంబంధించిన నిగూఢ వేదార్థమును రామాయణేతిహాసము వివరిస్తూ తన విలక్షణ ప్రయోజనాన్ని నెరవేరుస్తోంది.

రామాయణము బాహిరంగా" రామస్య అయనమ్" అని రామకథను, "రామాయాః అయనమ్" అని సీతాదేవి యొక్క మహాచరిత్రను" పౌలస్త్య వధమిత్యేవ" అని రావణ వధను వివరిస్తోంది.

"సీతారాముల మిధునత్వానికి రావణుడు అడ్డుగోడగా నిలిచాడు. రామ వియోగమును భరింపలేక సీత అమిత వ్యధను పొందింది. శ్రీరాముడు హనుమను దూతగా పంపి సీతా వృత్తాంతమును తెలిసికొన్నాడు. రావణుని

వధించి తిరిగి సీతమ్మను స్వీకరించాడు." ఇది రామాయణము యొక్క బాహ్యకథ.

అయితే అంతరంగా ఆలోచించినప్పుడు శ్రీరాముడు పరమాత్మ. సీత జీవాత్మ. జీవాత్మ పరమాత్మల కలయికకు అవరోధంగా నిలిచేది అహంకారము. అహంకారమే రావణుడు. అహంకారస్వరూపమైన రావణుని వృత్తాంతమును తెలియజేసిన హనుమ ఆచార్యుడు. హనుమ పురుషకారంతో సీతమ్మను శ్రీరాముడు స్వీకరించినట్లే ఆచార్యుని పురుషకారముతో విరోధిగ్రస్తమైన జీవాత్మయొక్క విరోధిని నశింపజేసి- ఆ జీవాత్మను పరమాత్మ స్వీకరిస్తాడు.

ఈ విషయాలను మన సంప్రదాయములో" అర్థ పంచకము"అంటారు. అర్థ పంచకమంటే అయిదు అర్థాలు. లేక అయిదు విషయాలు.

1. స్వ స్వరూపార్థము:- నేనెవ్వరిని?- నేను దాసుడను/ దాసిని.
2. పర స్వరూపార్థము:- నెనెవ్వరిని పొందాలి? పరమాత్మను.
3. ఉపాయ స్వరూపార్థము:-ఎలా పొందాలి? ప్రపత్తిద్వారా
4. విరోధి స్వరూపార్థము;_పొందడంలో అడ్డు పడేదేది?అహంకారమునకు మూలమైన సంసారము
5. ఫలస్వరూపార్థము:-పొంది నందు వలన ఫలమేది? పరమాత్మసేవా రూపమైన బ్రహ్మానందము.

ఈ అర్థ పంచకమును వేదము తెలియజేసింది. దీనిని వివరించడం కొరకే పురాణేతిహాసములు రచింపబడ్డాయి.

ప్రాప్యస్య బ్రహ్మణో రూపం- ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః
ప్రాప్త్యుపాయం;ఫల ప్రాప్తేః- తథా ప్రాప్తివిరోధిచ
వదంతి సకలావేదాః; సేతిహాస పురాణకాః
మునయశ్చ మహాత్మానో- వేదవేదార్థ వేదినః"

అర్థ పంచక జ్ఞానమే తెలిసికోదగినదని- మునులు, మహాత్ములు వేద వేదార్థ వేత్తలందరు ఉద్ఘోషిస్తారు.

అతి నిగూఢమై, వేదగుహాంతర్గతమైన ఈ అర్థపంచకజ్ఞాన భాండారమును

తన తపస్సుతో, బ్రహ్మవరంతో, నారదప్రసాదంతో బయలు పరచాడు వాల్మీకి. వేదమునకు ఉపబృంహణముగా రామాయణ మహేహాతిహాసాన్ని సాహితీ ప్రపంచములోనే మొట్టమొదట అక్షర బద్ధంగా శ్లోకమయంగా మనకందించిన వాల్మీకి మునీంద్రునికి అశృనయనాలతో కృతజ్ఞతాంజలిని ఘటించడం కంటె, మనము చేయగలిగిందేముంది? ఆ రామాయణాన్ని, నిరంతరము అనుసంధించుకొంటూ, ఆమహానందాన్ని హనుమ వలె పరిపూర్ణంగా మనముకూడ దోసిళ్ల నిండా అందుకొంటే- ఇంకా కావలిసిందే ముంది?

ఇతిశం

# V వాల్మీకి చరిత్ర

వాల్మీకి రామాయణంలో వాల్మీకి చరిత్ర లేదు. అయితే ఇతర పురాణాలు కొన్నింటిలో ఉంది. ముఖ్యముగా వాయుపురాణం, అధ్యాత్మరామాయణం, ఆనంద రామాయణం, పాద్మ, స్కాంధ, బ్రహ్మాండ పురాణాలలో వాల్మీకి చరిత్ర ఉంది.

ముఖ్యంగా వాయు, స్కాంధోప పురాణాలలో వాల్మీకి కథ ఒకే రకంగా ఉంది. అందువలన ఆ కథనే ప్రమాణంగా గ్రహించాలి.

వాయు, స్కంధోపపురాణములలో:- వరుణలోకంలో వరుణుడుఒకనాడు సనకాది మునులను తన ఇంటికి ఆహ్వానించాడు. వారి గోష్ఠిలో అనేక భగవద్విషయాలు చర్చకు వచ్చాయి. అందులో శ్రీహరి శ్రీరామచంద్రస్వామిగా అవతరించడం, రావణవధ మొదలగు విషయాలు ప్రసంగింపబడుతున్నాయి.

ఇక్కడ మనకు ఒక సందేహము కలుగవచ్చు. వాల్మీకి జన్మించడానికి ముందే రామాయణ కథ ఉందా? అని రామకథ ఎంతో ముందు నుండి దేవలోకాలలో ప్రచలితంగా ఉంది. అది బ్రహ్మకృతము. శతకోటి ప్రవిస్తరము ప్రత్యక్షరపవిత్రమైన రఘునాథచరితము.

ఆకథను తన్మయత్వంతో మునులు చర్చించుకొంటూ ఉండగా వరుణుని చిన్నకుమారుడు "హరితుడు" ఆటలలో నిమగ్నుడై - తన దగ్గర ఉండే నెమిలిని తరుముతూ, దాని కేకలకు ఆనంద పరవశుడగుచుండెను. అయితే హరితుని ఆటలు, అరుపులు, నెమిలి కేకలు, సనకాది మునుల ప్రసంగాలకు ఆటంకాలను కల్పించాయి.

అప్పుడు సనత్కుమారుడు కుపితుడై "లోకోత్తర మైన రామ కథ"కు దర్పముతో విఘ్నాన్ని కలిగించావు. కనుక నీవు వ్యాధుడవై అడవిలో మృగ పక్షుల మధ్య జీవించుమని" బాలహరితుని శపించాడు, అప్పుడు వరుణుడు తన కుమారుని అపచారాన్ని, ఋషిశాపాన్ని గ్రహించి విచార గ్రస్తుడై, తనకుమారుని క్షమింపు మని, సనత్కుమారుని ప్రార్థించాడు. కృపామయుడైన సనత్కుమారమునీంద్రుడు తన శాపాన్ని సవరించి " సప్తర్షి ప్రసాదంగా" రామనామమును లభించి తదనుసంధాన సుధాపానము ద్వారా ఉజ్జీవిస్తాడని"

అనుగ్రహించాడు, వరుణుని పెద్దకుమారుడైన భృగువంశములో ప్రచేతసుడనేముని జన్మించి, పెద్దవాడై వేదవేదాంగ విదుడై, దండకారణ్యము లో తప మాచరిస్తున్నాడు. ఆమునికి కుమారుడుగా హరితుడు శాపవశంగా జన్మించాడు. తండ్రి అయిన ప్రచేతసుని దగ్గర వేదవేదాంగములను అభ్యసించాడు. ఒక రోజు ఆబాలుడు సమిధలను తీసికొని రావడానికి సహచరులైన మునికుమారులతో కలిసి అడవికి వెళ్లాడు.

పూర్వజన్మకర్మఫలంగా, ప్రాచేతసుని మనస్సును ఆవనసౌందర్యము అక్కడి మృగ పక్ష సంతతులు ఆకర్షించాయి. హరితుడు తన ఇల్లు పరిసరాలను మరచి, అవనంలోనే ఉంటూ, వ్యాధవృత్తితో జీవిస్తూ, తన భార్యా పుత్రులను పోషించుకోవడానికి ఎందరినో హింసింపసాగాడు.

ఒకనాడు సప్తర్షులు అడనిలో ఆదారిలో వెళ్లసాగారు. వారిని వ్యాధుడు నిర్బంధించి హింసింపసాగాడు. ఆ ఋషులు వ్యాధునితో "ఓయీ! నీవు నీ భార్య, పుత్రుల పోషణకై ఈ హింసావృత్తిని అనుసరిస్తున్నావు కదా! దాని వలనీ నీకు కలిగే పాపంలో వారుపాలుపంచుకొంటారా? లేక నీవొక్కడివే ఆ పాపాన్నంతా అనుభవిస్తావా?" అని అడిగారు.

సప్తర్షుల ప్రశ్న వ్యాధుని హృదయంలో సందేహాన్ని కల్గించింది. ఆ మునులను అక్కడే నిర్బంధించి, ఆయన ఇంటికి వెళ్లి భార్యాపుత్రులను ఈ విషయము అడిగాడు. కుటుంబ యజమానిగా వారిని పోషించే భారము అతనిదే - కనుక సంపాదనలో ని పుణ్య పాపములతో తమకు పని లేదని వారు సమాధానమిచ్చారు. ఆ సమాధానము వ్యాధుని మనస్సులో ముల్లులా కుచ్చుకొంది.

అదే సమయంలో అక్కడ ఒక పక్షి ఎగురుతూ వెళ్లుతోంది. వ్యాధుడు దానిని చంపితినడానికి దానిపై బాణము వేశాడు. ఆబాణము ఆ పక్షికి తగులలేదు. ఆశ్చర్యంగా ఆశరము తిరిగి వచ్చి వ్యాధునికే తగిలింది. ఆ శరాఘాతము వ్యాధుని శరీరానికి తీవ్రబాధను కలిగించింది.

ఒక వైపు భార్యాపుత్రుల సమాధానము, మరొకవైపు శరాఘాతము వ్యాధుని మనశ్శరీరాలకు తీవ్రంగా ఒక్కుమ్మడిగా దుఃఖాన్ని కల్గించాయి.

ఆ బాధను తట్టుకోలేక వ్యాధుడు సప్తర్షులను సమాశ్రయించాడు. కరుణామయులైన ఆమహర్షులు- వ్యాధునికి " రామ" నామాన్ని"మధురంగా"

"మధురాక్షరాన్ని" ముందు మ" కలిగిన మధువు వంటి "రా" అక్షరాన్ని "మరా" అని అనగా తలక్రిందులుగా ఉపదేశించారు. తేనె కన్నా తీయని ఆరామనామానుసంధానము తలక్రిందులయినా తక్షణమే వ్యాధుని బాధలను తొలిగించింది. పరవశుడైన వ్యాధుని శరీరముపై చీమలు పుట్టను పెట్టాయి. కొంతకాలానికి ఆ పుట్టపై వరుణుడు కరుణించి వర్షింపగా పుట్టకరిగి, వాల్మీకి బహిర్గతుడయ్యాడు. స్కాంధపురాణంలో వాల్మీకికి ఈ విషయాన్ని స్వయంగా బ్రహ్మ చెప్పుతాడు.

అధ్యాత్మ రామాయణంలో కొద్ది తేడా ఉంది. భృగువంశంలో ప్రచేతస మహర్షికి పదకొండుగురు పుత్రులుండిరి. వారిలో చివరి వాడు "ఋక్షుడు"- ఋక్షుడు తీవ్రతపమాచరిస్తుండగా ఆయన శరీరముపై పుట్టపెరిగింది. వరుణుని అనుగ్రహముతో ఆ వల్మీకముపై వర్షము కురువగా - అందులో నుండి బయలువెడలిన ఋక్షుడు"వాల్మీకి"అయ్యాడు.

ఆనంద రామాయణంలో వాల్మీకి కథ చాల భిన్నంగా ఉంది. కృణుడనే ఋషీశ్వరుడు ఒక సరోవర తీరంలో ఆహారమును విసర్జించి తీవ్ర తపములో ఉండగా, ఆయన కనుల నుండి నీరు స్రవించెను. ఆకన్నీటిని ఒక నాగకన్య మ్రింగి ఒక బాలుని ప్రసవించెను. ఆబాలుడావనంలో కిరాతులచే పోషింపబడెను. మిగిలిన కథ అంతా మామూలే. ఆయన వ్యాధ వృత్తిలో ఉండగా సప్తర్షుల కృపాఫలంగా రామనామాన్ని లభించి వాల్మీకి అయ్యాడు.

"అధ్యాత్మ""ఆనంద" రామాయణాలలో వాల్మీకి చిత్రకూటంలో ఆశ్రమంలో ఉండి-తనను దర్శించడానికి వచ్చిన సీతారామ లక్ష్మణులకు తన కథను వివరిస్తాడు-"పుట్టుకతో బ్రాహ్మణు డనైనా, కిరాతుల పోషణకారణంగా వ్యాధుడనయ్యానని" వాల్మీకి తెలుపుతాడు.

శ్రీరాముడు భరతునికి పాదుకా ప్రదానం చేసి చిత్రకూటము వదిలి వెళ్లాక, వాల్మీకి మహాముని కూడ చిత్రకూటాశ్రమమును విడిచి, గంగా నదికి ఉపనది అయిన "తమసానదీ" తీరంలో ఆశ్రమ జీవితం గడిపాడు. "తమసానది" అలహాబాదు సమీపంలో గంగా నదిలో సంగమిస్తుంది.

గర్భవతి అయిన సీత అరణ్యంలో రామునిచే పరిత్యాజింప బడినప్పుడు ఆమెను వాల్మీకి తన ఆశ్రమానికి తీసికవెళ్లాడు. వాల్మీకి ఆశ్రమంలోనే సీతాదేవి పన్నెండు సంవత్సరాలు ఉంది. అక్కడే లవకుశుల జననం జరిగింది.

ఇంచుమించు అదే సమయంలో వాల్మీకి రామాయణ రచనను చేశాడు. పట్టాభిషేక సర్గవరకు వ్రాశాడు. తదనంతరము సీతాపరిత్యాగము, రాముని అశ్వమేధయాగము- లవకుశులయుద్ధం, సీతా భూప్రవేశం మొదలయిన సంఘటనలతో ఉత్తరకాండ ఏర్పడింది.

రామాజ్ఞతో శతృఘ్నుడు లవణాసుర సంహారం కొరకు మధురకు వెళ్తూ వాల్మీకి ఆశ్రమాన్ని దర్శించాడు. అప్పటికి సీతపూర్ణ గర్భిణి. తిరిగి శత్రుఘ్నుడు మధురనుండి అయోధ్యకు వెళ్తూ మరొక సారి వాల్మీకి ఆశ్రమాన్ని సందర్శించాడు. అప్పటికే లవకుశులు జన్మించారు.

కనుక శ్రీరాముడు రావణుని వధించి వచ్చి పట్టాభిషిక్తుడు అయ్యాకే వాల్మీకి రామాయణ రచన చేశాడని స్పష్టమవుతోంది.

"ప్రాప్త రాజ్యస్య రామస్య! వాల్మీకిర్భగవాన్నృషిః

చకార చరితం కృత్స్నం! విచిత్ర పదమాత్మవాన్

***"స్కాంధపురాణము"*** శ్రీరాముడే వాల్మీకి మహర్షిని తన చరిత్రను వ్రాయడానికి ఎన్నుకొన్నాడని వివరిస్తోంది. శ్రీ రామభూపాలుడు బ్రహ్మను పిలిచి తాను ఖర దూషణాది రాక్షసులను సంహరించిన సమయంలో 'శంఖుకర్ణుడనే' రాక్షసుడు తప్పించుకొన్నాడని - అయన తదనంతరము భార్యాద్వితీయుడై అడవిలో క్రౌంచపక్షుల రూపంలో తిరుగుతూ-బాటసారులైన మునులను జనులను, మృగములను రాక్షసరూపంతో భక్షిస్తున్నాడని ఆయనను వధించడానికి తాను వ్యాధుని రూపంలో వెళ్లి బాణము వేస్తానని- ఆ పరమార్థము తెలియక ఆ హింసాదృశ్యాన్ని చూడ లేక కారుణ్యాభావంతో తనను శపిస్తాడని- ఆశాపమే రామాయణానికి మూలశ్లోకమవుతుందని" తెలుపుతాడు.

నారదుడొకసారి బ్రహ్మదేవునితో " కమల గర్భా! వశిష్ఠ విశ్వామిత్ర, అగస్త్య,దుర్వాసాది- అనేక సమకాలీన మునులు, మరెందరో తదనంతర కవులు రామాయణ రచన చేశారు కదా! వారందరిని విడిచి వాల్మీకి ఒక్కనికే ఎందుకింత గౌరవము?" అని అడుగుతాడు సమాధానంగా వాల్మీకిని స్వయంగా రామభద్రుడే రామాయణ రచనకు ఎన్నుకొన్నాడని బ్రహ్మనారదునికి తెల్పుతాడు.

"వాల్మీకి రామనామాను సంధానముతో విగతకల్మషుడై చరాచరములలో ప్రతి వస్తువులోను, ప్రతి ప్రాణిలోను (తనను) భగవంతుని దర్శింపగల్గుతాడని, సృష్టిలో ఏ ప్రాణికి ఏ కొద్ది బాధకల్గినా, తనకే ఆ బాధ కలిగినట్లుగా

భావించు కొని పరదుఃఖమును తన దుఃఖంగా అనుభవిస్తాడని అటువంటి " సన్మనుష్యుడైన " వాల్మీకియే"శృంగార విరలము (తక్కువ శృంగారము)దుః ఖాయాసబ హుళ మైన రామాయణ రచనా గౌరవాన్ని అందుకోవడానికి తగిన వాడని నిర్ణయించానని" బ్రహ్మకు శ్రీరాముడు తెలియ జేస్తాడు.

అంతే కాదు" సరస్వతిని ప్రేరేపించి, వాల్మీకి నాలుక పై నిలుపుమని - వాల్మీకి వ్యాధుని శపించి, పరితప్తుడయ్యే సమయంలో స్వయంగా వెళ్లి ఆ శాపమే రామాయణ రచనకు ఆధారవుతుందని తెలిపి వాల్మీకిని ప్రోత్సహించుమని"శ్రీరాముడు బ్రహ్మను ఆజ్ఞాపిస్తాడు.

ఇక నారదోపదేశం ద్వారా వాల్మీకికి సందేహాలు తొలిగి, తమసానదికి స్నానానికి వెళ్లడం మొదలయిన విషయాలు ముందు చూద్దాం.

ఇతిశం

# VI. " వాల్మీకి సందేహము - నారదాగమనము"

వాల్మీకమంటే మట్టితో చేయబడిన మనశరీరమే వరుణుని వర్షముతో పుట్టనుండి బయలు వెడడమంటే దేహాత్మాభిమానం వదులుకోవడమే దానికి భగవత్కృపావృష్టికావాలి. నిరంతర రామ నామాను సంధానమువలననే భగవత్కృపావర్షము కలుగుతుంది.

"తప స్స్వాధ్యాయ నిరతం -తపస్వీ వాగ్విదాం వరం

నారదం పరిపప్రచ్ఛ -వాల్మీకిర్ముని పుంగవం"

తపస్వి అయిన వాల్మీకి -తపస్స్వాధ్యాయ నిరతుడు, వాగ్విదాం, వరుడు, ముని పుంగవుడైన నారదుని చక్కగా ప్రశ్నించెను.

ఇది రామాయణంలోని మొట్టమొదటి శ్లోకము-తపశ్శబ్దముతో ఆరంభమైన శ్లోకము. గాయత్రీమంత్రంలోని మొదటి అక్షరము "త"తో రామాయణము మొదలయింది.

ఇందులో శిష్యుడైన వాల్మీకి లక్షణము, ఆచార్యుడైన నారదుని లక్షణాలు చక్కగా వివరింపబడ్డాయి. ఈ లక్షణాలను గూర్చి పూర్తిగా తెలిసికొనే ముందు తపశ్శబ్దానికి అర్థాన్ని స్పష్టంగా తెలిసికోవాలి.

తపశ్శబ్దానికి అనేక అర్థాలు ఉన్నాయి.

**1.*తప"అనుష్ఠానే" "తపసంతాపే"*** :-

తపస్సు అంటే కృఛ్ఛ్ర చాంద్రాయణాది వ్రతానుష్ఠానము దీనిద్వారా శరీర భోగము తగ్గి శరీరము తపించి కృశిస్తుంది. రజస్తమో గుణాలు నశించి సత్వగుణము ప్రవృద్ధ మౌతుంది. సత్వగుణవృద్ధి భగవద్విషయాన్ని తెలిసికోవడానికి అవసరమైన శారీరక మానసిక స్థితులను కల్పిస్తుంది.

**2.**తప "ఆలోచనే":- భగవద్విషయ ఆలోచనమే తపస్సు దీనికే "బ్రహ్మజిజ్ఞాస"అనిపేరు. ఆచార్యుడు ఉపదేశించిన విశేష అర్థాలను చక్కగా మననం చేసి కోవడం కూడ తపస్సే.

**3.** తపస్సు అంటే యోగము:- "తపయోగే":-యోగమంటే అపూర్వలాభము,

నిత్యానుభవంలో ఉండే సుఖదుఃఖములు మొదలైన అల్పాస్థిర విషయాలను విడిచి-అపూర్వమైన పరమాత్మను పొందడమే తపస్సు.

**4.** యోగః కర్మసు కౌశలం:- చేసే వాడిని నేను అనే కర్తృత్వాహంకారమును వీడి ఫలాపేక్ష లేక, కర్మలను (కౌశలము)నేర్పుతో చేయడం కూడా యోగమే-తపస్సే.

**5.**స్వాధ్యాయ ప్రవచనేవేతి నాకో మౌద్గల్యః తద్ధి తపస్తద్ధి తపః:- ముద్గల వంశజుడైన నాకుడనే ముని స్వాధ్యాయ, ప్రవచనములు రెండు కూడ తపస్సే అనెను. అదే తపస్సు అన్నాడు.

"శిక్షావల్లి"స్వాధ్యాయ ప్రవచనాభ్యాం నప్రమదితవ్యం"స్వాధ్యాయ ప్రవచనాలయందు ప్రమత్తత (ఏమరి పాటు /నిర్లక్ష్యం)కూడదని ఉపదేశించింది.

నాకముని స్వాధ్యాయ ప్రవచనాలను రెంటిని కలిపి తపస్సు అన్నాడు కదా!మరి వాల్మీకి "తప స్సాధ్యాయ నిరతం"తపస్సు స్వాధ్యాయములను రెంటిని వేరుగా పేర్కొన్నాడు. శిక్షావల్లి కూడ స్వాధ్యాయ ప్రవచనాలను వేరుగావించింది. ఇప్పుడు "తపస్సు" శబ్దానికేమర్థము?

శాస్త్రములో "గోబలీ వర్దమనే న్యాయము "ఒకటుంది. దీనిప్రకారము గోశబ్దానికి అర్థము నిర్ణయింపబడుతుంది.

సాధారణంగా "గోవు"అంటే 'ఆవు"కావచ్చు, "ఎద్దు"కావచ్చు అలాగే "బలీ వర్దమంటే-"ఎద్దు"అని "పోతు'అని అర్థాలున్నాయి. "గో, బలీవర్దాలు"అనే రెండు శబ్దాలు కూడ "ఎద్దు"అనే ఒక సాధారణ అర్థాన్ని తెలుపుతున్నాయి. కనుక _"గోవు'అనే శబ్దానికి (బలీవర్దమనే శబ్దాన్ని జతచేసి)ఇక్కడ "ఎద్దు"అనే అర్థాన్ని నిర్ణయించడం జరుగుతుంది.

అలాగే "తపస్స్వాధ్యాయములు"రెంటిని విడివిడిగా వాల్మీకి చెప్పాడు. నాకముని "స్వాధ్యాయ, ప్రవచనములను రెంటిని కలిపి తపస్సు" అన్నాడు. "స్వాధ్యాయము'అనే శబ్దము ఒకసారి విడిగా (వాల్మీకి ప్రయోగంలో)మరొక చోటనాకమునిప్రయోగంలో తపశ్శబ్దముతో కలిపి వాడబడుటచేత "స్వాధ్యాయము"అనే శబ్దానికి స్వాధ్యాయమే (వేదాధ్యయనమే)అని అర్థము తెలిపి, తపస్సు అంటే, మిగిలిన"ప్రవచనమనే "అర్థాన్ని పరిశేషన్యాయంగా అభిజ్ఞులు నిర్ణయిస్తారు. కనుక వాల్మీకి అభిప్రాయాన్ని బట్టి తపస్సు అంటే ప్రవచనమే.

శ్రీరామాయణము -తపశబ్దాన్ని వాల్మీకి, నారదుల విషయాల్లో వేర్వేరుగా తెలుపుతుంది.

వాల్మీకి "తపస్వి"మాత్రమే

నారదుడు - "తపస్స్వాధ్యాయ నిరతుడు"

"తాచ్ఛీల్యేణినిః" అనే వ్యాకరణ సూత్రము ప్రకారము "తపస్వి"అంటే "తపశ్శీలి", తపస్సు చేసే స్వభావం కలవాడు.

ఇక నారదుడో తపోనిరతుడు -ప్రవచనం చేయడంలో నిష్ణాతుడు - నేర్పరి.

ఈ అర్థాన్ని బట్టి చూచినప్పుడు వాల్మీకి భారద్వాజాది మునులకు వేదాన్ని ప్రవచనం చేసేప్పుడు, ఆయనకు నిస్సందేహమైన సమగ్రమైన వేద విజ్ఞానంలేదు.. ఆయనను అనేక సందేహాలు బాధిస్తుండేవి. ముఖ్యంగా కొన్ని వేదవాక్యములకు వాల్మీకికి సమన్వయార్థము స్పష్టము కాలేదు.

ఉదాహరణకు:- " 1. అపిగ్రావాణః ప్లవంతే "రాళ్లు తేలుతున్నాయి. - (ఎక్కడ, ఎందుకు?)

2."పితాపుత్రేణ పితృమాన్ యోనియోనౌ" జన్మ జన్మలలో తండ్రి కొడుకును తండ్రిగా చేసికొన్నాడు. (ఎవ్వరు ఎవ్వరిని)

3. "భద్రో భద్రయా సచమాన ఆగాత్ "భద్రుడు భద్రతో కలిసి వెళ్లాడు (ఎవ్వరీ భద్రుడు?భద్ర ఎవ్వరు?వారిద్దరు కలిసి ఎక్కడికి వెళ్లారు?)

4.తస్మిన్ యదంతః -తదుపాసితవ్యం"-దానిలో ఏదుందో దానిని ఉపాసించాలి. (దేనిలో దేనిని ఉపాసించాలి)ఇలాగే వేదంలో అనేక సందేహాలు వాల్మీకిని బాధించాయి.

అంతేకాదు వాల్మీకికి మరొక ముఖ్యసందేహమేర్పడింది. తాను సప్తర్షుల ద్వారా ఉపదేశము పొందిన "రామ" నామాన్ని తాను చాలా కాలము జపించి-పాపవిముక్తుడయ్యాడే- ఆ రాముడెవ్వరు? ఆయన పరమాత్మేనా? లేక సిద్ధుడా? ఒక వేళ ఆ రాముడు పరమాత్మే అయితే ఇప్పుడు ఈ లో కంలో ("అస్మిన్ సాంప్రతం లో కే") ఆయన అవతార రూపంలో ఉన్నాడా? లేక ఆయన అవతారము గడిచి పోయిందా? లేక ఆ అవతారము ముందు రాబోతుందా?

ప్రస్తుతము అయోధ్యను పాలించే రాముడు ఉన్నాడు కదా! ఈయన తనను పవిత్రుని గావించిన ఆ రాముడు ఒకడేనా? లేక ఇద్దరు వేరా?

ఈ అయోధ్యాపతి అయిన శ్రీరాముడు భగవంతుడా? అయినచో ఆయనలో భగవంతునికి ఉండవలసిన షోడశ(16) గుణాలు రాశిపోసినట్లు స్పష్టంగా ఉన్నాయా?

ఇవి వాల్మీకిని నిరంతరము దహిస్తున్న ముఖ్య సందేహాలు. భగవద్విషయానికి సంబంధించిన సందేహాలు

భగవద్విషయాలకు సంబంధించిన ప్రశ్నకు "పరిప్రశ్న" అని పేరు. వాల్మీకి వీటికి సంబంధించే ప్రశ్నించాడు కాబట్టే "పరిపప్రచ్ఛ" అని రామాయణం తెలుపుతోంది.

సాధారణ విషయాలకు సంబంధించిన ప్రశ్న-ప్రశ్నయే. వాటి గురించి అడిగితే "ప్రపచ్ఛ" అంటే సరిపోతుంది

గీతాకారుడు-భగవద్విషయంలో సందేహాలు ఏర్పడినప్పుడు-వాటినెలా తీర్చుకోవాలో తెలుపుతూ.

"తద్విద్ధి ప్రణిపాతేన, పరిప్రశ్నేన సేవయా"

తత్వదర్శనులయిన జ్ఞానులను సందర్శించి ప్రణిపాతము (దండ సమర్పణము) ద్వారా, పరిప్రశ్నద్వారా సేవద్వారా సందేహనివృత్తి చేసికోవాలని ఉపదేశించాడు.

శ్రీరాముని సాధారణ కథ జగద్విదితమైందే- జనులు ఆ రోజుల్లో రాముని గురించి కథలు, కథలుగా చెప్పుకొనేవారు.

"రామో రామో రామ ఇతి జనానా మభవన్ కథాః

ఇక వాల్మీకి అప్పటికే ఒక మహర్షి కదా! ఆయన అంతటి వానికి రాముని సాధారణ కథ తెలియకుండా ఉంటుందా?

అంతేకాదు సీతారామలక్ష్మణులు స్వయంగా చిత్రకూట పర్వత ప్రాంతంలోని వాల్మీకి ఆశ్రమాన్ని దర్శించి, ఆయనను అభినందించినట్లు రామాయణమే వివరిస్తోంది.

"తతస్తౌ పాదచారేణ - గచ్ఛం సహసీతయా

రమ్యమాసేదతుఃశైలం-చిత్రకూటం మనోరమం

అభిగమ్యాశ్రమం సర్వే-వాల్మీకి మభివాదయన్"

అందువలన వాల్మీకికి కలిగిన సందేహాలు రాముని సాధారణ చరిత్ర గురించి కాదు. రాముని పరమాత్మ తత్వం గురించి ఏర్పడ్డవే.

వాల్మీకికి కలిగిన సందేహాలు స్వయంగా తీర్చుకోగలిగేవి కావు. ఆచార్యుని సన్నిధిలో మాత్రమే తీర్చుకోగలి గేవి. ఆచార్యుడిద్వారా కాక స్వయంగా సముపార్జించు కొన్న విద్య వీర్యవంతమైనది కాదు.

"ఆచార్యానుపది ష్టాయాః - విద్యాయాః వీరశూన్యతా"

స్వయంగా సాధించు కొన్న విద్య దుర్బలమైంది. అనేక సందే హ బాధితమైంది- అజ్ఞానసమమైంది.

సందేహములు కలిగిన వాడు చేయవలసిందేమిటి - అనే ప్రశ్నకు వేద సమాధన మీవిధంగా ఉంది.

"సగురుమేవాభిగచ్ఛేత్- సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం"

అనుమానములు కలిగిన వాడు -"భగవద్విశ్వాసము కలిగి, జ్ఞానానుష్టానములు, చక్కగా కలిగిన అచార్యుని ఆశ్రయించాలి. ఆచార్యుని ద్వారా పొందిన విద్య పటిష్ఠమైంది. సాధిష్ఠమైంది. "ఆచార్యాద్ధైవ విద్యా సాధిష్ఠంప్రాపత్"

ఇప్పుడు వాల్మీకికి కూడ శ్రీరామ పరమాత్మ తత్వాన్నిగురించి ప్రబల సందేహాలు కలిగాయి కదా!అయితే ఈ సందేహాలు తీర్చగల ఆచార్యుడెవ్వరో, ఆయనను ఎలా ఆశ్రయించాలో వాల్మీకికి అర్ధముకాలేదు.

భగవంతుడు కరుణామయుడు. తనగురించి జిజ్ఞాస (ఆర్తి) కలిగిన వాడికి - తానే ఉత్తమాచార్యుని ప్రసాదిస్తాడు.

"ఆచార్య లాభం -భగవానాలే"అని లోక గురువులు సెలవిస్తారు. ఒక ఉత్తమా చార్యుడెలా ఉంటాడు?-బలమైన విత్తనాలను కలిగిన ఒక కృషీవలుడు (రైతు) తన విత్తనాలను చల్లడానికి తగిన సారవంతమైన క్షేత్రము (నేల) కొరకు అన్వేషించినట్లే - ఒక ఉత్తమ గురువు- తద దగ్గర ఉన్న అపురూపమైన భగవద్జ్ఞాన సంపదను అందుకోగలిగిన ఒక సచ్ఛిష్యుని కొరకు వెదుకుకొంటూ వెళ్తుంటాడు.

భగద్విషయంలో ఆర్తి గల్గిన వాల్మీకిని -ఆచార్యశ్రేష్ఠుడైన నారదుడు స్వయంగా వెదుకు కొంటూ వాల్మీకి ఆశ్రమానికే వెళ్లాడు"వెదుక బోయిన తీగ-వాల్మీకికాలుకే తగిలింది".

ఒక ఉత్తమాచార్యునిలో మూడు లక్షణాలు ముఖ్యంగా ఉండాలి అని రామాయణం వివరిస్తుంది.

1 తపస్స్వాధ్యాయ నిరతత్వము

2 వాగ్విదాం వరత్వము

3 మునిపుంగవత్వము

1 తపస్స్వాధ్యాయ నిరతత్వము :- నారదుడు వేద విజ్ఞానమంతటిని స్పష్టముగా కలిగిన వాడు. అంతేకాదు- ఆజ్ఞానాన్ని పూర్తిగా అనుష్ఠానంలో పెట్టు కొన్నవాడు. జ్ఞానానుష్ఠాన పూర్ణుడు ఆయన,

2 వాగ్విదాం వరత్వము :- తనకు అన్నివిషయాలు తెలియడము ఒక ఎత్తు అయితే ఇతరులకు వాటిని సుస్పష్టంగా, సమగ్రంగా చెప్పగల్గడం మరోకఎత్తు రెండవ లక్షణం ఇది. దీనికొరకు అపార శబ్దజ్ఞానం ఆచార్యుని ఆధీనంలో ఉండాలి. నారదుడు ప్రవచనంలో కూడనిష్ణాతుడే.

3 మునిపుంగవత్వము:- ఆచార్యుని మూడవ లక్షణం మనన శీలము.

ఆచార్యుని భగవద్జ్ఞానం ఇతరులకు చెప్పడం కొరకు మాత్రమే కాదు. స్వయంగా అనుభవిస్తూ ఆనందించడం కొరకు కూడ ఇది మననము ద్వారా సాధ్యమవుతుంది.

నారుదుడు నిరంతరం భగవన్నామానుసంధానామృతమును పానము చేసేవాడు. ఈ మననము వలన ప్రవచనము సులభమవుతుంది నారదునిలో- మరో మూడు ఆచార్యలక్షణాలు విశిష్టంగా ఉన్నాయి.

1 కలహ శీలిత్వము 2. నారాయణ పరాయణత్వము

3. త్రిలోక సంచారము.

1 కలహశీలిత్వము:- ఆచార్యుడు ఎక్కడైనా కలహ శీలాన్ని కల్గిఉంటాడా?

ఈ ప్రశ్న విడ్డూరంగా లేదా?

సమాధానము:- ఆచార్యుడు ఎప్పుడో కాదు-నిరంతరం కలహశీలాన్ని కల్గి ఉండాలి. ఇందులో విడ్డూరము మాటేలేదు.

అయితే కలహమే విషయంలో -ఎవ్వరితో?ఎందుకు?

అచార్యుడు కలహించేది. అధర్మంతో, అధర్మపరులతో ఆచార్యుని మనస్సులో ధర్మాధర్మముల మధ్య నిరంతరం ఘర్షణ ఏర్పడుతుంది ఆ ఘర్షణలో ధర్మమే గెలుస్తుంది. ఎందుకు.?

"ఆచినోతి హి శాస్త్రాణి - ఆచారాన్ స్థాపయత్యపి

స్వయమాచరతే యస్తు- స ఆచార్య ప్రకీర్తితః

ఆయన సమస్త శాస్త్రాలను అధికరించినవాడు, ఆచారాలను స్థాపించే వాడు, స్వయంగా ధర్మాన్ని అచరించే వాడు కనుక. ఆచార్యుడు.

**2** నారాయణ పరాయణత్వము:- నారదునికే కాదు ప్రతి ఆచార్యునిలో కూడా నారాయణుడే పరదైవమనే విశ్వాసముండాలి ఈ సృష్టికి పూర్వము నారాయణు డొక్కడే ఉన్నాడని శృతి తెల్పుతోంది. "ఏ కో హవై నారాయణ ఆసీత్"

అంతే కాదు ఆయనే ప్రతివస్తువు లోపల, బయటకూడ ఉంటాడు "అంతర్బ హిశ్చ వ్యాప్య నారాయణ స్స్థితః

ఆయనే సకల ఫలప్రదాత" ఫలమత ఉపపత్తేః" దేవతల మధ్యేకాదు. రాక్షసులమధ్యలో కూడ నిర్భయంగా నారాయణ పరాయణుడై సంచరింప దగిన ఉత్తమోత్తమ ఆచార్యుడుదృఢ (రక్షణ) విశ్వాసశాలి నారదుడు.

**3**. త్రిలోకసంచారము:- ఆ చార్యుని మూడవ లక్షణము " త్రిలోక సంచారము" నారదుడెప్పుడు త్రిలోక సంచారే ఎందుకు తిరుగుతుంటాడాయన? తనకు భగవత్కృప వలన లభించిన జ్ఞానాన్ని శ్రీ మన్నారాయణ నామామృతాన్ని అందరికి పంచాలని, అందరి ఆర్తిని, దుఃఖాలను తొలిగించాలని.

ఒక ఉత్తమా చార్యుడు ఎందుకుజ్ఞానో పదేశం చేస్తాడు?

**1** ధనాపేక్షతోనా? :- ఎంతమాత్రము కాదు సదాచార్యుడెప్పుడు దురాశాపరుడుకాడు. భగవత్కృపతోధర్మబద్ధంగా ఎంత లభిస్తే-అంతటి తోనే తృప్తిపడే వాడు ఆయన"యదృచ్ఛాలాభసంతుష్టుడు."

**2.** శిష్యులు కోరినందువలననా? :- కొంత వరకు కావచ్చు "నాపృష్టః కస్యచిత్ బ్రూయాత్" అడుగనిదే శాస్త్రాన్ని చెప్పకూడదనే నియమము ఉంది కనుక. అడుగకుండా అందరికి చెప్పితే ఆ విషయముపై అనాదరము ఏర్పడుతుంది కనుక అయితే ముఖ్యంగా ఎందుకు ఆచార్యో పదేశము?

3 ఉపదేశించకుండా ఆచార్యుడు ఉండజాలనందువలన:- భగవత్ జ్ఞానసంపదలేక కోటానుకోట్ల జీవులు అనేక దుఃఖాలను అనుభవిస్తున్నారు. వీరి దుఃఖాన్ని చూచి "పర దుఃఖ దుఃఖిత్వము" గల కరుణా మయులైన ఆచార్యులు సహింపజాలక ఉపదేశిస్తారు.

అంతే కాదు ఆచార్యులు కర్మబంధము లేని వారు. కేవలము కృపతో భగవత్సన్నిధినుండి మనదగ్గరకు వచ్చినవారు. అందుకే వారు భగవంతుని దగ్గరకు స్వేచ్ఛగా తిరిగి వెళ్లగల్గుతారు వారొక్కరే వెళ్లడం కాదు- వారిని ఆశ్రయించిన వారందరిని తమతో తీసిక వెళ్లగల్గుతారు. అంతటి సమర్థులు, ఉదారులు ఆచార్యులు.

"పశుః మనుష్యః పక్షీవా-యేచ వైష్ణవ సంశ్రితాః

తేనైవ తే ప్రయాస్యంతి- తద్విష్ణోః పరమంపదం"

నారదుడు అటువంటి ఆచార్యుడే.

అంతే కాదు ప్రతి సదాచార్యుడు నారదుడే. ఎందుకు ?

ఆచార్యుడు మనలో అనంతకాలం నుండి గూడుకట్టుకొని ఉన్న ("నారం")అజ్ఞానాన్ని ("ద్యతి") నిర్మూలిస్తాడు. అంతేకాదు ఆయన మనకు అక్షయమైన భగవత్జ్ఞానాన్ని("నారం") కల్గిస్తాడు ("దదాతి").

ఇటువంటి సమస్త ఆచార్య లక్షణములు కలిగిన నారద మహాముని వాల్మీకి అదృష్టవశంగా వాల్మీకి ఆశ్రమానికే వచ్చాడు.

వాల్మీకి అప్పుడొక ఉత్తమ విద్యార్థి, ఒక సచ్ఛిష్యుడు, గురువుగారు ప్రబోధించిన శాస్త్రార్థముల పట్ల విశ్వాసము కల్గి(శాస్త్ర విశ్వాస శాలీ) వాటిని నిరంతరము ఆనందంతో మననము (తపస్సు) చేసికొంటూ ఉండే"తపస్వి" ఆయన.

తపశ్శీలమే సచ్ఛిష్య లక్షణము. "తపసా బ్రహ్మవిజిజ్ఞాసస్వ" అని వరుణుడు తన కుమారుడైన భృగువుతో "తపస్సుద్వారానే బ్రహ్మను తెలుసుకో" అని ఉపదేశించాడు.

సచ్ఛిష్యుని సందేహాలు సదాచార్యునిలో ఆసక్తిని కల్గిస్తాయి అనురాగాన్ని పెంచుతాయి. ఆలోచనలను రేకెత్తిస్తాయి. తప్పక శిష్యుని సందేహాలను తీర్చాలనే పట్టుదల ఆ చార్యునిలో పెరుగుతుంది.

వాల్మీకి సందేహాలు కూడ నారదునిలో ఆసక్తిని కల్గిస్తాయి. ఆయన అడిగే భగవంతుని షోడశ భగవద్గుణాలు ఒక నరునిలో ఉండడము దుర్లభమని, అయినా అట్టి గుణాలన్ని రాశిగా ఉన్న నరుని(మనుష్యుని,భగవంతుని) గూర్చి (బుద్ధ్వా) ఆలోచించి తెలుపుతాను, జాగ్రత్తగా వినవలిసింది (శ్రూయతాం) అని తన ఉపదేశాన్ని ప్రారంభిస్తాడు రామాయణం(సంక్షేపసర్గ) లో ఆచార్యనారదుడు.

"ఇతిశం"

# VII రాముడు పరమాత్మే

*(వాల్మీకి ప్రశ్నలు - నారదుని సమాధానములు)*

తపస్సు అనగా ఆలోచన "తప ఆలోచనే" అని నిఘంటువు ఒకే విషయాన్ని గురించి నిరంతరం ఆలోచించడం తపస్సు దీనినే మననము అంటారు"శ్రోత్రవ్యో, మంతవ్యో, నిధిధ్యాసితవ్యః" ఒక విషయాన్ని జాగ్రత్తగావిని, దానిని మనస్సులో మాటిమాటికి పునశ్చరణ చేసి కొంటూ, ప్రత్యక్ష సమానాకారంగా దర్శించడాన్ని, (భావించ డాన్ని) తపస్సు అంటారు.

సప్తర్షుల ఉపదేశం ఫలితంగా- వాల్మీకి రామతారకాన్ని మంత్రో పదేశం పొంది - దానిని నిరంతరము అనుసంధిస్తూ, భగవత్ప్రసాదమువలన దాని అర్థాన్ని ప్రత్యక్ష సమానాకారంగా అనుభవించి - దాని మాధుర్యానికి ఆనంద పరవశుడయ్యాడు. వాల్మీకి ఆ విధంగా తపస్వి అయ్యాడు.

అయితే తనను పవిత్రం చేసిన నామము రామునిదికదా! ఆయన పరమాత్మే కదా!ఆయన ఇప్పుడు భూమండలములో అవతార రూపంలో ఉన్నాడా? లేక ఆయన అవతారము గడిచిపోయిందా? లేక ముందు రానుందా?

తనను పవిత్రంచేసిన నామముగల రాముడు ప్రస్తుతము అయోధ్యను పరిపాలించే రాముడొక్కడేనా? లేక వేరా? భగవంతునికి అసాధారణములైన 16 గుణాలు ఉన్నాయి కదా!

"తస్మిన్ యదంతస్తదుపాసితవ్యం" అని ఆభగవద్గుణాలను ఉపాసన చేయాలని వేదము తెలుపుతోంది కదా! అటువంటి గుణసంపత్తి ప్రస్తుతము అయోధ్యాపాలకుడైన రామునిలో ఉందా?

ఇది వాల్మీకి మెదడును అనాది కాలంగా తొలుస్తున్న సందేహ పరంపర.

సగురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం"

అటువంటప్పుడు వేదవేదాంగ విదుడు, భగవద్విశ్వాస శాలి అయిన ఆచార్యుని ఆశ్రయించాలని వేదము వివరిస్తుంది.

అయితే ఎవ్వరా ఆచార్యుడు ? ఎవ్వరిని ఆశ్రయించాలోఅని సన్మనస్సుతో వాల్మీకి ఆలోచిస్తుంటే - భగవత్ప్రసాదంగా సాక్షాత్తుగా నారదుడే ("వెదుక

బోయిన తీగ కాలికి తగిలినట్లు) వాల్మీకి దగ్గరకు వచ్చాడు. ("అచార్య లాభం భగవానాలే"అంటారు పిళ్లలోకాచార్య స్వామి వారు.

నారదుడు వాల్మీకి సందేహములను నివృత్తి చేస్తూ పరమాత్మ అయిన రామచంద్రుడే ఇప్పుడు ఈ లోక పాలకుడని -చంద్రుని లోని పదహారు కళలవలె, రామ చంద్రునిలో పదహారు భగవద్గుణాలు ఉన్నాయని- చంద్రునిలోని షోడశ కళలు బుధులకు (దేవతలకు) ఆహారము అయినట్లే రామచంద్రునిలోని షోడశ గుణాలు బుధులకు (సజ్జనులకు) ధారక పోషక, భోగ్య రూపమైన ఆహారమవుతాయని ఉపదేశిస్తాడు.

శ్రీరాముని లోని షోడశభగవద్గుణాలను-(వాల్మీకి ప్రశ్నలకు సమాధానాలను) వివరించడం చాలకష్టము. అయినప్పటికి ముందు చక్కగా ఆలోచించి (బుద్ధ్వా) సమాధానములు చెబుతానంటాడు వాల్మీకి మునీంద్రునితో నారదమునీంద్రుడు "త్రైర్యుక్తః శ్రూయతాం నరః" అటువంటి దుర్లభము లైన గుణములు గల నరుని గురించి వినుమని తనసమాధానాన్ని ప్రారంభిస్తాడు నారద ముని.

సాధారణంగా నరుడు అంటే మనుష్యుడు"ఆత్మానం మానుషం మన్యే" అని రామభద్రుడుతనను మానవుడి గానే చెప్పుకొన్నాడు. చాలా మంది దృష్టిలో ఆయన దశరథాత్మజుడైన మనుష్యుడు.

కాని పరమార్థదృష్టితో చూచినప్పుడు రాముడు పరమాత్మ "రింగ్" "క్షయే" అని ధాత్వర్థము-"రః" అంటే క్షీణించేవాడు. "నరః" అంటే ఆద్యంతములేని పరమాత్మ

ఇక వాల్మీకి అడిగిన గుణ సంబంధమైన గురించిన ప్రశ్నలలో ఒక్కొక్క గుణాన్ని గురించి ప్రశ్నను - ఆగుణము రామునికి- పరమాత్మకు కూడ ఎలావర్తిస్తుందో గమనిద్దాము.

(1)గుణవాన్:- ఈ లోకంలో ప్రస్తుతము (సు) గుణవంతుడైన వ్యక్తి ఎవ్వరైనా ఉన్నాడా? అని వాల్మీకి మొదటి ప్రశ్న గుణములనేకంగా ఉంటాయి. గుణములన్నిటిలో " సౌశీల్యముప్రధానమైనది.

సౌశీల్యమంటే-పెద్ద వారితోను, చిన్నవారితోను ఏమాత్రము తేడా తెలియకుండా నీరులోనీరు పోసినట్లు కలిసి పోడవడం.

"మహతో మందైస్సహనీరంధ్రేణ సంశ్లేషఃసౌశీల్యమ్"

లోకంలో చాలమంది తమకు గౌరవం కల్గాలని పెద్దవాళ్లతో కలిసి ఉండాలని కోరుకొంటారు. కాని తమకంటే చిన్న వాళ్లతో కలసి మెలసి ఉండాలని ఎవ్వరనుకోరు. చిన్న వాళ్లతోకలసి తిరిగితే తమకు గౌరవహాని అనిభయము.

అంతే కాదు-పెద్ద వాళ్లతో కలసినా చిన్న వాళ్లతో కలసినా-లోకులలో తేడా స్పష్టంగా తెలుస్తుంది.

సౌశీల్య గుణము పూర్తిగా గలవాడు పరమాత్మ ఒక్కడే.

పరమాత్మ సర్వాధికుడు. హేయగుణములు ఏమాత్రము కలువని కేవల కల్యాణగుణుడు. అటువంటి భగవంతుడు సహజంగానే హేయగుణములు గలిగిన ప్రకృతితో-కర్మసంబంధము వలన సంక్రమించిన హేయ గుణములు గల జీవాత్మలతో - (వాటితో) ఏ మాత్రము తేడా తెలియరాకుండా కలసి పోతాడు. ఈ విధముగా పరమాత్మ చిదచిత్తులతో కలసి ఉండడానికి ఆయన వాత్సల్యమే కారణము.

"యస్య పృథివీ శరీరం" అని భగవంతుడు ప్రకృతితో, "అనేన జీవేనాత్మానా2ను ప్రవిశ్య" అని జీవాత్మల తోను, అంతఃప్రవిష్టః"- జీవాత్మలలోను కలసి ఉంటాడని వేదము వివరిస్తోంది.

శ్రీరాముడు మూర్తీ భవించిన సౌశీల్యగుణము

ఆయన స్నేహితులు, ఒక బోయ, ఒక కోతి, ఒక గ్రద్ద, వీటినే ఆస్వామి తన ప్రాణం కంటె మిన్నగా చూచుకొంటాడు.

"త్వయికించిత్ సమాపన్నే కింకార్యం సీతయామమ"

సుగ్రీవా! నీకే కొద్దిచిన్న ఆపదవచ్చినా నాకు సీతతోకూడ పనిలేదంటాడు ఆకృపామయుడు.

"ఆత్మసమఃసఖా"- బోయ అయిన గుహుని-తనతో సమానుడైన మిత్రుడిగా భావిస్తాడు ఆస్నేహపూర్ణుడు. "ద్విజోనష్టః ఈదృశీయం మమాలక్ష్మీః" అయ్యో ఈ జటాయువు మరణించాడే. నేనెంత దురదృష్ట వంతుణ్ణి అని వాపోతాడు ఆదయామయుడు.

2 **కశ్చవీర్యవాన్** :- వీర్యవంతుడెవ్వరని వాల్మీకి **2వ** ప్రశ్న ప్రబల శత్రువులు తన పైకి ఒక్కుమ్మడిగా పైబడి, తనను ఆక్రమించడానికి ముందు

కొస్తున్నా, ఏ మాత్రము మొక్కవోని ధైర్యముతో వారందరిని నిర్జింపగల్గడం వీర్యగుణము.

"బలవానింద్రియ గ్రామో, విద్వాంసమపకర్షతి" అని గీతోక్తి ఎంతటి విద్వాంసునయినా వికారాస్పదుని చేసేది ప్రకృతి.

అలాగే ప్రకృతి బంధములో జీవాత్మలుకూడ సవికారములే.

ఇటువంటి ప్రకృతిజీవాత్మలలో కూడ ప్రవేశించి నప్పటికి:-"తద్గత దోషైరసంస్పృష్టః"అపహతపాప్మా" అన్నట్లు వాటి వికారముల కేమాత్రము లొంగక నిరంతర పరిశుద్ధుడైన పరమాత్మే వీర్యవంతుడు.

శ్రీ రామ చంద్రుడొక్కడే ఈ లోకంలో వీరుడు.

"చతుర్దశసహస్రాణి-రక్షసాం భీమకర్మణాం

ఏకశ్చరామోధర్మాత్మా-కథం యుద్ధం కరిష్యతి"?

భయంకరులు-అధర్మయుద్ధం చేసేవారు పదునాలుగు వేల సైన్యము ఖర దూషణ, త్రిశరస్కులనే మహా సేనానుల

అధ్వర్యములో ముంచుకొస్తుంది. శ్రీరాముడో ధర్మాత్ముడు. అదికూడ ఒక్కడే. రాముడెట్లా వాళ్లను ఎదుర్కొంటాడో అని వాల్మీకి మహర్షికి కూడా సందేహమే. అటువంటి విషమ పరిస్థితిలోకూడ చిరునవ్వుచెరగ కుండా వారినందరిని మట్టి గరపించిన శత్రుహంత రాముడు. లోకములన్నిటిని ఏడిపించిన గడగడలాడించిన రావణుడుకూడ

"యస్య విక్రమమాసాద్య రాక్షసానిధనం గతాః" అని శ్రీరాముని పరాక్రమానికి భయ భీతుడయ్యాడు. అంతటి శత్రువులలో కూడ ప్రఖ్యాత వీరుడు ఆయన.

**3.** ధర్మజ్ఞశ్చ:- ధర్మజ్ఞుడెవ్వరు?- ధర్మములన్నిటిలో ఆశ్రిత రక్షణమే పరమధర్మము."రక్షాపేక్షాంప్రతీక్షతే"అని ఆశ్రితులందరి ఆపదలను పోగొట్టడమేకాదు ఇంకా కొత్త వారెవ్వరు రావడం లేదేమి అని ఎదురుచూస్తుంటాడు ఆ జగద్రక్షకుడు.

జగద్రక్షణ మూడు విధములుగా నుంటుంది.

**1.** ప్రళయ కాలంలో అచిదవిశేషములుగా (ప్రాణము లేనివాటి వలె) నున్న జీవాత్మలకు దయామనస్సుతో కరణ కళేబరముల నొసగుటద్వారా

సృష్టిచేయడం రక్షణలో ఒక భాగము.

**2.** తానిచ్చిన శరీరములను గల్గిన జీవాత్మలకు ఆపదలేర్పడ్డప్పుడు, వాటిని తొలిగించి, క్షేమం కల్గించడము రక్షణే.

**3.** ఈ సమస్త చేతనులకు కర్మ పరిపాకమేర్పడి, శరీరములు జీర్ణములై-దుర్భరములైనప్పుడు వాటినిలయం చేయడం కూడ రక్షణమే.

ఈ విధముగా సృష్టి, స్థితి, లయములనే మూడు విధములైన రక్షణ ధర్మములను నిర్వహించేవాడు పరమాత్మ

"యతోవా ఇమాని భూతాని జాయంతే,

యేన జాతాని జీవంతి యత్ర్పయంత్యభిసంవిశంతి"

అని పరమాత్మ వలననే భూతముల జన్మ-జీవ-ప్రళయములని వేదము ఘోషిస్తోంది.

శ్రీరాముడు సంపూర్ణ ధర్మ స్వరూపుడు. ఆయనను" ఏకశ్చ రామో ధర్మాత్మా" అని-"రామో విగ్రహవాన్ధర్మః" అని స్వయంగా వాల్మీకి మహర్షి, శత్రువైన మారీచుడు కూడ ధర్మమూర్తి అని ప్రశంసిస్తారు.

శ్రీరాముడెప్పుడు మూడు చోట్ల కనుపడేవాడు." దాన యజ్ఞ వివాహేషు"-దానయజ్ఞ వివాహాల్లో ఆయన తప్పక ఉండేవాడు.

దానములో :-దాత- ప్రతి గ్రహీత లిద్దరు సమర్థులుగా పవిత్రులుగా ఉండేటట్లు చూచేవాడు.

యజ్ఞము :-- విధివిధానముగా- మంత్ర పూతంగా, అన్నరాశులతో-సదక్షణాకంగా ఉండేట్లు చూచేవాడు.

వివాహాలలో ఏలోపం లేకుండా ఇరుపక్షాలవారు సంతృప్తి చెందేట్లు సహకరించేవాడు శ్రీరామచంద్రస్వామి.

అంతేకాదు- పరమాత్మవలె,"***రక్షితాజీవలోకస్యస్వజనస్యచ రక్షితా*** -తనను ఆశ్రియంచిన వారిని-వారితో పాటు జీవలోకము మొత్తాన్ని రక్షించే స్వామి ఆయన.

**4** కృతజ్ఞశ్చ:- "కృతం జానాతీతి కృతజ్ఞః" అని వ్యుత్పత్తి మనము అందరము చేసే పనులన్నిటిని తెలిసికొని వాటికి సరియైన ఫలాలను విచారించి-ఉదారముగా ఒసగేవాడు పరమాత్మ-

"ఫలమత ఉపపత్తేః"- ఫలము పరమాత్మ వలననే లభిస్తుందని వివరిస్తోంది బ్రహ్మసూత్రము.

"లభతే చతతః కామాన్ మయైవ విహితాన్ హితాన్" తానిచ్చిన ఫలాలనే దేవతల ద్వారా భక్తులు పొందుతారని గీతాచార్యోక్తి.

శ్రీరాముడు కృతజ్ఞుడు. జనులు చేసిన కర్మలనన్నిటిని తెలిసికోవడమేకాదు. వాటిలో అపకారములన్నిటిని మరచి(అవిజ్ఞా)ఉపకారమును-ఏ ఒక్కటి-ఏకొద్ది చేసినా-జ్ఞాపకముంచుకొనే విశేష కృతజ్ఞతామయుడాయన.

కథంచిదుపకారేణకృతేనైకేన తుష్యతి- నస్మరత్యపకారాణాంశతమ ప్యాత్మవత్తయా"

ఒక ఉడుత చేసిన స్వల్ప సహాయాన్ని కూడ గుర్తించిన పరమోదారుడాయన.

**5**. సత్యవాక్యో"పరమాత్మను గురించి తెలుపుతూ వేదము' సత్యం జ్ఞానం, అనంతం బ్రహ్మ" అనివివరిస్తుంది. బ్రహ్మ-సత్యం, జ్ఞానము, అనంతము అనే నిరూపక ధర్మములు గలవాడు. పరమాత్మయొక్క స్వరూపమును తెలిపే శబ్దములలో మొదటిది' సత్య పదము.

సత్యమనే ఏక శబ్దంలో అంతర్గతంగా మూడు శబ్దాల్లున్నాయి. **1.** **"సత్" 2. "తి" 3.**అం"

**1.** "సత్" స్వయంగా ఏ వికారములులేని జీవాత్మలను "తి" వికారమే స్వరూపంగాగల ప్రకృతిని "అం" నియమించే వాడు.

**2.** సత్:- అమృత స్వరూపులైన ముక్తులను

"తి" మర్త్యులైన బద్ధులను

"అం" నియమించేవాడు (మధ్వాచార్యులవ్యాఖ్య)

శ్రీరాముడు సత్యవాక్యుడు-దశరథుని మాటగాకైక శ్రీరాముని పట్టాభిషేకమును వదులుకొని, అడవులకు వెళ్లుమని తెలుపుతుంది.

"అమ్మా!నాన్నగారు స్వయంగా నాతో ఎందుకు చెప్పడం లేదు? అని రాముడు అడుగగానే, తండ్రిగారు చెప్పలేదనే నెపంతో రాముడు అడవికి వెళ్లనని అంటాడేమో అని భయపడుతుండే కైకతో:-

అమ్మా- రాముడెప్పుడు రెండు మాటలు మాట్లాడ డమ్మా! అని తన అచంచల సత్యపాలన దీక్షను తెల్పుతాడు.

**6.**దృఢవ్రతః:-గట్టి పట్టుదల గల వాడెవ్వడు?

పరమాత్మ ఆశ్రితరక్షణ విషయంలో దృఢవ్రతుడు.

మనతల్లి శ్రీదేవి మనతో భగవంతుని ఆశ్రయింపజేస్తుంది. అమె పురుషకారము వలన పరమాత్మకు మనపై ప్రేమ కలుగుతుంది. భగవంతుని ప్రేమను పరీక్షించడానికి ఆతల్లి మన తప్పులను స్వామి ముందు ఏకరువు పెట్టుతుంది.

భగవత్ప్రేమ సుదృఢమైందికదా. శ్రీదేవి ఎన్ని తప్పులను జెప్పినా-ఆయన మనను వదలడు."ఎన్నడియార్ అదుశెయ్యార్-శెయ్దారేల్ నన్రు శెయ్దార్" "నాభక్తులు తప్పు జేయరు" ఒకవేళ తప్పు జేసినా అది మంచేపో" అంటాడు మనస్వామి. ఆప్రేమైక పరుని జూచి ఆతల్లికూడ నివ్వెర పోతుంది.

శ్రీరాముడు కూడ ఆశ్రిత రక్షాదీక్షుడు

"అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతంమమ " సకల ప్రాణులకు అభయ ప్రదాత శ్రీరామచంద్రస్వామి" ఏహి పశ్యశరీరాణి" అని ఋషులు రాక్షస బాధలతో శల్యావశిష్టము లయిన తమ శరీరాలను చూపితే- సిగ్గుపడి రాముడు"ఋషులార!మీకు బాధ కల్గించే రాక్షసులను సంహరించి, మీకు రక్షణ కల్గిస్తాను అని వాగ్దానం చేస్తాడు.

"రాక్షసులతో వైరము ప్రమాదకరమని, ఈ అకారణవైరమెందుకు మనకు"?అని సీతాదేవి అంటే"సీతా-ఋషులకిచ్చిన మాటను నా ప్రాణం పోయినా జవదాటను. ఆవిషయంలోనిన్నైనా-లక్ష్మణునైనా వదలుకోవడానికి సిద్ధమే నంటాడు ఆ లోక రక్షకుడు.

"అపనిహం జీవితం జహ్యాం-త్వాంవాసీతే సలక్ష్మణాం" అని రాముడు దృఢ ప్రతిజ్ఞ చేస్తాడు.

**7. *చారిత్రేణ చకోయుక్తః*** :- చరిత్రముగల వాడెవ్వడు?చరిత్ర అంటే భూత భవిష్యద్వర్తమానములకు చెందిన వృత్తాంతము. సృష్టి, స్థితి, ప్రళయములు ప్రపంచానికి సంబంధించిన భూత భవిష్యత్తులు వర్త మాన.

ఈ సృష్టికి పూర్వము చైతన్యముందా? లేదా అనేశ్వేతకేతు శ్వేతకేతు ప్రశ్నకు సమాధానమిస్తూ

"సదేవసోమ్య ఇదమగ్ర ఆసీత్"సృష్టికి పూర్వము"సత్తే" ఉండెనని ఉద్దాలకుడు తెలిపాడు.

ఈ సత్తు అంటే బ్రహ్మనా-ఆత్మా?అని మళ్లీ ప్రశ్నించుకొని - బ్రహ్మ-ఆత్మ శబ్ద వాచ్యుడు"ఏకోనారాయణః"నారాయణుడే అని వేదము తన నిర్ణయాన్ని వివరించింది.

ఈ విధముగా ప్రళయకాలములో సూక్ష్మంగా చిద చిత్తులతో (ప్రకృతిజీవులతో) కూడిన నారాయణుడే సృష్టికాలములో స్థూలంగా చిదచిత్తులతో కూడుకొని ఉంటాడని పరమాత్మ చరిత్ర తెలుపుతోంది. శ్రీరాముడు గొప్ప చరిత్ర గలవాడు. చరిత్రఅంటే శీలమని కూడ అర్థము.

అరణ్యావాసం చేయడానికి వెళ్లి చిత్రకూటంలో నివసించే శ్రీరాముని అయోధ్యకు తిరిగి తీసిక వెళ్లాలనే దృఢనిశ్చయంతో చిత్రకూటానికి వెళ్లి ప్రార్థించిన భరతుని సమర్థిస్తూ జాబాలి నాస్తిక వాదం చేస్తాడు. అప్పుడాగ్రహంతో శ్రీరాముడు

"కులీన మకులీనం వా- శుచింవా యదివా z శుచిం

చారిత్రమేవ వ్యాఖ్యాతి- వీరం పురుషమానినం"

ఒక వ్యక్తి కులాన్ని- శుచిత్వాన్ని చరిత్రయే నిర్ణయిస్తుందని నిష్కర్షగా తెలుపుతాడు. అంతేకాదు తన తండ్రిగారి సభలో ఉన్నాడని జాబాలితో తాను సంబాషించానే తప్ప- నాస్తికునితో మాట్లాడాల్సిన అవసరం తనకు లేదని స్పష్టంచేస్తాడు.

**8. *సర్వ భూతేషుకోహితః* ?**ప్రాణికోటికి హితుడెవ్వడు?హితుడు అంటే మేలు చేయువాడులేక ఉపాయమయినవాడు. భగవత్ప్రాప్తికి కర్మ, జ్ఞాన, భక్తి, ప్రపత్తులేవి, సాక్షాత్తుగా సాధనములు కావు. అవి చేయాలని భగవదాజ్ఞ గనుక భగవత్కైంకర్య రూపంగా వాటిని అనుష్ఠించాలి.

"యమేవైషవృణుతే తేన లభ్యః" అంటుంది కఠోపనిషత్తు తనకిష్టమైన వారికే భగవంతుడు లభిస్తాడు. భగవత్ప్రాప్తికి భగవంతుడే ఉపాయము.

అందుకే తనకు తోచినవే ధర్మములని భ్రమించిన అర్జునునికి తానే సాక్షాత్తు ధర్మమని - ఇతర ధర్మములను అన్నివిడచి తననే ఆశ్రయించుమని శ్రీకృష్ణుడు చరమోపదేశము చేస్తాడు.

శ్రీరామ చంద్రుడు సర్వభూతహితాభిలాషి. ప్రజల సుఖదుఃములే తన సుఖదుఃఖములుగా భావించువాడు. పట్టాభిషేకము చేయదలచిన దశరథునితో శ్రీరాముని కల్యాణ గుణాలను వర్ణిస్తూ అయోధ్యాపౌరులు :-

"వ్యసనేషు మనుష్యాణాం భృశంభవతి దుఃఖితః

ఉత్సవేషు చ సర్వేషు -పితేవ పరితుష్యతి"

ఎవ్వరికే ఆపద కల్గినా-శ్రీరాముడు అతి దుఃఖితుడౌతాడు. ఎవ్వరికే శుభం కల్గినా- కన్నతండ్రివలె మిక్కిలి సంతోషిస్తాడు అని వివరిస్తారు.

9. విద్వాన్ కః:- విద్వాంసుడెవ్వరు?

బ్రహ్మాది దేవతలు కూడ రజస్తమోగుణములు గల్గి, భ్రమ ప్రమాదాలకు గురి అయ్యేవారే. అందువలన వారందరు అల్పజ్ఞులే. పరమాత్మ ఒక్కడే విద్వాంసుడు. సర్వజ్ఞుడు

"యస్సర్వజ్ఞః సర్వవిత్" అంటుంది వేదము.

పరమాత్మ అన్ని విషయాలను, అన్ని ప్రకారాలుగా తెలిసినవాడు భగవంతుడు జ్ఞాన స్వరూపుడు- జ్ఞాన గుణుడుకూడ. ఆయన జ్ఞానము సహజమైనది. "స్వాభావికీ జ్ఞాన, బల, క్రియాచ," అంటుంది శృతి.

శ్రీరాముడు విద్వాంసుడు."వృద్ధోపసేవీ- బ్రాహ్మణానాముపాసితా" అన్నట్లు జ్ఞానులను సేవించడం, ఉపాసించడం ఆయన అనవరత స్వభావము. ఆయనకు వేదవేదాంగములయందు మంత్ర రహస్యములందు పరిపూర్ణ జ్ఞానముండేది.

10."కః సమర్థశ్చ" :- సమర్థుడెవ్వరు? పరిపూర్ణమైన సహజమైన సామర్థ్యము పరమాత్మకే ఉంటుంది. తన సంకల్ప మాత్రముననే వివిధ విచిత్ర భువన, భవన నిర్మాణము చేయగల్గుతాడు ఆయన. "సోఽకామయత", "తదైక్షత," అని సృష్టికి భగవత్సంకల్పమే కారణమని వేదము వివరిస్తుంది త్రివిధ కారణములు పరమాత్మే.

భగవచ్ఛక్తి అపరిమితమైంది.- "పరాఽస్యశక్తిః"అణువుకంటె అణువుగా- మహత్తుకంటె మహత్తుగా మారగల్గిన శక్తిమంతుడు పరమాత్మ.

శ్రీరాముడు సర్వ సమర్థుడు. శస్త్రాస్త్ర ప్రయోగములోగాని, శాస్త్ర

చర్చలలోగాని, ధర్మానుష్ఠానంలోగాని ఆయనను మించినవాడెవ్వరులేరు." తవవక్తుంకః సమర్థః' నీకు చెప్పదగిన వాడెవ్వరు లేరంటుంది సీతాదేవి శ్రీరామునితో

11. కశ్చైకప్రియదర్శనః:-ఎప్పుడు ఒకే రకమైన ప్రియస్వరూపుడెవ్వరు?

ప్రపంచములోని ప్రతి వస్తువు గుణత్రయాత్మకమైనదే. ఒక్కొక్క గుణంపైకి వచ్చినప్పుడు ఒక వస్తువు కొందరికి ప్రియంగా, కొందరికి అప్రియంగా అనిపిస్తుంది. అంతేకాదు ఒకే వస్తువు ఒక వ్యక్తికి ఒక కాలంలో ప్రియంగా ఉండి, మరొక కాలంలో అప్రియంగా మారవచ్చు.

పరమాత్మకేవలము సత్వమయుడు"ఆనందోబ్రహ్మ" అన్నట్లు ఆయన ఆనంద మయుడు. అందువలన ఆయనమారే వాడు కాదు.

శ్రీరామ చంద్రస్వామి దర్శనము అందరికి ప్రియావహామే. తన ముక్కులు, చెవులు కోయించుకొన్న శూర్పణఖదుఃఖములో కోపములోకూడ, రామక్ష్మణులను గురించి తెలుపుతూ

"తరుణౌ, రూప సంపన్నౌ సుకుమారౌ, మహాబలౌ" అంటుంది.

తన భర్తను శ్రీరాముడే చంపాడని తెలిసికొని దుఃఖంతో, క్రోధముతో పరిగెత్తు కొచ్చిన వాలి భార్య తార, శ్రీరాముని చూడగానే.

"త్వప్రమేయశ్చ... ఉత్తమధార్మికశ్చ

క్షతజోపమాక్షః"- శ్రీరామచంద్రానీవు పుండరీక నేత్రుడవు, ఉత్తమ ధార్మికుడవు అంటుంది.

12. ఆత్మవాన్కః:-ఆత్మ వంతుడెవ్వరు?

లీలా విభూతి, నిత్య విభూతులలోని సకల ఆత్మలకు స్వామి పరమాత్మే." పతిం విశ్వస్య, ఆత్మేశ్వరగ్ "అంటుంది శృతి. ఈ జగత్తుకంతటికి స్వామి భగవంతుడు. ఆయన తనకు తానే ఈశ్వరుడు.

"దాస భూతాః స్వతస్సర్వే హ్యాత్మానఃపరమాత్మనః" పరమాత్మకు సర్వాత్మలు సహజంగానే దాస భూతములు.

"ఆత్మ" అనగా మనస్సు, ధైర్యము అనే అర్థాలు ఉన్నాయి. ఆత్మ

వంతుడనగా ధైర్యశాలి. ప్రశస్త మనస్కుడు. శ్రీరామ చంద్రుడు సర్వదా ధైర్యశాలి. ప్రశస్త మనస్వి.

దశరథుడు పిలిపించాడంటే పట్టాభిషేకం కొరకే అనుకొని వచ్చిన-శ్రీరాముడు -తనకు అరణ్యా వాసమే విధింప బడిందని తెలిసికూడ

"నాzలక్షయత-రామస్య కించిదాకారమాననే"

నచైవ రామోzత్ర జగామ విక్రియాం"

శ్రీరాముడు తనముఖములో ఏమాత్రము వికారాన్నిపొందలేదు. దుఃఖము- విచారము- ఈ వికారాలేవి శ్రీరాముని మనస్సులో చోటుచేసికోలేదు.

**13**. జిత క్రోధః:-క్రోధమును జయించిన వాడెవ్వరు? ఎంత నిగ్రహం కలవాడైనా ఎప్పుడో ఒకప్పుడు కోపానికి బానిస కావలసిందే.

"కామఏష క్రోధ ఏషః"రజోగుణ సముద్భవః"ఒక వ్యక్తి ఏదైనా కోరుకొన్నప్పుడు, అది లభించక పోతే క్రోధం కల్గుతుంది- కామము, క్రోధము రజోగుణమువలన కలిగేవే పరమాత్మ శుద్ధ సత్వగుణుడు. అందువలన ఆయనను రజోగుణము, తజ్జనిత క్రోధము అంటుకోజాలవు కదా.

" తనను ధిక్కరించి, ఇంటి నుండి బయటకు వెడలి, ఆహారపానీయములు లభించక, రాత్రివరకు తిరిగి తిరిగి విసిగివేసారి ఒక పాడుపడ్డ సత్రములో అవశంగా పడిపోయిన కుమారునికి-తన ముఖమును కనబడనీయకుండా-ఇతరులద్వారా మృష్టాన్న భోజన పానీయములను కల్పించి, వాటిని తనకొడుకు అనుభవిస్తుంటే ఆనందంతో కన్నీరు కార్చే దయామయుడైన కన్న తండ్రివలె, పరమాత్మకూడ మనము చేసిన అనేకాఁర్ద్రార్ధాపరాధములను సైతము క్షమించి-మనను కాపాడుతాడు.

"ఇరామడమూట్టువార్రైప్పాలే, ఉళ్లోకిడందు, సత్తైయే

పిడిత్తు, నోక్కి కొండుపోరుం" అని పైవృత్తాంతమును లోక గురువులు భగవంతుని క్షమాగుణంగా ఒక సూత్రములో మనోహరంగా వర్ణిస్తారు.

శ్రీరామచంద్రుడెప్పుడు క్షమాగుణసంపన్నుడే.

ఆయన అప్పుడప్పుడు ప్రదర్శనార్థము కోపాన్ని నటించేవాడు. "క్రోధమాహరయత్ రామః"అంటాడు వాల్మీకి.

ఒక్క పర్యాయము మాత్రము నిజంగానే క్రోధపరవశు డయ్యాడు శ్రీరాముడు. "రావణేనకృతం వ్రణం "దృష్ట్వా ప్లవగ శార్దూలం- కోపస్య వశమేయివాన్." రామ రావణుల యుద్ధం జరుగుతోంది. రావణుడెంత తీవ్రబాణాలను ప్రయోగించినా రామచంద్రుడు ఆగ్రహానికి రావడం లేదు.

రాముడిని విడిచి రావణుడు ఆంజనేయుని బాధింపసాగాడు. రాముని వహిస్తున్న హనుమ రావణుని బాణాలను సహించాడు. హనుమశరీరము సంపూర్ణంగా రక్త సిక్త మైంది." పూచిన మోదుగు పూవువలె" ఎఱ్ఱగా ప్రకాశిస్తున్నది.

అదృశ్యాన్ని చూస్తున్న శ్రీరామునికి కోపమాగలేదు. ఆయన కోపానికి వశుడయ్యాడు. "కోపస్య వశమేయివాన్." ఆ ఒక్క క్షణంతప్ప మరెప్పుడు శ్రీరాముడు కోపవశుడుకాలేదు. అప్పుడు కూడ తనకొరకు కాదు-తన ఆశ్రితులకొరకు కోపవశుడయ్యాడు.

14. ద్యుతి మాన్ కః?:-కాంతి మంతుడెవ్వరు?

లోకంలో చీకటి సహజమైనది. ఆ చీకటిని తొలిగించడానికి సూర్య, చంద్రాగ్నుల కాంతి అవసరమౌతుంది. అయితే ఆ సూర్య చంద్రాదులను కూడ ప్రకాశింపజేసేది భగవత్ప్రకాశమే "తస్య భాసాసర్వమిదం విభాతి", శ్రీరాముడు సహజ కాంతి మంతుడు- శ్రీరామచంద్రుని" రూపసంపదను, సౌకుమార్యాన్ని జూచిన ఋషులుకూడ విస్మితులయ్యేవారు.

" రూప సంహననం, లక్ష్మీః- సౌకుమార్యం సువేషతాం

దదృశుః విస్మితాకారాః-రామస్య వనవాసినః "

తన తొడపైన పడుకొన్న శ్రీరామ చంద్రుని స్వప్నకాలీన సౌందర్యానికి ముగ్ధురాలైన సీతాదేవి"సుఖసుప్తః"అని వర్ణించింది.

15. అనసూయకః(కః)అసూయ లేని వాడెవ్వడు ?

అసూయ ఇతరులలో దోషాన్ని అన్వేషించే దుష్టస్వభావము. పరమాత్మ"అవిజ్ఞాత"-మన దోషముల గురించి తెలియని వాడు. తెలియక పోవడం చేత గాకకాదు . ఇష్టంలేక

మన స్వభావము త్రికాలాలలో త్రికరణాలచేతదోషములు చేయడమే- మనదోషముల్లపట్ల పరమాత్మ ఆగ్రహములేక మనచేత మనకు తెలియకుండా ఏవైనా పుణ్యాలు జరిగాయా అని విచారించి చూస్తాడు. మనకే తెలియకుండా చేయబడ్డ పుణ్యాలను అజ్ఞాత సుకృతాలు అంటారు. ఇవి మూడు రకాలు:-

(1) ఆనుషంగిక సుకృతాలు:-ఒక వస్తువును మనముకొనుక్కోవాలని ఒక షాపుకు వెళ్తాము. ఆషాపు వెళ్లేదారి దేవాలయం ముందు నుండి ఉంటుంది. మనము కావలసినవస్తువు కొరకు ఆషాపుకువెళ్తే- దయామయుడైన పరమాత్మ" నీవు దేవాలయం ముందు నుండి వెళ్లావు. అదే నీపుణ్యము" అంటాడు.

2. ప్రాసంగిక సుకృతము:_ మనవాళ్లను పిలువడానికో ఇతరులను హేళన చేయడానికో"నారాయణ" అని

అని పిలుస్తాము. మనము" నారాయణ" అని స్మరిస్తే దాని వలన " అశేషాఘ హరమనే" ఉద్దేశ్యంతో - అనుకొని-పిలువము. అయినా మన మెట్లా పిలిచినా అదిమనకు పుణ్యాన్నే కలిగిస్తుంది.

3. యాదృచ్ఛిక సుకృతము:-మనము ఎక్కడికో ప్రయాణం చేయాలనుకొని లగేజి తీసికొని వెళ్తాము. మనము వెళ్లాల్సిన ట్రైన్ కొరకు ఎదిరిచూస్తూ- మనలగేజిని జాగ్రత్తగా చూచు కొంటాము.

మనదగ్గరలోనే మరొక ప్రయాణీకుడులగేజితో ఉంటాడు. ఆయనకేదో అత్యవసర కార్యము ఏర్పడి- రెండు మూడు నిమిషాలు తన లగేజిని వదలివెళ్తాడు. ఆసమయంలో మన ప్రక్కనే ఆయన సామాను ఉన్నందువలన- మన లగేజిని మనం రక్షించుకోవడంలో- ఆయన లగేజికి కూడ రక్షణ ఏర్పడుతుంది. ఆయన లగేజిని కాస్త చూడుమని మనకు చెప్పిపోలేదు. మనం కూడ ఆయన లగేజిని కావాలని చూడలేదు. అయినా మన సమీపంలో ఉన్నందువలన ఆయన లగేజికి రక్షణ కలిగింది. ఇది కూడ మనము చేసిన పుణ్యమని పరమాత్మలెక్కించి రక్షిస్తాడు.

మనకుతెలియకుండానే జరిగిన పుణ్యాలను"అజ్ఞాత సుకృతాలను "లెక్కలోకి తీసికొని మనను కాపాడాలనుకోవడం, మన పాపాలను లెక్కలోకి తీసికోక పోవడం భగవంతుని అనసూయ గుణమువలననే.

శ్రీరామ చంద్రుడు కూడ ఎంత మాత్రము అసూయలేని వాడే. తనకు పద్నాలుగేండ్లు అరణ్య వాస దుఃఖాన్ని కల్గించిన కైకలో శ్రీరాముడు ఏదోషమును చూడలేదు. ఇతరు లెవరుండెవ్వరు కైకను నిందింపకూడని రాముని అభిప్రాయము అందుకే

"నతేzబా మధ్య మా తాత! గర్హతవ్య కథాచన !

కైకేయిని ఎప్పుడు కూడ నిందింపకూడదు అంటాడు.

**16.** కస్య భిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే?:-

ఎవ్వరికి కోపమువస్తే యుద్ధంలో దేవతలుసైతము భయపడుతారో?

సృష్టిలో సకల చరాచర ప్రపంచము దైవ భీతి చేతనే క్రమము తప్పక నడుస్తోంది. వాయువు వీచినా, సూర్యుడు ఉయాస్తమయాలు జరిపినా, ఇంద్రుడు మూడులోకాలను పాలించినా, చివరకు మృత్యువు పరుగెత్తినా భగవద్భయం చేతనే"బీషాస్మాత్ వాతః పవతే...... మృత్యుర్ధావతి పంచమః" అని తెలుపుతోంది శృతి

శ్రీరాముడికి కొంచెము కనులు ఎరుపెక్కినా-ఆయన ముందు నిలిచేధైర్యము ఋషులకు, దేవతలకు ఎవ్వరికి లేదు.

కాకాసురుడు కన్న తల్లి వంటి సీతమ్మ తల్లికి ఆర్ద్రా పరాధంకావించిన పరమ నీచుడు. ఆతల్లి వక్షస్థలాన్ని కాకాసురుడు చీలుస్తుంటే- తన తొడపై పడుకొన్న శ్రీరామ చంద్రస్వామికి నిద్రా భంగము కలుగుతుందేమో అని ఆమె సహించి ఊర్కుకొంటుంది. ఆమె వక్షస్థలము నుండి స్రవించే రక్త బిందువులు స్వామిపై బడి - హఠాత్తుగా నిద్రనుండి మేలుకొని

"కఃక్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా"

"కోపముతో బుసలు కొట్టుతున్న అయిదు తలలనాగేంద్రునితో ఆడుకోవాలనుకొనే తెలివి తక్కువ వాడెవ్వడు "

అని ఆగ్రహముతో- ఆయనపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు రామచంద్రస్వామి.

నిజానికి వాడు సాధారణమైన కాకికాదు. ఇంద్రుని సొంత కొడుకు జయంతుడు. తన తండ్రి మహేంద్రుడు కదా!తప్పక రక్షిస్తాడనే గర్వముతో తండ్రిని శరణువేడుతాడు ఇంద్రుడాయనను బహిష్కరిస్తాడు. అంతకు ముందేకన్న తల్లి శచీదేవి పరిత్యజిస్తుంది. సత్యలోకాది అనేక లోకాలను అనేక పర్యాయాలు ఆశ్రయించుతాడు. శాపానుగ్రహసమర్థులు కదా మహర్షులు అని వారిని శరణు వేడుతాడు. తాను పక్షిరూపంలో ఉన్నాడుకదా! అని తనరూపాన్నిచూచి రక్షిస్తాయేమో ? అని గంధ భేరుండాది మహా పక్షులనాశ్ర యిస్తాడు.

"బ్రహ్మా స్వయంభూశ్చతురాననోవా
రుద్రస్త్రినేత్రః త్రిపురాంతకోవా
ఇంద్రోమహేంద్ర స్సురనాయకోవా
త్రాతుంనశక్తాః యుధి రామ వధ్యం"

శ్రీరాముడే చంపాలను కొన్నవారిని రక్షించడము బ్రహ్మా-రుద్ర మహేంద్రాదులకు మాత్రము సాధ్యమా? ఎవ్వరు రక్షించ జాలక వదిలి పెడితే- ఆకాకాసురుడు

"త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవశరణం గతః" చివరకు ఆరాఘవేంద్రునే శరణువేడాడు.

ఈ విధంగా పరమాత్మకు మాత్రమే సాధారణములైన షోడశగుణాలు శ్రీరాము చంద్రునిలోకూడ సంపూర్ణంగా ఉన్నాయని నారదుని వలన గ్రహించిన వాల్మీకి శ్రీరాముడు పరమాత్మే అని నిర్ణయించుకొని- ఆరామ చంద్రుడు- ప్రస్తుతము అయోధ్యాధి పతిగా ఉన్నాడని- ఆయన శుభనామమే తనను తరింప జేసిందనిగ్రహించాడు వాల్మీకి మునీంద్రుడు.

శ్రీ సీతారామ చంద్ర స్వామినే నమః

# IX శ్రీరామాయణ అవతరణము - వాల్మీ కి శాపము

అవతరణము అంటే క్రిందికి దిగడం. రామాయణావతరణమంటే రామాయణము పై నుండి క్రిందికి రావడం. రామాయణము దిగిరావడం ఏమిటి?

హిరణ్యగర్భుడు (చతుర్ముఖుడయిన బ్రహ్మదేవుడు)సకల పురాణకర్త, భవిష్యత్ ద్రష్ట, శ్రీరామావతారమున కంటె ఎంతో ముందే భవిష్యత్తును దర్శింపగల సమర్థుడైన చతుర్ముఖుడు బ్రహ్మలోకంలో శ్రీరామకథను ప్రవచించాడు.

"చరితం రఘునాథస్య
శతకోటి ప్రవిస్తరం
ఏకైక మక్షరం ప్రోక్తం
మహా పాతక నాశనం"

ఏనాడో శతకోటి ప్రవిస్తరము-ప్రత్యక్షరము (ద్వారా)మహాపాతక నాశనమును కలిగించే రఘునాథుని చరితము హిరణ్యా గర్భునిచే ప్రవచింపబడింది.

బ్రహ్మలోకానికి వెళ్లగల్గిన ఇంద్రాది దేవతలకు, సనక సనందాది మహర్షులకు ఆ కథ తెలుసు. వారు తమ తమ లోకాల్లో కూడ శ్రీరామకథను ప్రచారము చేశారు.

ఉదాహరణకు 1.వరుణ లోకంలో రామకథను సనక సనందాది ఋషులు చర్చిస్తుండగా, వరుణుని కుమారుడు "హరితుడు'నెమలితో ఆడుకొంటూ, తమకథా ప్రసంగమునకు అడ్డు కలిగించినందువలననే హరితుడు "భూలోకంలో వ్యాధుడై, చివరకు శాపవిముక్తుడై వాల్మీకి అవుతుడాడని" ఆమహర్షులు శాపము-శాపసవరణలను ఇవ్వడం సుప్రసిద్ధ విషయమే కదా!

2. అలాగే "దశరథునికి సంతానం లేక, ఋష్యశృంగుని సహాయంతో పుత్రకామేష్టిని జరిపి, పుత్రులను పొందుతాడనే"విషయాన్ని ఋషుల గోష్టిలో సనత్కుమారుడు ప్రసావించగా, తాను విన్నానని దశరథునికి స్వయంగా సుమంత్రుడు వివరించడం కూడ ప్రసిద్ధమే కదా!

అలాగే దేవతాలోకాల్లో ఋషుల సంఘాలలో రామావతారమునకు ముందే రామకథ ప్రచలితమయింది.

స్వర్వాహిని అయిన గంగానదిని భూమండలముపై భగీరథుడు దింపినట్లే-దేవతాలోకాల్లో ప్రసిద్ధమైన రామకథా గంగను అక్షరబద్ధంగా అవనీ తలంపైకి అవతరింపజేసిన కవిభగీరథుడు వాల్మీకి.

వాల్మీకి ముని-నారదమహాముని ద్వారా రామకథను విని తన సంశయ, విపర్యయములను తొలిగించుకొని, బ్రహ్మానందము తన మనస్సులో పరిపూర్ణంకాగా, శిష్యసమేతంగా-తత్కాల స్నానం కొరకు తమసానదికి వెళ్లాడు. తమసానది జాహ్నవీ నదికి ఉపనది. స్నానానికి వెళ్ళిన వాడు వెంటనే స్నానము చేసి తిరిగి వస్తే ఇంతకథ జరిగేది కాదు. రామాయణావతరణం సంభవించేది కాదు. మన అదృష్టవశాత్తు..దైవనిర్ణయం మరొక రకంగా ఉంది. దైవప్రేరణ వలన వాల్మీకిని ఆవన సౌందర్యము ఆకర్షించింది. కొంతసేపు వనవిహారంతో కాలక్షేపం చేద్దామనిపించింది. వాల్మీకికి వన వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. పిల్ల తెమ్మరలు చల్ల చల్లగా మెల్ల మెల్లగా వీస్తున్నాయి. పక్షులు తమ జంటలతో కూడి ఆనందంతో కిలకిలారావం చేస్తున్నాయి. నారదోపదేశంతో.వాల్మీకి మనస్సులోపలి బ్రహ్మానందమునకుబయటి వన వాతావరణానందము తోడైంది. ఆ సంతోషమయ వాతావరణములో వాల్మీకి తన సంశయ, విపర్యయములకు నారదోపదిష్ట రామకథా విషయాలతో సమాధానాలు సమకూర్చుకొంటున్నాడు.

వాల్మీకి శారీరకంగా బాహ్యప్రపంచ (వన)విహారము చేస్తున్నాడు. మనస్సులో అంతర ప్రపంచ విహారం చేస్తున్నాడు. అదొక తన్మయావస్థ-సమాధి దశ-అతీతధ్యాన స్థితి.

వాల్మీకి బాహ్యాభ్యంతరాలలో పవిత్రత,-ప్రశాంతత పూర్తిగా చోటుచేసికొన్నాయి. తన కథావిష్కరణకు ఇదే తగిన సమయము అని తలచాడు శ్రీరామపరమాత్మ.

వేదము కూడ ఎటువంటి స్థితిలో ఉన్న శిష్యునికి ఉత్తమాచార్యుడు ఉపదేశం చేయాలో వివరించింది.

"తస్మైస విద్వాన్ ఉపసన్నాయ, సమ్యక్ ప్రశాంత చిత్తాయ ప్రోవాచతాం తత్వతో బ్రహ్మవిద్యాం",

ప్రశాంత చిత్తుడై తనను సమీపించిన శిష్యునికి విద్వాంసుడు బ్రహ్మవిద్యోపదేశం చేయాలి.

అటువంటి ధ్యానావస్థలో-తన్మయావస్థలో బ్రహ్మానందభరితుడైన వాల్మీకికి దైవికంగా హఠాత్తుగా ధ్యానభంగమేర్పడింది. ఆకస్మాత్తుగా ఆయనలో కలవరమేర్పడింది. ఆయన మానస సరోవరం అల్లకల్లోలమైంది.

ఆప్రశాంత వనపరిసరాలలో అనుకోకుండా ఒక క్రూరవ్యాధుడు తన నిశిత నారాచముతో అక్కడ ఒకచెట్టుపై ఆనందంతో దాంపత్య మధువును గ్రోలుతూ బయటిప్రపంచాన్ని పూర్తిగా విస్మరించిన ఒక క్రౌంచమిధునంలోని మగపక్షిని కర్కశంగా నేలగూల్చాడు. రక్త సిక్తమైన శరీరముతో-తెగిన రెక్కలతో భరింపరాని బాధతో విలవిలలాడుతూ. మగ పక్షి మరణించింది. ఆడపక్షి ఆభయంకర సంఘటనకు భరింపలేక-మగపక్షి శరీరం చుట్టూతిరుగుతూ-శోకసంతప్త మనంతో దయనీయంగా ఆక్రందనము చేస్తుంది.

తనమనస్సులోని బ్రహ్మానందమునకు - ఆ పక్షుల మిధునానందానికి హఠాత్తుగా భంగము కలిగించిన కఠిన వ్యాధుడు వాల్మీకి కనులముందు నిలిచాడు.

అప్పుడు వాల్మీకి ఒక వ్యకి కాదు. సంపూర్ణ విశ్వంతో తాదాత్మ్యము చెందిన ఒక సన్మనుష్యుడు, వాల్మీకి తన మనస్థితిని కూడ అన్యాప దేశంగా వర్ణించాడు. "భరద్వాజా!ఈతమ సానదిలోని అకర్దమ తీర్థాన్నిచూడు, ప్రసన్నమై రమణీయమైన జలంతో ఈ తీర్థము సన్మనుష్యుని మనుస్సు వలె పవిత్రంగా ఉందికదా అంటాడు.

"సర్వగత్వా దనంతస్య-సఏవాహమవస్థితః
మత్తస్సర్వ మహం సర్వం-మయి సర్వం సనాతనే"

ప్రపంచంలోని సకల వస్తువులు తానే అయిన ప్రహ్లాదుని మనస్థితిని ఆవహించుకొన్నాడు వాల్మీకి.

ఈ జగత్తులోని అణువణువులోని సుఖదుఃఖాలు తనవిగానే గోచరిస్తున్నాయి ఆమహానుభావునికి.

ఆ పక్షి మిధునము యొక్క బాధ వాల్మీకికి స్వాంతమే అయింది. ఆ బాధ దుర్భరమైంది. ఆయనకు వ్యాధునిపై ఆగ్రహము కట్టలు త్రెంచుకొని పై బడింది.

అటువంటి సమయములో ఆయన ప్రశాంత చిత్తము, హఠాత్తుగా అల్లకల్లోలం అయింది. అనుకోకుండా ఆయన నోటినుండి వ్యాధుని విషయంలో శాపోక్తి వెలువడింది. ఆయన శోకము నుండి శ్లోకము వెడలింది. ఆయన, శోకశ్లోకుడు, శ్లోకశోకుడయ్యాడు. ఆయన శోకం నుండి బయలువెడలిన శ్లోకము విశ్వశ్రేయస్కరమైన శ్రీమద్రామాయణ మహాకావ్యానికి నాంది (ఆరంభం)అయింది. ఆయన శ్లోకము -సమస్తలోకాలకు శాశ్వతంగా శోకమును తొలిగించే సాధనమైనది.

"మానిషాద!ప్రతిష్ఠాత్వ!మగమః శాశ్వతీస్సమాః

యత్క్రౌంచ మిథునాదేకం-అవధీః కామ మోహితమ్"

ఓరీ!నిషాదుడా!(వ్యాధుడా) -నీవు క్రౌంచ మిధునములో మగ పక్షిని క్రూరుడవై అన్యాయంగా చంపావు. అందువలన నీవు (శాశ్వతీ స్సమాః మాగమః)ఎక్కువ కాలము జీవింపకుందువు గాక!అని శపించాడు వాల్మీకి ఆ వ్యాధుని.

వాల్మీకికి వెంటనే ఆశ్చర్యము, బాధ కలిగాయి. తానేమిటి?వ్యాధుని శపించడమేమిటి?తాను బహుకాలము రామ నామాను సంధానముతో శోక మోహములకు అతీతమైన స్థితికి చేరుకున్నాడే?ఇప్పుడీవిధంగా క్రోధపరవశుడు కావడమేమీటి?శపించడమేమిటి? తాను ఇంతకాలము చేసిన తపస్సు బూడిదలోపోసిన పన్నీరేనా?తమసానదీ ప్రాంతము తనలో తమోగుణమునే ప్రమోద మోహాలనే కల్పించిందా!ఇలా సాగాయి ఆయన ఆలోచనలు.

వాల్మీకికి ఆశ్చర్యాన్ని కలిగించే మరొక సంఘటన వెంటనే అక్కడ జరిగింది. తాను అంతవరకు చూస్తున్న చనిపోయిన మగపక్షి, దాని చుట్టు హృదయ విదారకంగా విలపిస్తూ తిరుగుతున్న ఆడపక్షి, మగపక్షిని నేల కూల్చిన వ్యాధుడు తాను శపించిన మరుక్షణమే అదృశ్యం కావడం జరిగింది. తాను శపించాలనేనా ఆదృశ్యము తనకు కనపడింది.?వాల్మీకికి అయోమయం కలిగింది.

అయితే ఇక్కడ మరొక విషయము ముఖ్యమైనది. ఈ సంఘటన జరిగే సమయానికే శ్రీరాముడు చాకలి వాని నిందాకారణంగా సీతా దేవిని పరిత్యజించాడు. సీతాదేవి వాల్మీకి ఆశ్రమానికి చేరుకొంది. శ్రీరామచంద్రస్వామి విరహము సీతాదేవిని అనుక్షణము కృంగదీస్తుంది. ఆమె దుఃఖము వాల్మీకికి కూడ దుర్భరమైంది.

అపరిమితమైన సీతాదేవి దుఃఖము వాల్మీకి హృదయం నిండా వ్యాపించింది. అటువంటి దుస్సహ దుఃఖముతో దుర్బలమైన వాల్మీకి హృదయాన్ని క్రౌంచవధ మరింత కృంగదీసింది. అందుకే అంతకాలము దాకా అలవర్చుకొన్న మనోనిగ్రహము పనికి రాకుండా పోయింది. ఆయన నోటి నుండి అప్రయత్నంగా శాప వాక్కులు వెలువడ్డాయి.

ఆయన తన శాప వాక్కులను పునశ్చరణ చేసికొన్నాడు. ఆశ్చర్యము!అవి వచనాలు కావు. అదొక శ్లోకము అప్పటి వరకు సాహితీ ప్రపంచములో వచనమే తప్ప-శ్లోక సృష్టి జరుగనే లేదు. ఇదే మొదటి శ్లోకము. వాల్మీకి తన శ్లోకాన్ని నెమరు వేసి కొన్నాడు. అందులో నాలుగు పాదాలున్నాయి. ఒక్కొక్క చరణములో ఎనమిది అక్షరాలున్నాయి. అనుష్టుప్ ఛందస్సులో సాగింది ఆశ్లోకము.

ఆపాదములను అనుసంధిస్తుంటే వీణను మీటినప్పటిలయ వినిపిస్తుంది. "తంత్రీలయ సమన్వితం"ఒక అవ్యక్త మాధుర్యము అనుభూతిలోకి వస్తుంది.

మానిషాద చరణంలో "మకు"త్వమగమః"లోని 'మ"కు

"యత్క్రౌంచ"లోని -"యకు -"అవధీః"లోని "అ"కు యతి ఏర్పడింది.

తన శోకము నుండి ఇంతటి అద్భుత శ్లోకమెలా ఏర్పడింది?

వాల్మీకి విస్మితుడయ్యాడు. ఆబాధ, ఆశ్చర్యాలతోనే తమసా నదిలో స్నానం చేసి, శిష్యసమేతుడై, ఆ శ్లోకాన్ని పునశ్చరణ చేసుకొంటూ, తన ఆశ్రమానికి చేరుకొన్నాడు.

IX. శ్రీరామాయణావతరణము -II "మానిషాద" అర్థ పరిశీలనము :-

తమసానదీ స్నానానంతరము వాల్మీకి శిష్యసమేతంగా ఆశ్రమానికి చేరుకొని, తత్కాల సంధ్యావందనము పూర్తిగావించుకొని తన శాపోక్తి శ్లోకాన్ని మాటి మాటికి శిష్యసమేతంగా నెమరు వేసికొంటూ ఆశ్చర్యచకితుడయ్యాడు.

అప్పుడు అక్కడికి అనుకోకుండా బ్రహ్మదేవుడు ఏతెంచాడు., బ్రహ్మాగమనము వలన వాల్మీకికి మరింత సంభ్రమము కలిగింది. లేచి, ఎదురేగి, బ్రహ్మకు స్వాగతం పలికాడు వాల్మీకి మునీంద్రుడు. ఆసన మర్యాదలను కల్పించి, కుశల ప్రశ్నలు కావించాడు. ఆయనతో తన శాపశ్లోకాన్ని, తన అయోమయాన్ని ప్రస్తావించాడు.

బ్రహ్మదేవుడు వాల్మీకి మర్యాదకు సంతోష భరితుడయ్యాడు. వాల్మీకి నోటి నుండి శాపోక్తి వెలువడడం దైవనిర్ణయమని తెలిపాడు. సరస్వతే స్వయంగా వాల్మీకి నాలుకపై నర్తించి, ఆశ్లోకాన్ని వెలువరించిందని తెలిపాడు.

ఆశాపోక్తి అమంగళ కరం కాదని, బ్రహ్మ వాల్మీకికి తెలిపాడు. ఆశ్లోకము జగత్కల్యాణ కరమైన రామాయణ మహాకావ్యానికి ఆరంభమని వివరించాడు. తన కృపవలన రామ కథ అంతా వాల్మీకికి కనుల ముందు నిలుస్తుందని, "సర్వంతే విదితం భవతి"-వాల్మీకికి తెలియని శ్రీరామ కథా రహస్యమే ఉండదని, వాల్మీకి రచనలో ఒక్కమాట కూడ అసత్యము కాదని, "నతేవాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి" అనివరమిచ్చి బ్రహ్మ అంతర్ధానం చెందాడు.

బ్రహ్మవర ప్రసాదము వలన వాల్మీకి ధ్యానావస్థను పొందాడు. ఆధ్యానములో ఆయనకు రామకథ అంతా అవగతము కాసాగింది. అత్యంత రహస్యములు కూడ ఆయనకు అనుభూతిలోకి రాసాగాయి.

వాల్మీకికి తన ముఖం నుండి వెలువడిన "మానిషాద"శ్లోకార్థము, దాని పరమార్థము స్పష్టంగా సంపూర్ణంగా గోచరించింది. ఆశ్లోకార్థములను మనము కూడ యథాశక్తి అనుభవిద్దామా?

**1.**నిషాద ఓరీ వ్యాధుడా!క్రౌంచ పక్షుల జంట నుండి కామమోహితమైన మొగపక్షిని చంపావు. కనుక ఎక్కువ కాలము జీవింపక వెంటనే నశించిపో.

**2.**మానిషాద!(మయాసహ నిషీదతీతి)!ఓ శ్రీనివాస!కామమోహితమైన, (పాపిష్టమైన)మగపక్షిని చంపి లోక కల్యాణం కావించావు. కాబట్టి నీవు చిరకాలము ఈ భూమండలములో వర్ధిల్లుదువు గాక!నీ కీర్తి ప్రతిష్టలు జగమంతా శాశ్వతంగా నిలుచుగాక!

**3.**శ్రీరామా!నీవు మండోదరి రావణుల జంటలో-కామమోహితుడై-అనేక స్త్రీలను చెరపట్టి లోకకంటకుడైన రావణుని చంపి జగత్కల్యాణం కావిస్తావు. అందువలన చిరకాలము వర్ధిల్లు.

**4.**హే శ్రీరామభద్రా!తారా వాలి మిధునములో -కామపరవశుడై బిడ్డలాంటి రుమను చేపట్టిన మహాబలశాలి, దుర్జనుడయిన వాలిని ఒకే బాణంతో నేల కూలుస్తావే. అందువలన నీ కీర్తి చంద్రికలు నిరంతరం జాజ్వల్య మానంగా వెలుగు గాక!

5.హే శ్రీరామచంద్రా!క్రౌంచివలె నీ విరహంతో అతిగా కృశించే నీ సీతాదేవి పట్ల కామవశుడై, ఆమెను నీనుండి దూరము చేసి నీకే ఆర్ద్రాపరాధము కావించి, క్రౌంచము వలె కుటిలగమనము కలిగిన లోక విద్రావణుడైన రావణుని వధిస్తావే. నీ కీర్తి ప్రతిష్ఠలు రామాయణములోని ఏడుకాండలలో (ఈవిధంగా)వ్యాపించు గాక!

1.బాలకాండలో:-నీ అవతారము, విశ్వామిత్ర యాగ సంరక్షణ, సీతాకల్యాణము, పరశు రామ విజయం ద్వారా.

2.అయోధ్య కాండలో:- నీ కల్యాణ గుణ వర్ణనము, నీ పితృవాక్యపాలనముల ద్వారా

3.అరణ్యాకాండలో:-శూర్పణఖా పరాభవము, మునులకు అభయప్రదానము, రాక్షస వధల ద్వారా

4.కిష్కింధ కాండలో:-వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకముల ద్వారా

5.సుందరకాండలో:-హనుమదౌత్యము, సీతా సమాచారము, కాకాసుర సంరక్షణము ద్వారా

6.యుద్ధకాండలో:-సమూల రావణ సంహారము ద్వారా

7.ఉత్తర కాండలో:-మోక్షప్రస్తావన ద్వారా

నీకీర్తి చంద్రికలు సకల జనుల మనములకు ఆహ్లాదకరములగు కాగ!

6.హేశ్రీవల్లభా!క్రౌంచమిధునమువలె, ప్రకృతి పురుషద్వయములో మలినమైన ప్రకృతి పట్ల కామమోహితుడైన పురుషుని (అవధీః)వేరు చేసి_నీ శాశ్వతా నందస్థానములో చేర్చుకొంటావే. నీవు శాశ్వత ప్రతిష్ఠను పొందుదువు గాక!

7.ఓశ్రీరామా!దశముఖములనే, దశేంద్రియములు, మనస్సనే రావణుడు నివసించే లంక అనే శరీరము నుండి సీత అనే జీవాత్మను చెరవిడిపించి హనుమ అనే ఆచార్యుని పురుషకారంతో అయోధ్య అనే నీ స్థానానికి తిరిగి తెచ్చుకొంటావే!నీకు శాశ్వత ప్రతిష్ఠకలుగు గాక!

8.ఓ శ్రియఃపతీ!అకారవాచ్యుడవైన నీవు, "మ"కారముచే తెలుపబడే కామ మోహితుడైన జీవుని నియంత్రించి, "అవధీః"నీ స్థానములో చేర్చుకొంటావే.

అందువలన "ఉ"నీవే చిరకాల కీర్తి ప్రతిష్టను పొందుదువు గాక!నీవే మాకు ఉపాయమగుదువు గాక!ఈ విధంగా "మానిషాదశ్లోకార్థము ప్రణ" వార్థాన్ని వివరిస్తుంది.

**9.**ఓశ్రీరామా!శంఖుకర్ణ దంపతులలో, వంచకుడై పరహింసాపరుడై కామమోహితుడైన, శంఖుకర్ణ రాక్షసుని వధ గావించితివి. కనుక నీవు చిరకాలము వర్ధిల్లుదువు గాక!

**10.**నిషాద(నితరాంసాదయతి) క్రూరుడవైన రావణా!క్రౌంచమిధునమువంటి సీతారాముల జంటలో సీతా ప్రియవల్లభుడైన శ్రీరాముని నుండి సీతాదేవిని వేరు జేసితివి!కాబట్టి (మాప్రతిష్ఠాంత్వమగమః)నీవు చిరకాలము జీవింపకుందువు గాక (కతక వ్యాఖ్య)

వాల్మీకి ఋషి కనుక -క్రాంతదర్శి గనుక అతనికి నిషాదునిలో రావణుడు కూడ కనుపించాడని కతక వ్యాఖ్య ఏర్పడింది.

ఈ విధంగా వాల్మీకి వదనారవింద వినిర్గతమైన "మానిషాద" శ్లోకార్థమకరందము అత్యంత మధురమై, అనంతార్థ ప్రదమై, అక్షర రస నిష్యందమై అత్యుత్తమైనది. అందులోనుండి నా అల్పమైన మేధాపాత్ర ద్వారా యథాశక్తి రామ కథా సుధను అందించడానికి ప్రయత్నించాను.

సాహితీ జగత్తులో వాల్మీకి వంటి మరొక కవి పుట్టనే లేదంటే, "మానిషాద"వంటి శ్లోకమే ఆవిర్భవించ లేదంటే, అతిశయోక్తి ఇసుమంతైనా లేదని రసజ్ఞులైన సాహితీ వేత్తలందరు ఏక కంఠంతో చాటుతారు.

రామాయణ స్వర్గంగను భూమిపైకి అవతరింపజేసిన కవిభగీరథుడు వాల్మీకి.

భూమండలంలోకి, "మానిషాద"శ్లోకం ద్వారా సరస్వతీ కన్యను ఛందోబద్ధంగా సృష్టించిన కవిబ్రహ్మ వాల్మీకి.

లోకాలను పావనం చేస్తూ, అసంఖ్యాక భక్తహృదయకేదారము లను భక్తిఫలవంతంగా విస్తూ-రామసాగర సంగమం చెందే రామాయణ మహానది జన్మకు కారణమైన కవి పర్వతము వాల్మీకి. కవితా శాఖను అధిరోహించి, మధురార్థ ప్రదములై అక్షర రసమును వెలువరించే "రామ, రామ"అనే మధురాక్షరముల ద్వారా "రామకథాసుధను'వెలువరించిన అద్భుత కవితా కోకిల వాల్మీకి.

"మధురం"-"మ" కల్గిన "రాzక్షరం""రా"అనే అక్షరము నిజంగా మధువే.

కవితా వన విహారులకు గంభీరమై, ముక్తి ప్రదమైన "రామ"నాదము ద్వారా జీవాత్మ, పరమాత్మల గాథలను ఉద్ఘోషించిన ముని సింహము వాల్మీకి.

ఆకవీంద్రునికి మనసారా ప్రణమిల్లి, సీతారామచంద్రుల అద్వితీయ మిధున పాదారవిందములకు మోకరిల్లి, "పలికించెడు వాడు శ్రీరామభద్రుడే"అనే దృఢాధ్యవసాయముతో అస్మదాచార్య వర్గానికి దాసోzహములు సమర్పించి, రామకథలోని రహస్య విశేష సుధను పామరజనులకు సైతము అందించాలనే పవిత్ర లక్ష్యంతో శ్రీరామాయణ మహా ప్రస్థానములో ముందడుగు వేస్తున్నాను.!

# X. అయోధ్యా పురము

కోసల దేశానికి అయోధ్యరాజధాని. సరయూ (గోగ్రా)నది అయోధ్యాపురిని. కోసలదేశము మొత్తాన్ని పరివేష్టించి ప్రవహిస్తుంది.

ఈ అయోధ్యానగర నిర్మాత స్వయంగా వైవస్వత మనువే. ఈనగరం **12**యోజనాల **(144 Km)**పొడువు, మూడు యోజనాల **(36Km)**వెడల్పులతో విస్తరించి ఉంది.

అయోధ్యలో అనేక విశాల వీధులుండేవి. పెద్ద పెద్దకవాటాలు, తోరణాలతో ఎప్పుడు విరాజిల్లుతుండేవి. ఈ నగరంలో రోడ్లకు రెండువైపులా చెట్లు పచ్చని నీడనిస్తుండేవి.

అనేక ఆయుధాగారాలు, ధాన్యాగారాలు, అంగడులు నగర శ్రీ శోభలను పెంచేవిగా నుండేవి. లెక్కకు మిక్కిలి భద్రగజాలు తురంగాలు, ఒంటెలు అయోధ్యా సంపదను తెలుపుచుండేవి.

నగరము చుట్టు పెద్ద పెద్ద దుర్గాలుండేవి. అనేక శతసహస్ర శతఘ్నులుండేవి. వీటితో "యోద్ధుమశక్యా"అన్నట్లు అయోధ్య శత్రుదుర్నిరీక్ష్యంగా ఉండేది.

నగరము చుట్టు ఆమ్రోద్యానాలుండేవి. ఎత్తైన అనేక ప్రాసాదాలు ధవళ కాంతులీనుతూ ఉండేవి.

ఆనగరములో సామంత రాజ సంఘాలు, వర్తక ప్రముఖ సమాజాలు ఉండేవి.

చిత్రకారులు, శిల్పకళాభిజ్ఞులు, వరనర్తకీమణులు అసంఖ్యాకంగా ఉండేవారు.

ధాన్య రాశులు, చెరుకు రసము, ఇతర పానీయములు అపరిమితంగా ఉండేవి. ఎల్లవేళలలో నగరమంతటా వీణాగానము, దుందుభినిస్వనము, మృదంగ వాద్యముల శబ్దాలు చెవులకింపుగా వినబడేవి.

ఆనగరంలో వేద వేదాంగ పారగులు అనేక సంఖ్యలో ఉండేవారు. శబ్దవేధి విద్యావిశారదులైన ధానుష్కులు అధిక సంఖ్యలో నుండేవారు. అతిరథ మహారథులు అసంఖ్యాకులుగా నుండేవారు.

ఆపురమును రాజధానిగా చేసికొని కోసలదేశాన్ని దశరథ చక్రవర్తి పాలిస్తుండేవాడు. ఆయన వేదవేత్త, దీర్ఘదర్శి, మహాతేజస్వి, ప్రజాప్రియుడు, ఆయన స్వయంగానే కాదు. ఆయన ప్రజలందరు ధర్మార్థకామములనే త్రివర్గాలను పూర్ణంగా సాధించేవారు.

ఆకాలంలో ప్రజలందరు సంతుష్టులు, ధర్మ పరాయణులు, బహువిషయజ్ఞులు, ఉదారులు, సత్యవాదులు.

పశుసంపదలేని వారు, ధనధాన్య హీనులు, లుబ్ధులు, అసంపూర్ణ కాములు మందుకైనా దొరికే వారుకారు.

అందరు కుండలాలను, కిరీటాలను, పూలమాలలను, సుగంధ ద్రవ్యాలను, అనులేపాలను ధరించేవారు.

మృష్టాన్న భోజనములేని వారు, దాతలు కానివారు లేనే లేరు.

అందరు తమ తమ విహిత కర్మలలో ఆరితేరిన వారు. అసత్యకాములు, అసత్యవాదులు, నాస్తికులు, దీనులు, బాధితులు డబ్బును పాతర పెట్టుకొనే వారు మచ్చుకైనా లేకుండిరి. అందరు దీర్ఘాయుష్కులే. ధర్మపరాయణులే. సత్యవాక్య పరిపాలకులే.

ఇటువంటి ధన ధాన్య సంపన్నమైన, తేజస్సంపన్నమయిన ప్రజాకోటి విలసితమైన కోసల మహాదేశాన్ని అయోధ్యానగరాన్ని రాజధానిగా చేసికొని స్వర్గాన్ని పాలించే మహేంద్రుని వలె మహావైభవముతో పాలించాడు దశరథుడు మహాత్ముడైన దశరథ మహారాజుకు ఎనమండుగురు అమాత్యులుండిరి వారందరు ఋజువర్తనులు, కీర్తి మంతులు, రాజకార్య నిరతులు.

ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్ధసాధకుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు అనే ఎనమండుగురు ఆయన మంత్రులుగా ఉండిరి.

లౌకిక కార్యములకు సంబంధించి, అష్టసచివులే కాక, ఆయనను ధర్మ మార్గంలో నడిపించడానికి వశిష్ఠుడు, వామదేవుడు అనే మహర్షులిద్దరు రాజగురువులుగా ఉండిరి.

అష్టసచివులు, రాజ గురువులే కాక అనేక మంది మంత్రాంగ నిపుణులైన మంత్రులు సలహాదారులుగా ఉండిరి. వీరందరు విద్యావంతులు, వినయశీలురు, జితేంద్రియులు, పరస్పర ఆదరణీయులుగా ఉండిరి.

వీరు కోపంలో కూడ, డబ్బు విషయంలో కూడ అబద్ధమాడే వారు కారు. దేశంలోని సమస్త వ్యవహారాలు వీరికి కరతలామలకాలు వారు నాలుగు విద్యలయందు ఆరితేరిన వారు.

**1.అన్వీక్షకి (తర్కము) 2.త్రయి (వేదము) 3. వార్త (వ్యవహారము) 4.దండనీతి**

ధర్మము తప్పిన స్వపుత్రులనైనా వారు శిక్షించేవారు. శత్రువులనైనా అన్యాయంగా శిక్షించేవారు కారు. కోశాన్ని ధర్మబద్ధంగానే పూరించేవారు.

సచివులలోనే కాదు సాధారణ జనులలో కూడ అసత్య వాదులు లేరు, దుష్టులు లేరు, పరదారరతులు లేరు.

దశరథుని అమాత్యులు సంధివిగ్రహాలను సాధించడంలో సమర్థులు, మంత్రాంగ నిపుణులు, సూక్ష్మబుద్ధి విశారదులు. నీతిశాస్త్ర విశేషజ్ఞులు. దేశ దేశాలలో వారి కీర్తి వ్యాపించింది.

మన మనస్సే అయోధ్య "యోద్ధుమశక్యా అయోధ్యా"అయోధ్యను శత్రువులు ఆక్రమింపజాలరు మన మనస్సును మనం కూడ సులభంగా గెలువరాదు.

పది ఇంద్రియాలనే గుఱ్ఱాలచే నడిపింపబడే మనస్సు అనే రథం కల దశరథులము మనమే. దశరథుని స్త్రీలు ముగ్గురు. కౌసల్య సుమిత్ర, కైకేయిలు. మనలోని మూడు గుణాలే ఆ ముగ్గురు రాణులు.

1. "సత్వాత్సం జాయతే జ్ఞానం" జ్ఞాన స్వరూపుడైన శ్రీరాముని కన్న కౌసల్యే సత్వగుణము 'శసయోర్న బేదః "అనుటచే సాత్విక కర్మ కౌశల్యామే ఆమె. 2. సుమిత్రే రజోగుణము, సాధారణరజో గుణమైతే సత్వ, తమస్సులకు సమానంగా మిత్రంగా ఉంటుంది. కాని ఇక్కడ రజోగుణ రూపమైన సుమిత్ర కేవలము కౌసల్యనే ఆశ్రయించింది. ఆమెను ఎ(ల్ల)ప్పుడు వదిలి ఉండలేదు. కౌసల్యతో పాటు, తాను కూడ కైకేయిని ద్వేషించింది. ఒక్క కౌసల్యకే మిత్రురాలయినందు వలన ఆమె సుమిత్ర. 3."తమస్త్వజ్ఞానజం విద్ధి. మోహనం సర్వదేహినామ్"తమస్సు అజ్ఞానం వలన కలిగి సకల ప్రాణులను మోహింపజేస్తుంది. దశరథుని వ్యామోహ పాశంలో బంధించిన కైక తమోగుణానికి ప్రతీక. "క+ఏక"భోగమును మాత్రమే కోరేదికైక. అర్ధ కామములకు ప్రతినిధి ఆమె "ద్వేష్యోభవత్యర్థ పరోహిలోకే"అందుకే ఆమె మన అందరినిందలకు గురి అయింది .

మనము సాధారణ మనస్థితి నుండి పైకి లేచి, దశేంద్రియాలను మనస్సుతో జయించి ఎదిగి విశిష్ఠ అయోధ్యస్థాయిని చేరుకోవాలి. మనము చేరవలసింది. "దేవానాం పూరయోధ్యా"పరమ పదమే. సాధారణ దశరథ స్థాయినుండి విశేష దశరథస్థాయినందు కోవాలి. "దశ"అంటే "పక్షి", "రథుడు" అంటే "వాహనము"కలవాడు-గరుడవాహనుడే దశరథుడు. ఆయన ముగ్గురు మహిషులు మనకు ఆరాధనీయులే. శుద్ద సత్వగుణులే శ్రీదేవి పురుషకార స్వరూపిణి-ఆమె మనను పరమాత్మను ఆశ్రయించుమని ఆహ్వానిస్తుంది. మన దోషములను సహింపజేసేది భూదేవి. మనను తక్షణమే కరుణింపుమని భగవంతుని త్వరపెట్టే స్నేహమయి నీళాదేవి.

ఇతిశం.

శ్రీమతేరామానుజాయనమః
శ్రీరామచంద్రపరమాత్మనే నమః

# XI. ఋష్యశృంగుడు

సూర్యవంశ సంజాతులైన మహారాజులు వంశపారంపర్యంగా అయోధ్యా నగరాన్ని రాజధానిగా చేసికొని ఈ భూమండలాన్ని పాలించారు.

ఇక్ష్వాకు వంశసంభవుడైన దశరథ నృపాలుడు అప్పటి కోసలదేశాన్ని పాలిస్తున్నాడు. అప్పటివరకు నిరంతరాయంగా వస్తున్న ఆవంశానికి వారుసుడులేడు. ఆవిచారమే దశరథుని నిరంతరము దహిస్తుంది. సకల భోగ భాగ్యములతో ఓలలాడుతున్నా, వంశాంకురము లేని దైన్యము ఆయనను ఎల్లవేళలా వెంటాడుతున్నది. కౌసల్య, కైకేయి, సుమిత్ర అనే ప్రధాన మహిషులు వందలాది రాజపత్నులున్నా - దశరథుని ప్రాసాదాన్ని తన బోసి చిరునవ్వులతో ప్రకాశింపజేసే బాలచంద్రుడే కరువయ్యాడు. సంతాన శూన్యతకు కారణము తన పూర్వజన్మ దుష్కృతమే అని దశరథ మహారాజా గుర్తించాడు. తన పాపములను శమింపజేసికోవడానికి "అశ్వమేధయాగాన్ని"నిర్వహించాలని నిర్ణయించాడు.

ఇంతలో రహస్యంగా సుమంత్రుడు ఒక వృత్తాంతాన్ని దశరథునికి నివేదించాడు.

"మహారాజా! పూర్వము సనత్కుమారుడు సంతానం నీకు కలిగే క్రమాన్ని తెలిపాడు." కాశ్యపుని పుత్రుడు విభండకుడనే మహర్షిఉంటాడు. ఆయన కుమారుడు ఋష్యశృంగుడు. ఋష్యశృంగునికి లోకజ్ఞానము బొత్తిగా ఉండదు. అగ్నిని, తండ్రిని అనువర్తించడం ద్వారా ఆయన బ్రహ్మచర్యము ద్వివిధంగా ఉంటుంది.

ఆకాలములో అంగరాజ్యపాలకుడుగా రోమపాదుడు ఉంటాడు. ఆయన రాజ్యంలో రాజదోషము వలన భయంకరమైన అనావృష్టి ఏర్పడుతుంది. ఆయన దుఃఖాక్రాంతుడై బ్రాహ్మణులను, వృద్ధులను పిలిచి, దానికి ప్రాయశ్చిత్తాన్ని అడుగుతాడు.

వేదపారగులైన విప్రోత్తములు "మహారాజా! నీవు విభండక పుత్రుడైన ఋష్యశృంగుని ఏదో ఒక ఉపాయంతో రప్పించి, నీకూతురైన శాంతనిచ్చి వివాహము చేయిస్తే మళ్లీ సువృష్టి కలిగి సుభిక్షమేర్పడుతుంది."అని రోమపాదునికి

తెలుపుతారు.

రోమపాదుడు, పురోహితుని, అమాత్యులను ఋష్యశృంగుని తీసికరావడానికి పంపాలనుకుంటాడు. వారు విభండకుని క్రోధాగ్నికి భీతులై తమ అశక్తతను నివేదించి, నర్తకీమణులను సహాయంగా తీసికవెళ్లి మునికుమారుని తీసికొస్తామని తెలుపుతారు. ఆవిధంగా గణికాజన సహాయంతో తీసికరాబడిన ఋష్యశృంగుని మూలంగా అంగదేశంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి ఆయనకు రోమపాదుడు తన తనూజ శాంతినిచ్చి పెళ్లిజేస్తాడు."

"అంతేకాదు ఆకాలంలో ఇక్ష్వాకు కులోద్భవుడైన దశరథుడు కోసలాధిపతిగా ఉంటాడు. ఆయనకు సంతానము ఉండదు. ఆయనకు అంగదేశాధిపతియైన రోమపాదునితో సఖ్యము ఉంటుంది. ఆయన అంగదేశానికి వెళ్లి, "రోమపాదమహారాజా!నీ అల్లుడైన ఋష్యశృంగుని శాంతా సమేతంగా మా దేశానికి పంపించు. ఆయన అధ్వర్యంలో స్వర్గము కొరకు పుత్రులకొరకు (అగ్నిష్టోమ, పుత్రకామేష్టులను) యజ్ఞాలను చేస్తాను"అని అర్థిస్తాడు. రోమపాదుడు అంగీకరిస్తాడు. ఋష్యశృంగుని అధ్వర్యములో దశరథుడు పుత్రకామేష్టి యాగం చేసి అమితవిక్రములైన నలుగురు కొడుకులనుకంటాడు."

"దశరథ మహారాజా! ఇదుగో దేవర్షి అయిన సనత్కుమారుని ద్వారా నేను విన్నవృత్తాంతమిదే సుమా!" అని సుమంత్రుడు దశరథ భూపాలునికి నివేదించాడు.

సుమంత్రునిద్వారా పుత్రకామేష్టి రహస్యాన్ని గ్రహించిన దశరథ మహారాజు తన కోరిక తక్షణమే నెరవేరినట్లు పరమానందభరితుడై తనపరివారముతో అంతఃపురకాంతలతో కలిసి అంగదేశానికి వెళ్లాడు. అంగదేశ మహీపాలుడు తన ప్రాణమిత్రుడైన దశరథ చక్రవర్తికి సపరివారంగా స్వాగతం చెప్పి సత్కరించాడు.

ఏడెనమిది రోజులు స్నేహితుని సాదర సపర్యలను స్వీకరించిన దశరథ సార్వభౌముడు -తనకు సంతానార్థము పుత్రకామేష్టిని నిర్వహింపజేయడానికి శాంతా సమేతంగా ఋష్యశృంగుని పంపుమని రోమపాదమహారాజును అభ్యర్థించాడు. ఆయన హృదయ పూర్వక అంగీకారముతో మహానుభావుడైన ఋష్యశృంగ మహర్షిని ధర్మపత్నీ సమేతంగా తన రాజధాని అయిన అయోధ్యానగరానికి తోడుకొని వచ్చి యథావిధిగా ఆదరిస్తాడు.

అక్కడ రోమపాదుని పాపఫలితంగా అంగదేశంలో అరిష్టాలు సంభవించాయి. ఆ ఆపదను తొలగించుకోవడానికి ఆమహీపతికి ఋష్యశృంగుని అనుగ్రహము అవసరమైంది. అందుకు ఆమునిచంద్రుని - తనదేశానికి రప్పించి -అంగ మహారాజు -తన అనుంగు పుత్రి అయిన శాంతనిచ్చి పాణిగ్రహణము జరిపించి - తన దగ్గరే ఉంచుకొన్నాడు. ఋష్యశృంగుడు అంగదేశంలో కాలుమోపిన తక్షణమే ఆదేశము సుభిక్షమైంది.

మనము కూడ తెలిసితెలియక అనేక అకృత్యాలను (పాపాలను) ఆచరిస్తాము. వాటి వలన మనకు, మనకుటుంబానికి, మనదేశానికి కూడ అనేక ఆపదలు కలుగవచ్చును. వాటిని తొలగించుకోవడానికి ఋషి వరిష్ఠుడైన ఋష్యశృంగుడు మనకు కూడ అవసరమవుతాడు. ఋష్యశృంగుడంటే ఎవ్వరో కాదు భాగవత శ్రేష్ఠుడైన ఆచార్యుడే. ఆయన అష్టాక్షరీ మహామంత్రాన్ని తమ ఆచార్యుల ద్వారా పరంపరగా పొంది - మనపైన అనురాగముతో ఆ మహామంత్రాన్ని మనకందిస్తాడు. ఆయన అడుగుపెట్టిన ప్రతి చోట సుభిక్షమే.

"యత్రాష్టాక్షర సంసిద్ధో -మహాభాగో మహీయతే

నతత్రవ్యాధి దుర్భిక్షాః - నతస్కర భయస్తథా.

అంతే కాదు - ఆ మహానుభావుని అనుగ్రహముతో దశరథ నరేశ్వరుని సంతాన ప్రతిబంధకమైన పాపములు నశించి - ఆయనకు పుత్రకామేష్టి ద్వారా నలుగురు కొడుకులు కలుగుతారు కదా!మనము కూడ కుటుంబసమేతుడైన ఆచార్యుని ఆశ్రయిస్తే -మనకు భగవంతుడే (పుత్రుడే)కావాలనే కోరిక (కామము)ఏర్పడుతుంది. దానికొరకు ఆచార్యుడు ఉపదేశించిన (ఇష్టినీ) "యాగాన్ని" (భగవదారాధనము)చేస్తాము. దానివలన మనకు కూడ శ్రీరామ పరమాత్మ లభిస్తాడు.

ఇతిశం

శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# XII. అశ్వమేధయాగము - పాపవినాశనము.

ఋష్యశృంగ మహామునిని శాంతా సమేతంగా దశరథ చక్రవర్తి మహర్షి మనః ప్రసాదకరములైన అనేక పరిచర్యలతో సంతుష్టుని కావించాడు. ఇంతలో సకల ప్రాణి మనోహరమైన వసంత ఋతువు వచ్చింది.

ఇది, 5వ త్రేతాయుగంలో దుర్ముఖి సంవత్సరము. "త్రేతాయుగే పంచమేతు - రాజా దశరథోనఘః - పుత్రార్థం హయమేధేన యష్టుం సముపచక్రమే" - శ్రీరంగ మహాత్మ్యము.

"

"వసంతే, వసంతే యజేత "అని వేదోక్తి. యజ్ఞాలు చేయడానికి వసంత ఋతువు తగిన కాలము. దశరథుడు యజ్ఞ నిర్వహణకై ఋష్యశృంగుని అనుమతిని పొందాడు.

దశరథుని ఆజ్ఞమేరకు సుమంత్రుడు వసిష్ట, వామదేవ, సుయజ్ఞ, జాబాలి, కాశ్యపాది మహర్షులను ఆహ్వానించాడు. వారందరు దశరథుని సంకల్పాన్ని ఆమోదించారు.

సంభారాలన్ని సమకూర్చబడ్డాయి. ఉపాధ్యాయ సమేతంగా ఉత్తమాశ్వము దేశాటనకై విడువబడింది. సరయూనది ఉత్తర తీరంలో యజ్ఞవాటిక నిర్మాణము సంకల్పింపబడింది. యజ్ఞ నిర్వహణలో ఏలోపమున్నా, అదికర్తకు వినాశకరమవుతుంది. అందువలన అన్ని జాగ్రత్తలు తీసికోబడాలని అంగీకరింపబడింది.

ఒక సంవత్సరము తురంగము స్వేచ్ఛగా దేశసంచారము గావించి వచ్చింది. మళ్లీ వసంతము వచ్చింది. ఇది 5వ త్రేతాయుగములో హేవిలంబి సంవత్సరము. దశరథుడు పురోహితుడైన వశిష్ఠునితో అశ్వమేధ యాగారంభానికై సమాలోచనలు జరిపాడు.

శిల్పులు, వర్ధకులు (సృక్స్రువాది కారకులు), లేఖకులు, తమ తమ కార్యాలలో నియుక్తులయ్యారు.

సకల జనులకు వర్ణాశ్రమ విహితంగా వసతులు, భోజన సదుపాయాలు సమకూర్చబడ్డాయి.

మిథిలాధిపతి జనకుడు, కేకయాధిపతి అశ్వపతి, అంగేశ్వరుడైన రోమపాదుడు, ప్రాగ్దేశ నరాధిపతులు, సింధు, సౌవీర, సౌరాష్ట్ర మహీపాలురు, దక్షిణ దేశాధిపులు ఇతర మిత్రరాజులందరు ఆహ్వానింపబడ్డారు.

మారేడు, చంద్ర, మోదుగు కఱ్ఱలతో, ఆరేసి యూపాలు, విరిగి కఱ్ఱతో ఒకటి, దేవదారు కట్టెతో రెండు యూపాలు ఇరువై ఒక్కటి ముష్టల ప్రమాణంతో నిర్మింపబడ్డాయి. వాటికి వస్త్రములు చుట్టబడ్డాయి. పుష్ప, గంధాలంకారాలు సమర్పించబడ్డాయి. పశువులను బంధించే కట్టె స్థంబాలను యూపాలంటారు.

ఇటుకలతో యజ్ఞ కుండ నిర్మాణము యథావిధిగా జరిగింది. బంగారునాణెముల రెక్కలతో, అథోముఖంగా తూర్పుదిశలో గరుడ ప్రతిమ నిర్మింపబడింది. ఉరగములు, పక్షులు పశువులు కల్పించబడ్డాయి.

కౌసల్యాదేవి యజ్ఞాశ్వాన్ని మూడు భాగములను చేసింది, వాటిని ఆరాత్రంతా కౌసల్యాదులు పరిరక్షించారు. ఋత్విక్కు ఆతురంగము యొక్క హృదయము (వప)ను హోమం చేశాడు. దశరథుడావపాహోమ గంధాన్ని ఆఘ్రాణించాడు. మూడు రోజులు అశ్వమేధక్రతువు తరువాత నాలుగవ రోజు అగ్నిష్టోమ, జ్యోతిష్టోమాదులు ఆ తరువాత అతిరాత్రము - లేక సర్వస్తోమం (ఆయుర్హోమాదులు) నిర్వంహిచబడ్డాయి.

దశరథుడు -హోత, అధ్వర్యువు, బ్రహ్మ, ఉద్గాత మొదలైన యాజికులను భూరిదక్షణలిచ్చాడు.

పాపప్రశమన కరమైన అశ్వమేధయాగము నిర్విఘ్నంగా పరిసమాప్తి చేయబడింది.ధశరథుని అశ్వమేధము మన జీవితాలకు దగ్గర సంబంధము కల్గిఉంది.

దశరథుడంటే దశదిశలలో అప్రతిహతంగా తన రథాన్ని నడిపేవాడు. దశరథము కలవాడు. మనము కూడ దశరథులమే. మన శరీరమే ఒక రథము. ***"శరీరం రథమేవచ"*** (కఠోపనిషత్తు) అధి పది దిశలలో అంటే పది విషయాలలో పది ఇంద్రియాలతో ఎదురు లేకుండా సంచరిస్తుంది. రథాన్ని గుఱ్ఱాలు లాగుతాయి. శరీరమును ఇంద్రియాలు లాగుతాయి. ఎంతటి విద్వాంసుని అయినా బలవత్తరములైన ఇంద్రియాలు ఇష్టము వచ్చినట్లుగా లాగుకొని పోతాయి.

"బలవానింద్రియగ్రామో విద్వాంసమపి (ప) కర్షతి ఇంద్రియములే గుఱ్ఱములు. ***"ఇంద్రియాణి హయాన్యాహుః"***

దశరథుడు సంతానానికి అవరోధములైన అనేక దుష్కర దుస్తర పాపాలను చేశాడు. మనము కూడ మన శరీర రథముతో, దుష్ట ఇంద్రియాశ్వాలతో స్వైర విహారము చేస్తూ అనేక పాపాలను చేశాము. చేస్తున్నాము. భష్యత్తులో కూడ చేయాలని సిదపడుతున్నాము.

దశరథుని అశ్వము సంవత్సర కాలం యధేష్టముగా తిరిగింది. ఇష్టము వచ్చింది తిన్నది. దాని నెవ్వరు నిగ్రహింపజాలలేదు. మన ఇంద్రియములు కూడా జీవిత కాలము యధేచ్ఛగా సంచరిస్తాయి. వాటిని సాధారణముగా మనము నిగ్రహింపజాలము.

దశరథుడు తన పాప పరిహారార్థము వశిష్ఠాది మహర్షుల సహకారంతో అశ్వమేధయాగము చేశాడు. మనము కూడా మహర్షుల వంటి క్రాంత దర్శనులైన భాగవతోత్తముల సహకారముతో దుష్టేంద్రియాశ్వములను నిగ్రహించడం ద్వారా "యాగము"చేయాలి. నిష్కామ కర్మద్వారా భగవదారాధనము చేయాలి. యాగమంటే దేవపూజ లేక భగదారాధనమే తద్వారా భగవత్ప్రీతిని పొందాలి.

కౌసల్య అశ్వాన్ని మూడు ముక్కలు చేసింది. హోత ఆ అశ్వము యొక్క వపను (హృదయభాగాన్ని)అగ్నిలో హోమం చేశాడు. దశరథుడు ఆహుతవపా భాగాన్ని ఆఘ్రాణించాడు.

మన జీవితంలో ఇంత కాలం స్వేచ్ఛా విహారము చేపట్టిన మన ఇంద్రియాశ్వ విజృంభణను మన (కౌసల్యా ఉపకోసల విద్య)బ్రహ్మవిద్య అనే జ్ఞానఖడ్గంతో ముక్కలు ముక్కలు చేయాలి దేవపూజాత్మకమైన యాగాగ్నిలో వాటిని (చెడ్డకోరికలను) హోమం చేయాలి. చివరకు వాటి అవశేషాలను వాసన చూచివదలాలి. అనగా సవాసనతో (దుష్ట)వాంఛలను వదిలివేయాలి. ఇదే మన జీవితానికి సంబంధించిన అశ్వమేధయాగ రహస్యము.

శ్రీరామచంద్ర స్వామినే నమః

# XIII. పుత్రకామేష్టి -పాయస విభాగము

దశరథుని అభ్యర్థన మేరకు ఋష్యశృంగుడు అధర్వణ వేదాంతర్గత మంత్రములతో పుత్రకామేష్టిని ప్రారంభించాడు. విధి విధానంగా హోమమును కావించాడు. యథాశాస్త్రముగా ఇష్టిమంత్రాలను పఠించాడు.

ఆ పుత్రకామేష్టి యాగములో తమ తమ హవిర్భాగములను గ్రహించడానికి యథావిధిగా దేవతలు అక్కడ సమావేశమయ్యారు. ఆ సదస్సుకు అధ్యక్షుడైన బ్రహ్మదేవునితో వారు రావణుడు పెట్టే బాధలగురించి మొరపెట్టుకొన్నారు.

బ్రహ్మదేవా!రావణుడు ఇంద్రసింహాసనాన్ని ఆక్రమించాడు. సూర్యుడా యనకు భయపడి ఎక్కువ ఎండను ఇవ్వడంలేదు. వాయువు పరిమితికి మించి వీచడంలేదు. నిరంతర తరంగములు గల్గిన సముద్రుడు కూడా రావణ భీతిచే నిశ్చలుడయ్యాడు. వాడు స్త్రీలను, ఋషులను, దేవతలను క్రూరంగా హింసిస్తున్నాడు. మాకునిలువ నీడ లేకుండా చేశాడు. "పితామహా! మా భయములను తొలగించి రావణవధోపాయము గావించి మమ్మల్ని రక్షించు".

బ్రహ్మదేవుడు :- దేవతలారా!ఆయన వధోపాయము నాకు తెలియును. రావణుడు తనకు దేవదానవ, గంధర్వ, యక్ష, రాక్షసుల వలన మరణం లేకుండునట్లు నన్ను వరమడిగాడు. నేను అంగీకరించాను. మానవులు అల్పవీరులని భావించి వారివలన అభయమును కోరుకోలేదు. అందువలన ఆయన మనుష్యుల చేతనే చంపబడుతాడు. అని తెలిపాడు.

అయితే రావణుని నిర్జింప గల్గిన మానవుడెవ్వరో బ్రహ్మాది దేవతలకు కూడ తెలియదు. అందువలన బ్రహ్మవచనము కూడ దేవతల భీతిని తగ్గించలేదు.

"ఏతస్మిన్నంతరే విష్ణుః - ఉపయాతో మహాద్యుతిః
శంఖచక్ర గదా పాణిః -పీతవాసా జగత్పతిః"

ఏతస్మిన్నంతరే:- దేవతలు రావణ భయంతో వ్యాకులురు అవుతున్న ఆసమయంలోనే జగత్పతి వారిభయాన్ని పోగొట్టదలిచాడు - ఆపన్నుల ఆపదలను అప్పుడే వారు అర్థించకుండా పోగొట్టడమే నిజమైన రక్షణ.

మహావిపత్తు సంభవించినప్పుడు ఎవ్వరిని యాచించాలో కూడ మనకు తోచదు కదా, మనభయాన్ని పోగొట్టవలసింది. జగత్పతియే కదా!

విష్ణుః:- ఆ లోక భర్త ఎక్కడున్నాడు.? ఈ చరాచర జగత్తులో అణువణువునా వ్యాపించి ఉన్నాడు ఆ విష్ణువు. తనను ఎవ్వరు కోరుకొంటారో - ఎవ్వరికి ఏ ఆపదను నివారించాలో అని జగమంతట వ్యాపించి ఉన్నాడు ఆస్వామి.

ఉపయాతో:- ఇప్పటికి తనకు రక్షణావకాశము లభించిందే అని సంతోషంతో వెలిగిపోయాడు ఆ పరంజ్యోతి. ఆయన దేవతలను సమీపించసాగాడు.

మహాద్యుతిః:- దూరంలో కాంతి పుంజంగానే ప్రకాశించిన ఆస్వరూపము దగ్గరికి వస్తుండగా దివ్యమంగళ విగ్రహసమేతమై వారికి దర్శనమిచ్చింది.

శంఖచక్ర గదాపాణిః పీతవాసా:- ఆపీతాంబరునికి, ఆశంఖచక్ర గదా ధారికి, ఆ విశ్వపతికి బ్రహ్మాది దేవతలు సంభ్రమాశ్చర్యాలతో, భక్తి ప్రపత్తులతో అంజలి ఘటించారు. "అంజలిః పరమాముద్రా క్షిప్రందేవ ప్రసాదినీ"-భగవంతుని సైతము కరిగించి. ఆయన ప్రసాదాన్ని తక్షణమే కలిగించే గొప్ప సాధనము అంజలి.

బ్రహ్మపురస్సరంగా దేవతలు శ్రియఃపతిని శరణు వేడారు.

"ప్రస్తుతము పుత్రకామేష్టి చేస్తుండే దశరథ రాజర్షి ముగ్గురు భార్యలందు నలుగురు పుత్రులుగా నీవు అవతరించి - లోకవిద్రావణుడైన రావణుని వధించి లోక కల్యాణము కావించుమ"ని వారు వేడారు.

శరణాగత పరిత్రాణ పరాయణుడైన శ్రియఃపతి -తాను దశరథ నందనునిగా అవతరించి, పదకొండువేల సంవత్సరాలు ఈ అవనీతలము పై నివసించి రావణాది దుష్టులను శిక్షించి -శిష్టరక్షణ కావిస్తానని - ధర్మాన్ని తిరిగి నాలుగు పాదాలుగా నడుపుతానని వారికి అభయమొసగాడు.

"పితరం రోచయామస - తదా దశరథం నృపం"- తనకు లోకులందరి వలెనే - తనయుడైన దశరథ మహారాజును తన తండ్రిగా వరించాడు. దానితో "పితా పుత్రేణ పితృమాన్ యోని యోనౌ" జగత్పిత ప్రతి అవతారములో కూడ తన పుత్రులనే (లోకులనే) తండ్రిగా కలిగి ఉంటాడు"అనే వేద వాక్కు

అప్పుడు సార్థకమైంది.

దశరథుడు నియమబద్ధంగా చేసే "పుత్రకామేష్టి" నిర్విఘ్నంగా పూర్తి అయింది. దేవతలందరు తమ హవిర్భాగాలను గ్రహించిసంతుష్టులై తమ తమ స్థానాలకు వెళ్లారు.

యజ్ఞకుండము నుండి జాజ్వల్య మానములైన మంటల మధ్యలో నుండి ప్రియురాలిని పదిలంగా పట్టుకొన్నట్లు ప్రాజాపత్యపురుషుడు పాణిద్వయముతో పాయస పాత్రను పట్టుకొని ప్రత్యక్షమయ్యాడు. తమయాగము తక్షణమే సఫలమైనందుకు సంతసించి దశరథాదులు ఆయజ్ఞపురుషునికి స్వాగతము పలికారు. దశరథ మహారాజుకు ఆ మహాపురుషుడు దేవ నిర్మితమైన పాయస పాత్ర నందించి అది ఆయురారోగ్య వర్థకమని సంతాన సంపత్కరమని దానిని తన ప్రియపత్నులతో భుజింపజేయుమని చెప్పాడు. నిర్ధనునికి మహాధనము లభించినట్లు మహానంద భరితుడై ఆ మహారాజు ఆయజ్ఞపురుషునికి ప్రదక్షిణాభివాదములు చేసి ఆ పాయస పాత్రను గైకొని అంతఃపురానికి వెళ్లాడు.

కౌసల్యా దేవికి (పట్టపు రాణికి) సగము, మధ్య భార్య సుమిత్రకు అరణాల (మధ్య) భాగము, చిన్న భార్య కైకేయికి రెండణాల చిన్న భాగము పాయసమును పంచాడు ఆ పృథివీపతి.

శ్రీరామాయణము పాయస విభాగము ద్వారా మనకొక సందేశమిస్తోంది. "ఆప ఏవ ససర్జాదౌ -తాసు వీర్యమపాసృజత్'అంటుంది. వేదము "మొదట జగత్పతి జలాలను సృజించి అందులో తన వీర్యాన్ని నింపాడు."అని వివరిస్తుంది శృతి.

జలానికి "పయస్సు"అని కూడ పేరు ఉంది. దశరథునికి ఆపయస్సే భగవద్వీర్యభరితమై పాయసమైంది. కనుక పాయసమంటే భగవచ్ఛక్తి. దశరథుడు తన ముగ్గురు స్త్రీలకు ఆపాయసాన్ని పంచాడు. ఆస్త్రీలు త్రిగుణాలకు ప్రతీకలు.

దశరథుడంటే దశేంద్రియాలలో మనోరథమును పరుగెత్తించే మనవంటి వ్యక్తే - ఆయన పాయసాన్ని పంచిన పద్ధతిని వాల్మీకి ఈ విధంగా వర్ణించాడు.

"కౌసల్యాయై నరపతిః పాయసార్థం దదౌతదా

అర్థాదర్థం దదౌచాపి - సుమిత్రాయైనరాధిపః॥

కైకేయ్యై చావశిష్టార్థం - దదౌపుత్రార్థకారణాత్

ప్రదదౌ చావశిష్టార్థం -పాయసస్యామృతోపమం

అనుచింత్య సుమిత్రాయై -పునరేవ మహీపతిః,

ప్రథమ ధర్మపత్ని, పట్టుపురాణి అయిన కౌసల్యాదేవికి పాయసార్థము పంచబడింది. ధర్మబద్ధంగా మిగిలిన సగములో సగము అంటే పావుభాగాన్ని మధ్య భార్య సుమిత్రకిచ్చాడు. మిగిలిన పావు భాగాన్ని తనప్రియ పత్ని కైకేయి కివ్వాలను కొన్నాడు. కాని మధ్య భార్య సుమిత్ర మళ్లీ కైకేయి ప్రక్కకు వచ్చినిలుచొని ఉంది. దశరథుడు ధర్మమాలోచించి (అనుచింత్య)పావు భాగము పాయసంలో సగము కైకకు మిగిలిన సగము మళ్లీ సుమిత్రకొసగాడు. పెద్ద భార్యకు పెద్ద భాగము, మధ్య భార్యకు మధ్యభాగము -తనకిష్టమైనదైనా చిన్న భార్యకు చిన్నభాగము లభించింది. ప్రసాద రూపంగా మనకు లభించిన భగవచ్ఛక్తిని ప్రపంచంలో మన మెలా వాడుకోవాలో పాయస విభాగ విధానం ద్వారా వాల్మీకి మనకు తెలిపాడు.

దశరథుని ముగ్గురు స్త్రీలు త్రిగుణాలకు ప్రతీకలని చూచాము కదా.

అందులో కౌసల్య సత్వగుణానికి ప్రతీక. "సత్వాత్ సంజాయతే జ్ఞానం" సత్వగుణము వలన జ్ఞానము కలుగుతుంది. కౌసల్యాదేవి వలన జ్ఞానస్వరూపమైన పరమాత్మ శ్రీరాముడుగా జన్మించాడు. ఆమెకు పాయసార్థము పంచబడింది.

మనము కూడ ప్రసాద రూపమైన భగవచ్ఛక్తిలో సగము జ్ఞానార్జనకైవినియోగించాలి సత్వగుణమే మొదటి గుణము అర్థభాగార్హమైనది.

త్రిగుణాలలో మధ్యగుణము రజోగుణము. ఇది అహంకార రూపమైనది. ఇది కొంత సత్వానికి, కొంత తమస్సుకు మధ్యలో ఉంటుంది. సుమిత్ర కౌసల్యా కైకేయిల మధ్యపత్ని

"రజః కర్మణి భారత" - రజోగుణము కర్మలను చేయడానికి అవసరమవుతుంది. సుమిత్రరజోగుణ ప్రతీక.

సుమిత్రకు నిజానికి కైకేయితో మైత్రిలేనేలేదు. ఆమెకు కౌసల్యాదేవితోనే అనన్య మైత్రి ఉంది. అందుకే ఆమె మంచి మిత్రురాలును కలిగిన "సుమిత్ర" -ఆమె వలన కలిగిన లక్ష్మణ శత్రుఘ్నులు భగవద్భాగవత కైంకర్యమనే సత్కర్మపట్ల సదాసక్తిగలవారు. జ్ఞానార్జన తరువాత -శుభకర్మాచరణకే అధిక భాగము భగవచ్ఛక్తి నుపయోగించాలి. అందుకే సుమిత్రకు ఆరణాలపాయసము లభించింది.

"ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవచ"

తమస్సు ప్రమాదమోహాలను, అంతిమంగా అజ్ఞానాన్ని కలిగిస్తుంది.

కైక తమోగుణప్రతీక. ఆమె దశరథునికి మోహావేశాన్ని కలిగించింది. ఆమె 'క+ఏక'కైక -భోగమాత్ర పరాయణ తనభోగము పట్ల మోహాన్ని దశరథునికి కలిగించి ఆయన ప్రమాదానికి తాను కారణమైంది.

అంతేకాదు - జ్ఞాన స్వరూపుడైన శ్రీరాముని దూరముగా తరిమి వేయించి - దశరథునికి జ్ఞానదూరమైన అజ్ఞానాన్ని కలిగించింది. ప్రపంచసౌఖ్యము పరమాత్మను దూరము చేస్తుంది. కైకేయి రాముని దూరము చేసింది.

అటువంటి తమోగుణజన్యమైన సంసారసౌఖ్యానికి చాల చిన్న (రెండణాల)భాగము భగవచ్ఛక్తిని వాడుకోవాలి. ఇది మన కందాల్సిన. శ్రీరామాయణ సందేశము.

దశరథుని ధర్మపత్నులు ముగ్గురు తమ గర్భాలలో విష్ణుతేజాన్ని ధరించి దిన దిన ప్రవర్థమానులు కాసాగారు.

అశ్వమేథయాగముతో తన పాపాలను పటాపంచలు చేసి కొన్న దశరథుడు -ఋష్యశృంగ ప్రసాదఫలంగా పుత్రకామేష్టిని సఫలంగా పూర్తి చేసికొన్నాడు.

"ఋషయః క్రాంతదర్శినః" అపూర్వమైన క్రాంతిని దర్శింపగల మహానుభావులు మాహర్షులు. వశిష్ఠాది మహర్షులు అటువంటి అపూర్వదర్శినులే. అశ్వమేధ యాగా చరణ ద్వారా వారి ఆశీర్వాదము లభించింది ఆ అవనీపతికి.

ఆమహర్షుల అభిప్రాయము ప్రకారమే ఋష్యశృంగ మహర్షిప్రసాదము పుత్రకామేష్టి పాయస రూపంగా పరిణమించింది. ప్రత్యక్షములైన ప్రపంచ సౌఖ్యములకు అతీతంగా భగవత్తత్వమును అపూర్వంగా గ్రహింపగలిగిన భాగవతోత్తములే వశిష్ఠాది ఋషులు - వారి ప్రబోధముతో భవనిస్పృహ, ఏర్పడుతుంది.

కాని అంతటితో ఊరుకోక మనము భగవత్ స్పృహను కలిగించుకోవాలి. అందుకు ఆచార్య సమాశ్రయణమే మనకు ఆచరణీయము.

"సత్ సంగాత్ భవనిస్పృహో -గురుముఖాత్ శ్రీశం ప్రపద్యాత్మవాన్"

సజ్జన సాంగత్యము వలన సంసారవైముఖ్యము - వైరాగ్యము కలుగుతుంది. వారి ప్రబోధముతో గురువును కొలువడం, తద్వారా శ్రీశప్రాప్తి కలిగి, ఆత్మవంతుడు కావడం జరుగుతుంది.

ఋషులలో శృంగాయమానుడు ఋష్యశృంగుడు. ఆయన మహర్షిశ్రేష్ఠుడు. ఆయనే భాగవతోత్తములలో శిఖామణి అయిన ఆచార్యుడు. ఋష్యశృంగుని - యాజకునిగా వరించడమే ఆచార్య సమాశ్రయణము.

ఋష్యశృంగ ప్రసాదముతో పుత్రకామేష్టి సఫలమైంది. మనకు కూడ మహాత్ముడైన ఆచార్యుని మహాప్రసాదముతో మన "పుత్రకామేష్టి'ఫలవంతమవుతుంది.

"పుత్రకామేష్టి"అంటే పుత్రుడు కలుగాలనే (కామంతో)కోరికతో చేసే ఇష్టమైన (యాగము) భగవదారాధనము

పుత్రుడంటె ఎవరు? "పుత్" అనే నరకాన్నుండి దాటించే వాడు. పుత్రజననంతో పున్నామ నరకం తొలిగి పోతుందని శాస్త్రము వివరిస్తుంది. "నృ"హింసాయాం"అనే ధాతువును బట్టి నరకమంటే హింసా నిలయము. బాధలకు పుట్టిల్లు.

పుత్రుడు ఒకే పున్నామ నరకాన్నుండి దాటింపగల్గుతాడు. కాని నరకమంటే అదొక్కటే కాదు. గర్భ, జన్మ బాల్య, వ్యాధి, జరా విపత్తి, మరణాలని

నరకాలు ఏడున్నాయని శాస్త్రము వివరిస్తుంది. వాటన్నింటినుండి ఏపుత్రుడైనా తరింపజేయగల్గుతాడా? లేదు. ప్రపంచములో ఏపుత్రుడు అంతటి సమర్థుడు కాదు.

పుత్రుడు మరొక్క పనిచేస్తాడు. నిస్సహాయస్థితిలో పోషిస్తాడు, ఆదుకొంటాడు నిజానికి ఏపుత్రునిపై తమ భారాన్నంతటిని మోపి నిర్భరులుగా తల్లిదండ్రులు తమ జీవితాలను హాయిగా గడుపగల్గుతారు?సర్వసమయాలలో, సర్వవిధాల, సర్వజనులను సర్వ(సప్త) విధ నరకాలనుండి సంతరింపజేయగలవాడు, సర్వభారాలను తానే వహించి సంరక్షింపగల సర్వసమర్థుడైన "పుత్రుడు"నిజంగా భగవంతుడే. అందువలన నిజంగా "పుత్రకామేష్టి"అంటే పరమాత్మ(పుత్రుడు) కావాలనే కోరికతో (కామంతో) చేసే సత్కర్మ.

ఇంకొక ముఖ్యవిషయము సాధారణంగా స్వర్గమంటే సౌఖ్య నిలయమనే భావన ప్రపంచంలో ఉంది. కాని ఆ ఆలోచన కూడ సత్యము కాదు.

స్వర్గ ప్రాప్తి కొరకు"జ్యోతిష్టోమాది"సాయాసములయిన సత్కర్మలను ఆచరించాలి. ప్రయాస ఫలితంగా లభించిన ఆస్వర్గము శాశ్వత సౌఖ్యప్రదమా?కాదు -పుణ్యము ఉన్నంత వరకే స్వర్గ భోగము.

"క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి"

పుణ్యక్షయము కాగానే భూమిపైకి తిరిగి రాక తప్పదు.

పోనీ స్వర్గ వాస కాలంలోనైనా సౌఖ్య ప్రాప్తి సంపూర్ణంగా ఉంటుందా?అది కూడ పూర్తిగా లభించదు.

స్వర్గవాసుల సమక్షంలోనే క్షీణపుణ్యులను "ధ్వస్త"అని స్వర్గాధికారులు స్వర్గం నుండి మెడలు పట్టిక్రిందికి నెట్టివేస్తారు. దానివలన స్వర్గవాసుల మనస్సులలో కూడ పతన భీతి ప్రారంభమవుతుంది. ఆ భీతితో అనుభవించే ఆనందము మాత్రము ఏమంత హాయినికలిగిస్తుంది?

అందువలన ఆయాస బహుళసాధ్యమై, అల్పాస్థిర ఫలదమై, భీతావహమయిన అమరావతీ నగర సౌభాగ్యము కూడ పాపానుభముతో సమానమైనదే.

అందువలననే "పుణ్యం పాపత్తో౽డొక్కుం"పుణ్యము కూడ పాపప్రాయమైనదే అని లోకగురువులు సెలవిస్తారు.

కనుక బాధావహములయిన పాపములను, స్వల్పాస్థిర భీతావహములైన సౌఖ్యములను కలిగించే పుణ్యములను లేకుండా చేసికోవాలంటే ఏమి చేయాలి?పాపమంటే ఎలా ఒక మరకో -పుణ్యాము కూడ ఒక మరకే. పాపము బొగ్గుమరక అయితే పుణ్యాము సున్నపు మరక.

బుద్ధిమంతుడు పుణ్యాపాపములనే ఈ రెండు రకాల మరకలను కడిగి వేసుకోవాలనుకుంటాడు.దానికి మార్గమేది. భగవచ్ఛరణాగతి ఒక్కటే పుణ్యాపాపనివారణ మార్గము.

"విద్వాన్ పుణ్యాపాపే విధూయ, నిరంజనః పరమం సామ్యముపైతి"

పరమాత్మ ప్రాప్తితో ప్రాజ్ఞుడైన జీవాత్మ పుణ్యాపాపములను పోగొట్టుకొని, ఏ మరకలు లేని వాడై సంపూర్ణ భగవదానందాన్ని శాశ్వతంగా పొందుతాడు.

అటువంటి అసాధారణ మహానంద ప్రదమైన పరమ పదాన్ని కృపజేసే పూర్ణ పురుషడనే పుత్రుని పొందాలనే కోరికతో ఆచార్య ముఖప్రీతి కరములైన సత్కర్మలను అనుష్ఠించడమే నిజమైన పుత్రకామేష్టి.

పుత్రకామేష్టియాగ నిర్వహణలో మరొక విషయము ముఖ్యమైనది. దేవతలు బ్రహ్మనుముందు ఉంచుకొని దేవ దేవుని ఆశ్రయించి అభయము పొందారు కదా!

ఆ దేవతలతో మనకేదైనా అనుబంధము ఉందా? ఉంది.

మన మనస్సే ఒక యజ్ఞవేదిక. సురులంటే "సురా (లా)తీతి సురః" మంచిని గ్రహించేవారు. అందువలన మంచినిగ్రహించే మన దివ్య ఆలోచనలే దేవతలు వారికి నాయకుడు బ్రహ్మ మన సదాలోచనలను నడిపించేనాయకుడు బుద్ధి దేవతలు బ్రహ్మపురస్సరంగా ఆశ్రయించింది, ఆదేవుడైన శ్రియః పతిని. మన బుద్ధి కూడ మనసదాలోచనలను నడుప వలసింది. పరమ పదమార్గం వైపు. మనను చేర్చుకోవలసింది. ఆశ్రియఃపతే. రావణుని వంటి అహంకారాన్ని (విరోధిని)నిర్మూలించి అభయమొసగే వాడుఆ శ్రీమన్నారాయణుడే.

ఇతిశం

శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# XIV. దేవతల సృష్టి

పుత్రకామేష్టి యాగహవిర్భాగాలను స్వీకరించిన దేవతలు శ్రీమహావిష్ణువు ద్వారా రావణ భయాన్నుండి అభయము పొందారు. అప్పుడు పితామహుడైన బ్రహ్మదేవుడు దేవతలతో, "ఆదితేయులారా!మీరు కూడా మీమీ అంశలతో, అవతార సమయములో భగవంతునికి రావణ వధ అనే లోకకల్యాణ కార్యక్రమంలో చేయూతనివ్వడానికి - బలవంతులైన పుత్రులను అప్సరో భామినులయందు, వానరయోనులయందు కనండి"అని ఉపదేశించాడు. దేవతలు, మునులు, సిద్ధ విద్యాధరులందరు అందుకు అంగీరించారు.

ఇంద్రుడు వాలిని సృజించాడు సుగ్రీవుడు సూర్యపుత్రునిగా జన్మించాడు. బృహస్పతి తారుని, కుబేరుడు గంధమాదనుని, విశ్వకర్మ - నలుని, అగ్నిదేవుడు నీలుని, అశ్వినీ దేవతలు మైంద ద్వివిదులను, వరణుడు సుషేణుని, పర్జన్యుడు శరభుని పుత్రులుగా పొందారు.

వాయుదేవుడు-మహాబలసంపన్నుడు, -శ్రీసీతారామానుగ్రహ పాత్రుడైన అంజనేయస్వామిని కన్నాడు. బ్రహ్మదేవుడు స్వయంగా జాంబవంతుని ప్రభవించాడు.

ఈ విధంగా దేవతాంశలతో కామరూపులు, మహాబలోపేతులైన వానరులు, భల్లూకవీరులు శ్రీరామకైంకర్యము కొరకు జన్మించారు.

దేవతలు మనదైవీ సంపదకు సంబంధించిన దివ్య ఆలోచనలకు సంకేతము.

దేవతలు శ్రీరామునికి కైంకర్యము సమర్పించుకోవడానికి బ్రహ్మదేవుని ఆజ్ఞతో ఆయా శరీరాలతో తమ సంతానాన్ని సృష్టించారు.

మన పవిత్ర ఆలోచనలు-ఆలోచనల వరకే మిగిలి పోకుండా - అవి శుభ కర్మాచరణ రూపంలోకి రావాలి. మన ఆలోచనలు శుభకర్మలను సమాచరించడమే దేవతలు సంతానాన్ని కనడం.

దేవతలు సంతానాన్ని కన్నది శ్రీరాముని సేవకొరకు. మనము చేసే శుభకర్మలు కూడా ఏదో ప్రతి ఫలాపేక్షతో చేసినవి కాకూడదు. శ్రీరాముని ప్రీతి కొరకే చేయాలి.

దేవతలు సంతానాన్ని పొందింది వానర భల్లూకాది దేహాలలో. కాని కేవల దేవతాది ఉన్నత శరీరాలలో కాదు. అలాగే మనము కూడ భగవత్కైంకర్య రూపంగా (శుభ)కర్మలను చేయడానికి మనకు దేవతాది శరీరాలే అక్కరలేదు. ఉన్నత జన్మలే అవసరము లేదు. నీచోన్నత భేదములు లేకుండా భగవత్సృష్టిలో ప్రతిప్రాణి కూడ భగవదారాధనకు అర్హమైనదే. ఇది దేవతా సృష్టి మనకందించే ముఖ్యసందేశము.

ఇతిశం

శ్రీరామాయనమః

శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# XV శ్రీ రామావతారము

*(:-5వ త్రేతాయుగంలో విళంబిచైశు. 9బుధ వారం)*

"త్రేతాయుగే పంచమేతు -రాజాదశరథోz నఘః

పుత్రార్థం హయమేధేన -యష్టుం సముపచక్రమే "- "శ్రీరంగమాహాత్మ్యే

పుత్రకామేష్టి జరిగి సంవత్సర కాలము పూర్తి అయింది. దశరథ పత్నులు ద్వాదశ మాసాలు మహానందంగా విష్ణుతేజాన్ని భరించారు

"తతస్తు ద్వాదశేమాసే -చైత్రే నావమికే తిథౌ

నక్షత్రే zదితి దైవత్యే -స్వోచ్ఛ సంస్థేషు పంచసు

గ్రహేషు కర్కటే లగ్నే -వాక్పతావిందునా సహ

కౌసల్యాz జనయద్రామం -సర్వ లక్షణ సంయుతం"

తమ గర్భాలలో శ్రీరాముని వంటి పుత్రులు కలుగాలనే కోరిక గల తల్లులు - తమ గర్భధారణను ఒక తపస్సుగా భావించాలి. కౌసల్యా, కైకేయి, సుమిత్రలవలె ద్వాదశ మాస (దీర్ఘ)కాలమైనా గర్భములను ఓపికతో ఆనందంగా భరించాలి. విలంబి కనుక అవతార విలంబము అనగా ఆలస్యము. ఆలస్యమైనా అమృతప్రదమైంది. కనుక 12నెలల గర్భము కూడ స్త్రీలకు ఒక శాపమను కోకూడదు. మాతృత్వము ఒక వరమని భావించుకోవాలి.

ధర్మవీరులైన ప్రజలను సమాజానికి అందించే సౌభాగ్యము తమకు ఉందని తల్లులు సంతోషించాలి. భారతదేశమెంత గొప్పదేశము? కౌసల్య, దేవకి, అదితివంటి భగవన్మాతలను కల్గిఉన్న ధార్మిక ధరణి మన జన్మ భూమి.

శ్రీరాముడవతరించినది 5వ త్రేతాయుగములో .హేవిలంబిలో పుత్రకామేష్టి విలంబిలో అవతారం "కాల ప్రకాశిక".

***శ్రీరాముడవతరించిన పవిత్రమాసము చైత్రము*** :- భక్తుల పుణ్యామే అయిన శ్రీరామచంద్రుని వలె -వసంతే వసంతేయజేత"అన్నట్లు పవిత్ర

కార్యములను చేయుటకు తగిన పుణ్యమాసము చైత్రము "చైత్ర శ్రీమాన్ అయం మాసః పుణ్యః"

ఈ సృష్టి సర్వస్వానికి ఆదిపురుషుడు శ్రీరాముడు. చైత్రము ఆది మాసము.

. శ్రీరాముడు పుంసాం మోహన రూపుడు. సర్వప్రాణి మనోహరమైన వసంతమునకు ఆలవాలము చైత్రము.

'పుష్పిత కాననః' చైత్రము శ్రీరామునికి త్రోవచూపే స్వభావం కలది. ఆ పరమ పురుషుడు పట్టాభిషిక్తుడై సకల ప్రాణి సార్వభౌముడు అయి రాజ్యరత్న కిరీటము ధరించాలనే కోరికతో తాను ముందుగానే సకలావనీ వనాలలో పూచిన పూలతో కిరీటమును చేసికొని ముందుగానే ధరించింది.

పక్షము శుక్లము:- తమస్సును దూరం చేసే చల్లని తెల్లని వెన్నెలకు నెలవైనది. సకల జనమనములలో సత్వగుణాన్ని ఉద్బుద్ధం చేసే సిత పక్షమది.

శ్రీరాముడు శుద్ధ సత్వమయుడు. ఆయన తన మనస్సులోనే కాదు, మన మనస్సులలో కూడ రజోగుణ తమోగుణములను అణచివేసి సత్వగుణమును అభివృద్ధి చేసేవాడు.

తిథి నవమి:- నవమి తొమ్మిదవ తిథి - సంఖ్యలన్నిటిలో తొమ్మిది పెద్దసంఖ్య.

శ్రీరాముడు స్వయంగా శ్రీమహావిష్ణువే దేవతలందరిలో పెద్దవాడు విష్ణువు "విష్ణుః పరమః"అంటుంది వేదము.

విష్ణు స్వరూపమే కాదు శ్రీరాముని అవతార స్వరూపము కూడ సకల దేవతలకు పూజనీయమైనది.

"కస్యబిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే "అనునట్లు శ్రీరాముని కనులు కొంచెము ఎరుపెక్కితేచాలు సకల దేవతలు గడ గడ వణకవలసిందే. వారము బుధవారము. బుధుడు ఒక శుభగ్రహము అలాగే ఆరోజు అవతరించిన శ్రీరాముడు -తాను స్వయంగా సజ్జనుడేకాదు. సకల 1. నవమి అంటే క్రొత్తది - కలిగించేది.

సజ్జన సంరక్షకుడు శ్రీరాముడు పరమాత్మ. 2.విష్ణుస్వరూపమే కాదుకుపైనతనను ఆశ్రయించిన వారికి క్రొత్తగా ఐశ్వర్య స్వర్గకైవల్య

లాభాలనేకాదు అత్యంత అపూర్వమైన పరమ పద సంపదను కూడ ప్రసాదించగల ఉదారుడాయన.

నక్షత్రము పునర్వసు:-చేజారిన సంపదను (వస్తువును)పునః మన చేతికి అందించే స్వభావము కలది. "అదితి" ఈ నక్షత్రానికి అధిదేవత. దైత్యపుటాలోచనలను నిష్ఫలంచేస్తుంది. కైక మూలంగా తనకు చేజారిన రాజ్యలక్ష్మిని పదునాల్గు సంవత్సరాల అరణ్యావాసము తరువాత తిరిగి అందుకొన్నాడు శ్రీరాముడు.

మనకు కూడ ఈ సంసారారణ్యములో అనేక సంవత్సరాల నివాసము తరువాత మన బాధలన్ని తొలగించి, మనకు అయోధ్య (భగవత్ స్థానము) (పరమ పద) సంపదను అందించే ఆశ్రిత రక్షాదీక్షుడా స్వామి.

పంచ సుగ్రహముల సుస్థితి:-ఒక్క సుగ్రహము ఉచ్ఛ స్థితిలో ఉంటే సర్వారిష్టాలు తొలిగి పోతాయి. రెండు సుగ్రహాలు ఉంటే సామంతపదవి లభిస్తుంది. మూడు ఉంటే స్వతంత్ర రాజపదము -నాల్గు ఉంటే చక్రవర్తిత్వము, అయిదు ఉంటే లోక నాయకత్వము లభిస్తాయి.

**1.** సూర్యుడు

చైత్రమాసమే మేషమాసము, ఈనెలలో సూర్యుడు మేషరాశిలో అంటే స్వస్థానములో, ఉచ్ఛస్థానములో శుభకారిగా ఉంటాడు బుధుడెప్పుడు రవిని ఆశ్రయించే ఉంటాడు. అందువలన రవి, బుధులు ఉచ్ఛస్థితిలో ఉన్నారు.

**2.** కర్కాటక లగ్నము చంద్ర, బృహస్పతులకు ఉన్నత దశ అందువలన వారిద్దరు శ్రీరామ జనన సమయంలో శుభకరులుగా ఉన్నారు. అంతేకాదు విలంబిలో గురువు కర్కాటకము రాశిలో ఉన్నాడు.

**3.** మేషరాశికి (జన్మరాశికి)**12**వ ఇంట మీనరాశిలో శుక్రుడు, ఉన్నాడు. పన్నెండవ స్థానములో శుక్రుడు శుభప్రదుడు. కర్కాటక మునకు (లగ్నానికి) **9**వ స్థానము కూడ మీనమే. **9**వ స్థానములో కూడ శుక్రుడు శుభదుడే.

**4.** తులలో శని **- 7**వ స్థానములో ,

ఈవిధముగా రవి, బుధులు, చంద్ర, గురువులు, శుక్రుడు ఉచ్ఛస్థితిలో ఉండి లోకనాయకత్వము కల్గించే వారుగా ఉన్నారు.

లగ్నము అభిజిత్ -మేషము ఉదయలగ్నము -దానికి నాలుగవ లగ్నము కర్కాటకము. నాలుగవ లగ్నాన్ని అభిజిల్లగ్నము అంటారు. అభిజిత్తు సర్వదోషనివారిణి

అభిజిల్లగ్నములో అవతరించిన రామభద్రుడు స్వయంగా దోషశూన్యుడు. అంతేకాదు మన సకల దోషాలను పోగొట్టే దయాస్వభావము కల స్వామి.

"కౌసల్యా శుశుభే తేన-పుత్రేణామిత తేజసా

యథా వరేణ దేవానాం అదితి ర్వజ్రపాణినా"

శ్రీరాముని గన్న కౌసల్యాదేవి -ఇంద్రుని గన్న అదితి వలె ప్రకాశించిందట.

ఇక్కడ ఈ ఉపమానము స్వామికి సరిపోయినట్లు కనపడదు. ప్రతిక్షణము తనపదవికి ఎక్కడ ప్రమాదము కలుగుతుందో అని నిరంతర భయభీతుడైన ఇంద్రుడెక్కడ?సకల ప్రాణి జనులకు అభయప్రదాత అయిన శ్రీరామచంద్రస్వామి ఎక్కడ ?(అభయం సర్వభూతేభ్యో -దదామ్యేతద్వ్రతం మమ)

శ్రీరామచంద్రుని కన్న కౌసల్యాదేవి వామనుని గన్న అదితి వలె శోభించింది అన్నా సరిపోయే దేమో?

అయితే వాల్మీకి కవీంద్రుని వాక్కులను తప్పు పట్టే అవకాశమే లేదు. ఇంద్రుడు సుప్రసిద్ధ దేవత త్రిలోక పాలకుడు. ఇంద్రభోగములు అపరిమితములు.

అందువలననే ఇంద్రునితో అదితివలె -శ్రీరాముచంద్రునితో కౌసల్య విరాజిల్లిందని వాల్మీకి వచస్సు వెలువడింది హీనమైనప్పటికి సుప్రసిద్ధ మగుటచేత -ఇంద్రునితో శ్రీరామచంద్రస్వామికి సామ్యము చెప్పబడింది. ఇంతకు పరమాత్మను గురించి వర్ణించడానికి తగిన ఉదాహరణము లోకంలో ఉండగల్గుతుందా? అందుకే అందిన ఉదాహరణంతో స్వామిని వర్ణించడం జరుగుతుంది.

పునర్వసు తెల్ల వారి పుష్యమీ నక్షత్రంలో భరతుడు జన్మించాడు పుష్యమి అంటే పోషించేది. భరించడానికి శక్తి నిచ్చేది. ఆనక్షత్రంలో అవతరించినందుకే భరతుడు"భరణాత్ భరతః"రాజ్యాన్ని, రామ విశ్లేషదుఃఖాన్ని భరించి "మహాత్మ"డయ్యాడు.

మరునాడు ఆశ్లేష నక్షత్రంలో సుమిత్ర -లక్ష్మణ, శత్రుఘ్నులను ప్రసవించింది -ఆశ్లేష సంశ్లేషను కలిగిస్తుంది.

కౌసల్యకిచ్చిన తరువాత ఇచ్చిన పాయసాంశతో లక్ష్మణుడు, కైకేయికి ఇచ్చిన తరువాత ఇచ్చిన, పాయసాంశతో, శత్రుఘ్నుడు సుమిత్రకు జన్మించారు. అందువలననే లక్ష్మణునికి శ్రీరామునితో, శత్రుఘ్నునికి భరతునితో సంశ్లేష ఏర్పడింది.

కాలప్రకాశికలో:-

ప్రమాది, ఖర, శోభకృద్రాక్షస, ప్రభ వేమ, ధనుర్గురుః

ప్రమాద్యాదివర్షాణాంతు యథాక్రమాత్

కుంభి, కర్కి, ధను, ర్మేష, కన్యారాశౌశని క్రమాత్,

ఖరలోధనుస్సులో గురువు

8సం.లకు విళంబి సం.లో కర్కాటకంలో గురువు.

ఇతిశరీ

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

# XVI. నామకరణము

భగవంతుడు పరమోదారుడు. ఆయన ఆర్తులకు, జిజ్ఞాసువులకు, అర్థార్థులకు, జ్ఞానులకు - అందరికి కూడ వారి వారి కోరికలను పూర్తిజేస్తాడు, అట్లావారి వాంఛలను తీరుస్తూ సర్వార్థప్రదాత అయి కూడ తనను గొప్పవాడిగా భావించుకోడు. తనను ఏ ఉద్దేశ్యంతో ఆశ్రయించినా -ఆశ్రయించిన వాళ్లనే గొప్పవారిగా సుకృతాత్ములుగా భావిస్తాడు

"చతుర్విధా భజంతే మాం జనాస్సుకృతినోర్జున"

మన భారతీయ సంప్రదాయములో అతిథులను, అభ్యాగతులను భగవత్స్వరూపులుగా భావిస్తాము. తిథి, వార, నక్షత్రాదులు లేక మన ఇంట్లోకి మనకు తెలియకుండా ఊడిపడి, మనకుశ్రమను కలిగించే వ్యక్తిని, "అతిథి దేవోభవ"అని సంభావిస్తాము.

మన ఆహ్వానమును అంగీకరించి, మన ఇంటికొచ్చిన అభ్యాగతుని "స్వయం విష్ణువు" గా గౌరవించి సపర్యలు చేస్తాము.

భిక్షువులకు కూడ మనమేదైనా ఇచ్చినప్పుడు మనము విసుగుకోము - "అనృశంసమే పరమధర్మమని" భావిస్తాము. మన ఇంటిముందు కొచ్చిన భిక్షువును కృష్ణుడుగా భావించి, ఆయనకు పెట్టిన భిక్షను "కృష్ణార్పణము "అనుకుంటాము.

"ఐయముం, భిక్షయుం, ఆందనైయుం కైకాట్టి", అని గోదమ్మతల్లి తిరుప్పావులో భిక్షువులకు భిక్షను, అతిథి అభ్యాగతులకు ఆదరమును _ఆచార్యులకు సన్మానాన్ని చేతినిండా సమర్పించాలని తెలుపుతోంది.

ఇదే మన భారతీయ సంప్రదాయము అనన్యవిశిష్టత మానవులమైన మనలోనే ఇంతటి మాననీయ గుణం ఉంటే ఇక జగత్పితలోని పరమౌదార్యానికి పరిమితి ఉంటుందా?

దశరథుడు తనకు సంతానం కావాలని మాత్రమే కోరుకొన్నాడు. కాని నలుగురు కొడుకులు కావాలని కోరుకోలేదు. ఒక్క కొడుకు పుట్టినా ఆయన తృప్తి చెందేవాడే.

భగవంతుడు తనకు ఇష్టము వచ్చినప్పుడు మనకు కావలసింది కావలసినంత మాత్రమే ఇచ్చి ఊరుకోడు. ఆయన తానివ్వాలి అనుకొన్నది అనుకొన్నంత వరకు పూర్తిగా ఇచ్చికాని ఊరుకోడు.

దశరథుడు ఒక్క కొడుకుతోనే తృప్తిపడేట్లు ఉండగా భగవంతుడాయనకు కల్పవృక్షము యొక్క నాలుగు శాఖలవంటి, నాలుగు పురుషార్థముల వంటి నలుగురు పుత్రులనిచ్చాడు. ఆపుత్రులెవ్వరో కాదు - తానే నాలుగు స్వరూపాలలో ఆవిర్భవించాడు.

"బహుస్యాం ప్రజాయేయ" అని భగవంతుడు సృష్టికి పూర్వము తాను సకల చరాచరము(లుగా)లలో వ్యాపించాలనుకొంటాడు. అలాగే తానే నాలుగు రూపాలలో దశరథ కుమారులుగా అవతరించాడు. వశిష్ఠుడు దశరథ నందనులకు పదకొండవ రోజుల తరువాత నామకరణం చేయాలని సంకల్పించాడు. "అతీత్యైకా దశాహంతు నామకర్మతథాకరోత్ ॥ 12వ రోజు చైత్ర బ॥ 5సోమవారం నామకరణము.

అప్పుడా నలుగురు పిల్లలను జన్మక్రమాన్ని బట్టి తొట్లెల్లో పరుండబెట్టారు. రామ భరత, లక్ష్మణ శత్రుఘ్నులకు వరుసగా శయనాసనములు సమకూర్చబడ్డాయి.

ఇంతలో అనుకోకుండా ఒక దైవ సంఘటన జరిగింది. తన తొట్లెలో పరుండబెట్టబడిన లక్ష్మణుడు హఠాత్తుగా ఏడ్వడం మొదలు పెట్టాడు. లక్ష్మణుని రోదనానికి కారణం ఎవ్వరికి అర్థము కాలేదు. ఘనవైద్యులు వచ్చి ఆ శిశువును పరీక్షించారు ఎవ్వరికేమి అంతుచిక్కలేదు.

దశరథుడు వశిష్ఠుని రావించాడు. ఆమహాముని లక్ష్మణుని ముఖాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు. ఆయన గొప్ప మనస్తత్వ వేత్త. ఈరోజుల్లో కూడ ఘన వైద్యులకు అంతుబట్టని మహావ్యాధులను మనస్తత్వవేత్తలు **(Psychiatrists)** నయం చేయడం చూస్తునే ఉన్నాము కదా!

లక్ష్మణుడు పడుకోబెట్టినట్లు లేడు. రాముని తొట్లె వైపు మలిగి ఏడుస్తున్నాడు. రాముడు కూడ లక్ష్మణుని వైపు మలిగి చూస్తున్నాడు. ఏడ్వడం, నవ్వడం మనవంతే. పరమాత్మ ఎప్పుడు నిర్వికారంగానే ఉంటాడు కదా. రాముడు అలాగే నవ్వడం, ఏడ్వడం లేక లక్ష్మణుని వైపు చూస్తున్నాడు.

"అన్యో అనశ్నన్ అభిచాక శీతి"

వశిష్ఠుడు రామలక్ష్మణులిద్దరిని పరికించి చూచాడు. ఆమహర్షికి అసలు కారణము అవగతమైంది. రామ లక్ష్మణులిద్దరిని ఒకే తొట్లెలో పడుకోబెట్టుమని ఆమునీంద్రుడు ఆదేశించాడు. ఆశ్చర్యము!లక్ష్మణుడు వెంటనే ఏడ్పుమానాడు. రామలక్ష్మణులిద్దరు పరస్పరాభిముఖులై సుఖనిద్ర చెందారు. "ప్రాజ్ఞేన సంపరిష్వక్తః " అని సుషుప్తిలో జీవాత్మ పరమాత్మల కలయికను శృతి మనోహరంగా వర్ణిస్తుంది.

వాల్మీకి కూడ ఆ పరిస్థితిని ఎంతో కమనీయంగా వ్యాఖ్యానించాడు. "లక్ష్మణో ...... బహిః ప్రాణ ఇవాపరః "లక్ష్మణుడు రామునికి బహిః ప్రాణము. "నచతేన వినా నిద్రాం లభతేచ పురుషోత్తమః "ఆయన ప్రక్కలేకుంటే రామునికి నిద్రేరాదు.

వశిష్ఠుడు నామకరణ సందర్భంగా క్రమాన్నిబట్టి రాముని చూచాడు.

రాముడు:- "రమయతి" రాముడు లక్ష్మణుని దుఃఖాన్ని పోగొట్టి ఆయనను ఆనందపరచాడే. కౌసల్యతో పాటు సుమిత్రా కైకేయిలు కూడ శ్రీరామునే రెప్పపాటు లేకుండా చూస్తు ఆనందిస్తున్నారు. వారికి తమ సంతానంపై ధ్యాసేలేదు. దశరథునికైతే రాముని చూచినప్పుడు కలిగిన ఆనందాన్ని మాటలలోవర్ణించడానికి వీలులేదు. "దృష్ట్వా .......భవామి పునర్యువేవ" అని స్వయంగా శ్రీరాముని దర్శనము తనలో క్రొత్తయవ్వనాన్ని నింపుతుంది అని దశరథుడు తెలుపుతాడు.

***"తేషాం కేతురివ జ్యేష్ఠో రామో రతి కరః పితుః"*** ధ్వజము వలె కులాలంకారుడైన రాముడంటే దశరథునికి మహాసంతోషము "రమయతి సర్వాన్"

ఇంతమందిని ఆనందపరుస్తున్నాడే ఈ బాలుడు అని ఆశ్చర్యచకితుడయ్యాడు మహర్షి. ఒకసారి తనను చూచుకొన్నాడు. తనలో కూడ తనకు తెలియకుండానే రాముడంటే ఆనందం పరవళ్లు త్రొక్కుతోంది. అబ్బురపడ్డాడు వశిష్ఠుడు తనవంటి జితేంద్రియులను కూడ ఆకర్షించి ఆనందాన్ని కల్గిస్తున్నాడే ఈ బాలుడు.

"రమయతి సర్వాన్ జనాన్" జనులందరిని రమింపజేస్తున్నాడు. అంతే కాదు తన వంటి మునులు కూడ ఆయన విషయంలో రమిస్తున్నారు. "రమంతే అస్మిన్ యోగినః" లోకానికంతటికి ఇష్టుడు "ఇష్టస్సర్వలోకస్య"అయినందువలన, అందరికి ఆనందాన్ని కల్గిస్తున్నందువలన పెద్ద పిల్లవాడికి "రాముడు"అని పేరు పెట్టాడు మహర్షి.

లక్ష్మణుడు:- రాముని ప్రక్కలో తొట్లెలో కేరిళ్లు కొడుతూన్న సుమిత్రాతనయుని జూచాడు వసిష్ఠుడు. ఆబాలునికి రాముడంటే ఎంతప్రేమో? ఆయనకు రాముడే పెన్నిధి. క్షణం కూడ రామవియోగాన్ని భరించేట్లు లేడు. "ఓహో! ఎంతటి అదృష్టవంతుడీ బాలుడు"ఎంతటి "లక్ష్మిసంపన్నుడో"! ఈ పిల్లవాడు అని ఆశ్చర్యంతో ఆ కుమారునికి "లక్ష్మణుడు"అని నామముంచాడు. "లక్ష్మనయతీతి"లక్ష్మణః" అని వ్యుత్పత్తి "లక్ష్మ" అనగా చిహ్నము లేక గుర్తు. శేషత్వ, కైంకర్య లక్షణములు గలవాడు లక్ష్మణుడు సేవా లక్షణముకల వాడు లక్ష్మణుడు.

భరతుడు:-మొదట రాముని ప్రక్క తొట్లెలో పరుండబెట్టబడినప్పుడు కైకేయీ తనయుడు ఆనందంగా పడుకొన్నాడు. తరువాత తనకు రామునికి మధ్యలో లక్ష్మణుడు వచ్చి చేరాడు. అప్పుడు కైకేయీ నందనుడు ప్రళయాన్ని సృష్టించలేదు.

లోకంలో కైకేయీ తనూజుని వంటివారు కొందరుంటారు. తమకు ఏదైనా సుఖం కల్గినప్పుడు ఆనందంగా ఉంటారు. ఒక్కొక్కప్పుడు తనకు చేజిక్కిన పెన్నిధిని హఠాత్తుగా ఇతరు లెక్కడి నుండో ఊడిపడిలాగుకొని పోతారు. అప్పుడు తమ నిధి చేజారిపోయినా ఆ బాధను తమలోనే దిగమ్రింగి సహించి ఊరుకుంటారు వారు. భగవత్ నిర్ణయము అలా ఉంటే మనము ఏమి చేయగల్గుతాము అని దుఃఖాన్ని భరించి ఊరుకొంటారు. వారే మహాత్ములు. ఇతరుల పట్ల వారికి అసూయ ఉండదు. భగవంతుని పట్ల అసంతృప్తి ఉండదు.

కైకేయీ కుమారుడు తన ప్రక్క తొట్లెలో రాముడు ఉన్నప్పుడు రాముని ఎలా ప్రేమించాడో, లక్ష్మణుడాయన ప్రక్కలోకి మారినప్పుడు కూడ ఆయన రాముని అంతగానే ప్రేమించాడు వశిష్ఠుడా బాలుని మనస్సును అర్థం చేసికొన్నాడు. ఓహో "ఎంతటి భక్తి భరితుడో" ఈయన అనుకొని ఆ బాలునికి "భరతుడు"అని పేరుంచాడు. "భరణాత్ భరతః" రామభక్తినిండుగా ఉన్నందువలన - రాముడు లేనప్పుడు రాజ్యాన్ని భరించినందున "భరతుడ"నే పేరు సార్థకమైంది.

శతృఘ్నుడు:- ఇక నాలుగో పిల్లవాడిని సమీపించాడు వశిష్ఠుడు మొదట ఆయనకు ప్రక్కతొట్లెలో ఉన్నవాడు లక్ష్మణుడు. లక్ష్మణుని సామీప్యము ఆ

బాలునికంత ఆనందాన్నివ్వలేదు "రామునిపట్ల విడువ జాలని ప్రేమ"లక్ష్మణుడు అయనను ఆకర్షించలేదు.

తరువాత అయన ప్రక్కతొట్లెలో సహనశీలి భరతుడున్నాడు. భరతుని వైపు మలిగిన ఆకుమారుడు ఆనందభరితుడయ్యాడు.

ప్రబల శత్రువువలె అందరిని వశపరుచుకొనే "రామసౌందర్యము" నకు ఆకుమారుడు లోబడలేదు. ఆబాలుని ముఖములో శత్రుభయంకరమైన తేజస్సు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అందువలన ఆయనకు "శత్రుఘ్నుడు" అని నామకరణము జేశాడు వశిష్ఠుడు.

1.వరులలో (ఉత్తములలో)శిష్ఠుడు వశిష్ఠుడు మునులందరిలో శ్రేష్ఠుడాయన. ఆమహర్షి వేద వేదాంగ విదుడు, మంత్రవేత్త, అనుష్ఠానగరిష్ఠుడు, అంతే కాదు.

తన ఇష్టములన్నింటిని తన వశంలో ఉంచుకొన్నవాడు వశిష్ఠుడు. వశిష్ఠుడు మన ఆచార్యుడే. ఆయన ఆర్యులందరిలో శిష్ఠుడు. దశరథుని అభిమతం ప్రకారము ఆయన కుమారులకు వశిష్ఠుడు నామకరణం చేశాడు.

మనకన్న తండ్రి కూడ మనను జ్ఞానానుష్ఠాన పూర్ణుడు, మంత్రవేత్త అయన ఆచార్యునికి అప్పగిస్తాడు తన ఆధీనంలో ఉన్న తనకు అప్పగించబడిన శిష్యునికి ఆచార్యుడు శాశ్వత నామకరణము చేస్తాడు.

ఆపేరు మనకు రావడం వలన భగవంతుని విడిచి క్షణం కూడ ఉండజాలని సీతా లక్ష్మణుల తత్త్వము, ప్రియా ప్రియములను సహింపగల్గిన భరతుని మహత్త్వము, భరతుని వంటి స్థితప్రజ్ఞుని అనవరతము ఆశ్రయించి, దానినే సమ్యక్ సంపదగా భావించి, తద్విరుద్ధమైన కేవల భగవన్మహిమను తృణీకరింపగల్గిన శత్రుఘ్నుని చరమ పర్వమైన పరమభాగవత నిష్ఠ మనలో స్థిరంగా కలుగుతాయి.

మన మీలోకంలో -దుర్లభమైన ఈ మానవ దేహములో జన్మించినందుకు - మనము చేయవలసిన ముఖ్యకృత్యము వశిష్ఠుని వంటి ఆచార్యుని వలన "శాశ్వత (దాస) నామము"పొందడమే. దాని వలననే మనకు పరమ శ్రేయోదాయకమైన భగవత్ భాగవతాచార్య దాస్యము లభిస్తుంది. తద్వారా అపరిమితమైన భగవత్ప్రీతి లభిస్తుంది.

## శ్రీరాముని ఇతర నామాలు:-

శ్రీరామునికి రామభద్రుడు, రామచంద్రుడు అని కూడ ప్రసిద్ధ నామములు ఉన్నాయి.

రామభద్రుడు:- అహిర్బుధ్న్య సంహితలో భద్రనామ విశిష్టత తెలుపబడింది.

"భద్ర శబ్దేన దేవస్య నిత్య నిర్దోషతోచ్యతే"

దుష్టమైన ఈ సకల చరాచర జగత్తులో అణువణువునా వ్యాపించిన భగవంతుడు "తద్గత దోషై రసం స్పృష్టః"అన్నట్లు వాటి దోషములే మాత్రము

అంటకుండా నిత్యము నిర్దుష్టుడై పరమ పావనుడై భద్రుడుగా ఉంటాడు. అటువంటి పరమాత్మ 'ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామి" అన్నట్లు తన దివ్య సంస్థానముతోనే శ్రీరాముడుగా అవతరించాడు. అంతే కాదు భగవంతునిలోని భద్ర లక్షణాలు శ్రీరామభద్రునిలో మరింత ఉజ్వలంగా ప్రకాశిస్తాయి.

"స ఉశ్రేయాన్ భవతి జాయమానః"అన్నట్లు భగవంతుని మూల స్వరూపాన్ని మరింత ప్రకాశింపజేసేది అవతారస్వరూపం. అందుకే అయోధ్యాకాండలో, "బహవో నృప!కల్యాణగుణాః పుత్రస్యసంతితే" అని పౌరులు జానపదులు ఏక కంఠంగా ఉగ్గడించారు, శ్రీరాముని భద్రగుణాలను. శ్రీరాముడు భద్ర (శుభ) గుణుడు.

రాములలో (శ్రేష్ఠుడు) భద్రుడు రామభద్రుడు -పరశు రామ బల రామాదులందరిలో భద్రుడు రామభద్రుడు.

"శుభమంగళ యోర్భద్రం స్యాత్ ద్రవ్య శ్రేష్ఠయోః"

శుభకరములయిన శ్రేష్ఠములయిన ద్రవ్యములను భద్ర శబ్దము నిర్దేశిస్తుంది. శ్రీరామభద్రుడు సర్వశ్రేష్ఠుడు, ఆశ్రితులకు శుభప్రదుడు. "త్వం పావన స్సర్వ లోకానాం "అని అగస్త్య మహర్షిచేత ప్రస్తుతింపబడిన పరమ పావనుడు రాముడు.

**2.** రామచంద్రుడు:- చంద్రకాంతాననుడు రామచంద్రుడు. చంద్రుని వలె (చంద్రవత్ కాంతం) అందమైన ముఖమండలము కలవాడాయన. అంతేకాదు (చంద్రాదపి కాంతం)చంద్రునికంటె అధికమైన అందమైన ముఖ మండలము కలవాడు ఆ "పుంసాం మోహన రూపుడు." స్వయంగా వాల్మీకి మహర్షి ఆరాముని "అతీవప్రియ దర్శనః" అని వర్ణించాడు.

చంద్రునిలో కేవలము సౌందర్యమే కాదు. బుధులకు (దేవతలకు)తన కళల ద్వారా అమృతమయమైన ఆహారాన్ని అందించే ఔదార్యము కూడ ఉంది.

రామచంద్రునిలో కూడ బుధులకు (సజ్జనులకు)తన కళల ద్వారా (నామ, రూప, గుణ, చేష్టితముల ద్వారా)అమృతాన్ని (అమృత స్వరూపమైన ఆహారాన్ని)అందజేసే పరమౌదార్యము ఉంది.

చంద్రునిలో కళలు పదహారు మాత్రమే. రామచంద్రునిలో కళలకు సంఖ్యయే లేదు. "బహవో కల్యాణ గుణాః"అని వాల్మీకి మహర్షికి కూడ రాముని కల్యాణ గుణములకు ఒక సంఖ్యలభించలేదు. అందువలన అనేకములు అని మాత్రమే చెప్పగలిగాడు. అయితే వాల్మీకి అడిగిన గుణాలు పదహారే - ఆ పదహారే ప్రధాన భగవద్గుణాలుగా వాల్మీకి ప్రశ్నించాడు.

అందువలననే చంద్రునికంటే అధికమైన ఆకర్షణ కలిగినవాడు రామచంద్రుడు. చంద్రకాంతాననుడు, అతీవ ప్రియదర్శనుడాయన.

ఇతిశం

# XVII విశ్వామిత్ర మహర్షి

విశ్వామిత్రుడు ఒక మహానుభావుడు. ఒక అసాధారణ వ్యక్తి మానవుడు సామాన్యస్థితి నుండి దృఢ ప్రయత్నంతో ఎంతటి మహోన్నతస్థితికి ఎదుగ గల్గుతాడో స్వయంగా నిరూపించిన లోకాతీతుడాయన.

విశ్వామిత్ర శబ్దానికి రెండు వ్యుత్పత్తులున్నాయి. ఒకటి సాధారణంగా పిల్లలకు కూడ తెలిసిన సవర్ణ దీర్ఘ సంధితో ఏర్పడిన ***"విశ్వ(స్య)అమిత్రంయః సః"*** అనే వ్యుత్పత్తి. దీని అర్థము ఆయన విశ్వానికి అమిత్రుడు లేక శత్రువు.

మరొకటి ఆయన అద్భుత వ్యక్తిత్వాన్ని తెలుపడానికి వ్యాకరణాచార్యుడైన పాణిని మహాశయుడు ప్రత్యేకంగా తెలిపిన "విశ్వ(స్య)మిత్రం" అనే వ్యుత్పత్తి. దీని ప్రకారము విశ్వామిత్రుడు జగత్తుకంతటికి మిత్రుడు.

పాణిని ***"మిత్రేచర్షౌ"*** అనే సూత్రాన్ని ఏర్పరిచాడు. దీని ప్రకారము "విశ్వ "శబ్దము మిత్ర శబ్దముతో కలిసి -ఆ మొత్తము శబ్దము (ఒక)ఋషి వాచకమైనప్పుడు "విశ్వామిత్ర"అవుతుంది.

***"ఋషి సంజ్ఞాయాం విశ్వశబ్దస్య దీర్ఘః"*** అనే నియమము ఏర్పడింది.

ఋషి పేరును తెలుపకుండా "విశ్వ"శబ్దము, " మిత్ర"శబ్దముతో కలిసినప్పుడు ***"విశ్వమిత్ర"*** గానే ఉంటుంది. "విశ్వమిత్ర"అంటే మాణవికుడు లేక బ్రహ్మచారి అని అర్థము.

విశ్వామిత్రునికి ఆయన మొత్తము జీవితాన్ని పరిగణన లోనికి తీసికొన్నప్పుడు రెండు వ్యుత్పత్తులు అన్వయిస్తాయి. మొదట ఆయన విశ్వానికి అమిత్రుడుగానే వ్యవహరించాడు. ఇందుకు రెండు సంఘటనలను ఉదహరింప వచ్చును. 1. వశిష్ఠమహామునికి ఆయనగావించిన మహాపచారము. 2. సత్యచరిత్రుడైన హరిశ్చంద్ర మహీపాలుని పరీక్షించిన విధము.

వాల్మీకి రామాయణంలో మిథిలానగరంలో శివధనుర్భంగానికి ముందు శతానందుడు శ్రీరామభద్రునికి విశ్వామిత్రుని చరిత్ర తెలుపుతాడు. అందులో వసిష్ఠమహామునితో విశ్వామిత్రుడు ఘర్షణ పడిన వృత్తాంతము ఉంది.

వశిష్ఠ మహాముని సన్నిధిలో కామధేనువు "తనూజ" నందిని ఉంటుంది.

ఒక రోజు విశ్వామిత్ర మహారాజు తన పరివారముతో వేటకు వెళ్లి, తిరుగు ప్రయాణంలో వశిష్ఠుని ఆశ్రమానికి ఏతెంచుతాడు.

తన దగ్గర ఉన్న "నందిని" సహాయంతో మహాముని మహారాజుకు, ఆయన పరివారానికి అద్భుతమైన విందుచేస్తాడు. ఆవిందుకు కారణమైన ఆధేనువుపై విశ్వామిత్రుని కన్నుపడుతుంది. "రజసోలోభ ఏవచ" ఎంత ధనాన్నైనా ఇస్తానని - దానికి బదులుగా ఆశబల తనకు తప్పక కావాలని విశ్వామిత్రుడు పట్టుపడుతాడు. ధర్మాత్ముడైన వశిష్ఠుడు దానికి అంగీకరింపడు. ఫలితముగా ఘర్షణ వారిద్దరి మధ్య ఏర్పడుతుంది.

మహర్షి కనుసైగలతో, గోమాత శరీరము నుండి వేలాది సైన్యము బయలుదేరి విశ్వామిత్రుని మొత్తము సైన్యాన్ని నశింపజేస్తుంది. విశ్వామిత్రుని నూరుగురు పుత్రులు యుద్ధానికి ఆహుతి అవుతారు.

విశ్వామిత్రుడెంత ప్రయత్నించినా, అపజయము తప్పక అవమానంతో - ఆయన రాజ్యానికి తిరిగివెళ్లి - ఒక కుమారునికి "రాజ్యపాలనను" అప్పగించి, తపశ్చర్యకై హిమాలయాలకు వెళ్లుతాడు. ఆయన మహా తపస్సుకు మహాదేవుడు సంతసించి - సాంగమైన ధనుర్వేద రహస్యాలను సంపూర్ణంగా అనుగ్రహించాడు.

సకల శస్త్రాస్త్ర సంపత్ గర్విష్ఠుడైన విశ్వామిత్రుడు తిరిగి వశిష్ఠుని ఆశ్రమం చేరుకొని - ఆగ్రహంతో ఆప్రాంతాన్నంతటిని అగ్ని దగ్ధం చేస్తాడు. అప్పుడు బ్రహ్మర్షి -మహాగ్రహంతో బ్రహ్మ దండాన్ని పైకెత్తుతాడు

భయంకర శస్త్రాస్త్రములేవి కాల దండము వంటి బ్రహ్మదండము ముందు నిలువ లేక పోతాయి. చివరకు విశ్వామిత్రునికి బ్రహ్మతేజస్సు యొక్క బలాతిశయాన్ని గుర్తించక తప్పలేదు.

***"ధిగ్బలం క్షత్రియబలం - బ్రహ్మ తేజో బలం బలం "*** క్షత్రియ శక్తి నిర్వీర్యమైనది. బ్రహ్మతేజమే మహాబల సంపన్నమైనదని అంగీకరిస్తాడు. దానిని తాను కూడ సాధించడానికి తపశ్చర్యకై బయలు దేరుతాడు. అన్ని దిశలలో తపస్సుగావించి, అనేక కఠోర పరీక్షలకు నిలిచి బ్రహ్మర్షి పదాన్ని సాధిస్తాడు.

విశ్వామిత్రుడొనర్చిన మరొక అకృత్యము సత్యసంధుడైన హరిశ్చంద్ర మహీపాలుని విషయంలో జరిగింది.

హరిశ్చంద్ర మహారాజు అయోధ్య రాజధానిగ యావత్ భారతాన్ని ఏలుతున్న రోజులవి. ఆయన "సత్యదీక్ష"ఈ భూమండలంలోనే కాదు,లోక లోకాల్లో ప్రఖ్యాతమైనది.

ఒకనాడు వశిష్ఠ మహాముని మహేంద్ర సభలో హరిశ్చంద్రుని "సత్యవ్రతాన్ని"గురించి వివరిస్తుంటాడు. వశిష్ఠుని పై నిరాదరం కల విశ్వామిత్రుడు ఆయన మాటలను ఖండించి తన పరీక్షలకు హరిశ్చంద్రుడు నిలువజాలడని సవాలు చేస్తాడు.

విశ్వామిత్రుని పరీక్షల మూలంగా హరిశ్చంద్రుడు రాజ్యాన్ని కోల్పోతాడు. అర్ధాంగిని అమ్ముకొంటాడు. చివరకు కాటికాపరి అయి కన్న కొడుకు శవాన్ని కాల్చడానికి డబ్బివ్వలేదని, చంద్రమతిని చంపడానికి కూడ సిద్ధపడుతాడు.

బ్రహ్మాది దేవతలు హరిశ్చంద్రుని కఠిన సత్య నిష్ఠకు ఆశ్చర్య చకితులౌతారు. విశ్వామిత్రుడు కూడ ఆయన నియమ నిష్ఠలకు విస్మితుడౌతాడు. అగ్నిలోపుటం వేసిన బంగారానికి స్వచ్ఛత లభించినట్లు -కష్టాల ఒరవడిలోనే మహాత్ముల ఆత్మశక్తి ఆవిష్కృతమౌతుంది.

**॥ప్రాయః స్వం మహిమానం క్షోభాత్ ప్రతిపద్యతే మహాజనః॥**

వశిష్ఠ, హరిశ్చంద్రులతో విశ్వామిత్రుని వైఖరి ఆయన అమిత్రతను మచ్చుతునక.

అయితే ఈ రెండు సంఘటనలతోనే విశ్వామిత్రుని జీవితము ముగిసి ఉంటే ఆయన అద్భుత చరిత్రను అవనీజనులు ఈ నాటికి అత్యంత కృతజ్ఞతతో స్మరించేవారు కాదు.

తానొనర్చిన ఈ రెండు దుష్కృతాలకు పశ్చాత్తప్తుడై విశ్వామిత్రుడు - విశ్వకల్యాణ కారకములైన రెండు అత్యద్భుత కార్యములను నిర్వహించి "విశ్వామిత్రస్తు ధర్మాత్మా "అని విశ్వ విఖ్యాతి నార్జించాడు.

"పుణ్యేన పాపమపనుదతి" అని స్మృతి వాక్యము కదా. వశిష్ఠ మహాముని విషయంలో అజ్ఞానంతో తాను చేసిన మహాపచారాన్ని "గౌతమ మహర్షిని - అహల్యను" కలుపడం ద్వారా రూపుమాపుకొన్నాడు. మనము కావించిన భాగవత మహాపచారాన్ని గుర్తించి, పశ్చాత్తాపము చెంది తిరిగి భాగవతాభిమానాన్ని సంపాదించడం కంటే వేరే మార్గం లేనే లేదు కదా!రెండవది

సూర్యవంశీయులు -శరీరాత్మల వంటి అనన్యదంపతులయిన హరిశ్చంద్ర, చంద్రమతులను వేరుచేసి, ఇక్కట్టుల పాలు చేయడం. విశ్వామిత్రుడు కేవల దురభిమానంతో కావాలని చేసిన మహాపాపమిది. ఈ పాపానికి ప్రాయశ్చిత్తంగా మళ్లీ సూర్యవంశ సంజాతుడైన శ్రీరామచంద్రస్వామిని అయోనిజ అయిన సీతామతల్లితో జతపరచుట. లేక విశ్వ కల్యాణ కారణమైన సీతారాముల కల్యాణాన్ని కావించుట జరిగింది. జీవాత్మ పరమాత్మలయొక్క అపురూప సమాగమాన్ని నిర్వహించడమే సీతారాముల పరిణయ నిర్వహణము.

ఈ రెండు మహాద్భుత సంఘటనల ద్వారా విశ్వామిత్ర సంయమీంద్రుడు విశ్వానికి అపురూపమిత్రుడయ్యాడు.

"విశ్వం మే మిత్రం"అని సగర్వంగా చెప్పుకోదగిన మహోన్నతస్థితి నందిన ఆమహాత్ముని సంస్మరణ సకల దోషాపహారకమైనది.

రజోగుణము వలన మన మనస్సులోని లోభము మనము కోరుకోకూడని విషయాలపట్ల కామాన్ని కల్గిస్తుంది. ఆ విషయాలు మనకు లభించనప్పుడు

"కామేఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః

మహాశనో మహాపాప్మా విధ్యేనమిహ వైరిణం".

ఆకామమే క్రోధంగా మారుతుంది. ఆక్రోధము తీవ్రమైనప్పుడు యుక్తాయుక్త విచక్షణనశించి సమ్మోహమేర్పడుతుంది. దానివలన మిత్రామిత్రుల స్మృతి నశిస్తుంది. దాని వలన బుద్ధి నాశము - తద్వారా వినాశమేర్పడుతుంది. ఇది శబల వ్యామోహితుడైన విశ్వామిత్రునికి వసిష్ఠమునీంద్రునితో ఏర్పడిన అకారణవైర స్థితి మనకందించే సందేశము. కనుక రజోగుణం వలన కలిగిన కామక్రోధాలు మహాపాపములు.

ఒక సజ్జనుడు ఎన్ని దుర్భర బాధలు ఏర్పడినా తన సత్ప్రవర్తన నియమాన్నుండి చలింపడని - అటువంటి మహాత్మునికి - మహామునులు - బ్రహ్మాది దేవతలు సైతము దిగిరాక తప్పదని చంద్రమతీ హరిశ్చంద్ర వృత్తాంతము మనకు తెలుపుతుంది. "ధర్మోరక్షతి రక్షితః" అనే వేద వాక్యము హరిశ్చంద్రుని సత్యదీక్షావిషయములో సార్థకమైనది.

విశ్వామిత్ర చరిత్ర మనకు రెండు విషయాలను బోధిస్తుంది. ఒకటి లోభగుణము వినాశహేతువు. రెండవది భాగవతద్వేషము ప్రబలమైనది. దానివలన ఎంతటి మహనీయుని తేజో బలములయినా నిర్వీర్యములవుతాయి.

శ్రీసీతారామచంద్ర స్వామినే నమః

## *విశ్వామిత్ర తపము - దక్షిణ దిశ*

వశిష్ఠునిపై ఆగ్రహంతో, లోభగుణా విష్టుడై విశ్వామిత్రుడు తపశ్చర్యకై బయలుదేరాడు.

దక్షిణ దిశలో భార్యా సమేతుడై కఠిన తపస్సు కావించాడు. ఆయనకు సత్య ధర్మ పరాయణులైన హవిష్యంద, మధుష్యంద, దృఢనేత్ర మహారథులను నలుగురు పుత్రులు కలిగారు. సహస్ర సంవత్సరాల తపము ద్వారా బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఆయనకు రాజర్షి పదమనుగ్రహించాడు.

కాని విశ్వామిత్రునికి పితామహుని వరము తృప్తి నీయలేదు. అందువలన మళ్లీ తపస్సుకు పూనుకొన్నాడు.

శ్రీరామాయనమః

ఆకాలంలో త్రిశంకు -అయోధ్యాధిపతిగా వసుధను శాసించేవాడు ఆయనకు ఈ మానవ శరీరంతోనే స్వర్గానికి వెళ్ళాలని ఒక విడ్డూరమైన కోరిక ఏర్పడింది. దాని కొరకు యజ్ఞాన్ని ఆచరించాలనుకొన్నాడు.

ఆయన కులగురువైన వశిష్ఠ మహామునిని ఆశ్రయించాడు. ధర్మాత్ముడైన ఆమహాముని త్రిశంకు మహీపతియొక్క అధర్మ వాంఛను అంగీకరింపలేదు. వశిష్ఠుడు కాదన్నాక -మహారాజు వశిష్ఠ పుత్రులను సమీపించాడు. వారు తమ తండ్రి గారి అభిప్రాయాన్నే గౌరవించుమన్నారు. అప్పుడు దురభిమానియైన త్రిశంకు భూపాలుడు -మరొక గురువు నాశ్రయించి అయినా తన మనోరథాన్ని సఫలం చేసికొంటానని తెలిపాడు. వసిష్ఠమారులు కుపితులై ఆయనను 'ఛండాలునివి కమ్మని'శపించారు.

ఆసమయంలో విశ్వామిత్రుడు దక్షిణ దిశలో తపస్సు చేస్తున్నాడు. త్రిశంకువు ఆయనను ఆశ్రయించాడు. విశ్వామిత్రునికి వశిష్ఠమహర్షిపై ప్రతీకార వాంఛ బలంగా ఉంది. అందువలన త్రిశంకువు కోరిక అధర్మమయినా అంగీకరించాడు ఆయన. వశిష్ఠునిపై ఆధిక్యాన్ని సంపాదించడానికి ఇదొక మంచి అవకాశంగా భావించాడు విశ్వామిత్రుడు. ఏదో ఒక ఆచార్యుడు తన కోరిక తీరితే చాలు అను కొన్నాడు త్రిశంకువు. ఎవరి స్వార్థం వారిది.

విశ్వామిత్రుడు తన కుమారులను యాగనిర్వహణకై నియోగించాడు సర్వ ఋషి గణాల సమాహ్వానం కొరకు శిష్యులను పంపి. ఆయా ఋషుల అభిప్రాయాలను, వారి మాటలను యథాతథంగా తెలుపుమన్నాడు.

విశ్వామిత్రునికి భీతులై - ఆయనకోరికపై ఋషులనేకులు యాగనిర్వహణకై ఏతెంచారు. వశిష్ఠుడు, ఆయన పుత్రులు రాలేదు. వసిష్ఠ మహర్షి మర్యాదగా తప్పించుకొన్నాడు. కాని వేడి రక్తంతో ఆవేశ పరులయిన వశిష్ఠ కుమారులు, మహోదయ సహితులై "క్షత్రియుడు యజ్ఞంచేయించడమా? చండాలుడు యజ్ఞంచేయడమా? దేవతలు ఆహవిస్సును అంగీకరించడమా? అని అపహాస్యంతో అధిక్షేపించారు.

విశ్వామిత్రుడు వశిష్ఠ తనయుల ఆక్షేపణను తీవ్రంగా భావించి, ఆగ్రహంతో, వారిని, "శునక మాంసభక్షకులై, వికారులై, సప్తశత జన్మ పర్యంతం శవమాంస భక్షకులై, ముష్టికులై జీవిస్తారని"ఘోరంగా శపించాడు.

మహోదయుడు మమ్ములను అకారణంగా ద్వేషించిన కారణంగా

సర్వలోకనిందితుడై, వ్యాధుడై, బలవంతంగా హత్యలు కావిస్తూ దుర్గతి పాలౌతాడు"అని ఋషిగణ సమక్షంలో కర్కశంగా శపించాడు.

ఋషులందరు మరింత భయగ్రస్తులై విశ్వామిత్రుడు చెప్పిన పనులను చేయసాగారు. సుదీర్ఘ కాలము యజ్ఞము సాగింది. అయినా హవిర్భాగాలను గ్రహించడానికి దేవతలు ఇష్టపడలేదు. అప్పుడా రాజర్షి ఆగ్రహంతో "త్రిశంకూ!ఈ దేవతలు హవిస్సులను గ్రహిస్తే ఎంత?గ్రహింపకపోతే ఎంత?నేనింతవరకు కావించిన మహోగ్రతపః ఫలితముతో నిన్నిప్పుడే స్వర్గానికి పంపుతున్నా"నని పలికాడు. మహర్షులందరు చూస్తుండగానే ఆశ్చర్యకరంగా త్రిశంకు స్వర్గారోహణము జరిగింది. అయితే స్వర్గలోక వాసులయిన దేవతలు త్రిశంకు స్వర్గాగమనాన్ని అంగీకరింపలేదు. తక్షణమే తలక్రిందులుగా పడి పొమ్మని శపించారు. బలవంతంగా ఆయనను నెట్టివేశారు. త్రిశంకువు క్రింద పడుతుండడము ఋషులంతా దర్శించారు.

విశ్వామిత్రుడిలో దురభిమానం మరింత పెరిగింది. పట్టుదలతో త్రిశంకువు పడిపోకుండా మధ్యలోనే నిలిపి, మరొక సప్తర్షి మండలాన్ని వేరొక ఇంద్రుని, ఇంకో స్వర్గాన్ని సృష్టించడానికి సంకల్పించాడు. అప్పుడు మహర్షులు, సురులు ఆప్రయత్నాన్ని విరమింపజేశారు. అయితే అంతవరకు విశ్వామిత్రుడు సృష్టించిన నక్షత్ర మండలము అలాగే ఉంటుందని త్రిశంకువు భూమిపై పడక మధ్యలో అలాగే అమర సన్నిభుడై ఉంటాడని సురులు, ఋషులు అనుగ్రహించారు. విశ్వామిత్రుడందుకు సమ్మతించాడు. అందరు తమ తమ స్థానాలకు వెళ్లి పోయారు. విశ్వామిత్రుని తపస్సు విఫలమైంది. అందుకాయన తీవ్రంగా విచారించి పశ్చిమ దిశకు తపశ్చర్యకై వెళ్లాడు. త్రిశంకువు కోరిక కోరికగానే కల కలగానే మిగిలి పోయింది. అభిమానంతో చేసిన యజ్ఞము అసంపూర్ణంగానే మిగిలిపోయింది.

త్రిశంకు ప్రయత్నముతో మనం గ్రహించాల్సిన విశేషాలెన్నో ఉన్నాయి. మన ఆచార్యుడే మనకు ప్రాప్యుడు _"ఆచార్యాదిహ దేవతాం సమధికాం అన్యాం నమన్యామహే' ఆచార్యునితో సమానమైన, లేదా అధికమయిన దేవత లేనేలేదు. ఆయన మన ప్రార్థనను మన్నించినా, మన్నింపకున్నా ఆయనను, ఆయన పుత్రులను అలక్ష్యం చేయడం కూడదు.

స్వాచార్యుని నిరాకరించి ఎంత గొప్ప వారిని ఆశ్రయించినా, వారు ఎంత ప్రయత్నించినా, మనను రక్షింప జాలరు. విశ్వామిత్రుని అంతటి వాడు వశిష్ఠుని వీడి తనను ఆశ్రయించిన త్రిశంకువును స్వర్గానికి పంపలేక పోయాడు. భూమికి, స్వర్గానికి రెంటికి చెడ్డ "త్రిశంకు స్వర్గము'అసంపూర్ణ విఫల ప్రయత్నానికి ఉదాహణమయింది.

స్వాచార్యుని వీడి, ఎంతటి మహాత్ములను ఆశ్రయించినా మనము 'రెంటికి చెడ్డ రేవడి"వలె అవుతాము. ఇహ పరములు రెండు అందకుండా పోతాయి.

అంతేకాదు స్వాచార్యుని త్యజించి తమను ఆశ్రయించిన వ్యక్తిని ఉద్ధరించడానికి ప్రయత్నించే ఎంతటి మహానుభావులైనప్పటికి విఫలులు కాక తప్పదు. ఆప్రయత్నంలో తమ మహత్వాన్ని కూడ కోలుపోక తప్పదు. విశ్వామిత్రుడంతటి వాడు అనవసరంగా త్రిశంకువును చేరదీసి ఆయనను కాపాడడానికి చేసిన వ్యర్థప్రయత్నంలో తన మహోగ్ర తపస్సును నిష్ఫలం చేసికొన్నాడు.

ఇంకొక మాట - మనకిష్టము లేని పనులు జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండడము, మర్యాదగా తప్పుకోవడం మంచిదని వశిష్ఠ భగవానుడు నిరూపించాడు.

ఎంత వారికైనా పరదూషణం పనికిరాదు. తపస్సంపన్నులు, మహోదయ సమేతులైన వాశిష్ఠులు విశ్వామిత్రాదులను అనవసరంగా నిందించి శాపగ్రస్తులయ్యారు. అననుకూల సమయాల్లో మనోనిగ్రహమే మంచిది.

అనుగ్రహించినా, ఆగ్రహించినా ఆచార్యుని సన్నిధేమనకు పెన్నిధి

మరొకరిపై స్పర్థతో ఆవేశంతో ఎంతటి తీవ్ర తపము చేసినా అది సఫలం కాదని విశ్వామిత్రుని దక్షిణ దిశా తపము మనకు సందేశమిస్తోంది.

శ్రీరామాయనమః

రామాయణంలో త్రిశంకు వృత్తాంతము. శబరి వృత్తాంతము రెండు ఆచార్య వైభవమును తెలిపేవే, స్వాచార్యుని విడిచి పెట్టినందు వలన మహారాజు అంతవాడికి కలిగిన అనర్థము త్రిశంకు వృత్తాంతము తెలుపుతుంది ఆచార్యుని ఆశ్రయించిన అతి సామాన్యవ్యక్తులు అందుకొనే అత్యున్నతస్థితిని శబరి వృత్తాంతము వివరిస్తోంది. ఆ అద్భుత సంఘటనను మనము ముందు పరిశీలిద్దాము.

ఇతిశం

శ్రీసీతారామచంద్ర స్వామినే నమః

# విశ్వామిత్ర తపము - శునశ్శేఫ వృత్తాంతము

(పశ్చిమదిశ)

దక్షిణదిశలో తపస్సుకు కల్గిన తీవ్ర విఘ్నానికి నిరాశ చెందిన విశ్వామిత్రుడు -పశ్చిమ దిశకు వెళ్ళి పుష్కర క్షేత్రములో పట్టుదలతో తపస్సు చేయడానికి పూనుకొన్నాడు తపస్సు చేస్తుండగా దీర్ఘకాలము గడిచింది.

ఆకాలంలో అంబరీషుడు అయోధ్యాధిపతిగా అవనిని పాలిస్తున్నాడు. ఆయన ఒకమారు అశ్వమేధ యాగాన్ని తలపెట్టాడు. ఇంద్రుడాయాగానికి విఘ్నంకల్గించడానికి యజ్ఞాశ్వాన్ని అపహరించాడు.

యజ్ఞ విఘ్నము కర్తకు సర్వానర్థాలను కలిగిస్తుంది. అందుకై బ్రాహ్మణులు అంబరీషునితో అశ్వమేధ యాగానికి బదులు కనీసం నరమేధ యాగమయినా నిర్వర్తించుమని సలహా ఇచ్చారు. నరమేధంలో బలిపశువు కావడానికి స్వయంగా ఏ వ్యక్తి అయినా ముందుకు రావాలి. రాజు ఎవ్వరిని కూడ బలవంతం చేయకూడదు. ఆవ్యక్తి ప్రాణత్యాగానికై సిద్ధ పడినందుకు అతని తల్లిదండ్రులకు పుష్కలంగా ధనమివ్వాలి.

ఆకాలంలో ఋచీకుడనే ఒక ముని దారిద్ర్యము వలన కుటుంబాన్ని మహా భారంగా పోషించుకొంటూ వస్తున్నాడు. ఆయన సంగతి తెలిసిన అంబరీషుడు ఆయన పుత్రులలో ఏ ఒక్కడినిచ్చినా -ఆయనకు బదులు శత సహస్రగోవులనిస్తానని తెలుపుతాడు.

"జ్యేష్టపుత్రుని వదులు కోనంటాడు"ఋచీకుడు "కనిష్ఠుని ఇవ్వనంటుంది" కన్నతల్లి. మధ్యముడు శునశ్శేపుడు తల్లిదండ్రులకు తన పట్ల ఉన్న నిరాసక్తతను గమనించి -తాను బలిపశువుగా వెళ్లడానికి నిర్ణయించుకొంటాడు. అంబరీషుడు ఋచీక దంపతులకు లక్షగోవులనిచ్చి -శునశ్శేఫుని తీసికొని వెళ్లాడు.

మార్గమధ్యంలో వారు పుష్కరక్షేత్రానికి చేరుకొన్నారు. శునశ్శేఫుడు ఆ పరిసరాలలో సంచరిస్తూ విశ్వామిత్రుని దర్శించాడు. విశ్వామిత్రుడు శునశ్శేఫునికి స్వయంగా మేనమామ. శునశ్శేఫుని దీన గాధ విశ్వామిత్రుని మనస్సును వెన్నలా కరిగించింది.

ఆ మహర్షి తన పుత్రులను పిలిచి, వారిలో ఎవ్వరైనా ఒకరు శునశ్శేఫునికి బదులు యజ్ఞ పశువుగా వెళ్లాలని అడిగాడు. తద్వారా వారికి పితౄణము తీర్చుకొనే మహాభాగ్యము లభిస్తుందని బుజ్జగించాడు.

మధుష్యందాది మహర్షి తనయులు, "స్వంతపుత్రులను బలి పశువుగా పంపి అన్యుల పుత్రులను రక్షించటంలో ఔచిత్యమేమిటని "ఆక్షేపించారు. విశ్వామిత్రుడు ఆగ్రహోదగ్రుడయి తన సుతులను "వేయి సంవత్సరాలు, శునకమాంస భక్షకులై వాశిష్ఠుల వలె నీచ జన్మలలో జీవించుడని"శపించాడు.

శునశ్శేఫునికి తన తపః ఫలాన్ని ధారవోసి "రెండు మంత్రాల నుపదేశించి, వాటిని యజ్ఞబలి సమయంలో పఠించి, రక్షను పొందుమని" తెలిపాడు. మహాసంతోషంతో శునశ్శేఫుడా రెండు మంత్రాలను గ్రహించి, అంబరీషునితో ఆనందంగా యజ్ఞస్థలికి చేరుకొన్నాడు. విశ్వామిత్రుని తపము మళ్లీ వ్యర్థమైంది.

ఆనరమేధ యాగంలో శునశ్శేఫుని బలి ఇవ్వడము కొరకు అతనికి రక్తాంబరమును ధరింపజేసి, అతనిని "యూపబద్ధుని"గావించారు. అప్పుడు విశ్వామిత్రదత్త మంత్రములను పఠించి శునశ్శేఫుడు ఇంద్రోపేంద్రులను సంతుష్టులను గావించాడు. సురేంద్రుడు శునశ్శేఫునికి దీర్ఘాయిష్యాన్ని, అంబరీష మహాపతికి యజ్ఞఫలాన్ని అనుగ్రహించి అంతర్థానము చెందాడు.

మరొక సహస్ర సంవత్సరాలు విశ్వామిత్రుడు దీర్ఘతపమాచరించాడు. అతని కఠోర తపోదీక్షకు అమితంగా సంతసించిన బ్రహ్మాది దేవతలు అతనికి 'ఋషి"పదాన్ని అనుగ్రహించారు. విశ్వామిత్రునికి వారు ఇచ్చిన "ఋషిత్వము"సంతృప్తినివ్వలేదు. ఆయన తన తపస్సును విరమించలేదు.

విశ్వామిత్రుని తీవ్ర తపము సురులకు భయాన్ని కలిగించింది. మహేంద్రుడెలాగయినా ఆయన తపస్సుకు ఆటంకం కల్పించాలను కొన్నాడు. అప్సరసలలోనే అద్భుత సౌందర్య లావణ్యా రాశి మేనక. ఆమెను పిలిచి మహర్షి తపోభంగము చేయుమని ఆజ్ఞాపించాడు. మేనకకు తన మేని హొయల పట్ల అచంచలమైన ఆత్మవిశ్వాసముంది. కాని వెళ్లేది తీవ్ర స్వభావుడయిన విశ్వామిత్రుని దగ్గరకు. ఆమె మనస్సులో భయాందోళనలు కలిగాయి. కాని కాదంటే అమరేంద్రుని తక్షణాగ్రహానికి గురికావలసిందే. ముందు నుయ్యి, వెనుక గొయ్యి. అదిరే గుండెలను అరచేతిలో పట్టుకొని ఆదితేయుల కార్యార్థము అడుగువేసింది ఆ అప్సరస.

విశ్వామిత్రుడా రోజు తపము చాలించే సమయ మాసన్నమైంది. అంతర్ముఖములైన ఇంద్రియము లొక్కొక్కటే బహుర్ముఖములు కాసాగాయి. ముందుగా ఆయన నాసికకు పరిమాళాలు ఆనందాన్ని కల్గించాయి. వీనులకు మధుర రాగాలాపనము చక్కని విందునిచ్చింది. కనులకు ఆసుందరి కమనీయ గాత్రము ఆశలను రెకెత్తించింది. విశ్వామిత్రుని పంచేంద్రియములను పంచశరుడు పరవశం గావించాడు.

వివశుడైన విశ్వామిత్రుడు తన తపము వదిలి బహుకాలము సురభామినితో స్మరభోగాలను అనుభవించాడు. ఆయన తపోదీక్ష సడలినందుకు దేవేంద్రుడు సంతోషించి మేనకను స్వర్లోకానికి తిరిగి వచ్చేయి మన్నాడు. తపోభంగానికై ఏతెంచిన మేనక నిజంగానే మనస్ఫూర్తిగానే విశ్వామిత్రునితో మన్మధ సుఖాలననుభవించింది. దానికి తోడు ఆమె అప్పుడే ఒక బిడ్డను కన్నది. పతిని, సుతను వదలి తక్షణమే స్వర్గానికి వెళ్లడం ఆపడతికి కొంత బాధా కరంగానే ఉంది. అంతేకాదు అసలు విషయమును గ్రహించి ఆ మహాముని తననెంత తీవ్రంగా శపిస్తాడో?అయినా అమరేశ్వరుని ఆనతిని మీరరాదు. విశ్వామిత్రునితో ధైర్యాన్ని చేజిక్కించుకొని, తన విషయాన్ని వివరించింది. సురలోకానికి ఒంటరిగానే తిరిగి వెళ్లింది.

విశ్వామిత్రుని వ్యామోహం చెల్లా చెదరు అయింది. తన తపోదీక్ష మేనక కామానికి బలి కావడం ఆయనకు పశ్చాత్తా పాన్ని కల్గించింది. తక్షణమే ఆయన తన తప్పిదాన్ని గ్రహించి - తిరిగి తపశ్చర్యకై మరో దిశను ఆశ్రయించాడు.

దక్షిణ దిశలో వసిష్టునిపై ప్రతీకారేచ్ఛ, ఆధిక్యకాంక్ష -విశ్వామిత్రుని అమోఘ తపస్సును వ్యర్థము చేశాయి. భాగవత ద్వేషము బలమైన పాపము. ఆ పాపము ముందు అతని తపస్సు గాలికి కొట్టు కొని పోయింది.

ఈ పశ్చిమ దిశలో విశ్వామిత్రుని యొక్క మమకారము అతని తపో దీక్షకు మొదట అంతరాయాన్ని కల్గించింది. శునశ్శేపునిరక్షణకై ఆయన పతస్సునంతా ధార బోయక తప్పలేదు. ఆయనను రక్షించే ప్రయత్నంలో తన స్వంత తనయులను శునక మాంసభక్షకులుగా శపించాడు.

అంతకంటె తీవ్రంగా తపమొనర్చాలని విశ్వామిత్రుడు అనుకొన్నాడు. ఇక్కడ ఆయనలో అంతర్గతంగా నిద్రించి ఉన్న కామము బుసలు గొడుతూ పడగ విప్పింది. మేనకా వ్యామోహం ఆయన కఠోరదీక్షను పూర్తిగా మరిపించింది. కామము మనకు బలమైన శత్రువు దాని ఆకలి తీరదు. దానిని వేరంట నరకడమే అది చల్లారని శత్రువు. ఎంత ఆహారాన్ని వేసినా మనకర్తవ్యం. "జహిశత్రుం మహాబాహోకామ రూపందురాసదం".

ఇతిశం.

## విశ్వామిత్ర తపము ఉత్తర దిశ - 3

దక్షిణదిశ, పశ్చిమదిశ ప్రశస్తములుకావు. ఆదిశలలో కావించిన శుభకార్యములేవి ఫలించవు. విశ్వామిత్ర తపము కూడ ఈ రెండు దిక్కులలోను ఫలించలేదు. అనుకోని అవాంతరములు కలిగి విశ్వామిత్రుని మనస్సులో తీవ్ర అసంతృప్తి కలిగించాయి.

అయినప్పటికి పట్టుదలకు మారుపేరయిన విశ్వామిత్ర సంయమి ఆ అవాంతరములకు ఆగిపోలేదు. అందువలన ఆ మహానుభావుడు తన తపస్సుకై ఉత్తరదిశను ఎన్నుకొన్నాడు.

మరొకమారు మహోగ్ర తపశ్చర్యకై విశ్వామిత్రుడు తలపోశాడు. అతని తీవ్ర తపస్సుకు భీతులైన దేవతలు బ్రహ్మదేవునాశ్రయించారు పద్మ సంభవుడాయనకు " ఋషిముఖ్య " పదాన్ని అనుగ్రహించినాడు.

విశ్వామిత్రునికి మహర్షి పదముపై ఆశ ఉంది. తన ఆశయము నెరవేరనందుకు ఆయన అసంతృప్తి జెందాడు. తన తపస్సును కొనసాగించడానికై నిశ్చయించుకొన్నాడు. నిజానికి మహర్షి పదము అంత సులభసాధ్యంకాదు. జితేంద్రియునికి మాత్రమే అది సిద్ధిస్తుంది.

అమరేంద్రుడు ఆ ఋషితపస్సుకి మరొక మారు అంతరాయాన్ని కల్పించాలనుకొన్నాడు. ఈ పర్యాయము జంభారి రంభను సురకార్యానికి నియోగించాడు. రంభ కూడ ముందు ముని శాపానికి భీతురాలైంది. అయినా మహేంద్రుని మాటకు ఆమె తలవంచక తప్పలేదు.

రంభ తన రమణీయ హావభావ విలాసాలను విశ్వామిత్రుని పై ప్రయోగించింది. అయితే అప్పటికే ఆయనకు అతివల అందం పట్ల ఆదరం తగ్గింది. అప్సరస సౌందర్యప్రదర్శన ఆయనలో ఆగ్రహాన్ని కలిగించింది. రంభను "పది సంవత్సరాలు రాయిగా పడిఉండమని శాపాంతములో తేజస్సమేతుడైన ఒబ్రాహ్మణుడు నిన్ను ఉద్ధరిస్తాడని, " శాపాన్ని, శాపాంతాన్ని తెలిపాడు.

అయితే రంభను శపించడం ద్వారా విశ్వామిత్రుడు సాధించింది ఏమి లేదు. తన తపోదీక్షారక్షణకై సురభామినిని శపించి ఆయన తిరిగి తన తపస్సును వ్యర్థముచేసికొన్నాడు. తన కోపమే తన శత్రువుగా మారింది ఈ మారు.

కామము తరువాత తల ఎత్తే ప్రబల శత్రువు క్రోధము. కామమే క్రోధంగా పరిణమించుతుంది. క్రోధము కలుగడానికి కారణము కామవాసనలు నశింపకపోవడమే. క్రోధమును జయింపనిదే కామముపై శాశ్వత విజయము సాధ్యముకాదు.

కామము, క్రోధము కూడ కలిగేది రజోగుణము వలననే కామము కన్నా బలవత్తరమైనది క్రోధము. ఇది మహాపాపములను చేయిస్తుంది.

క్రోధాన్ని జయించడము మహాత్ములకు కూడ పూర్తిగా సాధ్యము కాదు. అనుకోకుండా ఆవేశించడం క్రోధలక్షణము. ఆవేశించిన తరువాత యుక్తాయుక్త విచక్షణను లేకుండాజేసి సమ్మోహాన్ని కలిగిస్తుంది. సమ్మోహమువలన తానెవ్వరో ? తన పరిస్థితి ఏమిటో మరచిపోవడం జరుగుతుంది. అనంతరము సంభవించేది వినాశమే.

విశ్వామిత్రుడు మేనకా పరిత్యాగంతో కామాన్ని జయించాడు కాని రంభ దర్శనము ఆయనలో క్రోధానికి కారణమైంది. రంభను క్రూరంగా శపించాడు. విశ్వామిత్రునికి క్రోధాన్ని నిగ్రహించుకోవడం సాధ్యం కాలేదు. క్రోధాన్ని అదుపులో పెట్టుకోనిదే జితేంద్రియత్వము లభింపదు. జితేంద్రియత్వము కలుగనందుకే ఋషికి "మహర్షి" పదవి లభింపలేదు.

మొదట విశ్వామిత్రుడు మహీపాలుడుగా ఉన్నప్పుడులోభ, మోహములు, కామ, క్రోధములు ఆయనలో సంకులంగా ఉండేవి. ఆయన లోభగుణమే విశ్వామిత్రునికి నందినీధేనువును అపహరించాలనే కాంక్షను కలిగించింది. అది ఆయనకు లభించలేదు. కాని దాని వలన భాగవతద్వేష మహాదోషము సంప్రాప్తించింది.

బ్రహ్మతేజో విశేషాన్ని స్వయంగా దర్శించిన విశ్వామిత్రుడు చతుర్దిశలలో అసాధ్యమైన తపస్సును కావించాడు. దక్షిణ, పశ్చిమోత్తరదిశలలో ఆయన తపస్సు ఫలించలేదు. కాని ఒక్కొక్కదిశలో ఆ మహానుబావుడు ఒక్కొక్క దుర్గుణాన్ని జయించాడు.

దక్షిణదిశాతపము ఆయనలో భాగవతద్వేషాన్ని తగ్గించింది. పశ్చిమదిశలో తపస్సు ఆయనలో మమకారాన్ని నిర్మూలించింది. కామముపై ఆధిక్యాన్ని కలిగించింది. ఉత్తరదిశలోని తపస్సు క్రోధాన్ని జయించడానికి తోడ్పడింది. ఈ విధంగా ఈ దిశలలో తపము వ్యర్థమయినా ఆయన ఒక్కొక్క గుణముపై అధిపత్యాన్ని సాధించాడు.

## విశ్వామిత్ర తపము తూర్పుదిశ -4

ఉత్తర దిశలో కూడ విశ్వామిత్రుని తపము నిరర్థకమైంది. దానికి కారణము ఆయన క్రోధమే.

అక్కడ నుండి ఆ సంయమి ప్రాగ్దిశలో ప్రవేశించాడు. ఈ పర్యాయము తన మనోరథము ఈడేరదాకా తపస్సును కొనసాగించాలని దృఢంగా సంకల్పించాడు. ఆయన తపస్సు అత్యంత తీవ్రంగా కొనసాగింది. అవాంతరములెన్ని కలిగినా ఆ ముని చలింపలేదు. శాంత చిత్తంతో ఆ సంయమీంద్రుడు తన తపస్సును తీవ్రంగావించాడు.

వేయి సంవత్సరాలు నిరాహారుడై, ప్రశాంత మనముతో తపముగావించి తృప్తి జెందాడు. అనంతతపము తరువాత ఆ ముని ఆహారాన్ని గ్రహించడానికి సిద్ధమయ్యాడు. ఇంతలో ఇంద్రుడు బ్రాహ్మణరూపముతో ఆ అన్నమును యాచించాడు. ఆయనకు ఆ అన్నాన్ని పూర్తిగా దానంచేసి, మళ్లీ నిరాహారుడై ఉచ్ఛ్వాస, నిశ్వాసలను బంధించి, మరొక వేయి వర్షాలు ఘోరతపమాచరించాడు.

వాయు సంచారాన్ని ఆ సంయమి నిరోధించినందువలన బ్రహ్మతేజస్సు ఆయనలో కేంద్రీకృతమైంది. అగ్ని ఆవిర్భావానికి ముందు ధూమము వెడలినట్లు ధూమము అగ్నికి సంకేతమైనట్లు, విశ్వామిత్రుని శిరమునుండి పొగలు బయలుదేరి లోకములన్ని వ్యాపించాయి. ఆ ధూమముచేత దేవదానవ గంధర్వ, సిద్ధ, కిన్నర, కింపురుషాదులందరు సమ్మోహితులయ్యారు.

సురులందరు చతర్ముఖుని సమీపించి, పితామహా ! విశ్వామిత్ర మునీంద్రుడు ఏ ప్రలోభాలకు లోబడడంలేదు. ఆ మహాత్మునిలో కన్నుపొడుచుకొన్నా ఏ పాపములేశమైన కానరావడములేదు. ఆయన అభీష్టాన్ని ఇప్పటికి కూడ ఇవ్వకపోతే ఆయన తపోజనిత ధూమాగ్ని లోకాలను భస్మం చేస్తుంది. సాగరాలన్ని ఇప్పటికే సంక్షుభితాలవుతున్నాయి. భూమి కంపిస్తుంది. పర్వతములు బ్రద్దలవుతున్నాయి. వాయువు మహాప్రభంజనమై ప్రళయలక్షణాలను కలిగిస్తోంది అని నివేదించారు.

పద్మగర్భుడు మహామునిని సమీపించి, బ్రహ్మర్షి !స్వాగతము నీ మహోగ్రతపముతో నీవు బ్రాహ్మణ్యాన్ని, సంయమనాన్ని సాధించావు. నీ తపస్సు సఫలమైంది. నీకు దీర్ఘాయుష్యాన్ని అనుగ్రహిస్తున్నాను. నీకు స్వస్తి అగుగాక. ఇకనీవు నీ తపము చాలించి యథేచ్ఛగా వెళ్లుమని వరమొసగాడు.

విశ్వామిత్ర మహర్షి మహాసంతోషముతో పితామహా! నీ ప్రసాదము వలన నా తపస్సు సఫలమైతే, బ్రాహ్మణ్యము సిద్ధిస్తే ఓంకార, వషట్కారాలు,

వేదములు నాకు స్వాధీనములగు గాక ! బ్రహ్మపుత్రుడైన వశిష్ట మహాముని నన్ను అనుగ్రహించుగాక ! అని ప్రార్థించాడు.

దేవతలు "తథాస్తు" అనిరి. వశిష్ఠ మహర్షి విశ్వామిత్రుని బ్రహ్మర్షీ ! అని సంభోధించాడు. విశ్వామిత్రుడు వసిష్ఠుని సంభోధనతో సంతృప్తిని చెంది. స్వయంగా తాను కూడ వశిష్ఠ మహామునిని అమిత గౌరముతో ఆదరించాడు. విశ్వామిత్రుడు తపముచేస్తూనే మహీతలమంతా సంచరించాడు.

ఈ విధంగా అభిమానధనుడు, ధృడదీక్షాదక్షుడైన విశ్వామిత్ర సంయమీంద్రుడు తన అచంచల తపోదీక్షతో బ్రహ్మర్షి పదాన్ని తపస్సిద్ధిని పొందాడు. చివరలో ప్రాగ్దిశలో ఆయనకు తపస్సిద్ధి కలిగింది.

తూర్పుదిశలో ఆయన లోభగుణము పరీక్షింపబడింది. వేయి సంవత్సరాల నిరహార తపమును ఆచరించిన మహాముని ఆహార స్వీకారానికి సిధ్ధపడగా ఆ ఆహారాన్ని కూడ అమరేంద్రుడు అర్థించాడు. ఆకలి కూడ ఆమహాత్మునిలో ఆగ్రహాన్ని కలిగింపలేదు.

లోభము వలననే వశిష్ఠ ( భాగవత ) ద్వేషము సంభవించిది. చివరకు (అన్న) లోభమును జయించిన తరువాతనే భాగవతసఖ్యములభించింది. భాగవతాభిమానమే సకలశ్రేయములకు మూలము. బ్రహ్మపుత్రుని అభినందనమే బ్రహ్మర్షిపదాన్ని స్థిరపరిచింది.

విశ్వామిత్రునివలె మనముకూడ అరిషడ్వర్గములకు పరవశులమై ఉంటాము. ప్రపంచానికి అనర్థము కలిగినా మన స్వార్థాన్ని పూరించుకోవాలనుకొంటాము. ఆ సంధర్భముగా భాగవతద్వేషమహాపాపమును మూటగట్టుకోవడానికైనా సిద్ధపడుతాము.

ఈ అట్టడుగు స్థితినుండి మనముపైకి రావాలి. అహంకార, మమకారాలను జయించాలి. కామ, క్రోధ, లోభ, మోహములను ఒక్కొక్కటినే వశపరుచుకొవాలి. చివరకు వశిష్ఠునివంటి భాగవతోత్తముని అభిమానమునకు పాత్రులము కావాలి. వశిష్ఠునివంటి భాగవతాభిమానము సకల శ్రేయస్సులను కలిగిస్తుంది. దాని ద్వారానే భగవద్జ్ఞానము కలుగుతుంది. భగవంతుడు కూడ స్వాధీనమవుతాడు. తద్వారా విశ్వశ్రేయమును కలిగించగల మహత్వము సంభవిస్తుంది.

ఇది మనకు విశ్వామిత్రుని చతుర్దిశలలో తపము మనకు అందించే అద్భుతసందేశము.

ఓం తత్సత్

ఇతిశం.

# XXII. విశ్వామిత్రసమాగమము

విశ్వామిత్రుడు మహారాజుగా ఉన్నప్పటి స్థితికి, బ్రహ్మర్షిగా దశరథ చక్రవర్తి సభకు ఏతెంచే స్థితికి మధ్యలో చాల మార్పు చెందాడు. ఆయన మనోనదిలో వికారములన్నికొట్టుకపోయి నిర్మలత్వమేర్పడింది.

ఈ మధ్య కాలంలోనే హరిశ్చంద్ర మహీపాలుని సత్యదీక్ష కూడ కఠిన పరీక్షకు గురి అయింది. సజ్జనుల దృఢవ్రతబలము మహర్షి గుర్తించి పశ్చాత్తప్తుడయ్యాడు.

విశ్వామిత్రముని మనములో అణువణువునా జగత్కల్యాణ దీక్షనిండింది. అహంకారము, దురభిమానము అన్ని అనర్థాలకు మూలమునవే అవగాహన పూర్తిగా ఏర్పడింది.

ఆయనలో "మనము చేసే" ఏ పనికైనా మనము కర్తలము కాము, పరమాత్మ మన ద్వారా తన పనులు చేయించుకొంటాడని, మనము నిమిత్తమాత్రులమనే ధృఢవిశ్వాసమేర్పడింది. ***"ఏష ఏవ సాధు కర్మ కారయతి"*** అనే శృతి వాక్యము విశ్వామిత్రుని మనములో బలంగా నాటుకొంది.

విశ్వామిత్రుడు తన శేష జీవితాన్ని ఫలాపేక్షలేకుండా తపస్సుతో, యజ్ఞయాగాది సత్కర్మలతో గడుపుతున్నాడు. యావద్భారతంలో పర్యటిస్తూ పవిత్రకార్యముల నిర్వహిస్తున్నాడు.

వామనుడు బలిచక్రవర్తిని నిగ్రహించి, కొంతకాలము సిద్ధాశ్రమంలో తపస్సుకావించివెళ్లాడు. అటువంటి సిద్ధాశ్రమంలో విశ్వామిత్రుడు కొంతకాలంగా యాగాలు నిర్వహిస్తున్నాడు. అయితే మారీచ, సుబాహువుల మూలంగా వీటికి విఘ్నం కలుగుతోంది.

విశ్వామిత్రునికి పూర్వంవలె మనస్సులో క్రోధము అహంకారాలు కల్గక నశించాయి.

తన యాగాలను తాను స్వయంగా నిర్విఘ్నంగా పూర్తిజేసికోజాలననే నిర్ణయానికి వచ్చాడు. కారణము ఆయన అసమర్థుడని కాదు. మారీచ సుబాహువుల నిగ్రహించే శక్తి ఆయనకు లేదని కాదు. కాని వారిని శిక్షించాలంటే

తన మౌన యజ్ఞదీక్షను మధ్యలోనే వదులుకోవాల్సివస్తుంది. అప్పుడు కూడ యజ్ఞనిర్వహణ మధ్యలోనే ఆగిపోతుంది.

తన యాగానికి విఘ్నములెందుకేర్పడుతున్నాయి ? విశ్వామిత్రునికి కారణమవగతమైంది. తన పూర్వ సంచిత, ప్రారబ్ధ పాపఫలితంగానే యజ్ఞాలకు విఘ్నాలు కలుగుతున్నాయి. వీటితోపాటు తనకు ఆగామి కర్మల ఫలముకూడ అంటుకొనే అవకాశము లేక పోలేదు. ఈ విషమ పరిస్థితి నుండి ఎంతటి గొప్పవాడైనా స్వప్రయత్నంతో తప్పుకోజాలడు.

మరెలా ఈ కర్మ చక్రాన్నుండి తప్పించుకోవడం ? విశ్వామిత్ర మహర్షి తీవ్రంగా ఆలోచించాడు. ఆయన సామాన్యుడు కాదు. బ్రహ్మదేవుని వరకారణంగా ఓంకార, వషట్కారాలు, వేద, వేదాంగ విజ్ఞానము ఆయన స్వాధీనము లోనికి వచ్చాయి.

వేదమంత్రాలన్నింటిలో గాయత్రి మహామంత్రరాజము ప్రధానమైనది. !! న ***గాయత్ర్యాః పరో మంత్రః*** " గానము చేసేవారిని రక్షించే గొప్పమంత్రమది. అనేక పర్యాయాలు ఆ మంత్రశ్రేష్ఠాన్ని విశ్వామిత్రుడు సంపూర్ణ నిష్ఠతో జపించాడు. ఆ మంత్రము యొక్క పరమార్థాన్ని మహర్షి పూర్తిగా దర్శించాడు. ఆయన గాయత్రీ ద్రష్ట. అందుకే గాయత్రి మంత్రము విశ్వామిత్రముని పేరుతోనే ప్రసిద్ధమైనది. !! ***గాయత్ర్యాః గాయత్రీ ఛందః, విశ్వామిత్రర్షిః*** "

గాయత్రీ మంత్రానికి దేవత సవిత. సవిత అంటే సామాన్య సూర్యుడుకాదు. సూర్యాంతర్వర్తి ఆయిన శ్రీమన్నారాయణుడుగాయత్రీమంత్రదేవత !! తస్యభాసా సర్వమిదం విభాతి " అనే ఉపనిషదుక్తి సూర్యచంద్రాదుల ప్రకాశానికి పరమాత్మతేజమే మూలమని తెలుపుతున్నది అందుకే !! ***ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణః*** " అని స్మృతి వాక్యము కలిగింది.

ఇప్పుడా శ్రీమన్నారాయణదైవము ధశరథ చక్రవర్తి తనూజుడుగా శ్రీరామునిగా అవతారము ధరించింది. రాముడు నివురుగప్పిన నిప్పువలె తన ప్రకాశాన్ని దాచుకొంటున్నాడు.

" ఆత్మానం మానుషం మన్యే " తాను మానవుడినే అని ప్రకటించుకొంటున్నాడు. సామాన్య లోకము అలాగే భావిస్తోంది.

తాను శ్రీరామచంద్రుని పరమాత్మగా లోకానికి ప్రకాశింపజేయాలి. తాను ఆ శ్రీరామపరమాత్మపై తన సర్వభారములను సమర్పించాలి. ఇదే గొప్ప తపస్సు.

"న్యాసమేషాం తపసాం అతిరిక్త మాహుః " అంటోంది శృతి.

వశిష్టమహర్షి శ్రీరాముని నామకరణ సందర్భంగా ఇదివరకే ఆయనలో పరమాత్మ తత్వాన్ని గ్రహించాడు. ఆయన ఆ లోకాభిరామునికి విద్యాప్రదానము, ఉపనయనముల గావించి, తనవంతుకైంకర్యములనిదివరకే చేశాడు.

తాను కూడ తనవంతు కైంకర్యాన్ని చేయాలని విశ్వామిత్రమహర్షి నిర్ణయించుకొన్నాడు. వసిష్ఠుడు ఇంతవరకు ఉపదేశించని మహాస్త్రాలను రామునికి తాను ఉపదేశించాలి. వసిష్ఠుడు ఉపనయనం చేస్తే ఆ జగదభిరామునికి తాను వివాహం చేయాలి. శ్రీరాముని కల్యాణము జగత్కల్యాణానికి కారణము కావాలి.

ఇవి విశ్వామిత్రుని మనస్సులో మొదలుతున్న ఆలోచనలు ఇది వరకు కూడ తాను వసిష్ఠమహామునితో పోటీ పడ్డాడు. కాని ఆ పోటీకి కారణము తన రజోగుణమే - తన అహంకారమే. ఆ మహాముని పట్ల నిర్లక్ష్యంతో ఆయనపై ఆధిక్యాన్ని సంపాదించాలనే వ్యర్థ ప్రయత్నమే.

ఇప్పుడు వసిష్ఠమహర్షితో పోటీ రజజోగుణము వలన కలిగింది కాదు. సత్వగుణోద్రేకంతో వశిష్ఠమహర్షితో భగవత్కైంకర్యములో పోటీ పడుతున్నాడు. భగవత్కైంకర్యములో తాను ముందుండాలని ప్రయత్నించడం భక్తులకు కర్తవ్యమే కదా ? ఆ మహాముని మనస్సులో, భరన్యాసము, భగవత్కైంకర్యదీక్ష, జగత్కల్యాణసంకల్పము నిండుగా వ్యాపించాయి.

విశ్వామిత్రుడు ధశరథుని సభాస్థలికి ఏతెంచాడు. తనరాకను అయోధ్యాధిపతికి నివేదించుమని ద్వారపాలకుని కోరాడు. "విశ్వామిత్ర " నామము వింటూనే ద్వారపాలుడు గడగడవణికాడు. మహారాజు దగ్గరకు పరుగెత్తి వెళ్లి విశ్వామిత్రా గమన వార్తను నివేదించాడు.

ధశరథ చక్రవర్తి విశ్వామిత్రుని వ్యక్తిత్వాన్ని పూర్తిగా తెలిసినవాడు. ఆ మహారాజు వశిష్ఠాది మహామునులను ముందుంచుకొని విశ్వామిత్ర మహర్షి దగ్గరకు స్వయంగా వెళ్లి ఆ ముని చంద్రుని సభాస్థలికి తీసుకొనివెళ్లి, ఉన్నతాసనముపై కూర్చోబెట్టిపాదప్రక్షాళన, కుశల ప్రశ్నాది సత్కారములు గావించి సంభావించాడు.

ధశరథ భూజాని విశ్వామిత్రునిరాక తనకు, "తీవ్రంగా నష్టము చెందిన వానికి పెన్నిధి లభించినట్లుగా" ఉందన్నాడు.

"ఆయనకు సేవజేయడమే తన జీవిత పరమార్ధమని వచించాడు. ఆయన రాకలోని కారణము తనకు తెల్పుమన్నాడు". ధశరధుని సంభాషణ విశ్వామిత్రునికి ఆనందాన్ని కల్గించింది.

విశ్వామిత్రునిస్థితికి మనము కూడ చేరుకోవడానికి ప్రయత్నించాలి. ఎంతటి జ్ఞానసంపద, ఎంతటి నిష్ఠాగరిష్ఠత ఉన్నా మనకార్యలను మనము నిర్వహించుకోజాలమని, భగవంతుడే మన ద్వారా పనులను చేయించుకొంటున్నాడని, ఆయనే నిజమైన " కర్త" అని, మనము నిమిత్తమాత్రులమే అని గ్రహించాలి.

మన సంచిత, ప్రారబ్ధ, ఆగామి పాపములను వేటిని కూడ మనము స్వప్రయత్నముతో తొలిగించుకోజాలమని, అందుకు భగవంతుని ఆశ్రయించి, ఆయనపై భరన్యాసముగావించడమే కర్తవ్యమని గ్రహించాలి. అప్పుడే " పుణ్యాపాపే విధూయ " అన్నట్లు మన పాపములు నశించి, భగవల్లాభము కలుగుతుంది.

ఈ జగత్తులో, " అంతర్బహిశ్చ, వ్యాప్యనారాయణస్థితః " అన్నట్లు అణువణులోపల బయటకూడ సూక్ష్మంగా స్థూలంగా వ్యాపించిన ఆశ్రియః పతే శ్రీరాముడుగా ధశరథ నందనుడుగా అవతరించినవాడని, శ్రీరామాశ్రయమే. ఆయనపై మన భారాన్ని వదలడమే మనకు శ్రీరారక్ష అని గ్రహించాలి.

ఓం తత్సత్.

# XXIII. "అహంవేద్మి" "నాకు తెలుసు"

దశరథ చక్రవర్తి విశ్వామిత్రమహర్షితో ఆయన ఏది కోరినా ఇస్తానని అది తనకు మహాభాగ్యమని, ఈ సామ్రాజ్యమంతా అతనిదేనని భావించి ఏదైనా నిస్సందేహంగా కోరుకోవచ్చునని స్పష్టంగా విశ్వామిత్రునికి తెలిపాడు.

అప్పుడు మహర్షి తన యాగ నిర్వహణ గురించి తెలిపాడు. అనేక సంవత్సరాలనుండి తన యాగాలకు మారీచసుబాహువులనే రాక్షసులు విఘ్నాలను కల్గిస్తున్నారని తన క్రోధము యాగ నిర్వహణకు ప్రతిబంధకము కనుక వారిని నిగ్రహించడానికి తగిన క్రోధము కల్గడం తనకిష్టము కాదని అందువలననే వారిని తాను శపించడంలేదని ఆయన తెలిపాడు.

బాలుడైనా శ్రీరాముడు వారిని సంహరింపగల్గుతాడని, తాను ఆయన వెంట నుండి ఆయన తేజస్సును మరింత అధికంచేస్తానని శ్రీరాముని ముందు ఎంతటి లోకవిఖ్యాత పరాక్రములైనా నిలువజాలరని శ్రీరాముడు తప్పమరెవ్వరు మారీచ సుబాహువులను చంపజాలరని శ్రీరాముని సాధారణ మానవుడిగా సాధారణ పుత్రుడిగా భావించి వ్యామోహం చెందవద్దని తెలిపాడు. మహాముని, మహారాజుల మధ్య సంభాషణ ఈ విధంగా సాగింది.

ధశరథుడు :- ఏమయ్యా మహర్షీ ! నా కొడుకు గురించి నాకే క్రొత్తగా చెప్పుచున్నావే ! నాకు తెలియదా ఆయన గురించి !

విశ్వామిత్రుడు :- మహారాజా ! నీకు రాముని గురించి పూర్తిగా తెలియదు. నీవు కేవలము సాధారణ బాహ్యనేత్రములతో చూడగల్గుతావు. కేవలము వందిమాగధులతో పరివేష్టింపబడే నీకు శ్రీరామతత్వము తెలియదు. నిరంతర శస్త్రాస్త్రధారివైన నీకు రాముని గురించి ఎలా తెలుస్తుంది ! భోగపరాయణుడవు, రజోగుణయుక్తుడవు, సింహాసనోపవిష్టుడవు, పుత్రవ్యామోహితుడవు, అర్థకామపరుడవు, నీకు రామతత్వము అర్థమౌతుందా !

నేనోజ్ఞాననేత్రుడను, వృద్ధోపసేవిని, జితేంద్రియుడను సాత్విక ప్రకృతి కలవాడను, ధర్మకార్యపరాయణుడను, యోగక్రమవేత్తను, మోక్షగామిని, నాకు అందువలననే రామతత్వము పూర్తిగా అర్థమైంది.

మహారాజా ! బ్రహ్మరుద్రేంద్రాలకు అగోచరుడు, "క ఇత్థావేద, " అని వేదాదిప్రమాణాలకు కూడ అందనివాడు, "సోzగవేద, యదివానవేద " అని తనకు కూడ తెలియని మహిమ గలవాడైన పరతత్వము గురించి నీకు ఎట్లా తెలుసునని అడుగుతున్నావా ?

అవునయ్యా ! భగవంతుడికి కూడ తన గురించి పూర్తిగా తెలియడానికి నావలె ఆయన గురు శుశ్రూషచేశాడా?

"శృతమాసీన్మరీచితః" అన్నట్లు ఆ భగవంతునిచే బుద్ధియోగము పడసిన జ్ఞానులకు ఆయన గురించి పూర్తిగా తెలియునే ? " శ్రోతవ్యో, మంతవ్యో, నిధిధ్యాసితవ్యః "అనే వేదవాక్యాలు ఆ విషయాన్ని బలపరుచడం లేదా ?

ధశరథుడు :- మహామునీ ! నీకు సుకుమారుడైన నారాముని గురించి ఏమి తెలియునయ్యా ? వివరంగా తెవుపవయ్యా !

విశ్వామిత్రుడు :- మహారాజా ! నీ కుమారుడు బాలుడే కావచ్చు. తేజస్వంతులకు వయస్సుతో నిమిత్తం లేదయ్యా ! నీ కొడుకు మహాత్ముడు, ధైర్యశాలి, శత్రుదుర్నిరీక్ష్యుడు, సకల ప్రాణులకు అభయదాత ! ఆయనతో సమానులే లోకంలో లేరంటే అధికుల మాట ఎక్కడిదయ్యా ! ఆయన ధర్మసంస్థాపన కొరకే ప్రయత్నిస్తాడయ్యా ! ఆయనకు ఆగ్రహము వస్తే అగ్ని కల్పుడు, సూర్యతేజుడు, ఉపాయశాలి, మహావాయువువలె ఆయన శత్రువులను ఎగురగొట్టుతాడు. ఆశ్రియతులకాయన మృతసంజీవనము.

ధశరథుడు :- "మీరు తెలిపే విశేషణాలన్ని భగవంతునికి వర్తిస్తాయి. అంతేగాని నా రామునికి వర్తిస్తాయా"?

విశ్వామిత్రుడు :- చక్రవర్తీ ! రాముడంటే ఎవ్వరనుకొంటున్నావు ? సాధారణ మానవ బాలుడు అనుకొంటున్నావా ? నిన్ను స్వయంగా తండ్రిగా వరించి, నీకు అవతరించిన పరమాత్మే ఆయన

" స,ఉ,శ్రేయాన్ భవతి జాయమానః " అని వేదము తెలిపినట్లు ప్రతి జన్మలో కూడ వివర్ధమాన తేజస్వి ఆయన.

ధశరథుడు :- " మహానుభావా ! ఆయన పరమాత్మ అవునో కాదో నాకు తెలియదు. కాని నా రాముడింకా బాలుడే. యవ్వన మింకా అంకురించలేదు. సౌకుమార్యము తగ్గలేదు. ఈయన పరాక్రమంతో శత్రువులతో పోరాడగలడా !

శ్రీరామాయనమః

విశ్వామిత్రుడు :- భూజానీ ! రాముడు సహజ పరాక్రముడు, ఆయన విక్రమము అమోఘము. ఆయన ముందుగా శత్రువులున్నచోటికే వెళ్లి వారిని నిర్జింపగల్గుతాడు (అభియాత )హఠాత్తుగా మీద బడ్డ ఎంతటి ప్రబల శత్రువునైనా మట్టి గరిపింపగల్గుతాడు (ప్రహర్త). సకల దేవతా సంరక్షకుడు శ్రీరాముడు. భయంకర శతృవులనైనా క్షమింపగల ఉదారుడు. శతృవులనాయన ఎదిరించడానికి ఆయుధధారణము కూడ అవసరములేదు. సింహమువలెనిద్రాగతుడైనా అరిభయంకరుడే.

ధశరథుడు :-"మహర్షిపుంగవా ! మీరు మాట్లాడే ఈ మాటలు కేవలము మీ పనిని నెరవేర్చుకోవడానికి చెప్పేవి కావు కదా ! మీరే కాక నారాముని మీ వలె తెలిసిన వారింకెవ్వరైనా ఉన్నారా ? లేక మీరొక్కరేనా ?

విశ్వామిత్రుడు-మహీపాలా!నేనొక్కడినే ఎందుకయ్యా!మహాతేజుడు అయిన వశిష్ఠుడు కూడ రామతత్త్వము పూర్తిగా తెలిసినవాడే. ఆయన నీ కులగురువే కదా?ఆయనను అడిగి చూడు నేనుకూడ ఒకప్పుడు సూర్యవంశ రాజునే కదా! అందువలన నాకు విరుద్ధంగా మాట్లాడక నామాటనే బలపరుస్తాడంటావా? మేమిద్దరము (పూర్వము)పరస్పర శత్రువులమయ్యా!ఆయనధేనువును హరించడానికి ఆయనను అనేక బాధల పాలు జేశాను. ఆయన నామాటే అవునని ఎందుకంటాడు?

వశిష్ఠుడు అబద్ధం చెప్పుతాడా?ఆయన స్వయంగా బ్రహ్మపుత్రుడు. శ్రీరామునికి ఆచార్యులు, నావిషయంలో బ్రహ్మవరాన్ని బల పరుచగలిగిన మహాతేజశ్శాలి. సత్యధర్మ పరాయణుడు. ఆయన అబద్ధం చెప్పుతాడా?

దశరథుడు:-ఋషిశ్రేష్ఠా!నీవు, వసిష్ట మహాముని, ఇద్దరే కాక నా రాముని గురించి మీవలె తెలిసిన వారెవ్వరైనా అనేకులున్నారా?

మహర్షి :- ఇదుగో నీ ఎదుట మహర్షులు ఇందరు ఉన్నారు. కదా ! వీరిని అడిగిచూడు ఒకరిద్దరయితే అనృతమాడవచ్చు కాని వీరందరు అసత్యము పలుకుతారా?వీరంతా వాతాంబుపర్ణాశనులు. వీరేదో ఆచార్య పదవినందుకోవాలిని, ఆశపడేవారు కారు. అతి నిరాడంబరులు. పరమభాగవత శిఖామణులు. వీరందరు నీ ఎదుటే ఉన్నారే?వీరిని నీవే అడిగి చూడు.

ఈవిధంగా విశ్వామిత్ర సంయమి, అనేక విధాలుగా శ్రీరాముని పరత్వాన్ని గురించి, వసిష్ఠాది అనేక మహామునుల మ్రోల, సుమంత్రాది సచివుల సమక్షంలో

, సామంత భూపాల సమక్షంలో, పౌరజాన పదుల మధ్య అంతః పురకాంతలందరు వింటుండగా వివరించాడు.

దశరథాది సామాన్య మానవులు పరమాత్మ తమ మధ్య ఉన్నాడని గుర్తింపజాలరు. "అవజానంతి మాంమూఢాః మానుషీం తను మాశ్రితం"కాని విశ్వామిత్రుని వంటి జ్ఞానులు పరమాత్మ ఏ అవతారంలో ఉన్నా వెంటనే గుర్తిస్తారు.

# XXIV. ఊనషోడశ "పదహారేళ్లైనా లేవు"

.దశరథ మహారాజు విశ్వామిత్ర మహామునికి ఆయన ఏది . కోరినా తాను తప్పక ఇస్తానని-ఆయన మనస్సులోని కోరిక ఏదైనా నిస్సందేహంగా అడుగుమని చెప్పాడు.

విశ్వామిత్రుడు -తన యాగనిర్వహణ దీక్ష గురించి వివరిస్తూ అనేక సంవత్సరాల నుండి తనయాగ నిర్వహణలో మారీచ సుబాహువులనే రాక్షసులు విఘ్నకారకులుగా ఉన్నారని-తనయాగరక్షణ నిమిత్తము శ్రీరామభద్రుని తనతో పంపుమని కోరాడు.

దశరథ మహారాజు, పౌరులు, మహారాణులు, మహర్షుల ముందు" అహంవేద్మి"అనే శ్లోకం ద్వారా శ్రీరాముడు పరమాత్మే అని, ఆయన సత్య పరాక్రముడని, ఈ విషయము మహాతేజుడైన వసిష్ఠునికి, తపస్థితులయిన వారందరికి తెలుసు అని పరమాత్మ తత్వాన్ని ఆవిష్కరింపజేశాడు.

"ఊనషోడ శవర్షోమే।రామో రాజీవలో చనః। నయుద్ధ యోగ్యతామస్య। పశ్యామి సహరాక్షసైః। "

అయినప్పటికి దశరథుని మనస్సు కుదుటపడలేదు. మారీచ సుబాహువులు తాటకా తనయులని, వారు రావణ వర్గములోని వారని దశరథుడు తెలిసికొని భయకంపితుడయ్యాడు రామునికి బదులు తాను విశ్వామిత్రునితో పాటు-ఒక అక్షోహిణి సైన్యముతో రాగలనని-మారీచ సుబాహువు లిద్దరిలో ఎవరో ఒకరితో యుద్ధము చేస్తానని చెప్పాడు. "తయోరన్య తరేణాహం యోద్ధాస్యాం"

తనకు 60వేల సంవత్సరాల ముసలితనంలో అపూర్వంగా లభించిన భగవత్ప్రసాదము శ్రీరాముడని, ఆయనకింకా 16 సంవత్సరాలు కూడా పూర్తిగా నిండలేదని. పాలుగారే వయస్సులో ఆయన ఉన్నాడని, ఆయనకింకా అస్త్ర విద్య పూర్తిగా అబ్బలేదని, ఆయన సాయంత్రము కాగానే నిద్రనోర్చుకోజాలని పద్మ పత్రాక్షుడని వాపోయాడు.

మారీచ సుబాహువులిద్దరు భయంకర రాక్షసులని, మాయా విద్యా

నిపుణులని, అధర్మ కూట యుద్ధం చేసే వారని, అటువంటి భయంకర రాక్షసులతో రాముడు యుద్ధం చేయజాలడని, దయ ఉంచి, శ్రీరాముని తన దగ్గరే ఉంచుమని, ఆయనవెంట తీసికవెళ్లొద్దని "నరామం నేతుమర్హసి"అని మాటిమాటికి బ్రతిమాలాడాడు.

"మెడలో ధరించవలసిన సుకుమార కుసుమహారాన్ని పిసికి, తెంపి, చెల్లా చెదురు చేసి, ఎండలో వేసి, మాడ్చినట్లు, తన సుకుమార కుమారుణ్ణి ఆఘోర రాక్షసుల ముందుకుపంపి హింసింపవద్దని వేడుకొన్నాడు.

తన రాముడు-ఇరువై ఒక్క పర్యాయాలు "నిక్షత్రియం" చేయడానికి భూమండలమంతా పరిక్రమించి, తన కరకు పరశుధారతో క్షత్రియులను హతమార్చిన క్రూరబలుడైన పరశురాముని వంటి వాడు కాదని -తన కుమారుడు- అతి సుకమారుడని మనవి చేసి కొన్నాడు.

ఈ విధంగా దశరథ మహారాజు శ్రీరాముని పరమాత్మ తత్త్వము ప్రభోధింపబడి కూడ- పుత్రవ్యామోహంతో రాముని విశ్వామిత్రునితో పంపడానికి నిరాకరించాడు.

దశరథుడు మనవలె ఇంద్రియలోలుడే. సాధారణ దీనమనస్కుడే. దారేషణ, పుత్రేషణ, ధనేషణ-అనే ఈషణత్రయమునకు మనవలెనే లోబడినాడు. అందులో ప్రస్తుతము దశరథుని పుత్రేషణ ముంచివేస్తోంది.

మనవలెనే దశరథుడు కూడ విశ్వామిత్రుని చూడగానే వెనుకాముందు చూడకుండా-ఆముని ఏది అడిగినా తప్పక ఇస్తానని మాట ఇచ్చాడు.

దానములన్నిటిలో వాగ్దానము అత్యంత సులభమైనది. వాగ్దానం చేయడానికి ఏఅర్హత అవసరము లేదు. ఎవ్వరైనా చెయవచ్చు. ఎలాంటి శ్రమ అవసరములేదు. సమస్య అంటూ ఉంటే వాగ్దానము తరువాతే ప్రారంభమౌతుంది. దానిని పాలించడములోనే మహనీయత ఉంటుంది.

విశ్వామిత్రుడు నిగ్రహానుగ్రహసమర్థుడు. అతిలోక వీరుడు. తనకు చేతగాక దశరథుని (రామ)సహాయాన్ని అపేక్షింపలేదు. తాను కోపావిష్టుడు కావడం ఇష్టము లేక యాచించాడు.

శ్రీరాముడు సత్య పరాక్రముడని, పరమాత్మ అని అవతార రహస్య జ్ఞానాన్ని వసిష్టాది మహర్షులు, సామంతులు, సచివులు, రాజబంధువులతో బంధురమైన రాజ సభలో విశ్వామిత్రుడు ఆవిష్కరించాడు.

అయినా దశరథుడు శ్రీరాముని పంపుటకు అంగీరించలేదు. పుత్రవ్యామోహముతో ఆయన ఆడిన మాటను తప్పడానికైనా వెనుదీయలేదు.

కావాలంటే రాముడికి బదులు తాను సైన్య సమేతంగా వస్తానని-వచ్చినా మారీచ సుబాహువులలో ఒక్కరితో మాత్రమే పోరాడగల్గుతానని అన్నాడు. అయితే దశరథుని అసందర్భ ప్రలాపములకు, ఆడిన మాట తప్పినందుకు, విశ్వామిత్రుడు కోపగించ లేదు. ఇప్పుడు విశ్వామిత్రముని ఆగ్రహముపై సంపూర్ణాధిపతాన్ని సాధించాడు.

దశరథుడు రాముని ఇవ్వడానికి నిరాకరించినా, విశ్వామిత్రుడు, "మహారాజా!ఆడితప్పడం మంచిదేమో నీవే నిర్ణయించుకో-ఆయినా నీకు శుభమగు గాక!అని ప్రశాంతముగా వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు.

ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విషయము ఒకటి ఉంది. సాధారణ మనుష్యులకు వలె-జ్ఞానులకు కూడ వ్యామోహము ఉంటుంది. అయితే వారి వ్యామోహము మనవలె ఈషణత్రయమునకు సంబందించి కాదు. వారి వ్యామోహము భగవంతునికి సంబంధించినది విశేషదృష్టితో చూచినప్పుడు దశరథునికి రాముని పైగల వ్యామోహం ఆచార్యునికి పరమాపట్ల ఉండేవ్యామోహమే ఆచార్యాది జ్ఞానులు భగవద్విరహాన్ని క్షణం కూడ సహించి

ఉండజాలరు. సాధారణుల వ్యామోహం కంటె కూడ జ్ఞానుల వ్యామోహము మరింత"పర వశాన్ని"కల్గిస్తుంది.

"యన్ముహూర్తం క్షణం వాపి వాసుదేవో నచింత్యతేసాహానిః తన్మహచ్ఛిద్రం"

ప్రహ్లాదుడు భగవచ్చింతన లేక ఒక క్షణము -ఒక ముహూర్తము వ్యర్థంగా కాలము గడిచి పోయినా అది ఎంతో హానికరమని -ఎంతో ఉపద్రవాన్ని కల్గిస్తుందని మనల్ని హెచ్చరిస్తున్నాడు.

ఆచార్యులు తమకు ప్రియాతి ప్రియుడైన భగవంతుని ఇతరులకు మంత్ర పూతంగా అందించేముందు-వారిని ఎన్నో కఠిన పరీక్షలు చేస్తారు.

భగవదర్థుల చిత్త శుద్ధిని తీవ్రంగా శంకిస్తారు. అగ్నిలో పుటం వేసిన బంగారము శుద్ధమై ప్రకాశాన్ని విరజిమ్మినట్లు, ఆచార్యుల కఠిన పరీక్షలకు నిలిచిన వారికే అపూర్వభగవల్లాభము కలుగుతుంది.

"న రామం నేతు మర్హసి"అని ఇక్కడ దశరథుడు పదే పదే రాముని విశ్వామిత్రునితో పంపడానికి నిరాకరిస్తాడు. విశ్వామిత్రుడిప్పుడు ఒక సాధకుడు. ఆయన ఇంద్రియ నిగ్రహము ఇక్కడే తెలుస్తుంది. ఎన్ని రకాల తాను ఒప్పించినా మెప్పించినా దశరథుడు మొండి వైఖరితో రాముని పంపడానికి ససేమిరా -వీలులేదంటాడు. అయినా విశ్వామిత్రుడు సహనాన్ని కోల్పోలేదు. సహనం కోల్పోయిన వాడికి సర్వేశ్వరుడు అందడు. అందువలననే విశ్వామిత్రుడు సరే రాజా!నీవు మాటను నిలబెట్టుకోవా?ఏది న్యాయమో నీవే విచారించుకో నీకు శుభమగు కాక"అని ప్రశాంతంగా అన్నాడు. ఇది సాధకునికి ఉండవలసిన మనస్స్థితి.

శ్రీరామానుజులు భగవన్మంత్రమును అపేక్షించి, గోష్ఠీ పూర్ణుల నాశ్రయించినప్పుడు పూర్ణులు రామానుజాని పద్దెనమిది పర్యాయములను త్రిప్పి పంపారు, ఒక్క మాసం రోజులు కఠిన ఉపవాసం చేయాలని నియమము విధించారు. రామానుజుల సహనాన్ని స్థిరత్వాన్ని పరీక్షించాకనే వారికి పూర్ణులు భగవన్మంత్రమును అనుగ్రహించారు. ఇది దశరథుడు రామునివ్వనని పదే పదే నిరాకరించడంలోని మనము గ్రహించవలసిన పరమార్థము. ఎన్ని రకాల నచ్చ చెప్పినా-దశరథుడు శ్రీరాముని పంపుటకంగీకరింపలేదు. అయినా విశ్వామిత్రుడు -చాల నిగ్రహాన్ని కల్గి వెళ్లి పోవడానికి సిద్ధపడ్డాడు.

దశరథుని అకృత్యమును బ్రహ్మర్షి వశిష్ఠుడు గ్రహించాడు. ఇక తాను కలుగ జేసికోక తప్పదనుకొని -మహారాజుతో ఈ విధంగా అన్నాడు.

"దశరథ మహీపతీ!మీరు ఆడిన మాట తప్పి-విశ్వామిత్రుల వెంట శ్రీరామునికి పంపక పోవడం మంచిదికాదు. ఇక్ష్వాకు నృపాలురు ఆడిన మాట తప్పిన వారు కారు. సత్య వాక్యపాలనమునకు హరిశ్చంద్రుడు పడిన కష్టములు మీకు తెలియనివి కావు.

విశ్వామిత్రుడు స్వయంగా సకల శస్త్రాస్త్ర సంపన్నుడు ఆయన శ్రీరాముని పంపుమని మిమ్మల్ని కోరినందువలన-ఆయనను అసమర్థుడని భావింపకూడదు. ధనువు, తపము-రెండింటిలో ఆయన అగ్రేసరుడు. శ్రీ రామునికి మేలు చెయడం కొరకే ఆయన-శ్రీరాముని తన వెంటతీసికపోదలచాడు. ఆయన వెంట పంపడంలోనే శ్రీరాముని కల్యాణము ఇమిడి ఉంది. అంతేకాదు. రాముని పంపినందువలన అబద్ధమాడడమనే పాపము నీకు అంటదు. అందువలన శ్రీరాముని తప్పక విశ్వామిత్రుని వెంట పంపు" స్వయముగా కుల గురువు, బ్రహ్మర్షి అయిన వశిష్ఠుని మాటలు దశరథునిలో ఆలోచనలు రేకెత్తించాయి. కౌసల్యాదేవి కూడ కుల గురువు ఉపదేశాన్ని సమర్థించింది. సభాసదులైన మహర్షులు, సామంత నృపాలురు వశిష్ఠుని సలహాను బలపరిచారు.

చివరకు దశరథుడు శ్రీరాముని పిలిచి విశ్వామిత్రుని వెంట పంపడానికి అంగీకరించాడు. జ్ఞానమును విడిచి, కర్మ ఉండనట్లు రాముని వెంటే లక్ష్మణుడు వెళ్లడానికి సిద్ధమయ్యాడు. రామలక్ష్మణుల సోదరప్రేమ దశరథునికి సంతోషాన్ని కల్గించింది. విశ్వామిత్రుడా సోదురులిద్దరిని వెంటపెట్టుకొని బయలుదేరాడు.

మొదట సాధకుని మనస్థైర్యాన్ని పరీక్ష చేయడాని కొరకు ఆచార్యుడు భగవంతుని (మంత్రాన్ని)ఇవ్వడానికి నిరాకరించినా, భాగవతోత్తములు సాధకుని ఆర్తిని గమనించి ఆచార్యునికి సాధకుని పక్షాన పురుషకారము చేస్తారు. అప్పుడాచార్యుడు సంతోషించిసాధకునికి భగవల్లాభము సమకూరుస్తాడు.

# XXV బలి-అతిబల

దశరథుని మాట ప్రకారము రామ లక్ష్మణులు కుడి ఎడమ రెండు తూణీరాలు గల్గిన భుజాలతో విశ్వామిత్రుని వెంట నడుస్తుంటే మూడు తలల పాములు పరుగెత్తుతున్నట్లు-పితామహుని అశ్వినీ దేవతలు అనుసరిస్తున్నట్లు -శివునితో స్కంధ, విశాఖులు అనుగమిస్తున్నట్లు కనిపించింది.

సరయూనది దక్షిణ తీరమునకు రాగానే, "రామా!" అని విశ్వామిత్రుడు ఆప్యాయంగా పిలిచి, "బలాతి బల"విద్యలనుపదేశించాడు. ఆవిద్యల వలన జ్వరము, శ్రమ, రూపవికృతి కలుగవు

నిద్రాగతులుగా, ప్రమత్తులుగా నున్నప్పటికి రాక్షస భాధలుండవు బాహు బలములో, సౌభాగ్యములో, జ్ఞానములో, దాక్షిణ్యములో బుద్ధి నిశ్చయములో సాటి ఎవ్వరు ఉండరు. ఆకలి దప్పుల బాధలుండవు.

అటువంటి మహామహిమాన్వితములైన బలాతి బల విద్యలను శ్రీరాముడు సంతోషంతో స్వీకరించాడు. ఆవిద్యలతో రాముడు మరింత ప్రకాశించాడు. ఆరాత్రి సరయూతటంలో, విశ్వామిత్రుని లాలనలో గడ్డి పరకలపై రామ లక్ష్మణులిద్దరు. సుఖనిద్రాగతులయ్యారు.

ప్రస్తుతము "విశ్వమునకు మిత్రుడు" విశ్వామిత్రుడు. భగవద్దర్శనమును విశ్వములోని ప్రతి అణువులో కలిగినవాడు ఆయన. సర్వత్ర సమదర్శనము కలిగినవాడు ఆమహర్షి. విశ్వామి త్రుడు మన ఆచార్యుడే అవిద్యనెదిరించడానికి, అహంకారనిరసనాది బలాతి బలములను కలిగించే ఇహలోక,పరలోక (స్వర్గలోక) -ఆత్మప్రాప్తి, భగవత్ప్రాప్తి అనే సకల విధ సంపదలను జ్ఞానగరిమను మంత్రము ద్వారా అందించేవాడే ఆచార్యుడు ఆమంత్రలాభముతో జ్ఞానప్రకాశము భగవదానంద సుఖములు కల్గుతాయి.

# XXVI "కౌసల్యా సుప్రజా"

సరయూనదీ తీరములో రామలక్ష్మణులసమేతంగా విశ్వామిత్రుడు నిద్రించాడు కదా. తెల్లవారింది. మహర్షి ముందుగా లేచి నిత్యకృత్యాలను నిర్వర్తించి శ్రీరాముని సమీపించాడు. ఆమహాత్మునికి విశ్వామిత్ర మహాముని సుప్రభాతము పాడడం ప్రారంభించాడు.

మొట్టమొదటి సుప్రభాతము వేదములో ఉంది. "ఉత్తిష్ఠత!జాగ్రత!ప్రాప్యవరాన్ నిబోధత!"మానవులార లెండి!జాగరూకులు కండి!పెద్దలను సేవించండి అనే హితోక్తులతో కూడి సకల జన శ్రేయస్సును ప్రబోధిస్తూ వైదిక సుప్రభాతము సాగింది.

ఆతరువాత "శ్రుతేరివార్థం స్మృతి రన్వగచ్ఛత్"అన్నట్లు శృత్యర్థమును విశ్వామిత్ర సుప్రభాతము అనుసరించింది 1.కౌసల్యా సుప్రజారామ!అని ప్రారంభించాడు ముని

"కౌసల్యా సుప్రజా !రామ!పూర్వా సంధ్యా ప్రవర్తతే

ఉత్తిష్ఠ!నరశార్దూల!కర్తవ్యం దైవ మాహ్నికమ్

త్రివాక్య పరిమితమైన త్రయీ సుప్రభాతమును నాలుగు చరణములతో విశ్వామిత్ర ప్రబోధము విస్తరించింది.

ఇక్కడ ఒక సందేహము సహజంగా కలుగుతుంది. సరయూ నదీ తటంలో రామలక్ష్మణులిద్దరు పడుకొన్నారు కదా!విశ్వామిత్రుడు"కౌసల్యా సుప్రజారామ!అని ఒక్క రామునే ఎందుకు లేపినట్లు?

ఈప్రశ్నకు పెద్దలు అనేక విధాలుగా సమాధానములిస్తారు. రామ లక్ష్మణులిద్దరిలో శ్రీరాముడొక్కడే విశ్వామిత్రుని దృష్టిలో ప్రధానమైన వాడు. లక్ష్మణుడు పిలువని పేరంటము. తాను విడిచి ఉండజాలక శ్రీరాముని అనుసరించిన వాడు. శ్రీరాముడో విశ్వామిత్రుని దృష్టిలో పరమాత్మే. జ్ఞానమును విడిచి కర్మ ఉండజాలనట్లు శ్రీరాముని విడచి ఉండజాలని లక్ష్మణుని వేరుగా లేపవలసిన అవసరములేదు. శ్రీరాముడు మేలుకొంటే లక్ష్మణుడు నిద్రిస్తూ ఉండజాలడు. అందువలన శ్రీరాముని ఒక్కనినే విశ్వామిత్రుడు

ప్రబోధించాడు. ఇదొక సమాధానము.

ఇంతకంటె విశిష్టమైన మరొక సమాధానాన్ని విశేషజ్ఞులు తెలుపుతారు. ఆసమాధానము అద్భుతమైనది.

శ్రీరామలక్ష్మణు లిద్దరికి గడ్డి పరకలతో పండు టాకులతో శయ్యలను లక్ష్మణుడేర్పరిచాడు. అయితే మధుర మూర్తి అయిన శ్రీరామచంద్రునికి ఆ కరకు తృణతల్పములో నిద్ర రాలేదు. ముందుగానే పుండరీకాక్షుడైన శ్రీరాముని కనులు నిద్రలేక మరింత ఎఱ్ఱ బారాయి. లక్ష్మణుడు శ్రీరాముని అవస్థను గమనించాడు. ఆపుంసాంమోహనునికి తాను మనోహరమైన శయ్యగా మారితే బాగుండుననుకొన్నాడు. తక్షణమే శేషశయ్య సిద్ధమైంది. శయ్యపై శ్రీరాముడు, శయ్యగా లక్ష్మణుడు సుఖనిద్రాగతులయ్యారు.

శేషశయానుని (శ్రీరాముని) సుందర స్వరూపము విశ్వామిత్ర మహర్షికి "సుప్రభాత సేవ"లో దర్శనిమిచ్చింది. ఎంతటి అదృష్టశాలి ఆమహాముని!ఏ పరమహంసలకు మాత్రము ఇంతటి సౌభాగ్యము కల్గుతుంది!మహాముని ఆనందానికి పట్టపగ్గాలు లేవు. సంతోషపరవశుడై గంతులు వేయసాగాడు.

(1) కౌసల్యా సుప్రజారామ!ఓహో రామ పరమాత్మా!నిన్ను తనయునిగా పొందిన కౌసల్య ఎంతటి సౌభాగ్యవతో కదా!అని కౌసల్య అదృష్టాన్ని పొగడడం ప్రారంభించాడు.

(2) కౌసల్యా సుప్రజా!అని ఒక మానవ మాత అయిన కౌసల్యాదేవికి ఎంత మంచి కొడుకువుగా-ఎంత విధేయుడైన పుత్రుడివిగా జన్మించావయ్యా రామా!అని శ్రీరాముని యొక్క సౌలభ్య గుణాన్ని ప్రశంసిస్తున్నాడు మహర్షి.

(3) విశ్వామిత్రుడు శ్రీరాముని "దశరథనందనా!" అని సంబోధించక "కౌసల్యా సుప్రజా!అని కౌసల్యను అభినందిస్తున్నాడు. ఎందుకు?ఆ మునికి దశరథుడంటే ఆగ్రహము. తాను ఎన్నివిధాల నచ్చజెప్పినా"నరామం నేతుమర్హసి"అని ససేమిరా శ్రీరాముని ఇవ్వనన్నాడు ఆ మహారాజు. ఆవృద్ధుని మొండితనము ముని మనస్సుకు అప్రియాన్ని కలిగించింది. అందుకే ఆయన పేరును ఉచ్చరించడానికి కూడ ఆమహర్షి మనస్సు అంగీకరించలేదు.

అయితే కౌసల్య-మహర్షి హృదయానికి నచ్చింది. కారణము?దశరథునికి కాంతా సమ్మితంగా నచ్చ జెప్పింది. శ్రీరాముని పంపడానికి తన వంతు

పాత్రను నిర్వహించిన కౌసల్యాదేవి ఎంతో మంచిదని మహాముని అభిప్రాయము అందుకే శ్రీరాముని మంచి కొడుకుగా గలిగిన కౌసల్యాదేవిని అభినందిస్తున్నాడు ఆమహర్షి.

**(4)** కౌసల్యా సుప్రజారామ!అని సంబోధించడంతో -పరశురా(మ, బలరా)మాదులకు ఈ సుప్రభాతము వర్తించదని అర్థము. శ్రీరామా!నిన్ను కనడానికి కౌసల్య ఎన్ని నోములు నోచిందో కదా అని మహర్షి కౌసల్య యొక్క సుకృత శీలాన్ని ప్రశంసిస్తున్నాడు

**(5)** తండ్రికంటె తల్లి నూరురెట్లు గౌరవనీయురాలు ***"పితుశ్శతగుణం మాతా"!*** అని శాస్త్రములు ఉద్ఘోషిస్తున్నాయి. అందువలన దశరథునికంటె అధికంగా ఆదరణీయురాలైన కౌసల్యనే ప్రస్తుతిస్తున్నాడు ఋషి

**(6)** "కౌసల్యా సుప్రజా!"అని విశ్వామిత్రుడు సంబోధిస్తుంటే తన తల్లి కౌసల్య స్వయంగా వచ్చి "సుప్రజా!"నా బంగారు తండ్రీ!నాయనా రామా!లేవయ్యా!అని తనను తల్లే లేపుతున్నట్లుగాప్రియంగా శ్రీరాముడు భావిస్తాడని వెంటనే లేస్తాడని మహర్షి ఆశించి "కౌసల్యా సుప్రజారామ". అని పిలిచాడు.

**(7)** "కౌసల్యా సుతనయా రామా!"అని కౌసల్యాదేవి అదృష్టాన్నే కొనియాడుతూ "కౌసల్యా సుప్రజారామ!" అనే మాటనే పదేపదే అంటూ-ఇక ముందుకు వెళ్ళజాలలేదు విశ్వామిత్రుడు. శేషశాయి అయిన శ్రీరాముని సుందర రూపము విశ్వామిత్రుని -ముందుకు వెళ్ళనీయలేదు.

ఆమహాముని అవస్థను గమనించిన శ్రీరాముడు ఆయనకు తెల్లవారు తున్నదృశ్యాన్ని కనపరిచాడు. సూర్యుని కిరణాలు చురుక్కుమన్నాయి. ప్రభాత దృశ్యాన్ని గమనించిన మహాముని. **2 *"పూర్వాసంధ్యా ప్రవర్తతే"*** అన్నాడు.

"రామ!ఉత్తిష్ఠ!"శ్రీరామభద్రా!మేలు కోవయ్యా!అంటే సరిపోయేది. ఉదయమవుతుంది మేలుకో -"పూర్వసంధ్యాప్రవర్తతే ఉత్తిష్ఠ"అని అనడమెందుకు అని మరొక ప్రశ్న.

ఒక గృహిణి -భర్త లేవక ముందే లేచి, తాను సిద్ధమై పిల్లల్నిలేపి, వాళ్ళను సిద్ధంచేసి, భర్తను మేలుకొల్పడానికి సిద్ధమైనట్లు, సూర్యపత్ని ఉషారాణి రాగరంజిత అయి సూర్యోదయం కంటె ముందుగానే ఉదయించి, మనను

తట్టి లేపుతుంది. తన ప్రియ భార్య లేపినా లేవని వాళ్లను చూస్తే సూర్యభగవానుడు మండిపడుతు చిఱ్ఱుబుఱ్ఱులాడుతాడట. అందుకే మొద్దు నిద్రపోయే వాళ్లకు సూర్య కిరణాలు చురుకులు పెడతాయట.

సూర్యోదయానికి ముందే మనము లేవాలి. లేచి స్నానతపోజపాదులు నిర్వర్తించకున్నా- ***"శయనే ఆసీనః"*** అన్నట్లు పడకలో కనీసము లేచి కూచోవాలి "హరిం స్మరేత్"అన్నట్లు భగవన్నామాను సంధానము చేయాలి.

రాత్రి కాలములో రౌద్రతమో ముహూర్తము ఉంటుంది. అటువంటి సమయంలో ఏమంచి పని చేసినా ఫలించదు. కనుక అప్పుడు తప్పక నిద్రపోవాలి.

తెల్లవారే ముందు బ్రాహ్మీముహూర్తము వస్తుంది. అప్పుడు అధ్యయన సంధ్యావందనాది శుభకర్మల నారంభించాలి. అవి వెంటనే శుభఫలాన్ని ఇస్తాయి.

ఇంద్రుని బ్రహ్మ హత్యాపాతకాన్ని భూమి, స్త్రీలు, వృక్షాలు భరింపగా మిగిలిన పాపాన్ని:

"**1.**అక్కలు, అన్నలుండగా పెళ్లి చేసికొనే చెల్లెళ్లు, తమ్ములు

**2.** భ్రూణ హత్యలు చేసేవాళ్లు.

**3.**ఉదయ, మధ్యాహ్న, సాయం సంధ్యలలో నిద్రించే వాళ్లు భరించాలని అగ్ని వచనము కనుక సూర్యోదయ కాలంలో నిద్రించడం బ్రహ్మహత్య కావించినంత మహాపాపము. అందువలననే శ్రీరాముని మేలుకోరి విశ్వామిత్రమహాముని ఆయనను లేపుతున్నాడు.

**3.**ఉత్తిష్ఠనరశార్దూల:- పురుషవ్యాఘ్రమా!పరాక్రమశాలీ!లెమ్ము!అంటున్నాడు.

అప్పుడప్పుడే కమల దళాలవలె కనులు విచ్చుకొంటూ నిద్రనుండి మేల్కొంటుండే శ్రీరాముని సుందర వదనారవిందములో-కమలనేత్రాలలో తనయాగ రక్షణ కావించగల్గిన పెద్దపులి పరాక్రమము కనుపడుతోంది. విశ్వామిత్ర ఋషికి. అందుకే "నరశార్దూల"అని పిలుస్తున్నాడు.

శ్రీరాముడు ఆచారప్రధానుడు-కనుక సూర్యోదయానికి ముందే లేపుతున్నాడు. మహాముని.

సూర్యోదయానికి ముందే లేచి ఏమి చేయాలి?

4.కర్తవ్యం దైవ మాహ్నికం:-విశ్వామిత్రుడు కర్తవ్యాన్ని ఉద్బోధిస్తున్నాడు. పరమాత్మకు కర్తవ్యమేదిలేదు. అయితే లోక సంగ్రహము కొరకు అవతారాలలో అందరివలె తాను కూడ కర్మాచరణ తప్పక చేస్తాడు. సూర్యోదయానికి ముందే లేచి-స్నానాది నిత్యకృత్యాలు నిర్వర్తించి -ఉదయిస్తుండే సూర్యునికి అర్ఘ్యజల ప్రదానము చేయాలి. **"స్థిత్వాభానవే అర్ఘ్యం దదానత్"** అన్నట్లు సూర్యునికి అభిముఖంగా నిలుచొని అర్ఘ్యమివ్వాలి. ఎందుకు?మనమిచ్చే అర్ఘ్యానికి సూర్యునికేమి సంబంధము?

ఉదయిస్తుండే సూర్యుని నిలువరించడానికి అనేక రాక్షసులు సూర్యునిపై బడడానికి వస్తారు. ఒక్క రక్త బిందువు క్రింద బడితే ఆబిందువు నుండి వేలాది రాక్షసులు జన్మిస్తారు వారినెదుర్కొవడానికి సూర్యునికి తీరికలేదు. మనము సహాయం చేయాలి. ఎలాగా అర్ఘ్యప్రదానం ద్వారా. ఏమవుతోంది అప్పుడు.?

"తా ఏతా ఆపః వజ్రీభూత్వా రాక్షసాన్ అపసర్పయంతి"అంటుంది. వేదము మనమిచ్చే అర్ఘ్యజలాలు వజ్రబలము కలిగి -సూర్యుని పై బడే రాక్షసులను తరిమివేస్తాయి.

ఉదయ సూర్యుని ఎప్పుడు, ఎంతకాలము సేవించాలి?మూడు గడియలలోపే సేవించాలి. అప్పుడే మనమిచ్చిన అర్ఘ్యము ఆదిత్యునికి అండగా ఉపకరిస్తుంది.

అంతేకాదు సూర్యుని ప్రథమ కిరణాలు నీలలో హితశక్తిని (అల్ట్రావాయిలెట్‌శక్తిని) కల్గి ఉంటాయి. అవి మన శరీరముపై బడి శరీరంలోని సకల వ్యాధులను పోగొట్టి ఆరోగ్యాన్ని కల్గిస్తాయి.

పాశ్చాత్య దేశాలలో కూడ"సన్‌బాత్"**(Sun Bath)** అని సూర్య (కిరణాల)స్నానమును శరీరముపై వీలయినంత తక్కువ దుస్తులతో చేస్తారు.

ఉదయ, సాయం సమయాలలో వాహ్యాళి అయుర్వేదంలో ఆరోగ్యం కొరకు విధించబడింది.

ఆదిత్యులు పన్నెండుమంది. ద్వాదశాత్యులంటారు వారిని. వారిలో ఒక్కొక్కరు మన శరీరంలో ఒక్కొక్క అవయవానికి ఆరోగ్యాన్ని, జవసత్వాలను కలిగిస్తారు. వారు ప్రత్యేక ప్రావీణ్యము కలిగిన వైద్యులు. వారు "స్పెషలిస్టులు"

అటు వంటి వారిని సేవించడం వలన కలిగే లాభాలను వేదము

వివరిస్తుంది "పశ్యేమ శరదశ్శతం"నూరేళ్లు చక్కని దృష్టిని కలిగి ఉంటాము. "శృణువామ "చక్కగా వినగల్గుతాము."జీవేమ 'శరదశ్శతం :-నూరేళ్లు జీవిస్తాము "నందామ, మోదామ"ఆనందిస్తాము మొదలుగా సూర్యోపాసనలాభములుంటాయి.

శ్రీరాముని ఆహ్నిక కర్తవ్యము నిర్వహింపలేచిరావాలి అని విశ్వామిత్రుడు ప్రబోధిస్తున్నాడు. స్నాన, సంధ్యావందన, తర్పణ, తపో, జపహోమాదులు, ఆహ్నికకృత్యాలు వాటిని చేయాలి

"యద్యదాచరతి శ్రేష్ఠఃతత్త దేవేతరో జనః"

అని గీతోక్తి -శ్రీ రామునికి పొందవలసిన ఫలములేదు. "నానవాప్త మవాప్తవ్యం," చేయవలసిన కర్మ కూడ లేదు. అయితే శ్రీరాముడంతటి వాడు స్నాన సంధ్యాది నిత్యకర్మలను అనుష్ఠిస్తే-మనము కూడా అలాగే తప్పక చేయాలి అని సాధారణ జనులు అనుసరిస్తారు. ఇదే లోక సంగ్రహము. "వర్త ఏవచకర్మణి"చేస్తునే ఉంటాను అని పరమాత్మ సూక్తి.

విశ్వామిత్రుడు శ్రీరామునికి కర్తవ్యాన్ని ఉపదేశిస్తున్నాడు. శ్రీరామా!నీవు చేయాల్సింది ఏమిటో తెలుసా నీవెప్పుడు లేస్తావో? నీ ఆరాధనము మేమెప్పుడు చేయాలో అని ఆరాధనోపకరణాలను గొని మేమందరము ఎదురుచూస్తున్నాము. నీవు లేచి మా ఆరాధనను స్వీకరించాలి.

"సుఖసుప్తః అని సుఖంగా నిద్రిస్తుండే నీ నిద్రాకాలిక సౌందర్యాన్ని సీతాదేవి వలె చూచి ఆనందించామే. నీవు లేచేప్పటి సౌందర్యాన్ని కూడ, సీతాదేవి వలె వీక్షించాలి. నీ శయన, స్థితి గమనాది సర్వకాల సౌందర్యమును సేవిస్తూ తన్మయులమయ్యేలా అనుగ్రహించాలి. రామప్రభూ! అని విశ్వామిత్రుడు శ్రీరాముని లేపుతున్నాడు.

శ్రీ సీతారామ చంద్రస్వామినే నమః

# XXVII తాటకవధ

శ్రీ రామలక్ష్మణులు మళ్లీ విశ్వామిత్రుని అనుసరిస్తూ వెళ్లుతున్నారు. సరయూ గంగానదుల సంగమ స్థలాన్ని సమీపించారు. వారు అక్కడ ఒక పుణ్యాశ్రమమును దర్శించారు. ఆ ఆశ్రమము అనంగాశ్రమము.

మన్మథుని బాణములకు పరవశుడై స్మరవశుడైన హరుడు పార్వతిపై మరులుగొన్నాడు. కొంత సేపటికి స్వస్థచిత్తుడై తన ఇంద్రియలోలుపత్వానికి కారణుడైన కందర్పుని గాంచి, అతనిని తన రూక్షఫాలాక్షముతో దగ్ధము జేసి అంగజుని అనంగుని గావించాడు. అందుకే ఆ ఆశ్రమానికి అనంగాశ్రమమని పేరొచ్చిందని విశ్వామిత్రుడు వివరించాడు. ఆరాత్రివారు ఆ ఆశ్రమమంలోనే వసించి, అక్కడి ఋషుల ఆతిథ్యము స్వీకరించి నిద్రించారు.

తెల్లవారి స్నానాది నిత్యకృత్యములను తీర్చుకొని, అక్కడి మునిజనుల వీడ్కోలును గ్రహించి, ఒక నావను అధిరోహించి, ఆనదీసంగమాన్ని తరించి మరొక అరణ్యములో ప్రవేశించారు.

ఆ అరణ్యము మహాఘోరమైనది. కీచురాళ్లధ్వని, భయంకర మృగగర్జనలు వినిపిస్తున్నాయి. ఆ అరణ్యము గురించి శ్రీరాముని కోరికపై విశ్వామిత్రుడు వివరిస్తున్నాడు.

"శ్రీరామా!ఈ కీకారణ్య స్థానములో పూర్వము మలద కరూశములనే రెండు స్థలాలు ఉండేవి. ఇంద్రుడు వృత్ర సంహారముచేయగా, అతనిని మలము, ఆకలి బ్రహ్మహత్యాకారణంగా ఆక్రమించాయి.

దేవతలు, మహర్షులు అతనికి సహస్ర కలశాలతో స్నపనంగావించారు. ఇంద్రుడు వినిర్మలుడయ్యాడు. అతని మల, కరూశములు ఈ భూమిలో నిలిచాయి. ఈ స్థలాలను ఇంద్రుడు కటాక్షించి. ఎల్లప్పుడు ఈస్థలములు ధనధాన్య సమృద్ధులతో తులతూగుతుంటాయని అమరేశుడు అనుగ్రహించాడు.

కొంతకాలానికి ఇక్కడికి "తాటక"అనే యక్షిణి సహస్ర గజబల సముపేత అయి వచ్చింది. ఆమె పుత్రుడు మారీచుడు భైరవాకారుడై జనులను హింసింపసాగాడు. అందువలన ఈ రెండు స్థలాలు నిర్జనములయ్యాయి.

కీకారణ్యములయ్యాయి. తాటక ఇప్పటికి ఇక్కడికి అర్ధయోజన దూరంలో ఉంటుంది. ఆ తాటకావనము నుండే మనము వెళ్లాలి. ఆదుష్టచారిణి అయిన తాటకను సంహరించి, ఈ అరణ్యమార్గాన్ని నిష్కంటకం చేయాలి"అని విశ్వామిత్రుడు తాటకావనం గురించి వినిపించాడు.

శ్రీరామచంద్రుడు విశ్వామిత్రముని వర్యునితో "గురువర్యా!యక్షులను అల్పవీరులంటారు కదా!తాటకకు వేయి ఏనుగల బలమెలా ఏర్పడింది.?" అని అడిగాడు.

విశ్వామిత్రుడు తాటకావృత్తాంతాన్ని తెలుపసాగాడు. "రామభద్రా!పూర్వము సుకేతుడనే యక్షుడు ఉండేవాడు. ఆయన మహావీరుడు. సంతానార్థము యక్షుడు బ్రహ్మనర్చించాడు. చతుర్ముఖుడాయనకు ఒక కన్యారత్నాన్ని సహస్ర గజబలంతో ప్రసాదించాడు. సుకేతుడామెను కొంత కాలానికి జంభపుత్రుడైన సుందునికిచ్చి పెళ్లిజేశాడు. వారికి మారీచుడనే పుత్రుడుగల్గాడు.

సుందుని మరణం తరువాత సుతసమేతంగా తాటక అరణ్యాలలో సంచరిస్తూ ఒకనాడు అగస్త్యాశ్రమంపైబడి ఆమహర్షిని బెదిరించింది.

అగస్త్యసంయమీంద్రుడు మారీచుని"రాక్షసునివి కమ్మని- తాటకను "భయంకరా కారవై, మానవ భక్షకురాలివిగా నుండు"మని శపించాడు. అప్పటి నుండి శాపఫలితంగా భయంకరాకారముతో తాటక బాటసారులను భక్షిస్తూ హింసిస్తున్నది. ఇటువంటి దుర్మార్గురాలినిసంహరించి- దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావించుమని" విశ్వామిత్రుడు వివరంగా తెలిపాడు.

"తాటకా సంహారమంటే స్త్రీ వధ కదా!అది వీరులకు వర్జనీయము కదా" అని శ్రీరాముడు సందేహిస్తుంటే విశ్వామిత్రుడు"జగత్ క్షేమము కొరకు నీవు తాటకను సంహరింపక తప్పదని" ఖండితంగా ఆజ్ఞాపించాడు.

అంతేకాదు పూర్వము కూడ మహామహులు దుష్టస్త్రీల వధ గావించారని ఐతిహ్యములను వినిపించాడు.

"మహేంద్రుడు జగద్వినాశకారిణి, విరోచనసుత అయిన "మంథర"ను సంహరించాడని"తెలిపాడు.

"పూర్వము ఇంద్రుడనేవాడు లోకాల్లో ఉండకూడదనే దురభిమానంతో దుష్టప్రయత్నంగావించిన భృగుపత్నిని (శుక్రమాతను)విష్ణువు స్వయంగా

సంహరించాడు. ఆవిధంగా అధర్మ పరులయిన అతివలెందరో పురుషసత్తముల చేతులలో హతులయ్యారు"అని విశ్వామిత్రుడు వివరించాడు.

మహేంద్రుడు సురనాయకుడు విష్ణువు సకల దేవతా సార్వభౌముడే. ఇటు వంటి శ్రేష్ఠులే దుర్జనస్త్రీ వధగావించడంవలన -దుష్టస్త్రీ హత్య తప్పుకాదేమో అని రాముడు అనుకోసాగాడు. అందులో "బలాతి బల"విద్యాప్రదాత అయిన విశ్వామిత్రుడు స్వయంగా గురువే. ఆచార్యాజ్ఞ అనుల్లంఘనీయము. అంతే కాదు దశరథుడు కూడ విశ్వామిత్రుని వచనాన్ని తప్పక పాలించాల్సి ఉంటుందని స్వయంగా ఆజ్ఞాపించాడు.

అందువలన శ్రీరాముడు విశ్వామిత్రునికి నమస్కరించి "గురువర్యా మీ మాటను తప్పకపాలిస్తాన"ని దృఢంగా పలికాడు.

శ్రీరాముడు ధనుష్టంకారము గావించాడు. ఆ మహాధ్వనిని విన్న తాటక క్రోధ మూర్ఛిత అయి, తాళ ప్రమాణంతో మాయాబలంతో ముందు కొచ్చింది.

శ్రీరాముడు లక్ష్మణునితో "తాటక స్త్రీ కనుక -ఆమెను పూర్తిగా వధింపనని _ఆమెను భంగపరుచడానికి ముక్కుచెవులు ఛేదించి విరూపను, బలహీనను కావిస్తాన"ని తెలిపాడు.

రాముడీమాటలు అంటూ ఉండగానే, చేతులు చాచి, భయంకరాకారముతో తాటక రామునిపైకి దుమికింది. విశ్వామిత్రుడు వెంటనే రామలక్ష్మణులకు "స్వస్తి" పలికాడు. తాటకను "హుంకారం,"తో కొంత సేపు స్థబ్దనుగావించాడు.

అయితే మరుక్షణంలోనే తాటక విజృంభించి -ఆవనధూళినంతా రామలక్ష్మణులపై కప్పి, మాయాశిలావర్షాన్ని కురిపించసాగింది. తన శరవర్షంతో రాముడు తాటక శిలావర్షాన్ని నిరోధించాడు. ఆమె రెండు చేతులు ముందుకు చాపుతూ వారిపై బడసాగింది. రాముడామె చేతులను, లక్ష్మణుడామె ముక్కు చెవులను ఖండించారు.

తాటక కామరూపధారిణి అయి, అంతర్ధానం చెంది, మాయాశిలా వర్షాన్ని కురిపింపసాగింది. ***"అనుచిత నయు-విష్ణు పురందరులను వ్యామోహితుల"*** గావించినట్లు తాటక మాయాశిలావర్షంతో రామలక్ష్మణులిద్దరిని సమ్మోహితుల గావించింది.

విశ్వామిత్రుడు శ్రీరామునితో:-రామా! ఇక ఈపరిహాస యుద్ధాన్ని చాలించు.

సంధ్యాసమయమవుతోంది. రాక్షసులు రాత్రించరులు. వారికి బలము పెరిగే సమయమిది. ఆలస్యము చేయక ఈ దుష్టరాక్షసిని దునుమాడుమ"ని హెచ్చరించాడు.

శ్రీరాముడామె వేగాన్ని శరవర్షంతో నిరోధించాడు. ఆమె లక్ష్మణుని వైపు హుంకరిస్తూ వెళ్లబోయింది. శ్రీరాముడామె వక్షస్థలాన్ని తీవ్ర శరాఘాతం గావించాడు. తాటకక్రిందబడి మరణించింది.

శ్రీరామభద్రుని సురలు, ఋషులు ప్రస్తుతించారు. రామలక్ష్మణులపై సుమవర్షం కురిసింది. లోకం నిష్కంటకమైంది. విశ్వామిత్రుడు శ్రీరాముని ఆప్యాయతతో దగ్గరకు తీసికొని ఆయన శిరస్సును అఘ్రాణించాడు. ఆ రాత్రి ఆవనంలో వారు సుఖంగా నిద్రించారు. తెల్లవారి దేవతల ప్రార్థనపై శ్రీరామునికి విశ్వామిత్ర ఋషీంద్రుడు సకల శస్త్రాస్త్రములను ఉపదేశించాడు.

1. "తట- తనతీరంలో "క" సుఖాన్నిచ్చేది తాటక ఒక ఘోరరాక్షసి. తనవనం దాటి ఎవ్వరిని బయటకు వెళ్లనీయలేదు. బాటసారులను తన భయంకరాకారముతో హింసించేది. విశ్వసంక్షేమము కొరకు విశ్వామిత్రుడు శ్రీరాముని ద్వారా ఆరాక్షసిని సంహరింప జేశాడు. 2.తన తటమును దాటినీయకుండా నిరోధించేది తాటక. తాటక ఎవ్వరో కాదు మన అవిద్యే - "తాటకి"-"తాడఘి"గా చెప్పుకోవచ్చును. 3."తాడ"తాడించి బాధించి "ఘి"చంపేది.

జీవనారణ్యంలో పయనిస్తూ -దాని ఆవరణను దాటి ఆవలి తీరమైన విరజకు చేరుకోవాలనే బాటసారులందరిని అవిద్య తన భయంకర రూపంతో నిరోధించి తన మాయా ప్రభావాన్ని వారిపై ఆవరింపజేస్తుంది. ఆవలి (విరజా)తీరాన్ని కనిపింపనీయక తిరోధానము గావిస్తుంది. తన ఆవరణను దాటి పోనీయకుండామాయా (శిలా)వర్షాన్ని కురిపిస్తుంది. తన ఆవరణలో ఉండేవారికి సుఖభ్రాంతిని కలిగిస్తుంది.

విశ్వానికి మిత్రుడైన ఆచార్యుడు సంసారారణ్యములో పయనించేవారిలో ఆవలితీరం చేరాలనుకొనే వారిని (ముముక్షువులను)సంరక్షించాలనుకొంటాడు. శ్రీరామ పరమాత్మనే భవారణ్యంలో ప్రవేశింపజేస్తాడు. అయితే అవిద్యాతాటక ఆపరమాత్మను కూడ ఆవరింప ప్రయత్నిస్తుంది.

విశ్వామిత్రాచార్యానుజ్ఞతో అవిద్యా తాటకను శ్రీరామ పరమాత్మ "అష్టాక్షరి"అనే శబ్దవేధితో సంహరిస్తాడు(అమె) అవిద్యనశిస్తుంది. అదే లోక కల్యాణ కరమైనది. విశ్వామిత్రాచార్యుడు తన దగ్గర ఉన్న దివ్యాస్త్ర (మంగళా శాసన)సంపదతో శ్రీరాముని మరింత బలవంతుని గావిస్తాడు.

ఇతిశం

శ్రీసీతారామచంద్ర పరబ్రహ్మణేనమః

# XXVIII సిద్ధాశ్రమము -(వామన వృత్తాంతము)

తాటకవధతో సంతోషించిన దేవతలు, మహర్షులు, విశ్వామిత్రునితో శ్రీరామునికి సకల శస్త్రాస్త్రపదనను గ్రహింపుమని కోరారు. అలాగే మహర్షి సర్వ శస్త్రాస్త్ర సంపదననుగ్రహించాడు రామంచంద్రునికి.

అక్కడి నుండి ఆముగ్గురు తిరిగి తమ ప్రయాణం కొనసాగించారు. మరొక మనోహరమైన మహావనానికి చేరుకొన్నారు. ఆవనాన్ని గురించి విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు వివరింపసాగాడు.

రామభద్రా! వామనుడు బలిని నిగ్రహించిన తరువాత ఈ వనానికి వచ్చి ఇక్కడ ఒక ఆశ్రమాన్ని నిర్మించుకొని, అందులో సుదీర్ఘకాలం తపమొనర్చి సిద్ధివడశాడు. అందుకే ఈ ఆశ్రమానికి సిద్ధాశ్రమమని పేరు.

వామనుడు అదితి, కశ్యపులకు దివ్యవర్ష సహస్రానంతరము కుమారుడుగా జన్మించాడు. తల్లి దండ్రుల అభీష్టము ప్రకారము శ్రీమహావిష్ణువు -వామన రూపుడై, విరోచనుని కుమారుడైన మహాబలి చక్రవర్తిని మూడడుగల భూమిని యాచించి త్రిలోకముల నాక్రమించి, వాటిని ఇంద్రుడికిచ్చివేశాడు.

అదితి, కశ్యపులు తపము చేసి, వామనుని పుత్రునిగా లభించింది ఈ ఆశ్రమంలోనే అందుకే ఈ సిద్ధాశ్రమంలోనే నేను కూడ ప్రస్తుతం నివసిస్తూ యాగాలు చేస్తున్నాను. ప్రస్తుతము ఈ ఆశ్రమానికి రాక్షస భయమేర్పడింది. వారిని నిర్జించి, యజ్ఞరక్షణగావించు" మని విశ్వామిత్రుడు కోరాడు.

❖

వామన వృత్తాంతము కూడ మన జీవితానికి సంబంధించిన మహత్తర సంఘటనే.

బలి అంటే ఇంద్రియ బలము కలవాడు. లేక బలమైన ఇంద్రియములకు లొంగినవాడు. అహంకార, మమకారాలకు అధీనుడాయన. ఆవిధంగా పరిశీలించినప్పుడు మనము కూడ బలి చక్రవర్తులమే. బలి ఇంద్రుని త్రిలోకాలను ఆక్రమించి, నా అంత వాడు లేడని అహంకరించాడు. తనవి

కాని మూడు లోకాలను (నావి) "తనవి" అని మమకారమును కలిగాడు. వామనుడు బలి అహంకార, మమకారములను పోగట్టదలిచాడు. ఈ రెండు దోషములు తప్ప బలి వద్ద మరే లోపములేదు. అంతే కాదు బలిచక్రవర్తి పరమధార్మికుడు. బలి ధర్మశీలము భగవంతుని కూడ వామనునిగా -యాచకునిగా మార్చింది.

వామనుడు "త్రిపద పరిమిత"భూమిని యాచించాడు. త్రిపదములనగా మూడు అడుగులు అని బలిచక్రవర్తి అనుకొన్న సామాన్యార్థము. త్రిపదములంటే స్వర్గ,మర్త్య పాతాళ లోకములనే మూడు స్థానాలు వామనుని దృష్టిలో. అందుకే "త్రిపదములను"యాచించి, మూడపదాలను ఆక్రమించాడు, రెండు అడుగులతో స్వర్గ మర్త్యాలను ఆక్రమించి, మూడవ అడుగును బలిశిరస్సుపై ఉంచి, బలిని పాతాళానికి పంపాడు.

త్రిపదములంటే త్రికరణాలని పేరు గల్గిన మనో,వాక్, కాయములు. ఇవి భగవంతుడు మనకు అనుగ్రహించిన మూడు సాధనాలు. వీటి ద్వారా మనము అతనినే ఆశ్రయించాలి లేక ఈ మూడింటిని ఆపరమాత్మకే అంకితం చేయాలి.

అయితే ఈ మూడు కరణాలను మనవిగా భావించుకొంటున్నాము. మనకే ఉపయోగించుకొంటున్నాము. వాటిపై 'మమకారాన్ని' పెంచుకొంటున్నాము. వీటి ద్వారా మనము ఇష్టమువచ్చినట్లుగా అర్థకామములను అనుభవిస్తున్నాము. వీటి ద్వారా ఇహలోక, పరలోక, ఐశ్వర్యాలను ఆత్మ ప్రాప్తిని మన కొరకు అభిలషిస్తున్నాము.

పరమాత్మ ఈ మూడు కరణాలను తనకే అర్పించాలని కోరుకొంటున్నాడు. ఇహలోక, పరలోక ఐశ్వర్యాల కొరకు ఆత్మప్రాప్తి కొరకు మనము చేసే ఆయాకర్మలను కూడ తనకే సమర్పించాలని పరమాత్మ మనను అడుగుతున్నాడు.

"యత్కరోషి, యదశ్నాసి, యజ్జుహోషి, దదాసియత్

యత్తపస్యసి కౌంతేయ -తత్కురుష్వ మదర్పణం"

"నీవు అనుభవించే లౌకిక ఐశ్వర్యాలను, దానము ద్వారా, యాగము ద్వారా నీవు ప్రయత్నించే పరలోక సంపదలను తపస్సు ద్వారా నీవు అభిలషించే ఆత్మప్రాప్తిని -నాకే అర్పణము చేయు"మని శ్రీకృష్ణుడు అర్జునుని అర్థించాడు.

*శ్రీరామాయనమః*

మనము అనుభవించే ఈ లౌకికైశ్వర్యాలన్ని మనవే, మనకొరకే అనుకొంటాము. మమకారముతోనే హోమ, దానాలను కావిస్తాము. మన ఆత్మప్రాప్తి కొరకే తపస్సు చేస్తాము. ప్రతి పనిలో నేను, నాపై, నాకొరకు అనుకొంటాము. అడుగడుగునా అహంకార మమకార దూషితులమవుతాము. దీని వలన కుండెడు తేనెలో ఒక్క గ్లాసు నీరు పోసినట్లు అవుతుంది. బంగారు బిందెలో చిక్కని పాలల్లో ఒక్క విషబిందువు కలిపినట్లు అవుతుంది.

అమృతమైనా నాకొరకే అనుకొన్నప్పుడు విషఫలితాన్నే ఇస్తుంది. పచ్చిగరళాన్నైనా ప్రహ్లాదుని వలె -పరమాత్మకు చూపి, ప్రసాద బుద్ధితో స్వీకరిస్తే -అమృతముకంటె అధికంగా ఆరోగ్యాన్ని కలిగిస్తుంది.

బలి చక్రవర్తి అహంకార, మమకారాలు, భగవంతుని శ్రీపాదాలను శిరస్సుపై ధరించడంతో మటు మాయమయ్యాయి. మనము కూడ శ్రీమన్నారాయణుని చరణ ద్వంద్వాన్ని శిరసావహించినప్పుడు ధ్యానాను సంధాన తత్పరులమైనప్పుడు మన అహంకార, మమకారాలు పూర్తిగా రూపు మాసిపోతాయి.

ఇతిశం

# XXIX విశ్వామిత్ర యాగసంరక్షణము :-

విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంటనిడుకొని తన సిద్ధాశ్రమంలో ప్రవేశించాడు. ఆశ్రమవాసమునులంతా -విశ్వామిత్రుని పూజించి రామ లక్ష్మణులను అనురాగంతో ఆదరించారు.

ఆరోజే రామలక్ష్మణుల ప్రార్థనపై విశ్వామిత్రుడు యజ్ఞ దీక్ష వహించాడు.

విశ్వామిత్ర మహాముని యజ్ఞ దీక్షా స్వీకారానంతరము, రామలక్ష్మణులు మహర్షిని సేవించి, ఆయజ్ఞమెంతకాలము జరుగుతుందో, ఎంతకాలము రాక్షసుల బారినుండి తాము యజ్ఞరక్షణ కావించాలో తెలుపుమని అడిగారు.

విశ్వామిత్రమునీంద్రుని మౌనదీక్షాకారణంగా అక్కడి మునులు ఆయజ్ఞము ఆరురాత్రులు కొనసాగుతుందని పూర్ణాహుతి, అవబృధాలతో పూర్తి అవుతుందని, అంతకాలము జాగరూకతతో కంటిపై రెప్ప వేయకుండా యజ్ఞసంరక్షణ కావించాల్సి ఉంటుందని వివరించారు.

పంచరాత్రముల పర్యంతము యజ్ఞము నిర్విఘ్నంగా గడిచింది. చివరిదైన ఆరవ రోజు మరింత జాగ్రత్త వహించాలని శ్రీరాముడు లక్ష్మణుని హెచ్చరించాడు.

యజ్ఞదీక్షావస్త్ర శోభిత మహర్షి మండలంతో, స్రుక్స్రువాదులతో, ఆజ్యాహుతులతో, వేదమంత్ర ఘోషలతో అగ్నిజ్వాలలతో యజ్ఞవేదిక అద్భుతంగా ప్రకాశిస్తోంది.

రామలక్ష్మణులు అత్యంత జాగరూకతతో ఆశ్రమవేదికను పరిరక్షిస్తున్నారు. వారు యజ్ఞ వేదిక పై సుదృఢమైన శర పరం పరలతో "రక్షణ కవచాన్ని" నిర్మించారు. అందరి దృష్టియజ్ఞ నిర్వహణపై కేంద్రీకృతమైంది.

ఇంతలో ఆ ఆశ్రమప్రాంతమంతా అదిరేట్లు భయంకర ధ్వనులు వినిపింపసాగాయి. వర్షాకాలంలోని మేఘాలవలె, ఆకసమంతా నల్లని రూపుదాల్చింది. మారీచసుబాహువులు వికృత రూపాలతో, పెడబొబ్బలతో పైపైకి రాసాగారు. రక్త వర్షాన్ని కురిపించసాగారు.

రాముడు లక్ష్మణుని హెచ్చరించాడు మరొక మారు. వెంటనే

శ్రీరామచంద్రుడు మారీచుడి పై మానవాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రము మహామాయావి అయిన మారీచుని మోహింపజేసి నిర్వీర్యునిగావించింది. వాయ వ్యాస్త్రముతో రామభద్రుడతనిని శతయోజన విస్తీర్ణమైన మహాసాగరము బయటపడవేశాడు.

రాముడు ఆగ్నేయ దివ్యాస్త్రాన్ని సుబాహువు వక్షస్థలంపై ప్రయోగించాడు. భయంకర బలసముపేతుడైన సుబాహువు ఆగ్నేయాస్త్ర విశిఖలలో దగ్ధమయ్యాడు. మిగిలిన రాక్షసులందరిని కూడ వాయ వ్యాస్త్రంతో నిర్జించాడు.

పటిష్ఠమైన బాణపరంపరలతో రామలక్ష్మణులు కల్పించిన అతి దృఢమైన ఆవరణ కారణంగా సుబాహు మారీచ రాక్షసులు కురిపించిన రక్తవర్షములో నుండి ఒక్క బిందువు కూడ యజ్ఞవేదికపై పడలేదు. వేదిక ఎంత మాత్రము అపవిత్రం కాలేదు.

విశ్వామిత్రుని యాగము పవిత్రంగా, ప్రశాంతంగా, నిర్విఘ్నంగా పరిసమాప్తిచెందింది. అవబృధస్నానానంతరము విశ్వామిత్ర సంయమీంద్రుడు రామలక్ష్మణులను అప్యాయతతో చేరబిలిచి, "రామా!నేను ధన్యుడనయ్యాను. ఈ సిద్ధాశ్రమము సార్థకమైంది. అన్నాడు.

విశ్వామిత్రుడింతకు ముందు అనేక పర్యాయాలు అదే ఆశ్రమంలో యజ్ఞాలు చేశాడు. అయితే ప్రతి పర్యాయము మారీచ, సుబాహువుల దురాగతాల మూలంగా యజ్ఞాలు అపవిత్రమై, అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

వివేకశాలి అయిన విశ్వామిత్ర ఋషి తన యజ్ఞ విఘ్నాలకు కారణము తన పాపములే అని గ్రహించాడు.

మనపాపములు మూడు రకాలు:- **1.**సంచితములు, **2.**ప్రారబ్ధములు **3.**ఆగామ్ములు

**1.**సంచితములు: అంటే అతి ప్రేమతో డబ్బును మూటగట్టుకొన్నట్లు

-మూటగట్టుకొన్న పాప, పుణ్య రాశులు. అవి గుట్టలు గుట్టలుగా పేరుక పోయి ఉంటాయి.

**2.**ప్రారబ్ధములు:-సంచితరాశుల నుండి ఈ జన్మలో మనము అనుభవించడానికి భగవంతుడు సంకల్పించిన పాపపుణ్యాలు. మన జన్మతోనే వాటి అనుభవం మొదలవుతుంది.

**3.**ఆగాములు:-భవిష్యత్తులో మనము అనుభవించాల్సిన సుకృత దుష్కృతాలు మనము ఇంకా చేయబోయే కర్మలని కూడ కావచ్చు.

అయితే ఈ మూడు రకాల కర్మలను రెండు భాగాలుగా కూడ విభజించవచ్చును **1.**సంచిత, ప్రారబ్ధములను ఒకవైపు **2.**ఆగామి కర్మలను మరొకవైపుగా పరిశీలించవచ్చును.

సంచిత ప్రారబ్ధములనంతములు. అనుభవించనిదే అవి తగ్గవు. అవి పూర్వ జన్మ కర్మలు, "ధేను సహస్రములున్నావత్స తన తల్లి ఆవును సులభంగా గుర్తించి చేరుకొన్నట్లు", మనము ఏజన్మలలో ఎక్కడ ఉన్నా పూర్వకర్మలు మనను విడిచి పెట్టవు. వాటిచేతులు అతి దీర్ఘములు. అవి "సుబాహువులు" వాటిని పూర్తిగా మనము అనుభవించాల్సిందే. లేదా భగవదాశ్రయమును పొంది, భగవదనుగ్రహాగ్నిలో అనంత పాపపుణ్యాతులా రాశిని దగ్ధము చేయించాలి.

విజ్ఞానఖని అయిన విశ్వామిత్ర మునీంద్రుడు తన సంచితారబ్ధ కర్మ అనే సుబాహువును శ్రీరామచంద్ర స్వామి నిగ్రహాగ్నిలో దగ్ధము చేయించాడు.

ఆగామి పాపపుణ్యకర్మలను వివేక శీలి తనకు అంటకుండా చూచుకొంటాడు. ప్రపన్నుడైన విశ్వామిత్ర పరమర్షి ***"మారీచి అనే ఆగామి కర్మను"*** శ్రీరామచంద్రుని దయా మారుతముతో శతయోజన (వర్ష) విస్తీర్ణమైన భవ మహాబ్ధి యొక్క బయటి తీరములో పడగొట్టిస్తాడు.

***"తదధిగమ ఉత్తర పూర్వాఘ యోర్లేష వినాశౌ"***అన్నప్రకారము పూర్వ కర్మలకు వినాశము, ఉత్తర కర్మలకు అశ్లేషము విధింపబడ్డాయి.

***"యథా ఇషీక తూలం అగ్నౌ ప్రోతం ప్రదూయేత, ఏవం హాస్య***

***సర్వే పాప్మానః ప్రదూయంతే"*** గదినిండా దూది ఒకే నిప్పురవ్వతో దగ్ధమైనట్లు మన పూర్వకృత పాపరాశి సమస్తము మనకు అనుకూలంగా భగవన్నిగ్రహాగ్నిలో దగ్ధమౌతుందని ఉపనిషత్తు వివరిస్తోంది.

విశ్వామిత్రముని ఇంతకుముందు ప్రతి పర్యాయము ఎంతో ప్రయత్నించి యాగాలను చేయాలనుకొన్నాడు. ప్రతి పర్యాయము అతని మహత్తర స్వప్రయత్నము విఫలమైంది.

ఇక ఈ పర్యాయము తన భారాన్ని శ్రీరామునియందు సమర్పించాలనుకొన్నాడు. శ్రీరాముడు సాక్షాత్తుగా పరమాత్మే అని అతడి నిశ్చయము. దీనినే భరన్యాసము, న్యాసము, శరణాగతి, ప్రపత్తి పేర్లతో వ్యవహరిస్తారు.

"న్యాసమేషాంతపసాం అతిరిక్త మాహుః"అంటుంది శృతి. న్యాసముకంటె మించిన తపస్సేలేదు.

ఈ పర్యాయము శ్రీరామునిపై భారము ఉంచి. యజ్ఞముచేశాడు. అది ఫలించింది. మనము కూడా విశ్వామిత్రునివలె సంయమనము కలిగి శ్రీరామునిపై పూర్తిగా భరన్యాసము చేస్తే మన పూర్వకర్మలు నశిస్తాయి ఉత్తర కర్మల ఫలము మనకంటదు.

ఓం తత్సత్.

శ్రీరామాయనమః

శ్రీసీతారామచంద్ర పరబ్రహ్మణేనమః

# XXX మిథిలానగర ప్రస్థానము - కుశనాభుని తనూజలు

విశ్వామిత్ర యాగ సంరక్షణ తరువాత సిద్ధాశ్రమ ఋషులు రామలక్ష్మణులతో విశ్వామిత్రుని మ్రోల మిధిలేశుని శివధనుస్సు గురించి ముచ్చటించారు.

తెల్లవారి విశ్వామిత్రుడక్కడి ఋషుల నక్కడే నిలిపి వారి సెలవు తీసికొని - ఆ ఆశ్రమమును విడిచి రామలక్ష్మణులతో కూడి ఉత్తర దిశకు బయలుదేరాడు.

వారు ఆసాయంత్రము శోణా నదీతీరము చేరుకొని స్నానసంధ్యాదులు ముగించుకొన్నారు. రామలక్ష్మణుల కోరికపై విశ్వామిత్రుడు కుశనాభుని చరిత్రము వినిపించాడు.

బ్రహ్మ తనూజుడైన కుశమహర్షి వైధర్భియందు కుశాంబుడు, కుశనాభుడు, అధూర్త రజసుడు, వసువు అను కుమారులను కల్గి ఉండెను. వారు వరుసగా కౌశాంబి, మహోదయము, ధర్మారణ్యము, గిరవ్రజము అనే నాలుగు నగరాలను నిర్మించి పాలించారు.

కుశనాభునికి సర్వాంగ సుందరులైన నూరుగురు కుమార్తెలు కలిగారు. వారు యౌవనాభరణ భూషితలై ఒకనాడు ఉద్యానవనములో విహరిస్తుండగా వాయుదేవుడు వారిని మోహించి గాంధర్వ వివాహము చేసికోదలిచాడు. పితృధీనలైన ఆయువతులందుకు నిరాకరింపగా, ఆగ్రహముతో వాయువు వారినందరిని కుబ్జలుగా మార్చాడు.

కుశనాభుడు వారి వికృత రూపములగాంచి దుఃఖించి పెద్దలను సంప్రదించి, మహానుభావుడు, ఊర్మిళా చూళీ తనయుడైన బ్రహ్మదత్తునికి

వారిని కన్యాదానముగావించాడు. బ్రహ్మదత్త కరగ్రహణముతో వారందరికి అపురూప లావణ్యాశోభలు యథా పూర్వము సంప్రాప్తించాయి.

యౌవనము, శరీర సౌందర్యము అశాశ్వతమైనవి. వాటిని దుష్కామ ప్రభంజనము అపహరింప సమకట్టుతుంది. కామానికి నీవు వశం కాకు. కామము క్రోధంగా మారి నీ స్వరూపమును చెడగొట్ట సంకల్పిస్తుంది. అప్పటికి శాంతి వహించు.

నీ కన్న తండ్రి నిన్ను బ్రహ్మదత్తుడనే ఆచార్యునికి అప్పగిస్తాడు. ఆచార్యుడు నీకు చేయూతనిస్తాడు. నిన్ను అనేక విధాలుగా సంస్కరిస్తాడు. తక్షణమే నీకు అపూర్వ ఆత్మ సౌందర్య సంపదలు భగవత్కృప వలన లభిస్తాయి నీశాంతమే నీకు సర్వదా రక్షకము.-ఇది కుశనాభ తనూజలు మనకందించే సందేశము.

# XXXI కౌశికీ చరిత్ర

కుశనాభుడు తన శతసుతలను బ్రహ్మదత్తునికిచ్చి వివాహము చేసి పంపాక, తనకు సంతానము లభించాలని, పుత్రకామేష్టిగావించాడు. బ్రహ్మతనయుడైన కుశమహర్షి ఆశీర్వాద ఫలితంగా ఆయనకు "గాధి' అనే తనూజుడు కల్గాడు.

ఆగాధికి విశ్వామిత్రుడనే తనయుడు, సత్యవతి అనే తనయకలిగారు. సత్యవతికి ఋచీకుడనే మహర్షితో పరిణయము జరిగింది. ఋచీక నిర్గమనముతో సత్యవతి "కౌశికీ" అనే పుణ్యనదీరూపము ధరించి లోకాన్ని పావనం చేస్తుంది.

విశ్వామిత్రుడా నదీతరంలోనే ఆశ్రమము నిర్మించుకొని తపస్సు జేశాడు. అక్కడి నుండి దక్షిణము దిశలో నున్న సిద్ధాశ్రమమునకు వెళ్లి -యాగములు చేస్తూ -వాటికి నిరంతర విఘ్నములు కలుగగా వాటిని స్వప్రయత్నముతో నివారింప జాలనని నిర్ణయించుకొని -శ్రీరాముని శరణు వేడి -ఆయనపై రక్షణ భారము సంపూర్ణంగా ఉంచి తపస్సిద్ధివడసి -సీతాకల్యాణము ద్వారా శ్రీరామునికి ఆత్మలాభమనే కైంకర్యము సమర్పించి తిరిగి కౌశికీ నదీ తీరానికి చేరదలచాడు. తన శేష జీవితాన్ని సోదరీ సమీపంలో యజ్ఞయాగాది శుభకర్మలను కావిస్తూ గడుపాలనుకొన్నాడు.

గాధి తనూజ అయిన సత్యవతి పితృనిర్దేశముతో ఋచీకుని పరిణయమాడింది. ఆయనతో గృహస్థ ధర్మముల నిర్వర్తించింది. తదనంతరము ఒక పుణ్యనదిగా మారి - తన జీవితమంతా తాను ప్రవహించే స్థలాలను సస్యశ్యామలము గావిస్తూ పుణ్యమయము చేస్తూ గడిపింది.

సత్యవతి -కౌశికీ నదిగా మారి మన జీవిత సత్యాన్ని ప్రబోధిస్తుంది.

జీవితమంటే నీవు నీ సుఖం కొరకు జీవించడము కాదు. గార్హస్థ్య జీవితము-భోగమయ జీవితము - నీజీవితంలో ఒక భాగము మాత్రమే.

ఒకనది ఎప్పుడు తనకొరకు ప్రవహింపదు. అవిశ్రాంతంగా అనేక స్థలాలను స్పృశిస్తూ -వాటిని సస్యశ్యామలము చేస్తూ ముందుకు వెళ్లుతుంది. నీవు కూడ నీ పూర్తి జీవితము కాకున్నా జీవితంలో కొంత భాగమైనా పరులదుఃఖ నివారణ కొరకు ప్రయత్నించు -నీవు మేలు చేసినవారు బాగు పడడమే నీకు కావలసింది. వారినుండి ఏప్రతి ఫలాన్ని అపేక్షింపకు. వీలైనంత వరకు అనేక జనులకు నీ సేవలను అందించు. ఏ ఒక్క వ్యక్తికో సేవ చేసినంత మాత్రమున నీలక్ష్యము నెరవేరదు. ఆర్తులను నిరంతరము ఆదుకొనుటలోనే మాధవ సేవాఫలాన్ని పొందు.

ఓం తత్సత్

శ్రీరామాయనమః

శ్రీసీతారామచంద్ర పరబ్రహ్మణేనమః

# XXX కుమార సంభవము

శోణా నదీతీరంలో ఆ రాత్రి నిద్రించి -మరునాడు విశ్వామిత్రుని అనుసరించి దానిని తరించి-మధ్యాహ్నం వరకు జాహ్నవీ తటాన్ని చేరుకొన్నారు రామలక్ష్మణులు.

అక్కడ స్నాన సంధ్యాధి నిత్య కర్మల నిర్వర్తించారు. విశ్వామిత్రముని గంగానది శివతేజాన్ని భరించిన గాధను వివరింపసాగాడు రామలక్ష్మణులకు.

హిమవంతునికి మేరు తనయ అయిన మనోరమ యందు గంగా, పార్వతులనే తనూజలు కలిగారు.

హిమవంతుని యాచించి -దేవతలు గంగామతల్లిని తమ లోకానికి తీసికవెళ్లారు. అక్కడ సురనదీ రూపంలో గంగాదేవి స్వర్లోక వాసులను సంతృప్తిగావించింది.

పార్వతి మహోగ్ర తపము ద్వారా పరమశివుని సంప్రీతునిగావించి -ఆ పరమేశ్వరునే పరిణయము చేసికొంది.

శివ పార్వతులు బహుకాలము భోగింప సాగారు. శివుని అమోఘ వీర్యమును కాలము గడిచిన కొలది భరించుట దుష్కరమని, దానివలన ప్రళయమే సంభవించునని -భీతులై దేవతలు వారి ఏకాంతమునకు భంగము కలిగించారు.

సురుల కోరిక పై శివుడు తన తేజాన్నిసర్వక్షమాశీలయైన భూమిలో విడిచాడు. ఆమహాతేజము భూమియావత్తునిండి పర్వతాలను, వనాలను వ్యాపిస్తూ -వసుంధరకు దుర్భరం కాసాగింది.

ఆదితేయులు -అగ్ని దేవుని -అవనితో పాటు శివ వీర్యమును ధరింపుమని ప్రార్థించారు. అగ్నిదేవుడు అందుకు అనుమతించాడు. శ్వేత పర్వతము - దివ్యశరవణము మొదలైనవి శివ వీర్యప్రభవములయ్యాయి.

దేవతలు సంప్రీతులై ఉమామహేశ్వరుల నారాధించారు. అయితే శర్వాణి వారి పరిచర్యలకు సంతుష్టురాలు కాలేదు. తనకు మహేశ్వరతేజము దక్కలేదనే కినుకతోస్వర్గ వాసులందరు సంతాన హీనులుగా మిగిలిపోతారని శపించింది.

తనకు దక్కని శివ వీర్యాన్ని ధరించిన భూమి-నిరంతరము మార్పులను చెందుతూ స్థిరత్వము లేక అనేకులకు భార్యగా నుంటుందని కఠినోక్తి గావించింది.

దేవతలకు రాక్షసులతో జరిగే యుద్ధాలలో సరియైన సేనాధిపతి లేక ఘోరబాధలు సంభవించాయి. వారి మొరను వినిన పరమేశ్వరుడు అగ్నిదేవునితో -తన తేజాన్ని గంగానదిలో విడువుమని ఆదేశించాడు. గంగా-హుతవాహనుల సంగమం వలన కుమార సంభవము జరుగుతుందని-ఆ బాలుడు పార్వతి సంప్రీతికి కూడ పాత్రుడౌతాడని-ఆయన దేవ సేనాని యై అసురులనణచుతాడని అభయ మొసగాడు మహేశ్వరుడు.

సురల ప్రార్థనతో స్వర్గంగ స్త్రీరూప ధారిణియై అగ్నిదేవుని నుండి ఆ శివతేజాన్ని గ్రహించింది. కాని అఖిలలోకములకు ఆహ్లాదాన్ని కలిగించే ఆనదీమతల్లికి కూడ ఆతేజము దుస్సహమయింది. ఆతల్లి ఆ వీర్యాన్ని తన జలాలలో వదిలింది. ఫలితంగా, బంగారము, సీసము, మొదలైన అతి మూల్యమైన లోహము లేర్పడ్డాయి.

చివరకు ఆతేజము నుండి హిమాలయ పాదస్థానములో గంగానదీ తీరములోని రెల్లు గడ్డిలో శివకుమారుడావిర్భవించాడు. ఆ కుమారునికి పాలివ్వడానికి ఆరుగురు కృత్తికలు ముందుకొచ్చారు. ఆరుగురు తల్లుల పాలు ద్రావినందుకా కుమారుడు షాణ్మాతురుడయ్యాడు. కృత్తికల చేపెంచబడినందు వలన కార్తికేయుడని ఖ్యాతి వహించాడు - ఆరు ముఖములతో ఏక కాలంలో ఆరుగురు తల్లుల స్తన్యము గ్రోలినందువలన "షణ్ముఖుడు"అని ప్రసిద్ధినందాడు. శివతేజము స్కన్నమగుట ద్వారా సంభవించినందుల కాయన "స్కంధుడనే" పేరువడశాడు.

శివ వీర్యానికి కారణమైన పార్వతీదేవి -దేవతలందరిలో శ్రేష్ఠత్వమును పొందింది. శివతేజము ధరించినందు వలన గంగానది నదులన్నిటిలో శ్రేష్ఠ వాహిని అయింది.

శివ వీర్యాన్ని దేవతలు ఎంత భగ్నము చేయాలనుకొన్నా అది ఎన్ని స్థానాలలో పతనమైనా -చివరకు ఆతేజము కుమారస్వామి సంభవానికి కారణమైంది.

భగవత్సంకల్పము అమోఘమైనది. ఆ సంకల్పమును నిరోధించాలని అహంకారముతో ఎంత వారు ప్రయత్నించినా -ఆ సంకల్పము నిష్ఫలము కాదు. చివరకు అది సఫలము కాకతప్పదు.

భగవత్సంకల్పము ననుసరించిన వారికి -అ అనుసరణము ఆ కాలములో కొంత కష్టాలను కల్గించినా -చివరకు వారు ఉత్తమత్వమును పొందుతారు.

ఇతిశం

శ్రీరామాయనమః

శ్రీసీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# XXX సగరయాగము:-

రామ లక్ష్మణులు కుమార సంభవ వృత్తాంతమును విన్న తరువాత హర్షసముపేతులై గంగావతరణ గాధను విస్తారంగా వినదలిచారు. విశ్వామిత్రుడు చిరునవ్వుతో సగరయాగము గురించి వివరింపసాగాడు.

అయోధ్యాధిపతులలో పూర్వుడు, శ్రేష్ఠుడు సగరుడు. సవతి తల్లి పెట్టిన గరళమును గర్భములో జీర్ణించుకొని ఉద్భవించిన మహాశూరుడు. సగరుడనగా గరళమును (జీర్ణించుకొని)కలిగినవాడు.

ఒక పర్యాయము సగర మహీపాలుడు అశ్వమేధ యాగము నిర్వహిస్తున్నాడు. అతని యజ్ఞాశ్వము దేశాటనకై విడువబడింది. అంశుమంతుడా అశ్వరక్షకుడుగా వెళ్లాడు. సంవత్సర కాలము సంపూర్ణమైంది. అశ్వము రాజధానికి తిరిగి వచ్చింది.

యజ్ఞ సన్నాహాలు పూర్తి అయ్యాయి. క్రతువు ఆరంభము మరుసటి రోజే. రాక్షస శరీరంతో ఇంద్రుడు యజ్ఞాశ్వాన్ని అపహరించాడు. రక్షింపబడని అశ్వము యజ్ఞ కర్తకు అనర్థాన్ని కల్గిస్తుంది. సగరుడు దీక్షాబద్ధుడు -కనుక యజ్ఞా శ్వమును తీసికొని వచ్చుటకు తన అరవై వేల మంది పుత్రులను పంపాడు.

వారందరు మహాసంరంభముతో హుటాహుటి బయలుదేరారు. భూమిని తమ వజ్రముష్టులతో బ్రద్దలు కొడుతూ వెళ్లసాగారు. దారిలో నాగులు, అసుర రాక్షసులు మర్దింపబడ్డారు. భూమి అంతా గుంటలు గుంటలుగా తవ్వబడసాగింది.

ఈ హఠాత్ప్రళయానికి దేవదానవ, గంధర్వ, యక్ష, రాక్షసాదులు బ్రహ్మకు మొరలిడగా భగవంతుడు "కపిల"రూపధారియై, భూమి పైననే ఉన్నాడని -

ఆయనయే ఈ ఉపద్రవాన్నుండి రక్షిస్తాడని బ్రహ్మవచించాడు.

ఆవిధంగా భూమంతా త్రవ్వి, దానిచుట్టూ పరిక్రమించి, ఎక్కడ కూడ యజ్ఞాశ్వం కాన రాక తిరిగి రిక్త హస్తులై సగరుని చేరారు ఆయన పుత్రులు. సగరుడు రోషసాగరుడై మళ్లీ భూమినంతటిని త్రవ్వి, అంతటా వెదికి అశ్వంతోనే తిరిగి రావాలని, కాని ఊరక రాకూడదని గద్దించాడు. .

సాగరులు మార్గ మధ్యములో పూర్వదిశలో "విరూపాక్ష"దిగ్గజాన్ని, దక్షిణ దిశలో 'మహాపద్మ'మత్తేభాన్ని, ఉత్తర దిశలో "భద్ర"గజాన్ని, పశ్చిమ దిశలో 'సౌమనస్య"ద్విరదాన్ని దర్శించారు. మళ్లీ భూఖననం చేస్తూ వెళ్లి "కపిల"మహర్షిని గాంచారు. ఆమహానుభావుని "అశ్వాపహర్త"గా భావించి, ఆయనపైకి ఉరికారు. వారి దుర్వృత్తిని గమనించి కపిలుడు హుంకారము గావించాడు. సాగరులందరు భస్మమయ్యారు.

సగరుడు తన షష్టి సహస్ర సుతులు తిరిగి రానందున, అశ్వమును (తిరిగి) తేవడానికై తన మనుమని అంశుమతుని ఆజ్ఞాపించాడు. ఆయన ఖడ్గధారియై బయలుదేరి, తమ పితరులు త్రవ్విన త్రోవలోనే పయనిస్తూ, మార్గస్థుల మర్యాదలను స్వీకరిస్తూ, దిగ్గజాలను దర్శించాడు. వాటి ఆశీర్వాదంతో, చివరదాకా వెళ్లి అక్కడ భస్మీ భూతులైన పితరులను దర్శించి, దుఃఖ పరవశుడయ్యాడు.

అక్కడికి సుపర్ణుడు గరుడుడేతెంచి, అంశుమంతుని ఓదార్చి వారికి ఉత్తమ లోకావాప్తిని కల్గించడానికి, లోకపావనియైన గంగామతల్లిని అవతరింపజేయుమని ఆనతిచ్చి వెళ్లాడు.

ధైర్యమును చేజిక్కించుకొని, యజ్ఞాశ్వాన్ని తీసికొని సగరుని సమీపించాడంశుమంతుడు. సగరుడు తన కొడుకుల దుర్మరణాన్ని గురించివిని కూడ యాథావిధిగా యజ్ఞము పూర్తి గావించు కొని ముప్పైవేల సంవ్సరాలు పాలన గావించి, గంగావతరణ విధిని నిర్ణయించకుండానే స్వర్గతుడయ్యాడు.

సగరుడు మహానుభావుడు, గర్భస్థుడుగానే గరళమును జీర్ణించుకొన్న మహావీరుడు. అశ్వమేధ యాగనిర్వహణకు సంకల్పించాడు. ఒకడు కాదు, ఇద్దరు కాదు అరువై వేల పుత్రులు అండగా నిలిచారు. కాని ప్రశాంతంగా యజ్ఞ సమాప్తి గావింపగల్గలేదు. షష్టి సహస్రసాగరులు సాహంకారులై అశ్వానయనార్థము బయలుదేరారు. వారి అహంకారము-వారిని కపిలుని మహత్వమును గుర్తింపనీయలేదు. అతనిని నశింపజేయడానికి ప్రయత్నించారు. కాని ఆయన ఆగ్రహానికి తామే నశించారు. వినయశీలుడైన అంశుమంతుడు అశ్వాన్ని తిరిగి తెచ్చాడు. సగరుడు మొత్తము పై యాగసమాప్తి జేశాడు.

ఎంతటి గొప్ప వారైనా తాము అనుకొన్న ప్రతి విషయాన్ని సాధింపజాలరు. భగవత్సంకల్పానికి విరుద్ధంగా "కోన్యోzస్తి సదృశోమయా"అని అహంకరించి, హుంకరిస్తే భగవదాగ్రహజ్వాలల్లో భస్మం కాక తప్పదు. అంశుమంతుని వలె వినయవంతులై వెళ్తే సహస్ర సాగరులకు అసాధ్యమైన విషయాన్ని అతి సులభంగా అందుకోవచ్చు. మన వినయమే విశేష సౌఖ్యప్రదము. మన శాంతమే మనకు సకల రక్ష!సుఖదుఃఖాలను సహించి పరిస్థితులతో సగరునివలె రాజీపడుతూ జీవించక తప్పదు.

శ్రీరామాయనమః

శ్రీరామచంద్రస్వామినే నమః

# XXXIV భాగీరథీ అవతరణము

సగర నిర్యాణము తరువాత అయోధ్యాధి పతిగా కోసలదేశ ప్రజలు అంశుమంతుని (మహారాజుగా)వరించారు. కొంతకాలము రాజ్యపాలన గావించి, అంశుమంతుడు తన తనయుని దిలీపుని పట్టాభిషిక్తుని చేసి, గంగావతరణోద్యోగము కొరకు తీవ్రముగా తపమొనర్చుతూనే స్వర్గ ప్రాప్తినందాడు

దిలీపునికి కూడ గంగావతరణ మార్గము గోచరింపలేదు. ఆయన ముప్పైవేల సంవత్సారాలు యజ్ఞములను, ఇష్టులను కావిస్తూ అసంపూర్ణ మనోరథుడుగానే మరణించాడు.

దిలీప తనయుడు భగీరథుడు, తన పూర్వులయిన అంశుమంత, దిలీప మహారాజుల ప్రగాఢ వాంఛ బాల్యమునుండే భగరథునిలో పట్టుదలను కల్గించింది. ఆయన తరువాత అయోధ్యాధిపతిగా సింహాసనమలంకరింప దగిన వారసుడాయనకు జన్మింపలేదు. అయినప్పటికి ఆయన అసంతృప్తితో ఆగిపోలేదు. మహామాత్యుల పై మహిభారాన్నుంచి కఠోరతపోదీక్షతో ఆయన కాంతారముల నాశ్రయించాడు.

సహస్ర వర్షములు గోకర్ణంలో భగీరథుడు ఘోరతప మాచరించాడు. భగీరథుని తపో దీక్షకు బ్రహ్మదేవుడు ప్రత్యక్షము కాక తప్పలేదు. గంగావతరణమున కంగీకరించాడు. అయితే గంగార్భటిని భరించుటకు పరమశివుని ప్రసన్నం చేసికొమ్మని ఆదేశించాడు. స్వయంగా క్షమాశీల అయి సర్వంభర అయిన భూమి కూడత్రిపథగా వేగాన్ని భరింపజాలదని తెలిపాడు.

అంగుష్ఠమాత్ర స్థిరుడై భగీరథుడు మరొక వత్సరం తీవ్ర తపమాచరించాడు. భక్త వశంకరుడైన శంకరుడు సంప్రీతుడై గంగాధారణకు తన సంసిద్ధతను తెలిపాడు.

ఆకసము నుండి మహావేగంతో గంగాదేవి క్రిందికి ఒక్కసారి దుమికింది. క్రింద నిలిచి ఉన్న మహాదేవుని, మహీధరాన్ని భూతలంతోపాటు, పాతాళానికి కొట్టుక పోతానని అహంకరించింది హుంకరించింది.

రుద్రుడు గంగాదేవి ఉద్ధతినిగాంచి, తనజటా మండల గహ్వరంలో మహావేగవతి అయిన స్వర్గంగను బంధించి స్తబ్ధనుగావించాడు.

భగీరథుడు హతాశుడై తిరిగి పరమేశ్వరుని ప్రసన్నం చేసికొన్నాడు. ఒక్కొక్క గంగాబిందువును శివుడు క్రిందికి వదిలాడు. ఆ బిందువు హిమాచలముపై పడి "బిందు సరోవరమైంది". అక్కడి నుండి ఏడుపాయలై హ్లాదిని, పావని, నళిని అని మూడు నదులుగా తూర్పువైపు ప్రవహించింది. సుచక్షువు సీత, సింధూ నదముల రూపములతో పడమటి వైపు ప్రవహించింది. ఏడవ పాయగా భగీరథుని వెంట ఏతెంచసాగింది.

గగనము నుండి (గం)భూమిపైకి దిగి వచ్చే ఆగంగామతల్లిని దేవదానవ, యక్ష, మహర్షి సంఘములు మహాభక్తితో సేవింపసాగాయి. వారు ఆ పవిత్ర జలాల్లో స్నాన, పానాదులు చేశారు.

భగీరథుని అనుసరిస్తూ గంగామతల్లి కన్న కుమారుని లీలగా అనుసరించే మాతృమూర్తివలె ముందుకు అనుగమింప సాగింది.

మార్గమధ్యములో జహ్నుమహర్షి తన ఆశ్రమంలో ప్రశాంతంగా తపస్సు చేసి కొంటున్నాడు. ఆయనను -ఆశ్రమాన్ని చూడగానే గంగా గమనంలో మళ్లీ మహోద్ధృతి ప్రవేశించింది.

మహర్షి యజ్ఞవాటిక, ఆశ్రమము -పరిసర ప్రాంతమంతా ప్రవాహమయమైంది.

జహ్నుమహర్షి కనులు దెరిచాడు. ఆనదీ వేగాన్ని గమనించాడు. ప్రశాంతంగా గంగా జలాన్నంతటిని పానంజేశాడు. భగీరథునికి తన వెను వెనుక సుడులు తిరుగుతూ ప్రవహించే గంగానది యొక్క సవ్వడి వినిపించలేదు. ఆశ్చర్యంతో వెనుదిరిగి చూచాడు. అతనికంతా అయోమయము కలిగింది. ప్రవహిస్తూ వచ్చే పావన గంగానదికి బదులు (ప్రశాంత)తపోనిష్ఠా గరిష్ఠుడైన జహ్ను మహాముని దర్శనమిచ్చాడు. ఆయన ఆ మహాత్ముని మనసారా ప్రార్థించాడు. కరుణామయుడైన -ఆమహాను భావుడు తన దక్షిణ కర్ణం నుండి గంగా ప్రవాహాన్ని వినిర్గతం చేశాడు.

జప తపోనిష్ఠా గరిష్ఠుడైన జహ్నుమహాముని మహా ప్రభావానికి స్వర్వాహిని సంభ్రమాశ్చర్య చకిత అయింది. ఆయన మహిమకు లొంగి వినయంతో తనయ భావాన్ని వహించింది అందుకే "జాహ్నవి" అనే పేరు కలిగింది గంగానదికి.

జాహ్నవీ జలాలు సాగరాల్లో ప్రవేశించి -వాటినుండి రసా తలానికి ప్రవహించి సాగరులకు స్పర్శించివారికి పవిత్రతాప్రాప్తిని కలిగించాయి.

పవిత్ర త్రిపథగా సలిల స్పర్శతో సగర తనయులందరు శాప విముక్తులై తమ తమ దివ్యలోకాలకు వెళ్లి పోయారు.

గంగావతరణ మొక అత్యత్భుత దివ్య సంఘటన సంభ్రమాశ్చర్యకరమైన సురనదీ అవతరణ సుందర దృశ్యమును కనులార సేవించిన సురలు, మహర్షులు, యక్ష, కిన్నర, కింపురుష, సిద్ధ, సాధ్య మహోరగులందరు ఆనాడు ఆ పవిత్ర జలావగాహంతో తరించారు.

ఆ అలౌకిక మహోద్భుత వృత్తాంతాన్ని వీను లారవిని సేవిస్తుండే మనందరికి కూడ పావన గంగామ తల్లి -తరణోపాయమౌతుందనడంలో అణువంత కూడా అనుమానం లేదు.

గంగావతరణము మన మనస్సులంకెతో ఆహ్లాదాన్ని కలిగించి -శాశ్వత ముద్రను వేస్తుంది.

మన మనస్సులో భక్తి గంగ అవతరించాలి. ఆగంగమన మనస్సులో సాంతం ప్రవహించకుండా మధ్యలో మన అహంకారము నిరోధిస్తుంది. మనలోని అహంకారాన్ని - దానివేగాన్ని నిగ్రహించడానికి ఆ మహాదేవునే శరణు వేడాలి. మహాదేవుని మహిమ వలన అహంకారము స్తబ్ధమౌతుంది. అయితే ఒక్క బిందువుగానే అది మళ్లీ బయలుదేరి ఒక సరోవర విశాలమై, సప్తావరణముల ముంచి ప్రవహిస్తు ముందుకొస్తుంది. అప్పుడు ఆ అహంకారము మహోద్ధతిని అణచడానికి ఆశ్చర్యకర మహిమోపేతుడైన ఆచార్యుడే సమర్థుడు. ఆచార్యుని అద్భుత మంత్ర మహిమకు అహంకారము పూర్తిగా లొంగిపోతుంది. ఆచార్యుని ఆశ్రయించిన మనవెంట నిరహంకారో పేతయైన భక్తి గంగ నిర్మలమై మన మనోరథాన్ని పూర్తి జేసి, మనను ధన్యులను జేస్తుంది.

అయితే భక్తి గంగావతరణ మహోద్యోగానికి మన భగీరథ ప్రయత్నము, మహాదేవుని రక్షాదీక్ష, జహ్నుదేశికుల కృప తోడుగా నిలవాలి.

ఓం తత్సత్

శ్రీరామాయనమః

శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# XXXV సముద్ర మథన వృత్తాంతము

గంగావతరణ గాధను విశ్వామిత్రుని ద్వారా విన్న రామలక్ష్మణులు ఆ రాత్రి సుఖంగా గంగాతీరంలో నిద్రించి, ఉదయం కావడంతోనే విశ్వామిత్ర సమేతంగా నౌకా సహాయంతో గంగోత్తర తీరం చేరి, అక్కడ విశాల పురాన్ని చేరారు. రామ లక్ష్మణుల కోరికపై మహర్షి విశాల పురి పూర్వవృత్తాంతాన్ని సముద్ర మథనగాధను వివరించాడు.

దేవతలు, దైత్యులు -తాము అజరులు, అమరులు కాదలచి క్షీరసాగరంలో నిక్షిప్తములయిన అమూల్య ఔషధాల సారాన్ని సేవింపదలచారు.

క్షీరసాగరంలో మంధరాద్రిని కవ్వంగా జేసికొని, దానికి అనేక శిరస్సులు గల వాసుకి మహాసర్పమును త్రాడుగా చుట్టి, మథనానికి సిద్ధమయ్యారు.

సహస్ర సంవత్సరాలు అలా చిలుకగా, వాసుకి సహస్రశిరముల నుండి విషాగ్ని జ్వాలలు ఎగసి హాలాహలము ఉద్భవించింది. దానిని పానం చేయడానికి భక్తవశంకరుడైన శంకరుడు ముందు కొచ్చాడు, ఆగరళాన్ని తనగళమందే నిలిపాడు.

అనంతరము మళ్ళీ మథనం మొదలైంది. మంధర మంధానము పాతాళము దాకా దిగిపోయింది. సురాసురుల ప్రార్థనపై జగద్భర్త తాబేలుగా మారి తన వీపుపై మంధరాన్ని భరించాడు. అంతేకాదు తానుకూడ ఉపేంద్రుడుగా ఆకవ్వాన్ని త్రిప్పసాగాడు.

మరొక వేయి వర్షాలు గడిచాయి. దండ కమండల ధారియై ధన్వంతరి దివ్యవైద్యుడు ప్రభవించాడు. అ సంఖ్యాకులైన అప్సరసలు ఆవిర్భవించారు. ఆ అద్భుత సుందర సురభామినులను ఎవ్వరు స్వంతంచేసి కోవాలనుకోలేదు. అందువలన వారు సర్వదేవతా సాధారణులుగా మిగిలిపోయారు.

ఆతరువాత వరుణ పుత్రి వారుణి సురభాండంతో ఉదయించింది. సురను సేవించిన దేవతలు సురలయ్యారు. దానిని ఆదరింపని దైత్యులు అసురులయ్యారు.

అనంతరము ఉచ్చైశ్రవము, ఐరావతము, కౌస్తుభమణి, కల్పవృక్షాలు కలిగాయి. వచ్చిన ప్రతివస్తువును అదేలాభంగా ఆదితేయులు సొంతం చేసుకొన్నారు. అమృతమునే అంతిమ లక్ష్యంగా భావించిన అసురులు మిగిలిన వస్తువులపై తమకము చూపక-వాటిని దేవతలు తీసికొంటుంటే ఊరకున్నారు.

అంభోధి మథనాంతములో అమృతము ఆవిర్భవించింది. శ్రీమహావిష్ణువు స్వయంగా "మోహిని" రూపము ధరించి అమృతాన్ని ఆదితేయులందరికి అందించాడు. మోహిని సమ్మోహన రూపమునకు ఆకృష్టులయిన అసురులకు అమృతము అందలేదు. మధ్యలో ఒక రాక్షసుడు దేవతా స్వరూపాన్ని ధరించి వంచనతో సూర్యచంద్రుల మధ్యప్రవేశించి కూచొన్నాడు. శ్రియఃపతి ఆవిషయాన్ని గమనించక ఆయనకు కూడ అమృత మందించాడు. అయితే ఆవిషయాన్ని సూర్యచంద్రుల కనుసైగలతో గ్రహించిన కమలాక్షుడు అమృతాన్ని అప్పుడే త్రాగుతుండే ఆ అసురుని కంఠాన్ని చక్రాయుధంతో ఖండించాడు. అమృతపాన విశేషంతో ఆ అసురుని తలమొండెము రెండు వేర్వేరు భాగాలుగా సజీవములయి -రాహుకేతువులయ్యాయి.

అమృత వినిమయాంతంలో -మోహిని మాయమయింది. మోసాన్ని గ్రహించి రాక్షసులు దేవతలపై యుద్ధాన్ని ప్రకటించారు. అయితే భగవత్సహాయంతో దేవతలు రాక్షసులపై విజయాన్ని సంపూర్ణంగా సాధించారు. ఇది విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు వినిపించిన క్షీరసాగర మథన వృత్తాంతము.

సముద్ర మథన మొక అద్భుత వృత్తాంతము-శ్రియః పతి ఆసమయంలో అనేక అవతారాలను ధరించాడు. అనేక అద్భుతాలు నిర్వహించాడు. మంధర పర్వతమును పెకిలింపజాలని సురాసురుల ప్రార్థనపై గరుడ వాహనుడై అక్కడికి ఏతెంచి ఖగపతితో మంధరోద్ధరణము గావించాడు. మంధరాచలము భారకారణంగా సముద్రాంతర్భాగానికి దిగబడి పోతుంటే మళ్లీ దేవతల దీనతను గమనించి -తాను తాబేలుగా మారి తన వీపుపై ఆ మహాపర్వతాన్ని భరించాడు.

మథన సందర్భంగా మంధరాద్రి నిలువుగా నిలువక అటు ఇటు ప్రక్కలకు పడిపోతుంటే, ఆ పర్వత శిఖరాగ్రంలో తాను నిలిచాడు.

ఉపేంద్రుడుగా దేవేంద్ర సహోదరుడై అదితి గర్భంలో అవతరించి-ఆదినుండి అంతం దాకా మథన కార్యక్రమంలో పాలుపంచుకొన్నాడు మాధవుడు. ఇలా ఎన్నో -మరెన్నో చిత్ర, విచిత్ర స్వరూపములను ధరించి శ్రీవల్లభుడెన్నో అద్భుతాలను సృష్టించాడు. క్షీరసాగర మథన సందర్భంగా శ్రియఃపతి ఇరువై నాలుగు అవతారాలెత్తాడని అభిజ్ఞుల అభిప్రాయము.

క్షీరసాగర మథనమొక చిత్రమైన సంఘటన -అది ఏకృతయుగంలో ఏనాడు జరిగిందో కాని, నేటికి మన మనోదర్పణంపై చిత్ర విచిత్రకాంతులతో చెరుగని ముద్రలను వేసింది, వేస్తోంది.

ఇంతకు ఏమా క్షీరసాగరము? -ఏమామథనము?

మన మనస్సే ఒక పాలసముద్రము. మన హృదయంలోని మంచి చెడులను పైకి దీసే బుద్ధే ఒక కవ్వము. మనలోని దైవీ సంపదకు సంబంధించిన సదాలోచనలే దేవతలు. ఆసురీ సంపదకు సంబంధించిన దుష్టవిచారములే అసురులు.

ఒక మహాకార్యానికి ముందు కలిగే మహావిఘ్నమే హాలాహలము. దానిని తొలిగింప గలిగేది మహాదేవుడే. జ్యోతిష్టోమాది మహాక్రతువుల నిర్వహణలో ఆయురారోగ్యాది అవాంతర ఫలముల వంటివారే అప్సరసలు, ఐరావతము మొదలైన సాగర సంజనిత సంపదలు. ప్రధాన ఫలమే అమృతము.

భగవన్మాయయే మోహినీ స్వరూపము. భగవంతుని భక్తిలేని రాక్షసులకు భ్రమకలిగిస్తుంది. చివరకు వారి వినాశానికి కారణమౌతుంది. దైవ భక్తులైన దేవతలకు ఆమాయా స్వరూపము అమృతాన్నే అందిస్తుంది. అమృతమంటే అక్షయమైన భగవదానందమే.

భగవద్గీతా చార్యుడు -మాయా స్వరూపాన్ని వివరిస్తూ

శ్రీరామాయనమః

"దైవీ హ్యేషా గుణమయీ

మమ మాయా దురత్యయా

మామేవ యే ప్రపద్యంతే

మాయా మేతాం తరంతితే 'అంటాడు.

మాయా అంటే "యామా -సామాయా"-లేనిదే మాయ అనే, అర్థంకాదు. త్రిగుణ మయి అయిన ప్రకృతే మాయ. అయితే ఈ ప్రకృతి కూడ భగవంతునిదే 'మమ"-నాదే అంటాడు భగవంతుడు. ప్రకృతి భగవదధీన మనే విషయాన్ని 'యస్యపృథివీ శరీరం, యః పృథివీం అంతరోయమయతి, యం పృథివీన వేద"అని అంతర్యామి బ్రాహ్మణం వివరిస్తోంది. మాయ పర బ్రహ్మను ఆవరించదు. అది ఆయన అధీనంలో ఉంటుంది. ఎవ్వరు భగవంతుని శరణు వేడుతారో మాయాశబ్ద వాచ్యమైన ప్రకృతి వారి ముందు తలవంచుతుంది. అమృతో పాసనలో వారికి సహకరిస్తుంది. చివరకు భగవచ్ఛరణా గతులకు అక్షయానంద ప్రదమైన భగవత్ప్రాప్తి లభించినప్పుడు తన త్రిగుణాత్మకత్వమును వీడి శుద్ధసత్వమయమై ప్రకాశిస్తుంది.

మంధరమును పెకిలించడం నుండి అమృతము నందించే దాకా అడుగడుగునా ఆదితేయులకు అండగా నిలిచిన ఆ శ్రీనివాసుడే ఆయన నిత్య సన్నిధే, మనకు అపురూపపమైన పెన్నిధి.

ఓం తత్సత్.

శ్రీ సీతారామచంద్ర పరబ్రహ్మణేనమః

# సప్త మరుత్తులు :-

సముద్ర మథనము తరువాత ఆవిర్భవించిన అమృతమును ఆదితేయులు మోహినీ సహాయముతో అందుకొని పానముజేసి దైత్య సంహారము కావించారు. దితి తన సంతాన నాశనానికి వగచి భర్త అయిన కశ్యపుని ఆశ్రయించి తనకు ఇంద్ర సంహారకుడైన తనయుని ఇమ్మని వేడుకొంది. కశ్యపుడు అనుగ్రహించి ఆమె పూర్ణవర్ష సహస్రము శుచిగా ఉంటే అలాగే శక్ర విజేత జన్మిస్తాడని వరమిచ్చాడు.

దితి గర్భవతి అయింది. సహస్రాక్షునికీ సంగతి తెలిసింది. కుశప్లవానికి వచ్చి దితికి పరిచర్యలు చేస్తూ అమాయకురాలైన ఆమెను సేవలతో సంతోషింపజేశాడు. వేయి సంవత్సరాలు పూర్తిగా వచ్చాయి. పది సంవత్సరాలే మిగిలాయి.

ఆయాసము అధికమై దితి ఒకనాడు అనుకోకుండా శయ్యాసనములో తలక్రిందులుగా శయనించింది. సహస్రలోచనునికి ఆ దృశ్యము కనబడింది. సమయము చిక్కింది. శరీర వివరము ద్వారా లోనికి ప్రవేశించి, వజ్రి తన వజ్రాయుధముతో ఆమె గర్భమును తరుగసాగాడు. లోపలి పిండము రోదింపసాగింది. "మారుదః" "మారుదః" "ఏడువ వద్దు, ఏడువ వద్దు"అని ఇంద్రుడు దితిభీతితో పలుక సాగాడు. లోపలి శిశువు రోదనము దితికి హఠాత్తుగా మెలుకువను కలిగించింది. "చంపవద్దు", "చంపవద్దు"అని దితి వారించింది శతక్రతువు శిశు సంహారాన్ని ఆపాడు. అప్పటికే దితి గర్భము లోని పిండము **(7)** ఏడు ముక్కలయింది. దితి తలక్రిందులుగా అశుచిగా పడుకోవడమే పిండచ్ఛేదానికి కారణమని పురుహూతుడు వినీతుడై ఆమెకు విజ్ఞాపనం చేశాడు.

ఇంద్రుని కాపట్యమును దితి గ్రహించింది. అయితే తాను తప్పుజేసింది. కనుక ఇంద్రుని ఏమనరాదు. తెలివిగా తన పిండములను రక్షించు కోవాలను కుంది. తన గర్భములోని సప్త భాగములు "మారుదః" అనే ఇంద్ర వచనాన్ని బట్టి సప్త మరుత్తులై -అతనికి మిత్రులై సకలలోకాలలో సంచరిస్తారని తెలిపింది. శతక్రతువు అందుకు సమ్మతించాడు.'

రామభద్రా! దితి తపస్సు చేసిన ఆ కుశప్లవ వనస్థలమిదే అని విశ్వామిత్రుడు వివరించాడు. ఇదే స్థలములో ఇక్ష్వాకు తనయునికి "అలంబుస"అనే అతివయందు "విశాలుడు" అనే పుత్రుడు జన్మించాడు. ఆయన పేరుతోనే ఈ "విశాల పురము" వెలసింది. విశాలుని వంశములోని వాడైన సుమతి ప్రస్తుత భూపతి అని తెలిపి విశ్వామిత్రుడు విరమించాడు.

తెల్లవారి "సుమతి"భూపతి విశ్వామిత్రాగమన వార్తను విని సపరివారముగా వచ్చి విశ్వామిత్ర మహర్షిని రామలక్ష్మణ సమేతంగా సేవించాడు. వారు ఆరోజు అక్కడే ఉండి తెల్లవారి మిథిలకు ప్రయాణం చేశారు.

భగవన్నిర్ణయము ప్రకారమే -ఆయన కృపతోనే అదితేయులు అమృత పానముగావించి అమరులై దైత్య సంహారము గావించారు. దితికి పుత్ర దుఃఖము కలిగింది. కశ్యపుని కరుణతో సురేంద్ర సంహారకుడైన సంతానం కావాలని దితి పట్టుబట్టింది. ఆమె పట్ల జాలితో ఆ మహానుభావుడు అందుకు అంగీరించి వరమొసగాడు.

అయితే భగవత్సం కల్పము ఆమె ఆలోచనలకు అనుకూలంగా లేదు. తన వ్రతాంత కాలములో ఆమెకు అవశత ఏర్పడి అధోముఖంగా శయనించింది. సహస్రాక్షుడు సమయము చిక్కిందనే సంతోషంతో తన సహస్ర ధారతో పిండమును సప్త భాగములుగా ఖండించాడు. చివరకు దితి విధిలేక తన పిండము యొక్క సప్త భాగములు సప్తమరుత్తులై సురేంద్ర సహాయకులై ఉంటారని పురందరుని ప్రార్థించింది. తనకు అపాయం తప్పినందుకు మహేంద్రుడు మహాసంతోషంతో దితి వచనాన్ని సమ్మతించాడు.

దితివలె మనము కూడ మన మనస్సులో అనేక ఆలోచనలను ప్రణాళికలను కలిగి -వాటి సాఫల్యము కొరకై ప్రయత్నిస్తాము. మన ఆలోచనలను మాధవుడు అంగీకరించి మనము కోరిన ఫలితాన్ని మనకందిస్తే-అప్పుడు "మనమే అధికులమని" అసురుల వలె అహంకరిస్తాము. కాని "ఫలమత ఉపపత్తేః" ఫలము ఆపరమాత్మ వలననే కలిగిందనే విషయాన్ని గుర్తింపము.

అన్ని కాలాలలో మన ఆలోచనలు ఫలించవు. పరమాత్మ సంకల్పము మన ఆలోచనలకు ప్రతి కూలంగా ఉన్నప్పుడు మన ప్రయత్నములు 'బూడిదలో పోసిన పన్నీరు వలె నిష్ఫలములవుతాయి. అంతేకాదు మన ప్రయత్నాలకు ప్రతికూల ఫలితాలు కల్గుతాయి. అప్పుడు దితి వలె పరిస్థితులతో రాజీపడాలి. వీలయినంతవరకు పరిస్థితుల వైషమ్యము తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి. "సప్తమరుత్తుల గాథ మనకు అందించే సందేశమిదే.

ఇతిశం

శ్రీశోz వ్యాత్

# అహల్యా శాపవిమోచనము :-

విశాలపుర ప్రాంతము నుండి విశ్వామిత్రముని రామలక్ష్మణ సమేతంగా మిథిలానగర సమీపానికి చేరుకొన్నాడు. నగర బహిర్వనములో కళావిహీనమైన ఒక ఋషి ఆశ్రమం అగుపడింది వారికి. రామలక్ష్మణుల ప్రార్థనపై ఆ ఆశ్రమ వృత్తాంతాన్ని వివరింప సాగాడు విశ్వామిత్రుడు.

"సృష్టి కర్త ఒకానొకప్పుడు సౌందర్యాన్ని అంతటిని ముద్దగా చేసి ఒక ముదితను సృష్టించి, అకలంక సౌందర్యరాశియైన ఆమెకు 'అహల్య" అని నామకరణము చేశాడు. సహజ సౌందర్యవతి అయిన అహల్య యౌవనా విర్భావముతో గులాబి గుబాళింపులను సంతరించు కొన్నట్లు మరింత మేని హొయలును, మెరుపును సంపాదించుకొంది.

వివాహ వయస్క అయిన అహల్యకు తగిన భర్త విషయంలో కన్న తండ్రి అయిన కమల గర్భుడు "పితాశృతం"అన్నట్లు యోగ్యుడైన వరుని అన్వేషింపుమని, తన పుత్రుడైన నారదుని పంపించాడు.

ఇంతలో ఇంద్రుడా ఇంతి చెలువానికి చెవులు గోసుకొన్నాడు. ఆ సుందరిని తనకే స్వంతము చేయుమని పరమేష్ఠిని ప్రార్థించాడు.

"భూమండలమంతా పరిక్రమించి తనను ముందు జేరుకొన్న వానినే వీరుడుగా నిర్ణయించి తన తనయనిస్తానని" చతుర్ముఖుడు స్పష్టము జేశాడు. అభ్రవాహనుడు ఆనందంతో ఆషరతును అంగీకరించి భూ పరిక్రమణను ప్రారంభించి వెళ్లాడు.

సరస్వతీ పుత్రుడు సకల లోకాలలో అహల్యకు సమర్థుడైన వరుని వెదుక సాగాడు.

భూమండలంలో ఒక పూరి గుడిసెముందు అప్పుడే ఈనిన ఒక నల్ల ఆవు చుట్టూ భక్తితో ప్రదక్షిణము చేస్తున్న గౌతమ మహాముని నారద మహామునికి కనపడ్డాడు. కపిల గోప్రదక్షణము భూప్రదక్షణ తుల్యమనే శాస్త్రార్థము నెరిగిన నారదుడు ఆమహర్షిని తన వెంట బ్రహ్మలోకానికి తీసుకవెళ్లాడు.

చతుర్ముఖుడు గౌతమమునికి అహల్యా ప్రదానము గావించాడు. కన్యాదానము పూర్తి అయింది. పాకశాసనుని పరిక్రమము పూర్తి అయింది. ఆనందంతో తిరిగి వచ్చిన అమరేంద్రుడు ఆదృశ్యమును వీక్షించి విచారగ్రస్తుడయ్యాడు.

సహస్రాక్షుని స్వాంతములో అహల్యయొక్క అద్వితీయ సౌందర్యము గూడుకట్టు కొని వేధింపసాగింది.

ఎన్నో నిశీధులు బొత్తిగా నిద్రలేని రాక్షసారాతి ఒక రాత్రి గౌతమాశ్రమ ప్రాంతానికి వెళ్లి-వంచనతో వేకువ అవుతున్నట్లు కోడివలె కూజితము చేశాడు. ప్రభాతమౌతుందనుకొని మహర్షి తపశ్చర్యకై ఆశ్రమమును వీడివెళ్లాడు.

ఆసమయం కొరకు నిరీక్షిస్తున్న అమరనాథుడు గౌతముని వేషంతో ఆశ్రమంలోనికి వెళ్లి అహల్యను సమీపించి తన వృత్తాంతమును వివరించాడు.

అహల్యా మనస్సులో అతివ చాపల్యం ప్రవేశించింది. మహేంద్రునిపై మనస్సులో మరులు గొన్నది. వారిద్దరు అవినీతితో హద్దులు మీరి కామ భోగమును అనుభవించారు. అంతదాకా లోకమునే మరచిన అహల్యా సంక్రనందనులకు హఠాత్తుగా గౌతముడు గుర్తు కొచ్చాడు.

ఆ పరమర్షి నిశిత దృక్కులనుండి నేర్పుగా తప్పించుకోవాలనుకున్న పాకశాసనుని ప్రయత్నము వ్యర్థమైంది. తెల్లవారిందను కొని వెలుపలికి వెళ్లిన మహర్షి బయట రాత్రి శేషాన్ని గుర్తించి మళ్లీ ఆశ్రమంలోకి ప్రవేశించాడు. అహల్యా అమరేంద్రుల అత్యాచారమును దివ్యదృష్టితో దర్శించిన మహర్షి "వేలుపు రేనిని విఫలుడవు కమ్ము "ని శపించాడు.

అహల్యను "అనేక సహస్ర వర్షములు ఆహారము లేక అదృశ్య అయి భస్మశాయినిగా పడిఉండుమని, దశరథాత్మజుడైన శ్రీరాముని రాకతో పునీతవై -అతనికి ఆతిథ్యమొసగి నీవు నాకు భార్యవు కాగలవని."శపించి హిమవత్పర్వత ప్రాంతానికి తపశ్చర్యకై వెళ్లాడు.

అఫలుడైన అమరేశ్వరుడు -అగ్నిముఖులైన అమరుల పితృదేవతల సహకారముతో మేషవృషణుడయ్యాడు. మహేంద్రునికి సహకరించిన మేషము దేవతలకు ప్రియమై ప్రధానయజ్ఞ పశువైంది."

విశ్వామిత్రుడీ విషయాన్నంతటిని రామ లక్ష్మణులకు వినిపించాడు- ఆమహాముని రామలక్ష్మణ సమేతుడై గౌతమా శ్రమమును సమీపించాడు. శ్రీరాముని శ్రీపాదరజః ప్రభావంతో పవిత్రమైన ఆ ఆశ్రమంలో అంతకాలము అదృశ్యంగా పడి ఉండిన అహల్య పవిత్రాంతః కరణ అయి-సహజ స్వరూపమును ధరించి శ్రీరాముని దర్శించింది.

రామలక్ష్మణులు అహల్యా మహాసాధ్వి పాదములకు ప్రణమిల్లారు. రామదివాకరుని కిరణములతో నిశ్శేషంగా శుష్కించిన పాపపంక అయిన ఆపతివ్రతామ తల్లి గౌతమ వచనమును స్మరించి వారికి వందనమాచరించింది. అహల్య అర్ఘ్యపాద్యాచమనీయాదులతో కాకుత్స్థుని గౌరవించింది. సురలు సుమవృష్టిని కురిపించారు. అప్సరసలు నాట్యము చేశారు. గంధర్వులు గానము కావించారు. ప్రకృతి మొత్తము మహాసంతోషముతో పరవశమైంది.

అంతలో గౌతమమహాముని ఆ ఆశ్రమానికి ఏతెంచి శ్రీరామచంద్ర పురస్సరంగా లక్ష్మణ విశ్వామిత్రుల నాదరించి అహల్యను స్వీకరించాడు.

అహల్యా గౌతముల వృత్తాంతములో అతిప్రధాన విశేషములను కొన్ని పరిశీలిద్దాము.

సరస్వతీ నారదుల సంప్రదించి అహల్యకు సమర్థుడైన వరుని అన్వేషించుటకు బ్రహ్మ నారదుని నియోగించాడు. అప్పుడే ప్రసవించిన - శ్వేత దూడను కల్గిన కపిల గోప్రదక్షిణము చేసి గౌతముడు నారదునికి కనుపించాడు.

గోవు అంటే ఆవు. గోవు అంటె భూమి. గౌతముడు కపిల గోప్రదక్షిణము గావించి భూప్రదక్షిణము చేసినట్లై బ్రహ్మ షరతును తనకు తెలియకుండానే పూర్తిగావించి అహల్యాపతి అయ్యాడు.

గౌతముడు గోప్రదక్షణము చేశాడు. "గోవు" అంటే బుద్ధి కూడ గోప్రదక్షణము చేశాడంటే బుద్ధిమండ లాన్నంతటిని పరిక్రమించాడన్నమాట. అందుకే ఆయన గౌతముడు -బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు.

గౌతముడంటే పరాపర విద్యలసారాన్ని సమగ్రముగాఎరిగి భగవత్ప్రసాదంగా మనకు లభించిన స్వాచార్యుడే.

"అహల్య"అంటె సంస్కారము లభించని అతివ. అహల్య అంటే హలముచే దున్నబడని భూమి అని శబ్దార్థము.

నాగలితో భూమిని దున్ని దాని కాఠిన్యమును తొలగించి మార్దవాన్ని కలిగించి -విత్తనమును వేసి అందులో పంటను పండిస్తాడు రైతు. మన ఆచార్యుడు కూడ మనమనే భూమిలోని సంసారాసక్తి కాఠిన్యాన్ని తన ఉపదేశహలము చేత తొలగించి-మనస్సును పరిపక్వము చేసి -మహామంత్రరాజ బీజావాపనము గావించి, జ్ఞానసస్యాన్ని పండించగల్గిన మహాకృషీవలుడు మన ఆచార్యగౌతముడు.

"అహము"అంటె పగలు లేక ప్రకాశము. ప్రకాశము జ్ఞాన సూచకము - అహల్య అంటె జ్ఞాన ప్రకాశము బొత్తిగా లేనిది. "గో" అంటేకిరణము - గౌతముడు అంటే కిరణము లేక ప్రకాశము కల్గిన వారిలో శ్రేష్ఠుడు. ఆవిధంగా కూడ మన "గురువే, గౌతముడు" మాక్స్ముల్లర్ పండితుడు అహల్యాగౌతములను రాత్రి సూర్యులుగా వర్ణించాడు. భగవద్విషయ ప్రకాశము ఇసుమంతా అయినా లేని మనలోని అజ్ఞానాంధకారమును తొలిగించి భగవద్విజ్ఞాన జ్యోతిని వెలిగించిన గురువే గౌతముడు.

గోవు అంటే వాక్కు. మన సందేహములను తన ఉపదేశముతో పటాపంచలు చేయడమే కాదు విపక్షుల వివాద పర్వతములను తన వాగ్వజ్రముతో తునాతునకలు చేయగల్గిన వాగ్విదాంవరుడైన మన ఆచార్యుడే గౌతముడు.

గౌతముడే అహల్యా పతి కాగలవాడని విధినిర్ణయము జరుగుతుంది.

గౌతముని సాంగత్యములో అహల్య శతానందుని కన్నది. మనకు కూడ ఆచార్యుని ప్రసాదఫలంగా లభించేది శతోత్తర గుణిత ఆనందుడైన పరమాత్మయే కదా! "భగవల్లాభం ఆచార్యనాలే".

అహల్య గౌతముని ప్రభావ ప్రకాశములను గుర్తింపలేదు. ఆమెకు భగవద్విషయమొక రాత్రి సంసార విషయమొక పగలు. ప్రపంచములోని అల్పాస్థిర సుఖములే ప్రధానమని విశ్వసించిన అవిద్యాభిభూత అహల్య.

ఆమెను భోగస్వభావుడైన ఇంద్రుడాకర్షించాడు. గౌతమ శతానందులను కూడ మరచి మహేంద్రునితో విషయ భోగములను, అనుభవించింది అహల్య.

గౌతముడు అహల్యను భోగరహితవుగా, భస్మశాయినిగా అదృశ్యగాపడి ఉండుమని శపించి ఆమెను త్యజించివెళ్లాడు అహల్యను ఆకర్షించిన అమరేంద్రుని విఫలు కమ్మని ఆగ్రహించాడు.

స్వాశ్రితులయొక్క విషయభోగ వాంఛను తొలిగించి వారి పాపములను తొలగించి -వైరాగ్యమును కల్గించే విశదజ్ఞాన రూపుడు గౌతమాచార్యుడు. అలాగే స్వాశ్రితుల నాక్రమించడానికి పైపైబడే విషయభోగ స్వరూపములను విఫలము గావించగల గొప్పమాంత్రికుడాయన.

అహల్య యొక్క విషయ వాంఛను తొలిగించడానికి గౌతముడు మూడు షరతులను విధించాడు.

**1.**నిరాహారము **- 2.** భస్మశయనము **- 3.** అదృశ్యస్థితి.

మనము కూడ ప్రపంచ విషయదర్శనములేక -స్వాత్వికాహారమును భుజించి -వైరాగ్యమును కల్గిఉన్ననాడు-అర్థకామములకు వశీకృతులము కావడానికి మూలములైన రజస్తమోగుణములు నశించి-సత్వము వృద్ధిజెందుతుంది.

సత్వగుణము వృద్ధిజెందినప్పుడే శ్రీరాముడేతెంచుతాడు. తన పాదస్పర్శను మనకు కలిగిస్తాడు. "శ్రీమన్నారాయణుని చరణద్వంద్వము" మనకు లభిస్తుంది. మనము పవిత్రులమౌతాము. గౌతమాచార్యుడు తిరిగి అభిమానించి మనను చేరదీస్తాడు. భగవద్భాగవతాభిమానములకు పాత్రులము కావడమే ఆచార్యునికి ప్రియమైనది.

ఇంకొక ముఖ్యవిషయము. అహల్యను పవిత్రంచేయడానికి శ్రీరాముడొక్కడే రాలేదు. లక్ష్మణ, విశ్వామిత్ర సమేతంగా వచ్చాడు లక్ష్మణుడు కైంకర్యనిష్ఠుడైన భక్తుడు. విశ్వామిత్రుడు గుణనిష్ఠుడైన భాగవతోత్తముడు. 'ఆస్తేవిష్ణురచింత్యాత్మాభక్తైర్భాగవతైస్సహ" భాగవత పురుషకారముతోనే శ్రీరాముని కృపకలుగుతుంది.

ఇతిశం

# శివధనుర్భంగము

## అహంకార, మమకార నిరాసము

అహల్యా శాపవిమోచనము చేయించి, విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో సహ విదేహుని యజ్ఞవాటికకు చేరుకొన్నాడు. శ్రీరాముడు యజ్ఞసంరంభములకు ఆశ్చర్య చకితుడయ్యాడు. విశ్వామిత్రుని ఆజ్ఞతో ఒక నివేశములో (గృహంలో)వారు ప్రవేశించారు.

విశ్వామిత్రుని రాక గురించి విన్నజనకమహారాజు, శతానంద పురోహిత సమేతంగా, ఋత్విగ్గణ సముపేతుడై ఆమహర్షిని సందర్శించి విధి విధానంగా గౌరవించాడు. విశ్వామిత్రుని రాకతో తనయజ్ఞము సఫలమైనదని విజ్ఞాపనం చేసికొన్నాడు. "తెల్లవారి ద్వాదశాహము లేక శేషాహము. ఆరోజే దేవతలు హవిర్భాగముల స్వీకరించడానికి వస్తారు." అని తెలిపాడు.

దేవతుల్య పరాక్రములు, అశ్వినీ దేవతల వంటి సౌందర్య స్వరూపులయిన ఆ కుమారు లిద్దరెవ్వరని ప్రశ్నించాడు. ఆ కుమారులు దశరథ నందనులని -మార్గము మధ్యలో శ్రీరామచంద్రుడు జరిపిన తాటకవధ, యజ్ఞ సంరక్షణము, అహల్యా శాపవిమోచనము మొదలైన సంఘటనల గురించి మునీంద్రుడు రాజేంద్రునికి వివరించాడు.

అహల్యానందనుడు, సముజ్వల తేజస్సంపన్నుడైన శతానందునికి అహల్యా శాపవిమోచన వృత్తాంతము చాల సంతోషాన్ని సమకూర్చింది. ఆయన విశ్వామిత్రమునిని మాటి మాటికి ఆ విషయాన్ని గురించి అడిగి -నిర్ధారణ చేసికొని పరమప్రీతినందాడు. శ్రీరాముని కృతజ్ఞతాదర సంభ్రమ వీక్షణాలతో సందర్శించాడు.

విశ్వామిత్ర మహర్షి రక్షణ లభించిన శ్రీరామలక్ష్మణుల కంటెమించిన ధన్యులు భువిలోనే లేరన్నాడు. ఆమహామునికి పూర్వము వశిష్ఠ మునీంద్రునితో నందిని విషయంలో కలిగిన వైరాన్ని, వశిష్ఠమహర్షి యొక్కబ్రహ్మతేజాన్ని దర్శించిన విశ్వామిత్రుడు చతుర్దిశలలో మహా దీక్షతో గావించిన తీవ్ర తపశ్చర్యను, చివరకు ఆయన లభించిన బ్రహర్షి పదాన్ని గురించి - శతానందుడు రామలక్ష్మణులకు తెలిపాడు.

తెల్లవారి జనక మహారాజు విశ్వామిత్రుని సేవించి, ఆమహర్షి ఆజ్ఞను యాచించాడు.

విశ్వామిత్రముని -జనక మహారాజుతో శివధనుస్సు గూర్చి వివరించుమని. ఆ ధనుస్సును రామలక్ష్మణులకు చూపెట్టుమని కోరాడు. జనకుడా ధనువు గురించి ఈ విధంగా తెలుపసాగాడు.

"దక్షవధానంతరము ధనుస్సమేతుడైన రుద్రుని భయంకర స్వరూపమునకు భీతులై -దేవతలు మహాదేవుని స్తుతించారు. భక్తవ శంకరుడైన శంకరుడు సంప్రీతుడై ఆ ధనువును దేవతలకిచ్చి వెళ్లాడు.

దేవతలు ఆ శివధనువును జనక మహారాజుకు పూర్వుడైన దేవరాతునికి కానుకగా నొసగారు. అప్పటి నుండి ఆ ధనుస్సు జనకుల పూజాగృహములో ఉంటూ వచ్చింది.

కొంత కాలానికి యజ్ఞము చేయదలిచి, నాగలితో భూమిని దున్నుతుండగా -ఆ నాగటి చాలులో ఒక బాలిక లభించుటచే ఆమెకు "సీత' అని పేరుంచి జనకుడా బాలికను పెంచాడు. సౌందర్యవతి, యౌవనవతి విలాసవతి అయిన ఆ సీతాదేవిని-ఆశివ ధనుస్సు నెక్కుబెట్టిన మహావీరునికి వీర్యశుల్కగా ఇవ్వడానికి నిశ్చయించి. స్వయంవరము చాటించాడు. సీతాదేవి, అపురూప రూపరేఖా విలాసములకు ఆకృష్టులైన అనేక రాజకుమారులు ముందుకొచ్చారు. కాని అల్ప వీర్యులైన ఆ రాజకుమారులు ధనుస్సునెత్తడానికే సమర్థులు కాలేదు. వారిని జనక క్ష్మాపాలుడు రిక్తహస్తులుగానే త్రిప్పిపంపాడు. వారందరికి జనకనృపాలునిపై అగ్రము కట్టలు తెంచుకొంది. ఒక సంవత్సర కాలము వారు మిధిలానగరాన్ని ముట్టడించారు. దుఃఖావిష్టుడైన జనక మహారాజు దేవతల ప్రసాదాన్ని లభించి, చివరకు వారందరిని తరిమివేశాడు.

ఈవిషయమంతా విశ్వామిత్ర మహామునికి జనక చక్రవర్తి నివేదించి రామలక్ష్మణులకు ఆధనస్సును ప్రదర్శిస్తానని, ఒక వేళ శ్రీరాముడా ధనుస్సును సంధింపగల్గితే, సంతోషంగా ఆయనకు సీతను కన్యాదానం చేస్తానని నుడివాడు.

విశ్వామిత్రుడు వెంటనే శివధనుస్సును తెప్పించుమని కోరాడు. సామంతులు, సచివులు మిధిలాంతః పురానికి వెళ్లి -అష్టచక్రములు గల పెద్ద ఇనుప పెట్టెను అయిదువేల మంది అనుచరుల సహాయంతో యజ్ఞ వాటికకు తెప్పించారు. ఆ ఇనుప పెట్టెలోనే శివధనువు ఉంది.

అధనుర్బలాన్ని వివరిస్తూ - సురాసుర గంధర్వ యక్షరాక్షస వీరులెవ్వరు ఆ ధనుస్సును సంధింపజాలరని, ఇక అల్పశక్తులయిన మనుష్యులను గురించి చెప్పవలసిందేముంటుందని జనక రాజర్షి అడిగాడు.

జనక మహీపాలుని సంభాషణనాలకించిన విశ్వామిత్రమహర్షి "వత్స! రామ!ధనుస్సును చూడు"మని రాఘవుని ఆజ్ఞాపించాడు. సంస్కృత భాష సుసంపన్నమైనది. ఆభాషలోని అలతి, అలతి పదాలకు అనల్పములైన అర్థాలు గోచరిస్తాయి.

"వత్స! రామ! ధనుః పశ్య' అనే ఈ4చిన్న పదాలకు అభిజ్ఞాలు అనేకార్థాలను సెలవిస్తారు.

1.శివధనుర్బలాన్ని గురించి జనకుడంతగా వర్ణించడం లక్ష్మణునికి నచ్చలేదట. "ఈ మాత్రము ధనుస్సును ఎక్కుబెట్టడానికి మా అన్నగారు కావాలా? నేను ఎత్తజాలనా?" అని ఆవేశంతో ఆధనుస్సంధానానికి ముందుకు రాబోతున్నాడు. ఆయనను వారిస్తూ విశ్వామిత్రుడు అన్నాడట:-"వత్స! నాయనా! లక్ష్మణా! "రామధనుః పశ్య" -ఇది శ్రీరాముని ధనుస్సు సుమా! చూడు అని ఒక అర్థము.

2."వత్స! శ్రీవత్సము అనే పుట్టు మచ్చను కల్గిన రామ! పరమాత్మవైన ఓరామా! ధనుః పశ్య ఈ ధనుస్సును చూడు-నీకిది సుసాధ్యమేసుమా అని మరొక అర్థము.

3. " వత్స!రామా! "ధనుః పశ్య" నాయనా!రామా!జనకుని ఇంట్లోనే ఈ ధనుస్సును ప్రయత్నించి చూడు" అని ఇంకొక అర్థము.

ఈ విధంగా అతి సామాన్యమైనవిగా కనుపడే ఈ నాల్గు చిన్నశబ్దాలకు సామాన్య విశేషార్థాలెన్నో విద్వదవతంసులు ఇంకెన్ని అర్థాలను వివరిస్తారో?

విశ్వామిత్రుని ఆజ్ఞనుగైకొని శ్రీరామభద్రుడా మందస (మంజూష)మును తెరచి, అందులో శివమహాధనుస్సును చూచి, "గురువర్యా!దీనిని స్పృశించి, ఎక్కుబెట్టి, పూరించడానికి ప్రయత్నిస్తాను'అని వచించాడు. విశ్వామిత్రుడు, జనకుడు కూడ అందుకు అనుమతించాడు.

ఆమహాబలుడు అతిలీలగా ధనుర్మధ్యమును చేతితో పట్టుకొని, అనేక సహస్రజన సమక్షములో - అల్లెత్రాడును కట్టి పూరించసాగాడు. ఆ మహావీరుని

హస్తముల లీలాశక్తికే అంతటి శివమహాధనువు భయంకర శబ్దమును కావిస్తూ ఫెళ్లున తునాతునకలైంది భూమి ఘోరంగా కంపించింది. సుస్థిరములైన మహాపర్వతములు చలించాయి. సముద్రము చెలియలికట్ట నతిక్రమించింది.

అప్పుడక్కడ విశ్వామిత్ర, రామ, లక్ష్మణ, జనకులు తప్పమిగిలిన సభాసదులందరు మూర్ఛాక్రాంతులయ్యారు.

జనక చక్రవర్తి - శ్రీరాముని అద్భుత పరాక్రమానికి విస్మితుడయ్యాడు "మునివరా! మా సీత నిజంగా సౌభాగ్యవతి శ్రీరామపత్నియై -పుట్టినింటికి, మెట్టినింటికి కీర్తి ప్రతిష్ఠలు తెస్తుంది. "అని విశ్వామిత్రునికి మహానందంతో వివరించాడు. విశ్వామిత్రుని ఆజ్ఞమేరకు -"దశరథ చక్రవర్తికి ఆవృత్తాంతాన్ని తెలియజేస్తూ-బంధు, మిత్ర, పరివార సమేతంగా ఆ భూజానిని ఆహ్వానిస్తూ "దూతలను పంపాడు.

శివధనుర్భంగము మహాద్భుతంగా జరిగింది. ఆ ధనుర్భంగ మహాధ్వని సమస్తలోకాలలో వ్యాపించింది. సమస్తలోకవాసులు వినమ్రులై ఆ రఘువీరునికి కైమోడ్పులందించారు.

ఇంతకు ఆనాడు మహాద్భుతంగా జరిగిన ఆ శివధనుర్భంగము ఈనాడు మనకేవిధంగా సంబంధించింది?

ఎందుకానాడు వీరాధివీరులు ఆ ధనుస్సును ఆరోపించుటకు అశక్తులయ్యారు?

ఎందుకు దేవ, దానవ, గంధర్వ యక్షరాక్షస మహావీరులు సైతము ఆధనుస్సు నెక్కు బెట్టుటకు అసమర్థులైనారని, జనక రాజర్షి వివరించాడు?

ఇంతకు ఏ మాధనుస్సు?దానితో ఈ నాడు మనకేమి సంబంధము? ఈ ప్రశ్నలకు సమాధానములు కావాలంటే మనము కఠోపనిషత్తును ఆశ్రయింపక తప్పదు.

ఏమి తెలుపుతోంది కఠోపనిషత్తు?

"ప్రణవోధనుః -శరోహ్యాత్మా -బ్రహ్మతల్లక్ష్యముచ్యతే

అప్రమత్తేన వేద్ధవ్యం -శరవత్తన్మయో భవేత్" ధనుస్సంటే వేరే ఏదోకాదు -ప్రణవమే. శరమంటే ఆత్మయే. దానికి లక్ష్యము బ్రహ్మయే.

"ఓం" కారమే ప్రణవము . ఓం అనేది ఒకే అక్షరము. అయితే దానిని మరింత విభజిస్తే, అందులో మూడు అక్షరాలు ఉన్నాయి. "అ -ఉ,మ"అనేవి ఆ మూడక్షరాలు. ఈ మూడింటిలో ప్రతి అక్షరమునకు వేర్వేరు అర్థములున్నాయి.

"అకారార్థో విష్ణుః - "అ" అంటే విష్ణువు-లేక పరమాత్మ "మ కారార్థో జీవః" - "మ" అంటే జీవాత్మ.

"ఉ" కారోz నన్యార్థం సంబంధం నియతం" - "ఉ"అంటే జీవాత్మ - పరమాత్మలకు మధ్య విడదీయరాని -నిశ్చితమైన సంబంధము.

ఈ మూడక్షరములు మూడు పదములే. ఈ మూడక్షరములు (అ, ఉమ)కలిసి ఒకే మహాక్షరంగా, మహాపదంగా "ఓం'అర్థము "జీవాత్మలమయిన మనకు పరమాత్మతో విడదీయరాని సంబంధము ఉంది అని, స్పష్టమౌతుంది. లేక సూటిగా చెప్పాలంటే జీవాత్మల మయిన మనమందరము పరమాత్మకు చెందినవారమే ఆయనకు ఆధీనులమే" అనే అర్థము నిశ్చయింపబడింది.

ప్రణవములో "అ" అక్షరము ముఖ్యమైనది. తదర్థమైన పరమాత్మ ముఖ్యమైన వాడు. ఆయనే యజమాని.

ప్రణవములోని ఇతరాక్షరములు "ఉ" "మ" "అ"కు అధీనములైనవి. వాటి అర్థములైన - "జీవాత్మ" - "అనన్యార్థసంబంధము" పరమాత్మకే అధీనములు లేక స్పష్టంగా చెప్పాలంటే మొత్తము "ప్రణవము" "అ"కే లేక పరమాత్మకే అధీనమైనది. అందుకే ఓం కారరూపములో ఉండే ఆశివధనుస్సు శ్రీరామునికి మాత్రమే అధీనమైనది. ఆయన మాత్రమే ఎక్కుబెట్ట గల్గాడు మరెవ్వరు- దేవ, దానవ, గంధ, యక్ష రాక్షసాది వీరులెవ్వరు ఆధనుస్సును పూరింపజాలలేదు. పూరింపజాలరు. బ్రహ్మాదులకు సైతము ఆ ధనుస్సు వంగదు.

శ్రీ రాముడా ధనుస్సును వంచి, దానికి అల్లె త్రాడుకట్టి పూరించసాగాడు. శరమును సంధించడమే ఆలస్యము-ఇంతలో ఆధనుస్సు భగ్నమైంది. శరసంధానమంటే జీవాత్మకు పరమాత్మతో అనన్యార్థమైన సంబంధాన్ని కలుపడం. అప్పుడా జీవాత్మకు లక్ష్యమేది?శరము వెళ్లవలసింది ఎటువైపు? - శ్రీరాముడు నిర్దేశించిన వైపే కదా శరమార్గము. జీవాత్మ అయిన సీతాదేవి చేరవలసింది. చేరింది కూడ శ్రీరాముని సమీపమునకే కదా!

ఇంతటి మహాప్రభావము గల మహాధనుస్సును, బ్రహ్మ వరుణేంద్ర, రుద్రమరుత్తులు కూడ స్వాధీనము చేసికోజాలరంటే యక్షరాక్షసుల మాట

ఎందుకు?సాధారణ మానవుల మాట మరెందుకు?శ్రీరామభద్రుడొక్కడే (శివ) ధనుర్భంగము కావింప సమర్థుడు.

ఇక్కడ మరొక విశేషార్థాన్ని విద్వదగ్రేసరులు సెలవిస్తారు. వాల్మీకి "వత్స-రామధనుః పశ్య" అనే శ్లోకాన్ని వ్రాస్తూ చమత్కారంగా గుణభంగము చేశాడు.

విశ్వామిత్రుడు రామునికి ధనుస్సును చూపుతూ, ***"వత్స! రామ! ధనుః పశ్య- ఇతిరాఘవ మబ్రవీత్"*** అన్నాడు. సాధారణంగా శ్లోకము సాగవలసింది -"వత్సరామధనుః పశ్యేతి రాఘవమ బ్రవీత్"అని "పశ్యేతి" అని గుణ సంధి ఉండాలి. కాని "ధనుః పశ్య ఇతి"అని గుణ సంధి లేకుండా విశ్వామిత్రుడు చెప్పాడు. ఎందుకా మహాముని అలా చెప్పాడు? అలా చెప్పడంలో కూడ ఏదైనా ఒక విశేషాభి ప్రాయం ఉందా?

సాభిప్రాయంగానే గుణసంధి చేయబడలేదని పెద్దలు సెలవిస్తారు.

ఎందుకంటే ఆ మాటలను రామునితో చెప్పేప్పుడు విశ్వామిత్రుడు దూరం నుండే ఆధనుస్సు బలాన్ని అంచనావేసికొన్నాడు -మహావీరుడైన - వరబల సముపేతుడైన తానుకూడ "ఆధనుస్సుకు గుణసంధి చేయజాలను" అని నిర్ణయించుకొన్నాడట. అందుకే గుణ సంధిని భంగము చేశాడట.

ఇంతకు సామాన్య విశేషార్థ ప్రయుక్తమైన గుణ సంధి అంటే ఏమిటి?

సామాన్యార్థములో గుణసంధి అనేది ఒక సంస్కృత వ్యాకరణ సంధి"అకారమునకు -ఇ,ఉ లు పరమైనప్పుడు ఏ, ఓలు ఆదేశమగును"అని గుణసంధి సూత్రము.

ఇక్కడ "పశ్య" అనే మాటలోని "శ్య" (అకారముకు)ఇతి పదములోని "ఇ"కలిసినప్పుడు "పశ్యేతి "లో (శ్యే)అని ఏకారము వస్తుంది. అలా రానీయకుండా "పశ్య, ఇతి"అని వేరు వేరు పదములను వాడుటచే గుణ సంధి భంగమైంది.

విశేషార్థములను గుణసంధికి చెప్పినప్పుడు రెండు అర్థాలు ఉన్నాయి. సంస్కృతంలో గుణము అంటె రెండు అర్థాలున్నాయి.

1. గుణము =అల్లెత్రాడు.

2. గుణము =స్వభావము ।గుణము.

విశ్వామిత్రుడు శ్రీరామునికి ధనుస్సును చూపెట్టుతూ -ఆ మహాధనుస్సునకు తాను కూడ గుణసంధి చేయజాలనని నిర్ణయించుకొన్నాడు కదా. ఇక్కడ గుణసంధి అంటే (ధనుస్సును వంచి-దానికి) అల్లెత్రాడును బలంగా కట్టడం. అంతటి మహాబల సంపన్నమైన-బ్రహ్మేంద్ర రుద్ర మరుదర్కులకు కూడ అసాధ్యమైన ఆ ధనుస్సును వంచడానికి -దానికి గుణమును -లేక అల్లె త్రాడును సంధించడానికి తనకు కూడ శక్తి లేదని -తనలో తాను సమీక్ష చేసికొన్నాడు ఆవీరముని.

ఒక్క శ్రీరాముడు మాత్రమే-వత్సరాముడు మాత్రమే ఆ ధనువునకు గుణసంధి, అల్లె త్రాడు కట్టడానికి సమర్థుడని విశ్వామిత్ర మునీంద్రుడు గుర్తించాడు.

గుణమంటే స్వభావము లేక మనకు సామాన్యంగా తెలిసిన గుణమని కూడ అర్థము కదా!

సీతాదేవి -శ్రీరాంచంద్రుల కల్యాణానికి ఆ శివధనుస్సు ఒక గోడలా అడ్డునిలిచింది. ఆ ధనుస్సును ఎక్కుబెట్టి తేనే, శ్రీరామునికి సీతను కన్యాదానం చేస్తానని జనకుడన్నాడు.

ఇక్కడ ధనుస్సు ఎటువంటిదో మరొక రీతిగా పరిశీలిద్దాము -సాధారణంగా ధనుస్సు మహాకఠినంగా ఉంటుంది. దానికి రెండు అంచులు-లేక కొనలుంటాయి. ఆ రెండుకొనలు ధనస్సును ఎవ్వరికి లొంగకుండా ఉన్నతంగా నిలబెట్టుతాయి. అధనుస్సును వంచే వీరుడు ముందు ఆరెండు కొనలన్ను బలంగా వంచాలి. వాటిని దగ్గరకు తీసికరావాలి. లేక సంకోచింపజేయాలి. అప్పుడు గుణమును లేక అల్లెత్రాడును - లేక నారిని-ఆవంచిన రెండుకొనలకు గట్టిగా బిగించి - తిరిగి ఆకొనలు దూరంగా ఉన్నతంగా -కాకుండా చూడాలి. అప్పుడు అధనుస్సు శరసంధానానికి అనుకూలమవుతుంది.

ధనుస్సు వలె మన ప్రకృతి కూడ చాలకఠినమైంది. మృదుత్వము దాని స్వభావము కాదు. అది సాధారణంగా ఎవ్వరికి లొంగదు. దానిని లొంగనీయకుండా దృఢముగా నిలిపేవి-దాని రెండు కొనలు. ఆరెండు శిఖరము లేవి?అహంకారము ఒక అగ్రము -మమకారము, మరొక అగ్రము. అహంకారము రూపుదాల్చిన రావణుడు, మమకారమే మూర్తీభవించిన ధృతరాష్ట్రుడు లొంగె వారుకాదు కదా!

మన ప్రకృతి యొక్క రెండు చివరలను - అహంకార, మమకారాలను సంకోచింపజేయాలి. అవి సాధారణంగా వంగవు. వాటిని సాధనతో, సమగ్రమైన ఏకాగ్రతతో వంచాలి. ఇక తిరిగి అవి పైకి లేవకుండా వాటిని బిగించిబంధించాలి. దేనితో గుణముతో - భగవద్గుణముతో. భగవద్గుణాను సంధాన భోగ్యతతో కాలక్షేపము జరుపుకొంటున్నంత సేపు -అహంకార, మమకారములు తల ఎత్తవుకదా.

అలాగే ప్రణవమేధనుస్సు అనుకొన్నప్పుడు కూడ- ***అధనుస్సుకు పైన పరమాత్మ - క్రింద జీవాత్మ అనే అగ్రాలున్నాయి.*** కదా ఆరెండింటిని సంధానము చేసేది గూడ గుణమే-భగవద్గుణమే. సాధారణంగా వివాహాల్లో వధూ, వరుల మధ్యతెర అడ్డంగా ఉంచుతారు. వధువు లక్ష్మీ స్వరూపిణిగా, వరుని శ్రీమహావిష్ణు స్వరూపునిగా భావిస్తారు.

***"అస్మైవరాయ శ్రీమహావిష్ణు స్వరూపాయ***

***మహాలక్ష్మీ స్వరూపిణీమ్ ఇమాం కన్యాం"*** అని సంకల్పము.

వీరిద్దరిమధ్య తెర అడ్డుఉంటుంది. లక్ష్మి అంటే జీవాత్మ. విష్ణువు పరమాత్మ, వధూవరుల వివాహమంటే జీవాత్మ, పరమాత్మల కలయికే కదా. వీరిద్దరి మధ్య అడ్డుగా ఉండేతెర అంటే జీవాత్మ యొక్క ప్రకృతే.

ఈ ప్రకృతి ఎటువంటిది? **"భగవత్తిరోధానకరి"** అంటే భగవంతుని మరిపించేది. **"స్వభోగ్యబుద్ధి జనని"**- అంటే తన విషయములో భోగ్యతాబుద్ధిని కలిగించేది.

పురోహితుడు, పెద్దలు-సకల దేవతా-మహర్షిజన -విశిష్ట పదార్థముల ఆశీర్వాదముతో - ఈ అడ్డు తెరను తొలగించి వధూ వరులను ఒకటి చేస్తారు. వారి ఐక్యాన్ని ఇంకా మంగళ సూత్రముతో - బ్రహ్మబంధముతో బలపరుస్తారు. ఇక వారి జీవితాల్లో ఎప్పుడు అడ్డు తెర ఉండదు. జీవాత్మ యొక్క ప్రకృతి -ఇకముందు జీవాత్మ పరమాత్మల సంబంధానికి ఎప్పుడు అడ్డంగా నిలువదు. జీవాత్మకు-తాను పరమాత్మకే సంబంధించిన దాననని తాను పరమాత్మ భోగమేకల దానని పరమాత్మనే ఆశ్రయించే దానినని అనన్యశేషత్వ -అనన్యభోగ్యత్వ, అనన్య శరణత్వములనే ఆకారత్రయ సంపద కలిగి జీవాత్మ శాశ్వత బ్రహ్మానంద ప్రాప్తిని అందుకొంటుంది.

అయితే అహంకార, మమకారములను, పూర్తిగా సంకోచింపజేయడం

స్వప్రయత్నంతో ఎంతటి మహానుభావునికైనా సాధ్యము అవుతుందా?
**"బలవానింద్రియగ్రామో - విద్వాంసమపికర్షతి".**

జీవాత్మ -పరమాత్మల మధ్య అడ్డుగా నిలిచే స్వార్థ ప్రకృతిని వశీకరించుకోవడం స్వప్రయత్నంతో సాధ్యమయ్యేపనేనా?

కొంతవరకు మన మనస్సులో భగవద్గుణాను సంధానముతో సాధింప వచ్చునేమో.

కాని శ్రీరామచంద్ర పరమాత్మ - తానే ఈ ప్రయత్నానికి పూనుకొన్నప్పుడు (శ్రీకృష్ణరూపములో "మాశుచః" అని మనను మనప్రకృతి బంధాన్ని గురించి, ఏడువ వద్దని - "మోక్షయిష్యామి" తానే విముక్తిని కల్గిస్తానని అభయమిచ్చినట్లు) తానే వదిలించినప్పుడు ప్రకృతి బంధవిముక్తి మనకు మహాసులభమౌతుంది.

ప్రకృతి ధనుస్సుయొక్క రెండు కొనలను, అహంకార, మమకారాలను వంచాలని ఆమహాత్ముడు సంకల్పించినప్పుడు - అవి సంకోచింపబడడమే కాదు. అవి పూర్తిగా విరిగి పోతాయి. ముక్కలు అవుతాయి. వాటి స్వరూపములే నశించిపోతాయి. ప్రణవధనుస్సు యొక్క రెండు కొనలను-పరమాత్మ, జీవాత్మలను కలుపడానికి ఆ పరమాత్మ సంకల్పించిననాడు. అమధ్య దూరాన్ని తనకృపా స్వభావము (కృపా గుణము)తో తొలిగించాలను కొన్నప్పుడు ఆధనుస్సుయొక్క రెండు కొనలు, జీవాత్మ-పరమాత్మలు ఒక దానితో మరొకటి కలిసి ఆనందించడం సుసాధ్యమౌతుంది. "యమేవైష వృణుతే తేనలభ్యః" తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వాం"- తాను అభిమానించే వాళ్లకు పరమాత్మ లభిస్తాడని కఠోపనిషదుక్తి

శ్రీసీతారామచంద్ర స్వామినే నమః

# సీతాకల్యాణము

విశ్వామిత్రుని ఆజ్ఞను పురస్కరించుకొని జనక చక్రవర్తి శివధనుర్భంగ వృత్తాంతాన్ని దశరథ చక్రవర్తికి తెలుపుతూ, ఆయనను కుటుంబ పరివార సమేతంగా సీతారామకల్యాణం కొరకు రమ్మని ఆహ్వానించాడు.

దూతలు అయోధ్యకు వెళ్లి దశరథ మహీపాలునికి జనకుని ఆహ్వానాన్ని అందించారు. విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులను పంపినప్పటి నుండి ఏవార్త తెలియక ఆందోళన చెందుతున్న దశరథ మహారాజుకు జనకుని ఆహ్వానము-ఆకలి గొన్నవానికి అమృతము లభించినట్లు మహానందాన్ని కల్గించింది.

ధశరథ భూజాని కౌసల్యాది రాజపత్నులు, వశిష్ఠాది మహర్షులు సుమంత్రాది మంత్రులు, చతురంగ సేనావాహినితో, ఇతర పరివారంతో వాయువేగమనో వేగములతో ప్రయాణించి మిధిలకు చేరారు.

తెల్లవారి జనక మహీజాని-తన తమ్ముడు కుశధ్వజుని కుటుంబసమేతంగా సాంకాశ్యనగరాన్నుండి రావించాడు.

వశిష్ఠ మహర్షి దశరథ, చక్రవర్తి యొక్క (వంశ పూర్వానుక్రమణికను) ప్రవరను వినిపించగా, శతానందమునీంద్రుడు జనక చక్రవర్తి యొక్క పూర్వ రాజుల క్రమాన్ని వివరించాడు.

విశ్వామిత్ర మహర్షి, దశరథ, జనకుల వంశముల వైభవాన్ని కొనియాడి, ఆ రెండు గొప్పవంశముల మధ్య సంబంధము ఎంతో శ్రేయస్కరమని, అపూర్వమని అభిప్రాయపడ్డాడు.

జనక చక్రవర్తి సంతోషభరితుడై తనకూతురులైన సీతాదేవిని ఊర్మిళను -శ్రీరామునికి, లక్ష్మణునికి, తన తమ్ముని కూతురులైన మాండవి, శృతకీర్తులను భరత శతృఘ్నులకివ్వడానికి అంగీకరించాడు.

ఆ రోజే సౌమ్యసం ఫాల్గుణ శు12మఖా నక్షత్రము కనుక నాందీశ్రాద్ధాది

పితృకర్మలను చేయాలని, తెల్లవారి భగప్రజాపతికి సంబంధించిన ఫల్గుణి నక్షత్రము(ల)కు వివాహములను జరుపాలని నిశ్చయించారు.

దశరథ చక్రవర్తి ఆరోజు కుమారులతో గోదాన వ్రతాన్ని పితృ శ్రాద్ధాన్నినిర్వర్తింపజేశాడు. ఆరోజే భరతుని మేనమామ యుధాజిత్తు వచ్చాడు. సౌమ్యసంవత్సరము ఫాల్గుణమాసము శుక్లత్రయోదశి- 6వ నక్షత్రం ఉత్తరఫల్గుణి వివాహానికి శుభం.

తెల్లవారి వివాహ మంటపములో వేదికను ఏర్పరచి, వశిష్ఠుడు దానిని అలంకరింపజేశాడు. నవధాన్యాంకురములతో కూడిన గురుగులను, ధూప పాత్రలను, శంఖపాత్రలను, స్రుక్స్రువాదులను అర్ఘ్యపాద్యాది పాత్రలను సమకూర్చాడు. అక్షతలను తెప్పించాడు.

దర్భలను యధావిధిగా పరచి, వేదిపై అగ్నిని కల్పించి, మంత్రముల ననుసంధిస్తూ విధి విధానంగా హవనం చేశాడు.

ఆ తరువాత సర్వాభరణ భూషిత అయిన సీతాదేవిని శ్రీరామచంద్రున కెదురుగా అగ్ని సమక్షంలో నిలిపారు.

కౌసల్యానందవర్ధనుడు, దశరథ తనయుడైన శ్రీరామచంద్రునికి సీతాదేవిని అప్పగిస్తూ జనకరాజర్షి ఈ విధంగా అన్నాడు.

*"ఇయం సీతా:- రామంచంద్రా!*

1. ఈ అద్దాల పెళ్లి మంటపంలో సీతాదేవి యొక్క అనేక ప్రతిబింబాలను చూచి, కలవరంతో నిజమైన సీత ఏదో అని వెదుక్కుంటున్నావా?ఇదిగో ఈమేనయ్యా నిజమైన సీత!
2. సీతను నీవింతకు ముందు చూడలేదు కదయ్యా!ఆమె ఎవ్వరో నీకు తెలియదుకదా! ఇదిగో ఈమేనయ్యా సీత.
3. రామంచంద్రా!తలయెత్తి సీతను చూస్తే నిన్ను కాముకుడని లోకులనుకొంటారని తలవంచుకొని ఉన్నావా?చూడవయ్యా ఇదిగో నీ సీత!
4. శ్రీరామా! "ఈ"సీత ఎవ్వరో తెలుసా! ఈమె సాక్షాత్తుగా లక్ష్మీదేవి యేనయ్యా!
5. శ్రీరామభద్రా!నీవు సాక్షాత్తుగా శ్రీమన్నారాయణుడివే కావచ్చు. కాని

ఒక మానవుడిగా కౌసల్యాతనయుడివిగా సామాన్యంగా జన్మించావు. ఈ సీతోఅయోనిజ!

6. శ్రీరామా!సాధారణంగా వరులందరు వివాహంలో వధువు సౌందర్యవతి లభించాలని కోరుకొంటారు కదా! ఈ సీతాదేవి ఎలా ఉందో తెలుసా! రతీ దేవిని మించి లావణ్య శోభలతో మెరిసిపోతోంది-నీ వధువును కనులనిండా చూచుకో.

7. రామా! రైతు తన ఫలాన్ని పొలంలో చూచుకొంటాడు కదా!అలాగే నాకు యజ్ఞభూమిలో నాగటిచాలులో లభించిన అపూర్వఫలమే ఈ సీత.

8. ఈ సీత వైభవాన్ని వింటావా? ఈమె మర్త్యా మర్త్యులను కలిపేదయ్యా! (శంకరులు)

ఈ సీత చేతనా చేతనములను నియంత్రించేదయ్యా (రామానుజులు)

ఈ సీత బద్ధముక్తులను నియమించే స్వభావం కలది.(మధ్వాచార్యులు)

9. ఈ సీత సమస్త లోకవాసులకు పురుషకారమును కావిస్తుంది.

10. ఈ సీత నాకు భూమిలో లభించిన అనర్ఘ రత్నము. ఈ సీత నాకు అపురూపంగా దొరికిన అపూర్వమైన బంగారము.

ఈ సీత నీకు వీర్యశుల్కంగా లభించింది. అయితే రామా!ఇంతటి బంగారు తల్లి ఈ సీత-తల్లిలేని పిల్లయ్యా!

"మమసుతా!" :-రామా! సీత తల్లిలేని పిల్ల అయినా అనాధ అనుకోకు 1.ఈమె నాబిడ్డకంటె గారాబంగా పెరిగిన బిడ్డ - ఈ బిడ్డ నా ప్రాణానికి ప్రాణమయ్యా!

రామా!నాబిడ్డ సీత!గారాబంగా మాత్రమే పెరిగిందికాదయ్యా!ఈ సీత మాజనకుల సంస్కారాన్ని ఆచార వ్యవహారాలను పూర్తిగా పుణికి చ్చుకొందయ్యా!

2. అమమసుతా!నాగారాబాల కూతురు - ముద్దుల మూట ఈ సీత - అయితే తల్లి గారింటిపై మమతతో నీ వెంట రావడానికి సందేహిస్తుందనుకోకు, నాస్వభావాన్ని అలవర్చుకొన్న వైదేహి ఈమె. ఈమెను, సాధారణులవలె అహంకార, మమకారములు బంధించవయ్యా!

సహధర్మ చరీతవ:- "రాజర్షీ! మీకూతురు గారాబంగా పెరిగింది కదా! అందాల రాశికదా! సరే భోగార్ధము ఈమె ఉంటుంది. ఈమె ధర్మకార్యలకు నాకు పనికి రానిది" అంటావా !రామా!అలాకాదు. భోగానికి, యోగానికి కూడ నీకీమెయే పత్ని-ధర్మకార్యాలలో కూడ నీతో ఉండి, తానుకూడ పాలుపంచుకొంటుంది.

ప్రతీచ్ఛ చైనాం:- అలాగా!అయితే ఈ సీతను నేను చేపట్టడానికి మీ అనుమతి లభించినట్లేనా?అని అడుగుతున్నావా?రామా!నా ఇష్టపూర్తిగానే సీతను నీకిస్తున్నాను. ఈమెను స్వీకరించవయ్యా!

***భద్రంతే:-*** **1** రామచంద్రా! నీవు పురుషులకే పిచ్చి కల్గించేంత మోహన మూర్తివి. ఈ సీతేమో అద్భుత సౌందర్యరాశి. మీ ఇద్దరి దాంపత్యమును చూడ లేక లోకుల దృష్ఠి తగుల వచ్చునయ్యా!లోకులు మీ అనన్య దాంపత్యమునకు హాని కల్గించవచ్చునయ్యా!భద్రము సుమా!మీకు శుభమగు గాక!

**2.** శ్రీరామభద్రా! ఈ సీతాదేవి అతిలోక సౌందర్యవతి. ఈమెనెట్లాకాపాడుకొంటావో? ఈమె అలౌకిక సౌందర్యమునకు ఎవ్వరికి కన్నుకుట్టుతుందో ?భద్రము సుమా!

**3.** శ్రీరామా!నీవేమో వీరాధి వీరుడవు. సాహసమే నీవృత్తి!ఈ సీతేమో సాక్షాత్తు లక్ష్మీదేవి. మీ ఇద్దరికి స్థిరత్వము తక్కువ. భద్రమయ్యా రామా!మీరిద్దరు కాపురము ఎలా చేసికొంటారో.

రామచంద్రా! ఈ సీతాదేవి మహాపతివ్రత!మహానుభావు రాలు!నిన్ను నీడవలె ఆశ్రయించి ఉంటుంది. ఈమెను నీవు చేపట్టవయ్యా!

జనకమహారాజు ఈవిధంగా శ్రీరామునితో సంభాషిస్తూ -రామచంద్రుని హస్తములో మంత్రజలపూతంగా సీతను కన్యాదానం చేశాడు.

ఆశుభ సమయములో ఋషులు, సురలు, బాగు!బాగు!అని ప్రశంసించారు. పుష్పవృష్టిని కురిపించారు. దుందుభి మొదలైన మంగళవాద్యాలను ప్రోగించారు.

జనకుడదే విధంగా ఊర్మిళను లక్ష్మణుని చేతిలో మాండవిని భరతుని చేతిలో, శృతకీర్తిని శతృఘ్నుని హస్తములో నుంచారు. అందరికి కన్యాదానములు జరిగాయి.

నలుగురు రాజకుమారులు - లక్ష్మీదేవి యొక్క నాలుగు స్వరూపముల వంటి రాజ్యకన్యలతో పాణిగ్రహణం చేశారు. అగ్నిప్రదక్షిణములు, ఉపకార్యాలు నిర్వర్తింపబడ్డాయి.

అప్సరసలు నాట్యం జేశారు. గంధర్వులు మధుర గానం చేశారు. సీతారాముల కల్యాణము మహాద్భుతంగా విశ్వశ్రేయస్కరంగా, లోకులందరి కనులపండువుగా అతివైభవంగా నిర్వహింపబడింది.

సీతారాముల కల్యాణము లోక కల్యాణకరమైనది వారి పరిణయమును గాంచిన సురాసుర మానవులు, త్రైలోక్యవాసులు సంతోష పరవశులయ్యారు.

ఆనాడు త్రేతాయుగంలో సౌమ్యసంవత్సరఫాల్గుణ శుద్ధత్రయోదశి ఉత్తర ఫల్గుణిలో జరిగిన సీతారాముల వివాహమును ఈ నాటికి కూడ మహోత్సవంగా మనము జరుపుకొంటున్నాము. ఆనాడు మన ఇంట్లోనే మనకొడుకుదో, కూతురుదో పెళ్లి జరిగినంత సంబరము ఉంటుంది.

సీతారాములు ఆది దంపతులు. లోక పితరులు. వారి కల్యాణ మహోత్సవాన్ని మనం ఆనందంతో జరుపుకొంటే ఆ జగత్పితరుల ఆశీస్సులతో మన జీవితాలు ప్రతి క్షణం కళ కళ లాడుతుంటాయి.

ఇక్కడ ఒక విషయాన్ని మనం గమనించవలసి ఉంది. సీతాదేవి మనవలె ఒక జీవాత్మ. జీవాత్మలమయిన మనమందరము పరమాత్మకు భార్యల వంటి వారమే. పరమాత్మ ఒకనినే "సహస్ర శీర్షాపురుషః" అని వేదము వివరించింది.

"స్త్రీ ప్రాయ మితరం జగత్"జగత్తులోని సకల చేతనులు స్త్రీప్రాయులే. అందువలన సీతారాముల కల్యాణమంటే జీవాత్మ, పరమాత్మలకలయికే. జీవాత్మ పరమాత్మల సమాగమము సకలలోక శుభావహము. అందుకే సీతారాముల పరిణయము మనకు అమిత ఆనందప్రదము.

సీతారాముల కల్యాణ సందర్భముగా జనక మహారాజు స్వయంగా, "ఇయం సీతా" ఇదుగో సీత అని సీతను రామచంద్రునికి అప్పగిస్తుంటే -

త స్థానంలో మననే ఊహించుకొని, మెడను వంచి - శ్రీరామునితో మంగళ
త ధారణ చేయించుకొన్నట్లుగా పాణి గ్రహణము చేస్తున్నట్లుగా
ించుకొని మురిసిపోతుంటాము.

ఆనాడు జనక మహారాజు సీతాదేవికి వాడిన "అయోనిజ" మొదలైన
ణాలన్ని జీవాత్మలమైన మన అందరికి వర్తిస్తాయి. మన ఆత్మకూడ
వలె అయోనిజయే. పరమాత్మ సంతోషంతో స్వీకరిస్తే తప్ప మనకు వేరే
లేదు. మన ఆత్మ శ్రీరామ చంద్రస్వామితో సమాగమము చెందడం,
కు పరమాత్మకు కూడ భద్రము సీతను వేరు చేసే రావణుని వలె -
ను మన (ప్రకృతి) అహంకారము రాముని నుండి వేరుచేస్తుంది. భద్రమే
గా.

మన ఆత్మ- పరమాత్మను నీడవలె ఆశ్రయించేదే. పతివ్రత వలె భగవంతుని
ఎ ఇతరులను, ఇతరమును కోరదగనిదే. పరమాత్మతో అనన్య సంబంధము
సౌభాగ్యము కలిగినదే. అటువంటి మన ఆత్మ-పరమాత్మతో కలువాలని
శం, కలసినట్లు అనుకరించడమే సీతారాముల కల్యాణ మహోత్సవం
పుకోవడం.

శ్రీ సీతారామ కల్యాణము - 5వ త్రేతాయుగంలో సౌమ్య సంవత్సర
ష్ణ శుద్ధత్రయోదశి - ఉత్తరఫల్గుణి - అభిజిల్లగ్నంలో జరిగినప్పటికీ -
లయములలో శ్రీరాముడవతరించిన శ్రీరామ నవమి సుప్రసిద్ధమగుటచే
జే జరుగుతుంది. లేదా శ్రీ రామచంద్రస్వామిని ఆయాదేవాలయాలలో
ష్ఠచేసి కొన్న రోజు జరుగుతుంది.

ఇతిశం

# పరుశరామ గర్వభంగము అయోధ్యా పునరాగమనము

సకల లోకాలకు ఆహ్లాదకరమైన సీతా కల్యాణ మహోత్సవము ముగిసింది. తెల్లవారి విశ్వామిత్ర మహాముని సంతోష సంపూర్ణ స్వాంతుడై, వారందరి వీడ్కోలు తీసికొని, హిమవచ్ఛిఖర ప్రాంతానికి తపశ్చర్యకై తిరిగి వెళ్లాడు.

జనక మహారాజు సీతకు తదితర తనయలకు అనేకములైన కానుకలు సమర్పించాడు. జనక మహీపాలుని సెలవుగైకొని, దశరథ చక్రవర్తి- కుమారులతో, కోడళ్లతో, రాజకుటుంబాంతః పురకాంతలతో, పురోహిత, మంత్రి, సామంత సేనాపరివారముతో అయోధ్యకు తిరిగి ప్రయాణానికి బయలుదేరాడు.

హఠాత్తుగా మార్గంలో సుడిగాడ్పు చుట్టుకొంది. వృక్షములు ఫెళ ఫెళార్భటులతో విరిగి పడిపోతున్నాయి. సకల దిశలు గాఢ తమస్సుతో నిండి పోతున్నాయి. భూమి భయంకరంగా కంపించింది. పక్షులు అప్రదక్షిణంగా, మృగములు ప్రదక్షిణంగా భయంతో తిరుగజొచ్చాయి.

దశరథ మహారాజు భయకంపితుడై వశిష్ఠ మహామునితో ఈ అకాల మహాప్రళయానికి కారణము విచారించాడు. త్రికాల వేది అయిన ఆమహర్షి "మహారాజా!అతి త్వరలో ఒక మహాపద సంభవింపబోతుందని పక్షుల అప్రదక్షిణము సూచిస్తుంది. అయితే మృగాల ప్రదక్షిణము-త్వరలో నే తిరిగి ఆ ఆపద తొలిగిపోతుందని సూచిస్తోందని తెలిపాడు.

ఇంతలో దట్టంగా అల్లుకపోయిన జడలతో, భుజము పై క్రూరమైన గండ్ర గొడ్డలితో మహాభయంకరా కారముతో మహాగ్రహోదగ్రుడైన జామదగ్ని వారిముందు ప్రత్యక్షమయ్యాడు.

వశిష్ఠాది మహర్షులు శాంతి సూక్తములు జపిస్తూ భార్గవ రామునికి పరిచర్యలు చేశారు. వారి మర్యాదలను స్వీకరించి ఆ పరశు రాముడు దశరథ రామునితో "దాశరథీ!నీ పరాక్రమము. నీశివధనుర్భంగము మొదలైన వృత్తాంతములను విన్నాను. శివధనుర్భంగము ద్వారా నీవు అమర్యాదగా ప్రవర్తించడం నాకు అగ్రహాన్ని తెప్పించింది" శివుడు పరశురామునికి ధనుర్విద్యా గురువు. గురువు యొక్క (శివుని) ధనుస్సును విరువడం జామదగ్నికి కోపాన్ని కల్గించింది.

"శ్రీరామభద్రా! ఇదిగో జామదగ్నికి చెందిన మరొక ధనువు. నీవు వీరుడివైతే
) పూరించు. నీ బలాన్ని ప్రదర్శించు. నీ బలాన్ని చూచి. ఒకవేళ నీవు
సమాన వీరుడవని నాకనిపిస్తే , నీతో ద్వంద్వ యుద్ధము చేస్తాను'అని
హానకరంగా మాట్లాడాడు.

భార్గవ రాముని భీకర రూప దర్శనముతోనే దశరథుని సగము ప్రాణాలు
హాయి. ఆయన క్రూర వాక్యములతో మిగిలిన ప్రాణాలు కూడ
ట్లుగాఉన్నాయి. ఆయన ధైర్యము పూర్తిగా నశించింది. అయినా పుత్ర
హామము వలన దుఃఖాకులుడై "భార్గవా!నీకిది న్యాయమా!నీవు ఇరువై
పర్యాయాలు నిక్షత్రియం చేసి, శాంతము కలిగి యజ్ఞము చేసి కాశ్యపునికి
భూమండలాన్నంతా దానంగా ఇచ్చి వెళ్లావే?తపస్సు చేసికొంటూ నీ
వితాన్ని ప్రశాంతంగా గడుపుకొంటున్నావే?మళ్లీ ఆగ్రహానికి రావడం
టి తపోమయ జీవునికి న్యాయమా?

జమదగ్ని నందనా! వృద్ధాప్యంలో పుత్రకామేష్టిని జేసిపుత్రులను
ానయ్యా! శ్రీరాముడు నాప్రాణమయ్యా!కనికరించి నా కొడుకును
వయ్యా! నీకు చేతులెత్తి నమస్కరిస్తాను. నాకు పుత్రభిక్షను
దింపవయ్యా! లేక పోతే నా సర్వనాశనము తప్పదు"అని దీనాతి దీనంగా
మిలాడజొచ్చాడు పరశురాముడు దశరథుని ప్రార్థనను సరకు చేయక,
భద్రునితో, "రామా! నాధనుస్సు యొక్క విశేషాన్ని తెలుపుతాను విను.
్యము ఆశివధనుస్సును, ఈ వైష్ణవ ధనుస్సును అతిదృఢంగా విశ్వకర్మ
ంచి - శివ కేశవులకు సమర్పించాడు. హరి హరులలో అధిక వీరుడెవ్వరో
కోదలచి-దేవతలు వారి మధ్య యుద్ధాన్ని కల్పించారు. వారిద్దరు పరస్పర
తో భయంకరంగా పోరాడజొచ్చారు.

మహాదేవుడు విజృంభించి శివధనుస్సుతో పోరాడుతున్నాడు.
విష్ణువొక్కసారి ఆగ్రహంతో "హుంకారము"గావించాడు. మహాశివుడు
ుయ్యాడు. దేవతలు వారిద్దరిని యుద్ధము నిలుపుమని వేడుకొన్నారు.
తే శివుని నిర్వీర్యునిగావించిన విష్ణువునే అధికునిగా ఋషులు, దేవతలు
రించారు.

పరమశివుడా ధనువును జనకుని వంశపూర్వుడైన దేవరాతునికి దేవతల
ా అందించాడు. మహావిష్ణువు తన ధనువును ఋచీకునికి ఒసగాడు. ఈ
స్సునాకు ఋచీకుని నుండి మాతండ్రి ద్వారా సంక్రమించింది.

నీకు చేతనైతే ఈ మహాధనువును యోజించు శరాన్ని సంధించు, నీవు వీరుడవని నాకు తోచితే నీతో ద్వంద్వ యుద్ధం చేస్తాను,!అని మరొక సారి హెచ్చరించాడు.

భార్గవ రాముని పలుకులు శ్రీరామునికి రుచించలేదు. ముఖ్యంగా తన తండ్రి గారైన దశరథుని ప్రార్ధనను జామదగ్ని సరకు చేయక పోవడం ఆయనకు ఆగ్రహాన్ని కలిగించింది. అంతే కాక తనను మాటి మాటికి 'నీవు వీరుడవని నాకనిపిస్తే" అని రెచ్చగొట్టాడు తన శౌర్యాన్ని శంకించడం ఆ మహావీరునికి "అగ్నిలో ఆజ్యం పోసినట్లు"తనను అవమానపరిచినట్లు అనిపించింది.

శ్రీరామభద్రుడు పరశురామునితో పరుషంగా "జామదగ్నీ! నీవు పిత్రాణము తీర్చుకోవడానికి ఇరువై ఒక్క పర్యాయాలు నిక్షత్రియం చేశావని విని నీ పితృభక్తిని గౌరవించాను.

కాని నన్ను వీర్యహీనుడిగా తలచి చులకనగా నీవు పలికిన పలుకులను సహింపలేకున్నాను. అంతేకాదు నాముందే మా తండ్రి గారిని నీవు నిరాదరించడాన్ని క్షమింపలేకున్నాను. నీవు మా ఆచార్యులైన విశ్వామిత్ర మునీంద్రుల బంధువని ఇంతవరకు ఉపేక్షించాను. కాని తపము చేసికొంటూ కాలము గడుపవలసిన నీకు అకాలక్రోధము కలుగడం, నీవు వాచాలతతో పేలడం, ఎంత మాత్రం క్షమార్హమైనవి కావు", అని క్రుద్ధుడై-తాటకా తాటకేయ సంహర్త అయిన రామభద్రుడు జామదగ్ని ధనువును లాగుకొని శరసంధానంగావించి - "భార్గవా! నీవు బ్రాహ్మణుడవని, విశ్వామిత్ర సంయమీంద్రుని సమీపబంధువని -ప్రాణములను తీయడంలేదు. అయితే నాబాణము వ్యర్థముగా పోదు. నీపాదగతినైనా, నిరోధిస్తాను -లేక నీతపోలోకాలనైనా భస్మం చేస్తానని' తోక తొక్కిన మహాసర్పం వలె బుసలు గొట్టాడు.

రామభద్రుడు పరశురాముని ధనువుతో పాటు, ఆయన బ్రహ్మతేజాన్ని కూడ లాగుకొన్నాడు. స్తబ్ధుడైన భార్గవ రాముడు "దశరథ రామా! నేనింతకు ముందే కాశ్యపునికి ఈ భూమిని దానం చేసి-రాత్రులు ఇక్కడ ఉండనని ఒట్టు బెట్టుకున్నాను. నేను గురువుకిచ్చిన మాటను జవదాటజాలను కాబట్టి నాతపోలోకాలను నీ బాణంతో దగ్ధం చేయి" అని పలికాడు. రామభద్రుడలాగే దగ్ధం గావించాడు. పరశురాముడు దశరథ రామునికి ప్రదక్షిణచేసి - అంజలి ఘటించి - మళ్లీ తపశ్చర్యకై మహేంద్ర గిరికి వెళ్లాడు.

పరశురాముడు వెళ్లి పోయాడన్న వార్త వినడంతోనే దశరథునికి పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి. మూర్ఛనుండి తేరుకొన్నాడు. తన కుమారులు మళ్లీ జన్మించినట్లు భావించాడు. మహా సంతోషంతో తన పరివారంతో జవసత్వాలు లభించి అయోధ్యకు తిరిగి వెళ్లాడు.

కొద్ది రోజులు అయోధ్యలో గడిపిన తరువాత భరతుడు తనమేనమామ అయిన యుధాజిత్తుతో కేకయ దేశానికి వెళ్లాడు. సత్వమును ఛాయ అనుసరించినట్లు భరతుని విడిచి ఉండజాలని పరమభాగవత దాస శిఖామణి శతృఘ్నుడు భరతునితో కేకయదేశానికి తీసికపో బడ్డాడు.

అయోధ్యలో సీతారాములు ఒకరి మనస్సును మరొకరు తెలిసికొని పరస్పర ప్రేమతో, అతి మనోహరంగా ఆనందంలో ఓలలాడారు.

పరశు రాముడు శ్రీ మహావిష్ణువు యొక్క అంశావతారము. దుర్మార్గులై విజృంభించి లోక సంక్షోభానికి కారకులైన క్షత్రియులను సంహరించడమనే - దుష్కృత వినాశమనే -అవతార ప్రయోజనాన్ని నిర్వర్తించడము కొరకు విష్ణ్వంశ భార్గవ రామునిలో ప్రవేశించింది. ఆయన తన పితృహంతకుడైన కార్త వీర్యుని నిగ్రహించడంతో పాటు, ఇరువై ఒక్క పర్యాయాలు దుష్టక్షత్రియ సంహారంగావించి తన పరశువు యొక్క రుధిరధారలతో తన తండ్రికి తర్పణం జేశాడు. చివరలో యజ్ఞము గావించి -కాశ్యపునికి భూదానం చేసి ప్రశాంత చిత్తుడై మహేంద్రగిరికి తపశ్చర్యకై వెళ్లాడు. దీనితో భగవంతుని అంశావతార ప్రయోజనం నెర వేరింది.

లోక కంటకుడైన రావణుని నిర్యాణం కొరకు-దేవతల ప్రార్థన పై శ్రీమహావిష్ణువు స్వయంగా దశరథనందునుడిగా అవతరించాడు. పూర్ణావతారము పుడమి పైకి ఏతెంచింది.

పరశురాముడు శివధనుర్భంగమును గురించి విని అనవసరంగా అహంకార భరితుడై ఆగ్రహోదగ్రుడయ్యాడు. ప్రయోజనము తీరిన అంశావతారము పూర్ణావతారముతో ఎదురుపడింది. భార్గవ రాముని ధనుర్గ్రహణము ద్వారా అంశావ తారతత్వము - జామదగ్నిని వీడి - పూర్ణావతార స్వరూపుడైన శ్రీరామభద్రునిలో లీనమైంది. జామదగ్ని కేవల వ్యక్తిగా మిగిలాడు. శ్రీరామునిచే తపోలోకములు కూడ దగ్ధము కాగా మరింత క్షీణతేజుడై మహేంద్రగిరికి తపముకై తిరిగి వెళ్లాడు.

జగన్నాటక సూత్రధారియైన జనార్దనుడు తన అంశను (విభూతిని) మనలో కొందరు వ్యక్తులలో తన ఇష్టంతో ప్రవేశపెట్టుతాడు. వారి ద్వారా తాను అనుకొన్న కార్యాలను ఆచరింపజేస్తాడు. వారు కేవలము నిమిత్త మాత్రులు. ఈజగన్నాటకంలో మనము కేవలము అతడుసృష్టించిన పాత్రలము. అతడాడించినట్లు ఆడవలసి ఉంటుంది.

ఈ సృష్టి రహస్యము తెలియక - మన పాత్రల పరిమితిని గుర్తింపక మన ద్వారా జరిగిన ఏవో కొన్ని పనులకు మన ప్రతాపమే కారణమనుకొంటాము. "కోన్యో స్తి సదృ శోమయా? అన్నట్లు నా అంతవారు లేరని అహంకరిస్తాము. "కొండతో పొట్టేలు కొట్టుకొన్నట్లు" ఆ విశ్వాత్మనే అవమానపరుస్తాము.

మన అవసరము తీరిందని పరమాత్మ భావించినప్పుడు మన పాత్రను ఈవిశ్వ నాటకరంగాన్నుండి నిష్క్రమింపజేస్తాడు. లేక మన పాత్ర ప్రాధాన్యాన్ని తగ్గిస్తాడు. పాత్ర ప్రాధాన్యము తగ్గడం పరశురాముని ద్వారా గ్రహిస్తాము. మన సాధారణ నేత్రాలకు అగుపించని - ఆ సూత్ర దారికి వినమ్రులమై అహంకార రహితులమై అనవరతము అంజలి ఘటించడమే మన కర్తవ్యము.

ఇతిశం



# ఉపయుక్త గ్రంథావళి


| | |
|---|---|
| 1. వాల్మీకి రామాయణము | శ్రీ గోవిందరాజ వ్యాఖ్యానము |
| 2. మంధర (రామాయణ)ము | శ్రీ వావికొలను సుబ్బారావు |
| 3. రామాయణంలో వేదాంతార్థాలు | శ్రీ. తె.కం. గోపాలాచార్య స్వామి వారు |
| 4. రామయణ రత్నాకరము | శ్రీ. తె.కం. గోపాలాచార్య స్వామి వారు |
| 5. రామయణ-తత్వదీపికలు | శ్రీ భాష్యం అప్పలాచార్య స్వామి వారు |
| 6. అంతరార్థ రామాయణము | శ్రీ వేదుల సూర్యనారాయణ శాస్త్రి గారు |
| 7. శ్రీ వాల్మీకి రామాయణ దర్శనము | శ్రీ పాండురంగ శాస్త్రి అఠవలె |
| 8. శ్రీ మద్రామాయణము - విశ్వశ్రేయము | డా. మల్లాది గోపాలకృష్ణ శర్మ గారు |
| 9. రామయణము | ఉషశ్రీ |

శ్రీరామాయనమః.

శ్రీసీతారామచంద్రస్వామినే నమః

# కృతజ్ఞతాంజలి

శ్రియఃపతి అయిన తనపై నాలో చిన్నతనం నుండి తన్మయత్వానికి "బీజప్రదుడైన" తండ్రి-నాతండ్రి రామయ్య తండ్రి!

భగవంతుడనుగ్రహించిన రామభక్తి బీజాన్ని తమప్రవచనామృత వర్షంతో ప్రభవింపజేసిన పరమ భాగవతోత్తములు మాపితృదేవులు, శ్రీమత్ ఆచిన్నృసింహదేశికులు.

ప్రభవించిన రామభక్తి అంకురాన్ని వికసింపజేసిన విఖ్యాత విద్వాంసులు సంతానంగోపాలాచార్య స్వామివారు, మహావిద్వాంసులు మరంగంటి శ్రీరంగాచార్య స్వామివారు.

వికసించిన రామానురక్తి కుసుమాన్ని "శ్రీరామాయణానుభవంగా" మంగళాశాసనంతో ఫలింపజేసిన మహానుభావులు కులపతులు తె.కం. గోపాలాచార్యస్వామి వారు.

రసాస్వాదనంతో -రసభరితం చేసినవారు వ్యాఖ్యానకళావాచస్పతులు శ్రీభాష్యం అప్పళాచార్య స్వామివారు.

"శుభాశంసనం"తో శోభాయమానంగావించిన మహిమాన్వితులు, ప్రాతస్స్మరణీయ పాదారవిందులు శ్రీశ్రీశ్రీ త్రిదండి(చిన్న) శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు.

భగవంతుడికి, ఈ భాగవతోత్తములకు త్రికరణ పూర్వకదాసోహములు.

అదే విధంగా నాపై గాఢాభిమానముతో "బాఢప్రశంసాసూక్తముతో" నన్ను అభినందించిన ఆప్త విద్వత్కవులు వేముగంటి నరసింహాచార్య కవీంద్రులకు, ఆదినుండి నా ఈ "శ్రీరామాయణానుభవ" గ్రంధానికి అన్ని విధాల అండగానిలిచిన ఆప్తులు "కవితా కళానిధి"నచవేదాంతాచార్య స్వామి వారికి కృతజ్ఞతాపూర్వక నమోవాకములు.

శ్రీసీతారామచంద్రుల పాదారవిందమ్ములకు పరవశుడనై "శ్రీరామాయణానుభవ" రూపంగా సమర్పించిన "[illegible]" విశేషాలను మిత్రులు శ్రీరామరాజు వకీలు గారితో కూడవిని సంతోషించడమే కాక

*శ్రీరామాయనమః*

"శ్రీ రామాయణానుభవానికి" గ్రంధరూప "శాశ్వత ఆలయాన్ని సమకూర్చ సంకల్పించిన "అపర రామదాసులు" సిద్దిపేటలో సుప్రసిద్ధ న్యాయవాదులు మ.రా శ్రీ సిరికొండ వేంకటరావు గారు

"ప్రభావ" వంతమయిన మాజనకుల ("నృసింహ") నామ మంత్రము "నాటికి, నేటికి, ఏనాటికి కూడ మాన్యులను, సామాన్యులను కూడ తన్మయులను కావిస్తునే ఉంది. తర తరాలుగా మానాన్నగారి మహిమాన్వితమైన నామమంత్రానికి విశుద్ధ జీవనానికి వ్యాముగ్ధులైన శ్రీసిరికొండ వేంకటరావుగారు ముద్రణ భారము మొత్తాన్ని తాము, "తమవారు"వహించడానికి సమ్మతించారు.

సిరికొండ సంకల్పించింది. సిరిని సమకూర్చింది. పుస్తకము పూర్తి అయింది. భాగవతోత్తముల కరకమలాలను అందుకొనే భాగ్యము లభించింది.

సిరికొండ వారికి వారి సంబంధులకు, శ్రీ అంకిరెడ్డిపల్లి రామరాజు వకీలు గారికి మహోదారులు ధర్మ కార్య నిర్వాహకులు, శ్రీ కన్హయ్యాలాల్ బల్దేవా గారికి, ప్రపన్న వంశ సంజాతులు, రామభక్తి ధురంధరులు శ్రీయుతులు కూర పండరిగారికి, కూర అంతయ్యా గారికి, వైశ్య శ్రేష్ఠులు శ్రీ జిల్లా వేంకటేశం గారికి, గట్టురాం రాజేశం గారికి, ధర్మ సేవాతత్పరులు, మహోదారులు శ్రీ వాల నారాయణ రావు గారికి, డా. చాకంటి రామచందర్‌రావు గారికి ద్రవ్య దాతలందరికి శ్రీ వల్లభుడు సమస్త శ్రీలను సర్వకాలాలలో సమకూర్చుగాక.

"శ్రీరామాయణానుభవానికి" రమణీయంగా శాశ్వతంగా అక్షరాకృతిని సమకూర్చిన మిత్రులు, శారదా ముద్రణాలయాధిపతులు (కరీంనగర్) శ్రీనాగభూషణంగారికి, వాసుదేవరావు గారికి, సహకరించిన ఉద్యోగివర్గానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు.

*ఎందరో మహానుభావులు - అందరికి వందనాలు.*

*ఆచి. శ్రీనివాసా చార్య*

# ద్రవ్య దాతలు

| | |
|---|---|
| 1. శ్రీ. రామాలయ భక్తులు సుభాష్‌నగర్, నిజామాబాద్ | 1,116-00 |
| 2. శ్రీమతి శ్రీ వేంకట రామమ్మ, నారాయణరావు (అనంతగిరి) | 1,116-00 |
| 3. శ్రీమతి శ్రీ సిరికొండ అమృతమ్మ, బాలకిషన్‌రావు (బాచారము) | 1,116-00 |
| 4. శ్రీమతి శ్రీ రామగిరి అనసూయ, తిరుపతిరావు (కాజిపురము) | 1,116-00 |
| 5. శ్రీమతి శ్రీ సాగి గోపమ్మ, రామచందర్‌రావు (నూకలమఖ్లి) | 1,116-00 |
| 6. శ్రీ కన్హయ్యలాల్ బల్దేవా - (సిద్దిపేట) | 2,516-00 |
| 7. శ్రీ. కూర పండరినాథ్ & సీతారామాంజనేయ కళామందిరం సిద్దిపేట | 2,116-00 |
| 8. శ్రీ జిల్లా వెంకటేశము సిద్దిపేట | 1,516-00 |
| 9. శ్రీ గట్టు రాంరాజేశం, సిద్దిపేట | 1,116-00 |
| 10. శ్రీ కూర అంతయ్య, సిద్దిపేట | 1,011-00 |
| 11. శ్రీ. ఎ. రామరాజు, వకీలు, సిద్దిపేట | 1,116-00 |
| 12. శ్రీ ఎస్. వేంకటరావు, సిద్దిపేట | 1,116-00 |
| 13. శ్రీ వాల నారాయణరావు (పటన్‌చెరువు) | 2,116-00 |
| 14. శ్రీ డా. చాకుంట రామచందర్ రావు, సిద్దిపేట | 1,116-00 |